

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 41

శనివారం 3-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 41

శనివారం 3-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్‌కు ఏడో ఓటమి

గుజరాత్ టైటాన్స్ చేతిలో పరాజయం. ప్లే ఆఫ్స్ అవకాశాలకు తెర!

-17లో



జీడీపీ వృద్ధి 6.3 శాతమే

భారత వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ తగ్గించింది.

-17లో



సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం

విళింజమ్ అంతర్జాతీయ సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం సుసాధ్యమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు.

- వివరాలు 6లో▶



ఢిల్లీ సహా ఉత్తరాదిన భారీ వర్షం

ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాలు భారీ వర్షాలతో అతలాకుతలమయ్యాయి. ఆయా ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



పహల్గాం వెనుక ఐఎస్ఐ హస్తం

బైసారన్‌లో ఉగ్రవాదుల ముందస్తు ప్రణాళిక, దాడి, పరారీ తదితరాల వెనుక ఐఎస్ఐ హస్తం ఉందని ఎన్ఐఏ పేర్కొంది.

- వివరాలు 6లో▶



రోడ్డుపై వైమానిక గర్జన

వాయుసేన విమానాలు సంప్రదాయ యుద్ధక్షేత్రాలకు భిన్నంగా నడిరోడ్డుపైనా ల్యాండింగ్, టేకాఫ్ జరిపి సత్తా చాటాయి.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

అభివృద్ధి అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదు..



అభివృద్ధి అంటే హైటెక్ సిటీ మాత్రమే కాదని.. ఓల్డ్‌సిటీ, గౌలిగూడ, అంబర్‌పేట, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ సిటీయేనన్నారు.

- వివరాలు 8లో▶

గ్రూప్-1 నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేం



గ్రూప్-1 నియామకాలపై గత నెలలో ఇచ్చిన స్టేని ఎత్తివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. స్టే ఎత్తివేసి నియామకాలకు అనుమతిస్తే ఇక ఆ తర్వాత విచారణ జరిపినా అర్థం లేదని అభిప్రాయపడింది. విచారణను జూన్ 11కు వాయిదా వేసింది.

- వివరాలు 2లో▶

ముందస్తు బెయిల్ ఇవ్వలేం



ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ ఇవ్వలేమని, విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.

- వివరాలు 7లో▶

బోగీలు భగభగ.. ఏసీలో చల్లగా..

వేడి, ఉక్కపోత తట్టుకోలేక ఏసీ బోగీల్లో ప్రయాణానికి మొగ్గు

మండే ఎండలతో కొలిమిని తలపిస్తున్న రైల్వే కోచ్‌లు

- పగటి పూట ప్రయాణం అంటేనే హడలిపోతున్న ప్రజలు
- నెల, నెలన్నర ముందే అయిపోతున్న థర్డ్ ఏసీ ఎకానమీ టికెట్లు
- పదుల్లో ఉంటున్న వెయిటింగ్ లిస్ట్ నంబర్లతో అవస్థలు
- ప్రయాణికుల రద్దీ పెరుగుతుండటంతో ఏసీ ఎకానమీ కోచ్‌లు పెంచుతున్న రైల్వే...
- ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రేక్‌ల కొరత



కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రద్దీగా ఉన్న ఏసీ బోగీ

సికింద్రాబాద్–హౌరా మధ్య తిరిగే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీ ఎకానమీలో నెల క్రితం వరకు 15 రోజుల ముందు కూడా టికెట్లు అందుబాటులో ఉండేవి. కానీ ప్రస్తుతం మే 15న ప్రయాణానికి వెయిటింగ్ జాబితా 85గా ఉంది. ఇక 31వ తేదీన వెళ్లాలంటే అసలు బుకింగ్‌కే వీల్లేకుండా ఉంది. ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో మే 15న వెళ్లాలంటే వెయిటింగ్ లిస్ట్‌లో 47వ నంబర్ చూపుతోంది. నెలాఖరుకు 'రిగ్రెట్' అని చూపుతోంది. దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ఈనెల మొత్తం వెయిటింగే చూపుతోంది. వీటిల్లో కేవలం థర్డ్ ఎకానమీ క్లాస్ మాత్రమే కాదు, ఏసీ కేటగిరీలోని ఏ తరగతిలోనూ వచ్చే నెల రోజుల్లో టికెట్లు అందుబాటులో లేవు. కానీ అల్పాదాయ వర్గాలకు అందనంత దూరంలో ఉండే వందేభారత్ రైళ్లలో మాత్రం 15 రోజుల ముందు కూడా టికెట్లు లభిస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రైలు ప్రయాణం అంటే ప్రజలు హడలిపోతున్నారు. నడి వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో పగటి వేళ రైలు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. తీవ్రమైన ఎండలతో కోచ్‌లు కొలిమిలా మారుతున్నాయి. ఫ్యాన్ల నుంచి వచ్చే వేడి గాలి, కిటికీల్లోంచి వీచే వడగాడ్పులు ప్రయాణికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చల్లటి వేళ రైలెక్కుతున్నప్పటికీ సుదూర ప్రాంతానికి ప్రయాణం చేసేవారు పగటి వేళ రైలు బోగీల్లో వేడి, ఉక్కపోతతో వడదెబ్బకు సైతం గురవుతున్నారు. పేద, అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలు రైలు ప్రయాణానికి సాధారణంగా చార్జీ తక్కువగా ఉండే

మిగతా 8వ పేజీలో ▶

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఇలా

256	మొత్తం ఎక్స్‌ప్రెస్ రైళ్లు
130	సాధారణ థర్డ్ ఏసీ కోచ్‌లుండే ఎక్స్‌ప్రెస్ రైళ్లు
30	థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లున్న రైళ్లు
14	రెండు రకాల కోచ్‌లున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లు
70	ప్యాసింజర్ రైళ్లుండగా, ఎనిమిదింటిలో థర్డ్ ఏసీ కోచ్‌లు ఉన్నాయి

యుద్ధ భయం నేపథ్యంలో పాకిస్తాన్‌లోని ముజఫరాబాద్‌లో సరిపడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఓ కుటుంబం



వణుకుతున్న దాయాది

- భారత్‌ను నిలువరించండి
- అరబ్ దేశాలకు విజ్ఞప్తులు
- రాయబారులతో షరీఫ్ భేటీ
- ఉగ్రవేటలో మేం భారత్‌తోనే...
- పాక్‌కు అమెరికా స్పష్టీకరణ
- మీ గడ్డపై ముష్కరులు: వాన్స్
- వారి వేటలో భారత్‌కు తోడ్పడండి
- దాయాదికి ఉపాధ్యక్షుడి హితవు
- మాది 'ఉగ్ర'చరిత్రే: బిలావల్
- ఎనిమిదో రోజూ పాక్ కాల్పులు

6లో

భారత 'పహల్గాం ప్రతీకార' ప్రయత్నాలు చూసి పాకిస్తాన్ బెదిరిపోతోంది. ఉద్రిక్తతలను తగ్గించేలా భారత్‌ను ఒప్పించాలంటూ అరబ్ దేశాలను ఆశ్రయించింది. పాక్‌లోని ఆ దేశాల రాయబారులతో పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మరో పక్క పాక్ ప్రేరేపిత హాకర్ గ్రూపులు భారత వెబ్‌సైట్లపై శుక్రవారం భారీగా సైబర్ దాడులకు దిగాయి. సైబర్ గ్రూప్ హోక్స్ 1337, నేషనల్ సైబర్ క్రూ పేరిట దాడులు జరిగినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇదంతా పాక్ హైబ్రిడ్ యుద్ధ తంత్రంలో భాగమని అనుమానిస్తున్నారు.

ఐదు సెక్టార్లలో కాల్పులు

కాల్పుల విరమణకు పాక్ తూట్లు

6లో

ఉద్రిక్తతలపై త్వరలో భద్రతామండలి భేటీ



అమరావతిలో పలు అభివృద్ధి పనులను రిమోట్ కంట్రోల్‌తో ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో గవర్నర్ జస్టిస్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు

దేశాభివృద్ధికి ఏపీని ఇంజన్‌గా చేస్తాం

అమరావతి పునఃప్రారంభ సభలో ప్రధాని మోదీ

- రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటుంది
- రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు అందిస్తోందని వెల్లడి

సాక్షి, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మీ భుజంతో పాటు నా భుజం కలిపి పనిచేస్తా. రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ యువకుల కలలను నిజం చేసేందుకు అంకిత భావంతో పనిచేస్తామని హామీ ఇస్తున్నా' అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమరావతి పునఃప్రారంభంలో భాగంగా రూ.58 వేల కోట్ల విలువైన పనులకు ప్రధాని శుక్రవారం శంకుస్థాపన చేశారు. వెలగపూడిలోని సచివా లయం వెనుక భాగంలో నిర్వహించిన సభలో ప్రధాని మాట్లాడుతూ తల్లి దుర్గాభవాని కొలువైన పుణ్య భూమిపై మీ అందరినీ కలవడం ఆనందంగా ఉందన్నారు. 'దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు,

మిగతా 14వ పేజీలో ▶

తెలంగాణే మార్గదర్శి

కులగణన అంశంలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్పష్టీకరణ
- తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన పూర్తి చేసిందన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే... ప్రభుత్వ పథకాలకు వర్తింపజేసే ప్రక్రియ మొదలుపెట్టిందని వెల్లడి
- జాతీయ కులగణనలో తెలంగాణ విధానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ తీర్మానం
- మమ్మల్ని చూసే కేంద్రం ముందుకు వచ్చిందన్న సీఎం రేవంత్
- ఢిల్లీలో జరిగిన భేటీకి ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరుల హాజరు


సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో త్వరలో చేపట్టనున్న జనగణనలో కులగణనను చేర్చాలన్న కేంద్ర నిర్ణయం వెనుక కాంగ్రెస్ పార్టీ అద్వితీయ పోరాటం ఉందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పేర్కొంది. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తన భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి చూపించిందని, దేశానికే మార్గదర్శిగా నిలిచిందని కొనియాడింది. తెలంగాణలో అన్ని వర్గాల నుంచి సమాచారం సేకరించి పారదర్శకంగా నిర్వహించిన కులగణన నమూనానే కేంద్రం అనుసరించాలని తీర్మానించింది. దేశంలోని అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అంశాల్లో న్యాయం చేసేలా జనగణనను ఎప్పట్లోగా పూర్తి చేస్తుందో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీ అక్బర్ రోడ్డులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో ▶

ఏఐ మర్యాద.. చాలా కాస్ట్లీ గురూ



- చాట్ జీపీటీలో 'ధన్యవాదాలు', 'దయచేసి' ఖరీదే... వీటికి అదనపు విద్యుత్
- సమాధానం కోసం గూగుల్ కంటే 10 రెట్లు ఎక్కువ శక్తి
- ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్, ఇతర పరిశోధనల్లో వెలుగులోకి

2లో

దాతృత్వంలో పెద్ద చెయ్యే..



- 'సామాజిక బాధ్యత'కు కంపెనీల భారీ వ్యయం.. నిర్దేశిత మొత్తాన్ని మించి వెచ్చించిన 13,571 కంపెనీలు
- 2017–18లో ఇలాంటి కంపెనీలు 4,945 మాత్రమే.. సీఎస్ఆర్ ఫండింగ్‌లో ప్రైవేటు సంస్థల వాటా 86%
- 2022–23లో సీఎస్ఆర్‌కు మొత్తం రూ.29,987 కోట్లు.. పేదవారి చదువుకే మూడింట ఒక వంతు ఖర్చు

8లో

ఇదంతే సంగతి



దీనికి పేటెంట్ వారిదేనట! "రాహుల్ గాంధీ కులగణన" అని పేరు పెట్టమంటున్నారు!


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో చెరువులోకి కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు దొడ్డిపట్ల రాములు

ముంచెత్తిన నష్టం

అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆగమాగం

- వాన ధాటికి పలుచోట్ల కొట్టుకుపోయిన వడ్ల రాశులు
- కొనుగోళ్లలో జాప్యం... రైతులకు తప్పని యాతన

సాక్షి, హైదరాబాద్/నెట్‌వర్క్: అకాల వర్షాలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు నష్టపోతున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, ఖమ్మం, భూపాలపల్లి జిల్లాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షంతో రైతులు కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. కొన్ని చోట్ల వర్షం ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. ఖమ్మంలో నష్టం అధికంగా జరిగినట్టు అధికార యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసింది.

కొనుగోళ్లలో ఆలస్యంతోనే...

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే దాదాపుగా 60 శాతానికి పైగా కోతలు పూర్తయినా, కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. లారీల కొరత, మిల్లర్ల కొర్రీలు, గోనె సంచులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు వేచి చూసే పరిస్థితి ఏర్పడింది. ఐకేపీ, పీఏసీఎస్ వంటి సహకార సంఘాలు

మిగతా 14వ పేజీలో ▶

చిన్న పరిశ్రమకు అప్పు కరువు

రూ.80 లక్షల కోట్ల లక్ష్యంలో ఇచ్చింది 19 శాతమే

- నైపుణ్య లేమితో ఎంఎస్ఎంఈల ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం... పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులకు విముఖత
- ప్రభుత్వ పాలసీలపై కొరవడిన అవగాహన
- అంతర్జాతీయ మార్కెట్ చైన్‌కు దూరంగా మన పరిశ్రమ... ఎంఎస్ఎంఈల్లో పోటీతత్వం పెంపుపై నీతి ఆయోగ్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: భారతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వాణిజ్య సంస్థ (ఎంఎస్ఎంఈ)లు అప్పులు పుట్టక, పెట్టుబడులు రాక కునారిల్లుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పరిశ్రమ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నా, అప్పులు ఇవ్వాలని లక్ష్యాలు నిర్దేశించినా బ్యాంకర్లు రుణాలు ఇవ్వటంలేదు. ఎంఎస్ఎంఈలకు రూ.80 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని కేంద్రం నిర్దేశించగా.. బ్యాంకులు ఇచ్చింది మాత్రం 19 శాతమేనని నీతి ఆయోగ్ వెల్లడించింది. ఎంఎస్ఎంఈ రంగంలో పోటీతత్వం పెంపునకు సంబంధించిన నివేదికను ఈ సంస్థ శుక్రవారం విడుదల చేసింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాంపిటీటివ్‌నెస్ (ఐఎఫ్‌సీ) సహకారంతో ఈ నివేదికను రూపొందించింది. భారతీయ ఎంఎస్ఎంఈల పోటీతత్వాన్ని ప్రభావితం చేస్తున్న కీలక సవాళ్లను ఈ నివేదిక విశ్లేషించింది.

రుణ వితరణ 19 శాతమే: దేశంలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు బ్యాంకుల ద్వారా రూ.80 లక్షల కోట్ల

మిగతా 8వ పేజీలో ▶

యూఎస్ కాన్సులేట్‌కు మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం గచ్చిబౌలిలోని యూఎస్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లారు. గత నెలలో సికింద్రాబాద్ పాస్ పోర్టు కార్యాలయంలో తన డిప్లొమాటిక్ పాస్‌పోర్టును అధికారులకు అందజేసి సాధారణ పాస్‌పోర్ట్‌ను రెన్యువల్ చేయించుకున్నారు. కేసీఆర్ మనువడు, కేటీఆర్ కుమారుడు హిమాన్షు అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్నారు. మనువడిని కలిసేందుకు ఈ నెలలో కేసీఆర్ అమెరికా వెళ్లే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి బండి సంజయ్ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ప్రధానమైన కొన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారి హోదా కలిగిన రహదారులుగా ప్రకటించాలని కేంద్రాన్ని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ప్రధానంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు స్థానంలోని కొన్ని రోడ్లకు ఈ మార్పు అవసరం ఉందన్నారు. కరీంనగర్ (ఎన్‌హెచ్–563 ఇంటర్‌సెక్షన్)–సిరిసిల్ల–కామారెడ్డి–ఎల్లారెడ్డి–పిట్లం (ఎన్‌హెచ్–161) రహదారి (మొత్తం పొడవు: 165 కి.మీ), సిరిసిల్ల (ఎన్‌హెచ్–365బి)–వేములవాడ– కోరుట్ల రహదారి (మొత్తం పొడవు: 65 కి.మీ)ని కొత్త జాతీయ రహదారులుగా ప్రకటించాలని ప్రతిపాదించారు. అలాగే.. రాయపూర్ నుంచి హైదరాబాద్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌పై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అత్యుత్తమ ప్రాధాన్యంతో సిద్ధం చేయాలని కోరారు. ఇది తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ మధ్య (తెలంగాణలో ప్రతిపాదిత పొడవు: 280 కి.మీ) అనుసంధానాన్ని మరింత మెరుగుపరుస్తుందని తెలిపారు. వీటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయడం వల్ల మెరుగైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ఆకర్షణ, లక్షలాది మంది పౌరులకు లాభం చేకూర్చుతుందని సంజయ్ సూచించారు. ఈ ప్రతిపాదనలకు వెంటనే ఆమోదం తెలిపి పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు.


సిరియాపై ఇజ్రాయెల్ వైమానిక దాడి

డెమాస్కస్: సిరియా రాజధాని డమాస్కస్‌లోని అధ్యక్ష భవనానికి అత్యంత సమీపంలో శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ వైమానిక దాడికి దిగింది. సిరియా దక్షిణ ప్రాంతంలోని మైనారిటీ డ్రూజ్ ముస్లింలుండే గ్రామాలపై దాడి చేయవద్దంటూ ముందుగా హెచ్చరికలు చేసిన ఇజ్రాయెల్ అనంతరం దాడికి పాల్పడింది. సిరియా ప్రభుత్వ అనుకూల దళాలు, మైనారిటీ డ్రూజ్ వర్గం సాయుధులు మధ్య డెమాస్కస్ పరిసరాల్లో జరుగుతున్న పోరులో డజన్ల కొద్దీ మృత్యువాతపడటమో, గాయపడటమో జరిగిందన్న వార్తల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సిరియాలో కొత్త ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు చేసేందుకే ఇజ్రాయెల్ దాడి జరిపిందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, ఇజ్రాయెల్ చర్య తమ దేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిగా అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా పేర్కొన్నారు. సిరియా నాయకత్వానికి ఇదో హెచ్చరికని, డ్రూజ్ వర్గం ప్రజలకు అపకారం తలపెడితే ఊరుకునేది లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పేర్కొన్నారు. సిరియా ప్రభుత్వ అనుకూల బలగాల దాడిలో గాయపడిన డ్రూజ్ వర్గం వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. మహ్మద్ ప్రవక్తను కించపరుస్తూ సోమవారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైన ఆడియో క్లిప్ ఘర్షణలకు దారి తీసింది. డ్రూజ్ వర్గం బోధకుడే దీనికి కారణమంటూ సున్నీ ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారు. ఇందుకు సంబంధించి నాలుగు రోజులుగా సాగుతున్న ఘర్షణల్లో కనీసం 100 మంది చనిపోయారని బ్రిటన్ కేంద్రంగా పనిచేసే మానవ హక్కుల సంఘం ప్రకటించింది. డ్రూజ్ వర్గం ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో సగం సిరియాలోని స్వెయిదా ప్రావిన్స్ తోపాటు, డెమాస్కస్ చుట్టుపక్కల నివసిస్తున్నారు. మిగతా వారు ఇజ్రాయెల్, లెబనాన్‌లలో ఉంటున్నారు.

ఏఐ మర్యాద.. చాలా కాస్ట్లీ గురూ

కృత్రిమ మేధ (ఏఐ).. సాంకేతిక ప్రపంచాన్ని శాసిస్తున్న ఓ సరికొత్త ఆవిష్కరణ. గూగుల్ సెర్చ్ ఇంజన్ మాత్రమే తెలిసిన మనకు అంతకు మించి సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చే అనువైన సాధనం. అందుకే, ఏఐని రోజువారీ వ్యాపకాల్లో అత్యధికంగా వినియోగిస్తున్న వారి సంఖ్య కూడా రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. గిబ్లి-శైలి, పోర్ట్రెయిట్ సెల్ఫీలు, గ్రూప్ చిత్రాల రూపకల్పనలో ఏఐని ఎక్కువగా వాడుతున్నారు. ఈ నేపథ్యంలో చాట్ జీపీటీకి సంబంధించి ఎవరూ ఊహించలేని, ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్. కేవలం రెండు పదాల వినియోగం వల్ల ఏఐ ఖర్చు విపరీతంగా పెరుగుతోందట. ఇప్పుడు ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా ఏఐని వినియోగించేవారిని నివ్వెరపోయేలా చేసింది.

– సాక్షి, స్పెషల్ డెస్క్



కర్బన ఉద్గారాలు.. ఖర్చైపోతున్న నీరు

రివర్‌సైడ్‌లోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం.. ఏఐకి శక్తినిచ్చే సర్వర్‌లను చల్లబరచడానికి అధిక మొత్తంలో నీరు అవసరం. వంద పదాల ఇ–మెయిల్‌కు చాట్‌జీపీటీకి 1,408 మిల్లీలీటర్ల వరకూ నీరు వినియోగం అవుతుంది. మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం ఒక పెద్ద ఏఐ మోడల్‌ను తయారు చేయడం వల్ల విడుదలయ్యే కార్బన్... ఐదు కార్లు వాటి మొత్తం జీవితకాలంలో విడుదల చేసే కార్బన్ కంటే ఎక్కువ. గూగుల్ కూడా 2019 నుంచి ఉద్గారాలలో 48 శాతం పెరిగినట్లు వెల్లడించింది. ఇదంతా ఎక్కువగా ఏఐ వల్ల జరిగింది. కాబట్టి, ఏఐ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు చెప్పడం మనకు చాలా సాధారణంగా అనిపిస్తున్నప్పటికీ, ప్రతి అదనపు పదం సిస్టమ్ పనిభారాన్ని, పర్యావరణానికి ముప్పుని, సంస్థలకు ఖర్చుని పెంచుతుందని గుర్తించాలనే సలహా ఇప్పుడు టెక్ నిపుణుల నుంచి ఎక్కువగా వినిపిస్తోంది.

- సమాధానం కోసం గూగుల్ కంటే 10 రెట్లు ఎక్కువ శక్తి
- విద్యుత్ బిల్లు పది లక్షల డాలర్లు ఎక్కువ
- జపాన్‌కి సరిపడా విద్యుత్ వినియోగం
- 2,500 స్విమ్మింగ్ పూల్‌లకు సరిపోయే నీరు
- భారీగా కర్బన ఉద్గారాలు
- ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్, ఇతర పరిశోధనల్లో వెలుగులోకి

చాట్ జీపీటీలో 'ధన్యవాదాలు', 'దయచేసి' ఖరీదే
వీటికి భారీగా అదనపు విద్యుత్

ఏఐ మర్యాద నేర్పుతోందా?..: 'ఫ్యూచర్' అనే అమెరికాకు చెందిన ఓ పత్రిక తాజా అధ్యయనం ప్రకారం అమెరికాలో ఏఐని ఉపయోగించే 67శాతం వ్యక్తులు చాట్‌బాట్‌తో మర్యాదగా ప్రవర్తిస్తున్నారు. వారిలోని 18 శాతం మంది 'దయచేసి, ధన్యవాదాలు' అని చెబుతున్నారు. మిగిలిన 82శాతం మంది అది ఏఐ అయితే ఏంటి, సాటి మనిషి అయితే ఏంటి.. ఎవరితోనైనా మర్యాదగా ప్రవర్తించడం మంచిదని తాము ఆ విధంగా ఉన్నామని చెప్పారు. కాగా ఏఐతో మర్యాదగా ఉండటం వల్ల ప్రయోజనాలున్నాయని మైక్రోసాఫ్ట్ డిజైన్ డైరెక్టర్ కుర్టిస్ బీవర్స్ మైక్రోసాఫ్ట్ బ్లాగ్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. మీరు ఏఐతో మర్యాదగా ప్రవర్తిస్తే, అది అదే విధంగా స్పందించే అవకాశం ఉందనేది ఆయన మాటల సారాంశం.

కృత్రిమ మేధకు కృతజ్ఞతల భారం



ధన్యవాదాలు, దయచేసి అనే పదాలను.. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు(జీపీయూ)గా పిలిచే ప్రత్యేక చిప్‌లతో నిండిన సర్వర్లను ఉపయోగించి ఏఐ ఉత్పత్తి చేస్తుంది. ప్రజలు చాట్‌జీపీటీకి 'దయచేసి, ధన్యవాదాలు' అని చెప్పడం వల్లే కంపెనీ విద్యుత్ ఖర్చుల కోసం పది మిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోందని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ (ఓపెన్ ఏఐ) సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ వెల్లడించారు. ఏఐ ద్వారా ఒక ప్రశ్నకు సమాధానం వెదకడానికి గూగుల్ కంటే 10 రెట్లు ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. వినియోగదారులతో ఏఐ మర్యాదగా ఉండటానికి రోజుకి 10 మిలియన్ల డాలర్లు ఖర్చవుతుందని ఆయన వివరించారు.

ఒక దేశానికి సరిపోయే విద్యుత్

కృత్రిమ మేధ, చాట్ జీపీటీ వంటి వ్యవస్థలకు ఎక్కువ విద్యుత్ శక్తిని వినియోగించే భారీ డేటా కేంద్రాలు (సర్వర్లు) అవసరం. వాషింగ్టన్ పోస్ట్ పరిశోధన ప్రకారం ఏఐ ద్వారా 100 పదాల ఇ–మెయిల్‌ను తయారు చేయడానికి వాడే విద్యుత్... గంటకు 14 ఎల్‌ఈడీ లైట్లు వెలగడానికి వాడేంత విద్యుత్ వినియోగంతో సమానం. అలాంటిది ప్రతి రోజూ ఏఐని మనం లక్షలాది ప్రశ్నలు అడుగుతుంటాం. వాటన్నిటికీ ఏఐకి ఎంత విద్యుత్ అవసరం అవుతుందో ఊహించడమే కష్టం. ప్రస్తుతం ఉన్న డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం వాటా ఇప్పటికే ప్రపంచంలోని మొత్తం విద్యుత్ వినియోగంలో 2 శాతంగా ఉంది. ఏఐ మన నిత్య జీవితంలో మరింతగా కలిసిపోయినందున ఇది ఇంకా భారీగా పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆర్థిక సలహాల సైట్ బెస్ట్ బ్రోకర్స్ పరిశోధకులు చాట్‌జీపీటీకి ఏటా సగటున 1.059 బిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరమని కనుగొన్నారు. అంటే విద్యుత్ ఖర్చుల్లో ఏఐ చాట్‌బాట్ కోసం మాత్రమే ఏటా దాదాపు 139.7 మిలియన్ డాలర్లు ఖర్చవుతుంది. ఇది 2026 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. అంటే జపాన్ వంటి దేశం మొత్తం ఇంధన అవసరాలకు సరిపోయేంత విద్యుత్‌ను ఒక్క ఏఐ వాడేస్తోంది.

చాట్ జీపీటీకి ఏటా సగటున 1.059 బిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం

'మీకు స్వాగతం' అనే రెండు పదాల కోసం 40 నుంచి 50 మిల్లీలీటర్ల నీరు కావాలి


వంద పదాల ఇ-మెయిల్‌కు చాట్ జీపీటీకి 1,408 మిల్లీలీటర్ల వరకూ నీరు వినియోగం

ఇలా మైక్రోసాఫ్ట్ నీటి వినియోగం ఏడాది కాలంలో 1.7 బిలియన్ గ్యాలన్‌లకు పైగా పెరిగింది

ఇది 2,500 ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్‌లను నింపడానికి సరిపోతుంది

గ్రూప్–1 నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేం

స్టే ఉత్తర్వులు ఎత్తివేసేందుకు హైకోర్టు నిరాకరణ
తదుపరి విచారణ జూన్ 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 నియామకాలపై గత నెలలో ఇచ్చిన స్టేని ఎత్తివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. స్టే ఎత్తివేసి నియామకాలకు అనుమతిస్తే ఇక ఆ తర్వాత విచారణ జరిపినా అర్థం లేదని అభిప్రాయపడింది. ఎంపికైన వారు, ఎంపిక కాని వారినీ దృష్టిలో పెట్టుకుని క్షుణ్ణంగా విచారణ చేపడతామని స్పష్టం చేసింది. సమగ్ర విచారణ చేపట్టకుండా, వాదనలు పూర్తిగా వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెప్పింది. గ్రూప్–1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లలో విచారణను హైకోర్టు జూన్ 11కు వాయిదా వేసింది.

అన్నం ఉడికిందో లేదో ఒక్క మెతుకుతో చెప్పవచ్చు: న్యాయమూర్తి

2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. కోర్టు సమయం ముగిసినా రెండు గంటలకు పైగా విచారణ కొనసాగించారు. తొలుత వాదనలు వినిపించేందుకు అర గంట సమయం కావాలని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది రచనారెడ్డి కోరగా, న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ఇలా వాదనలు వినిపిస్తూ పోతే ఇక అంతు ఉండదన్నారు. అన్నం ఉడికిందో లేదో ఒక్క మెతుకుతో చెప్పవచ్చని.. వాదనలు సంక్షిప్తంగా విన్పించాలని సూచించారు. రీకౌంటింగ్‌లో మార్కులు తగ్గాయని పిటిషనర్లు పేర్కొంటున్న పూజితారెడ్డి సమాధాన పత్రాలు సహా ఇతర వివరాలను సీల్డ్ కవర్‌లో ఇవ్వాలని టీజీపీఎస్సీకి సూచించారు. నకిలీ పత్రాలు, తప్పుడు డాక్యుమెంట్లు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరుపక్షాలను హెచ్చరించారు.

వాదనలు ఇలా..

రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని చెబుతున్న కమిషన్ వద్ద మెయిన్స్ పరీక్షలు ఎందరు రాశారో కచ్చితమైన వివరాలు ఇప్పటికీ లేవు. బయోమెట్రిక్ తీసుకున్న తర్వాత కూడా లెక్కల్లో తేడా ఎందుకు వస్తుంది? కొన్ని సెంటర్ల నుంచి 10 శాతం మంది ఎంపికయ్యారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్లం మీడియాల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. ఆయా మీడియం పేపర్లను ఆ సబ్జెక్టుల్లో నిపుణులైన వారే దిద్దారా? వారి వివరాలు లేవు. మూల్యాంకనం చేసిన వారిలో తెలుగు వచ్చిన వారు ఎందరున్నారు? ఇలాంటి వివరాలు కమిషన్ ఎక్కడా పేర్కొనలేదు..'అని చెప్పారు. టీజీపీఎస్సీ తరఫున న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 'కొందరు తప్పుడు డాక్యుమెంట్లతో పిటిషన్లు వేస్తున్నారు. ఇలా వేసిన కొందరు పిటిషనర్లకు ఇదే హైకోర్టులోని మరో బెంచ్ జరిమానా కూడా విధించింది. ఓ పిటిషనర్‌కు 60 మార్కులు తగ్గాయని పిటిషనర్ న్యాయవాది చెబుతున్నారు. అది తప్పుడు డాక్యుమెంటు. కొందరు పిటిషనర్లు వకాలత్‌పై సంతకమే పెట్టలేదు. తప్పుడు సంతకాలతో పిటిషన్లు వేస్తున్నారు. నియామకాలపై ఇచ్చిన స్టేని ఎత్తివేయాలి..'అని కోరారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

'నాపై విచారణను ఉపసంహరించండి'

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో తప్పుడు మార్కుల మెమో పెట్టిన వ్యవహారంలో తనపై విచారణ ఉపసంహరించాలని సంగారెడ్డి జిల్లా లింగంపల్లి పంచాయతీ సెక్రటరీ షబ్నం ఆర్యా(అభ్యర్థి) హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. మెయిన్స్ పారదర్శకంగా జరగలేదని పేర్కొంటూ ఓ వాట్సాప్ గ్రూప్ రూపొందించి, తనను కూడా అందులో చేర్చారన్నారు. టీజీపీఎస్సీపై పోరాడటం కోసమంటూ రూ.5 వేలు అడిగితే పంపానన్నారు. ఆ తర్వాత ఇటీవల డబ్ల్యూపీ 12431/2025 పిటిషన్ ఉత్తర్వుల కాపీని గ్రూప్‌లో పోస్టు చేశారని పేర్కొన్నారు. పిటిషనర్ల జాబితాలో తన పేరు ఉండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. తాను కేసు వేయలేదని, ఎలాంటి వకాలత్‌పై సంతకం పెట్టలేదని, తన పేరు తొలగించాలన్నారు.

రాహుల్ ఆశయం నెరవేరింది

దేశవ్యాప్త కులగణన క్రెడిట్ ఆయనదే
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
- బీసీ బిల్లును రాష్ట్రపతికి పంపినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు



గవర్నర్‌ను కలిసిన మహేశ్‌గౌడ్, పొన్నం, సారయ్య, అనిల్, కేకే, అంజన్, వీహెచ్, విజయశాంతి, ఐలయ్య

సాక్షి, హైదరాబాద్: జనాభా లెక్కల సేకరణతోపాటే దేశంలో కులగణన కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆశయం నెరవేరిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ ఒత్తిడివల్లే కేంద్రం కులగణనకు నిర్ణయం తీసుకుందని, ఈ క్రెడిట్ రాహుల్‌దేనని చెప్పారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతికి పంపినందుకు శుక్రవారం పీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. స్వతంత్ర భారతావనిలో కులగణన నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణేనని పేర్కొన్నారు. రాహుల్ ఆశయం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కులగణనను శాస్త్రీయంగా నిర్వహించినట్లు తెలిపారు.

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి

బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లును కేంద్రం ఆమోదించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆలోచనను కేంద్రం మార్గదర్శకంగా తీసుకుంటే కొందరు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గవర్నర్‌ను కలిసినవారిలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు విజయశాంతి, బస్వరాజు సారయ్య, దండె విఠల్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయికుమార్, ముత్తినేని వీరయ్య వర్మ తదితరులు ఉన్నారు.

సీడబ్ల్యూసీ తీర్మానం నాకెంతో గర్వంగా ఉంది

'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) చేసిన తీర్మానం తనకెంతో గర్వంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'జనగణనలో కులగణనకు తెలంగాణ మోడల్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన సీడబ్ల్యూసీ కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. నాలుగు గోడల మధ్య, నలుగురి ఆలోచనలతో కాకుండా మొత్తం పౌర సమాజం, తెలంగాణ మేధావులు, వివిధ కుల సంఘ నాయకులు, విద్యావేత్తల నుంచి అత్యంత పారదర్శకంగా సలహాలు, సూచనలు స్వీకరించి శాస్త్రీయంగా తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టిన విషయాన్ని ఈ తీర్మానంలో ప్రస్తావించింది. ఇది తెలంగాణకు గర్వకారణం. ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ విషయంలో దేశానికే తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలవడం నాకెంతో గర్వంగా ఉంది. అత్యద్భుతంగా, అత్యంత పారదర్శకంగా కులగణన నిర్వహించి తెలంగాణ ప్రతిష్టను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా మరొక్కసారి నా అభినందనలు'అని ఆ ట్వీట్‌లో సీఎం రేవంత్ పేర్కొన్నారు.

అవ్వకు అండ

సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల సంఘం
నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు
కుటుంబ సభ్యులకు హెచ్చరిక.. అవ్వ అప్పగింత



భూదవ్వ

సాక్షి ఎఫెక్ట్

జగిత్యాల: 'అవ్వను అడవిలో వదిలేశారు' శీర్షికతో 'సాక్షి' ప్రధాన సంచికలో.. శుక్రవారం ప్రచురితమైన కథనానికి తెలంగాణ మానవ హక్కుల సంఘం స్పందించింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన భూదవ్వను.. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాళ్లు చేతులు కట్టేసి గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి అటవీ సమీపంలో వదిలేయడం తెలిసిందే. ఈ సంఘటనను సుమోటోగా స్వీకరించాలని తెలంగాణ మానవ హక్కుల సంఘం ఆదేశించింది. వృద్ధురాలిపై ఆస్తి సంబంధిత వేధింపులకు పాల్పడినట్లు కమిషన్ అనుమానిస్తోంది. జూన్ 6 లోపు సంపూర్ణ నివేదిక దాఖలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. సఖి కేంద్రం సంక్షేమాధికారి నరేశ్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్.. శుక్రవారం సఖి కేంద్రానికి భూదవ్వ కూతురు, కోడలిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. పెద్ద వారిని హింసిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. అవ్వను జాగ్రత్తగా చూసుకోవాలని.. రాతపూర్వకంగా రాయించుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రజాప్రభుత్వ లక్ష్యం

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
'కారుణ్య'కోటాలో సింగరేణిలో 21 మందికి ఉద్యోగాలు



సాక్షి, హైదరాబాద్: యువతకు ఉపాధి కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కేవలం ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోనే కాకుండా స్వయం ఉపాధి వైపు కూడా యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకువచ్చిందని అన్నారు. వచ్చేనెల రెండో తేదీన పెద్ద ఎత్తున స్వయం ఉపాధి యూనిట్లు కేటాయిస్తూ, లబ్ధిదారులకు మంజూరీ పత్రాలు అందిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ప్రజాభవన్‌లో సింగరేణి కాలరీస్‌లో 21 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి కాలరీస్‌లో కారుణ్య నియామకాల వయోపరిమితిని 35 సంవత్సరాలనుంచి 40 ఏళ్లకు పెంచామని, ఈ నేపథ్యంలో లబ్ధి పొందిన వారికి నియామకపత్రాలు ఇస్తున్నామని వివరించారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రణాళికలు తయారు చేస్తోందని అన్నారు. సింగరేణి సంస్థ మార్కెట్లో ఇతరులతో పోటీపడి నిలవాల్సిన పరిస్థితి ఉందని, కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ.. పూర్తి పనిగంటలు పనిచేసి కంపెనీని కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు దీనిని ఒక వారసత్వంగా అందించాలని సూచించారు. సింగరేణిని ఇతర రంగాలు, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని, ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే ప్రతి ఒక్కరూ శ్రమ శక్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్సీ హరిరామ్‌ను ప్రశ్నిస్తున్న ఏసీబీ అధికారులు

బంజారాహిల్స్ ఏసీబీ కేంద్ర కార్యాలయంలో విచారణ
ఈనెల 6 వరకు కస్టడీకి అనుమతించిన కోర్టు



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్‌ను కోర్టు అనుమతితో ఏసీబీ అధికారులు తమ కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజులపాటు హరిరామ్‌ను ఏసీబీ కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు హరిరామ్‌ను శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. ఏసీబీ సిటీ రేంజ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం హరిరామ్‌ను ప్రశ్నిస్తోంది. తొలి రోజు విచారణలో భాగంగా హరిరామ్ వ్యక్తిగత విషయాలు, ఉద్యోగ, కుటుంబ సభ్యుల వివరాలను తెలుసుకున్నారు. నీటిపారుదల శాఖలో ఎక్కడెక్కడ పనిచేశారు..? కాళేశ్వరం ప్రాజెక్టులో ఏయే బాధ్యతలు నిర్వర్తించారు.. తదితర ప్రాథమిక అంశాలకే మొదటి రోజు పరిమితమైనట్టు తెలిసింది. శనివారం సైతం హరిరామ్‌ను ప్రశ్నించనున్నారు. గత నెల 26న హరిరామ్ ఇంటితోపాటు 14 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేసి పలు ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

తెలంగాణే మార్గదర్శి

▶ మొదటి పేజీ తరువాయి

సీడబ్ల్యూసీ భేటీ జరిగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి కమిటీ సభ్యులు దామోదర రాజనర్సింహ, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. ప్రధానంగా కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడారు.

కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలి: ఖర్గే

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర మొదలు, మొన్నటి లోక్‌సభ ఎన్నికల వరకు ఇదే అంశాన్ని ముందుపెట్టి కాంగ్రెస్ పార్టీ పోరాడిందని ఖర్గే చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణన పూర్తి చేసి ప్రభుత్వ పథకాల్లో అమలు చేసే ప్రక్రియను సైతం మొదలు పెట్టిందని ప్రశంసించారు. ప్రజల సమస్యలను నిజాయితీగా లేవనెత్తితే, ఎన్డీఏ వంటి మొండి ప్రభుత్వాలు తలవంచాల్సిందేనని రాహుల్‌గాంధీ నిరూపించారని అన్నారు. అయితే కులగణన సమస్యను ఒక మంచి ముగింపు వచ్చేంత వరకు కాంగ్రెస్ నేతలంతా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఇదే అంశంపై చేసిన తీర్మానంలోనూ తెలంగాణ అంశాన్ని సీడబ్ల్యూసీ ప్రస్తావించింది.

తెలంగాణ నమూనాను కేంద్రం అనుసరించాలి

'తెలంగాణలో కులగణనకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం పాటించిన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అవసరం ఉందని సీడబ్ల్యూసీ భావిస్తోంది. తెలంగాణలో కుల సర్వే రూపకల్పన పూర్తిగా పౌర సమాజం, సామాజికవేత్తలు, నాయకుల క్రియాశీల ప్రమేయంతో.. సంప్రదింపులు, పారదర్శక ప్రక్రియ ద్వారా జరిగింది. ఈ సర్వే పూర్తిగా బ్యూరోక్రాటిక్ విధానంలో కాకుండా ప్రజల పరిశీలన నుంచి వచ్చింది. అందువల్ల జాతీయ స్థాయి కులగణన కోసం తెలంగాణ పాటించిన విధానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతోంది. కేంద్రం విశ్వసనీయమైన, శాస్త్రీయమైన, భాగస్వామ్య నమూనాను రూపొందించేందుకు వీలుగా మా పూర్తి మద్దతును ప్రకటిస్తున్నాం. సంప్రదింపులు, జవాబుదారీతనం సమ్మిళితత్వంతో విలువలను ప్రతిబింబించే చట్రాన్ని రూపొందించడంలో సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..'అని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో పేర్కొంది.

రేవంత్, దామోదరకు అభినందనలు

కులగణన ప్రక్రియలో చేసిన శ్రమ, అమలులో చూపిన చొరవపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరలను సీడబ్ల్యూసీ కీలక నేతలు అభినందించారు.

జాప్యం వద్దు.. పారదర్శకంగా జరగాలి

'కులగణన ప్రక్రియలో జాప్యం చేయకూడదు. అన్ని రాజకీయ పార్టీలను పూర్తి విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ అంశంపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ జరపాలి. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులను కేటాయించి, జనాభా లెక్కల ప్రతి దశకు నిర్దిష్టమైన సమయాన్ని ప్రకటించాలి. కులగణన వివరాల నమోదు ప్రక్రియ పూర్తి సమగ్రంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలి. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు, విద్యా, ఉపాధి అవకాశాలకు ఈ కులగణనే ప్రాతిపదికగా ఉండాలి. కుల గణన సరిగ్గా జరిగి అమలైతే సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది..'అని తీర్మానంలో స్పష్టం చేసింది.

పూర్తి పారదర్శకతతో నిర్వహించాం: సీఎం రేవంత్

తెలంగాణలో కులగణన జరిగిన తీరును సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. కచ్చితత్వంతో, పూర్తి పారదర్శకంగా కులగణన నిర్వహించామని తెలిపారు. 'బీసీల జనాభా గతం కన్నా 6 శాతం మేర పెరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని పార్లమెంట్ ఆమోదానికి పంపించాం. విద్య, ఉద్యోగం, ఉపాధి, నిధుల కేటాయింపుల్లో ఓబీసీ, ఆదివాసీ, దళితులు, మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఇకపై ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి. కులగణనతో ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని మేము విశ్వసిస్తున్నాం. మమ్మల్ని చూసే కేంద్రం కూడా కులగణన చేసేందుకు ముందుకొచ్చింది. దీనిపై రాష్ట్రంలోని నిమ్న వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి..'అని సీఎం తెలిపారు.


Reliance
SMART BAZAAR
మన నినాదం ఇండియా మొత్తం చేస్తుంది ఫుల్ పైసా వసూల్
ఫుల్ పైసా వసూల్ సేల్
30th APR - 4th MAY
చివరి రోజులు 2
గుడ్ లైఫ్ ఆల్మండ్ వెల్యూ ప్యాక్ / రెగ్యులర్ వెల్యూ ప్యాక్ ప్లెయిన్ క్యాష్యూస్ 500 g
స్మార్ట్ ప్రైస్ ₹389 / ₹419
ఎమ్ఆర్‌పి ₹590 / ₹770
ఆదా చేసుకోండి ₹201 / ₹351
లూజ్ చక్కెర S / రా పీనట్స్ 1 kg
స్మార్ట్ ప్రైస్ ₹43 / ₹119
మార్కెట్ ధర ₹50 / ₹124
చక్కి ఆటా 5 kg / ఫియోనా రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 5 L
స్మార్ట్ ప్రైస్ ₹205 / ₹649
ఎమ్ఆర్‌పి ₹270 / ₹950
ఆదా చేసుకోండి ₹65 / ₹301
స్మార్ట్ ప్రైస్ ₹999 / ₹1049
PL కర్నూలు సోనా మసూరి / గుడ్ లైఫ్ డైలీ రైస్ 26 kg
ఎమ్ఆర్‌పి ₹1650 / ₹1950
ఆదా చేసుకోండి ₹651 / ₹901
ఇమామి హెల్తీ అండ్ టేస్టీ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ / గుడ్ లైఫ్ ఫిల్టర్డ్ వేరుశెనగ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹132 / ₹149
ఎమ్ఆర్‌పి ₹165 / ₹210
ఆదా చేసుకోండి ₹33 / ₹61
కనీసం 25% తగ్గింపు
డెయిరీ, ఫ్రోజెన్ అండ్ బేకరీ (ఎంపిక చేసిన)
ఎమ్ఆర్‌పి ₹25 మొదలుకుని
Scan & Unlock Secret Offers
BUY ANY 3 GET ANY 1 FREE
కోల్డ్ డ్రింక్ అండ్ జ్యూసెస్ 250 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹40 మొదలుకుని / యూనిట్
BUY ANY 2 GET ANY 1 FREE
బిస్కెట్స్ / చాకొలెట్ / రస్క్ 118 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹100 మొదలుకుని / యూనిట్
తాజ్‌మహల్ టీ / టాటా చక్ర గోల్డ్ ప్రీమియం టీ 500 g
ఆదా చేసుకోండి ₹75
ఎమ్ఆర్‌పి ₹380 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹305 మొదలుకుని
హార్లిక్స్ / బూస్ట్ 1 kg
ఆదా చేసుకోండి ₹201
ఎమ్ఆర్‌పి ₹600 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹399 మొదలుకుని
సోప్ 125 g మొదలుకుని (మల్టీ ప్యాక్) (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 45% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹313 మొదలుకుని
షాంపూ 1 L (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 60% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹959 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹384 మొదలుకుని
టూత్‌పేస్ట్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
కనీసం 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹208 మొదలుకుని
సర్ఫ్ ఎక్సెల్ 7 kg / టైడ్ డిటర్జెంట్ పౌడర్ 8 kg (సెలెక్ట్ వేరియంట్స్)
ఫ్లాట్ 40% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹985 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹591 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹1999 మొదలుకుని
3 బర్నర్ గ్యాస్ స్టవ్
ఎమ్ఆర్‌పి ₹7560 మొదలుకుని
2000+ ఫ్యాషన్ స్టైల్స్ ₹399 లోపు
టీ-షర్ట్స్ ₹199 | షర్ట్స్ ₹299
కుర్తాస్ ₹299 | షార్ట్స్ ₹299 | జీన్స్ ₹399
స్మార్ట్ ప్రైస్ ₹999
18 పీసెస్ ఓపల్ వేర్ డిన్నర్ సెట్
ఎమ్ఆర్‌పి ₹2095 మొదలుకుని
ఫ్లాట్ 70% తగ్గింపు
కాటన్ డబుల్ బెడ్‌షీట్ సెట్ విత్ పిల్లో కవర్
ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹360 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹55999 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹32990 మొదలుకుని
బ్రాండెడ్ 1.5 టన్ 3 స్టార్ ఇన్వర్టర్ ఎయిర్ కండిషనర్ (ఎంపిక చేసిన)
క్రూయిజర్ హార్డ్ ట్రాలీ 2 సెట్
స్మార్ట్ ప్రైస్ ₹3999
ఉచితం డఫెల్ ట్రాలీ బ్యాగ్
ఎమ్ఆర్‌పి ₹12800
ఇప్పుడు తెరవబడింది
మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1.
అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. రవి ం దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ పక్కన, గుడిమల్కాపూర్ రోడ్. మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్‌నగర్ బస్టాప్. సలార్‌పురియా సత్వ మ్యాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి ఫ్లైఓవర్ పక్కన. IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. యశోద గార్డెన్స్, శాంతినగర్. బార్కస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. బస్టాండ్ కాలనీ, RB నగర్. HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. కేపీహెచ్‌బీ ఫ్యాకల్టీ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ. ఏషియన్ శివగంగా రోడ్డు. చిల్కానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. ESI హాస్పిటల్ ఎదురుగా. రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్
10% INSTANT DISCOUNT* SBI card
*Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Credit Card; Validity: 30 Apr - 04 May 2025. T&C Apply.
వద్ద కూడా లభ్యం
fresh Signature
SMART SUPERSTORE
SMART BAZAAR

క్రోధము వలన సమ్మోహము గల్గును. సమ్మోహము వలన స్మృతి భ్రమించుట, స్మృతి భ్రమించుట వలన బుద్ధి నాశనము, బుద్ధి నాశనము వలన భ్రష్టత్వము పొందుట కల్గును.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 3 మే 2025

అప్పన్న సన్నిధిలో అపచారం!

శ్రీమహావిష్ణువు వరాహ లక్ష్మీ నృసింహస్వామి రూపంలో వెలిశాడని లక్షలాదిమంది భక్తులు విశ్వసించే సింహాచల క్షేత్రం గురించి తెలియని వారెవరూ లేరు. ఏటా గంధం అమావాస్య తర్వాత వచ్చే అక్షయ తృతీయనాడు ఎంతో వేడుకగా జరిగే చందనోత్సవం సందర్భంగా భక్తజనం పోటెత్తుతారు. భక్తుల విశ్వాసాలతో అంతగా ముడిపడి వుండే ఈ చందనోత్సవ సమయంలో చిన్న దుర్ఘటనైనా చోటుచేసుకున్న ఉదంతం ఆలయ చరిత్రలో లేదు. అలాంటిచోట కళ్లుమూసుకుపోయిన పాలకుల సాక్షిగా అపచారం జరిగిపోయింది. కొత్తగా నిర్మించిన గోడ కూలి బుధవారం వేకువజామున ఏడుగురు భక్తులు మరణించటం అందరినీ కలచివేసింది. అసలు చందనోత్సవంనాడు అడుగడుగునా చోటుచేసుకున్న అరాచకం గమనిస్తేనే ఈ ప్రభుత్వానికి పవిత్రోత్సవాలపై భక్తిశ్రద్ధల మాట అటుంచి ఏదైనా అనుకోనిది సంభవిస్తుందేమోనన్న భయం కూడా లేదని అందరికీ అర్థమైంది. వీవీపీ టిక్కెట్లు, పాస్‌లు పంచుకోవటానికి పెట్టిన శ్రద్ధలో వెయ్యోవంతైనా భక్తులకు సౌకర్యాల కల్పనలో, వారి భద్రతకు చర్యలు తీసుకోవటంలో లేవు. ప్రమాదాలు చెప్పి రావు. అందుకే ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటారు. అంబులెన్స్‌లు, పారా మెడికల్ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచుతారు. కానీ విషాదం సంభవించిన క్షణాల్లో బాధితులది అరణ్యరోదనే అయింది. ప్రమాదంలో చిక్కుకున్నవారూ, ఇతరులూ ఆర్తనాదాలు చేస్తుండగా అరగంటకు అధికారులు వచ్చారు. ప్రయోజనం ఏముంది? 3.05 గంటలకు ప్రమాదం జరిగితే ఆ తర్వాతెప్పుడో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అడుగుపెట్టారు. ముందస్తు ఏర్పాట్లుంటే ఆ ఏడుగురూ... లేదా కనీసం వారిలో కొందరైనా ప్రాణాలతో బయటపడేవారు.

వెనక్కి తిరిగిచూస్తే ఈ తరహా విషాద ఉదంతాలు ఆయన అధికారం వెలగబెట్టే సమయంలో ఎన్నో జరిగాయని తెలుస్తుంది. 2015లో రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాల ప్రారంభం నాడే తీవ్ర తొక్కిసలాట జరిగి 29 మంది భక్తులు ప్రాణాలు కోల్పోవటం ఎవరూ మరిచిపోలేరు. చిన్నపిల్లలూ, వృద్ధులూ తెల్లారుజామున 4 గంటలనుంచి స్నానాల కోసం నిరీక్షిస్తుండగా చంద్రబాబు సకుటుంబ సమేతంగా ఉదయం 8.30కు స్నానాదికాలు ముగించుకుని నిష్క్రమించేవరకూ ఎవరినీ అనుమతించలేదు. తర్వాత హఠాత్తుగా స్నానఘట్టానికున్న ఏకైక ప్రవేశ ద్వారాన్ని తెరిచారు. తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకొని భక్తులు కన్నుమూశారు. కృష్ణా పుష్కరాల్లో సుందరీకరణ పేరిట వందల ఆలయాలను కూల్చి, వాటిల్లోని విగ్రహాలను చెత్తబండ్లలో తరలించటం కూడా బాబు హయాంలోని ముచ్చటే. మళ్లీ ఈ పదకొండు నెలల కాలంలో వరస విషాద ఉదంతాలు చోటుచేసుకున్నాయి. బాధ్యతాయుత స్థానంలో వున్నానన్న ఇంగితం కూడా లోపించి తిరుమల వేంకటేశుని లడ్డూ కల్తీ జరిగిందంటూ ఆయనే తప్పుడు ప్రచారాన్ని లంకించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన ముందస్తు ఏర్పాట్ల వైఫల్యం కారణంగా తొక్కిసలాట జరిగి తిరుమల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఆరుగురు భక్తులు మరణించారు. ఇక టీటీడీ గోశాలలో గోవుల మృతి ఉదంతం సాధారణ భక్తుల ఊహకందనిది. అసలు అలాంటిదేమీ లేదని బాబు బుకాయించగా టీటీడీ చైర్మన్, ఈవోలు మృతిచెందిన గోవుల సంఖ్య గురించి తోచిన అంకెలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. దశాబ్దాలుగా హైందవ ధర్మానికి, దాతృత్వానికీ ప్రతీకగా వున్న కాశీ నాయన ఆశ్రమాన్ని ఈ ప్రభుత్వమే స్వహస్తాలతో నేలమట్టం చేసింది. పురాతనమైన ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీకూర్మం క్షేత్రంలో ఇటీవల తాబేళ్లు చనిపోవటం అందరినీ ఆశ్చర్యంలో ముంచింది.

ఏమైంది ఈ సర్కారుకు? పగలూ, ప్రతీకారాలూ తీర్చుకోవటానికి పదకొండు నెలల సమయం చాల్లేదా? పాలనపై దృష్టి పెట్టేదెప్పుడు? అసలు చందనోత్సవం వంటి ముఖ్య ఘట్టం కోసం ప్రభుత్వపరంగా చేసిందేమిటి? ఇందుకోసం నియమించిన కమిటీలో మంత్రులకు లోటులేదు. అయిదుగురున్నారు. హైలెవెల్ కమిటీ అన్నారు. అందులో ఒక్కరంటే ఒక్కరికి కొత్తగా కట్టిన గోడ ఎలా వుంటుందో తెలియదు. ఎలాంటిచోట నిర్మించారో, దేంతో నిర్మించారో, నిర్మించి ఎన్నాళ్లయిందో అంతకన్నా తెలియదు. చందనోత్సవంనాడు వాన పడటం అక్కడ రివాజని కూడా తెలిసి వుండదు. కొండధారలు, ఆకాశగంగ, మాడవీధుల్లో పడిన వర్షమంతా ఇప్పుడు ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలోని మెట్లపై నుంచి కిందకు పోతుందని తెలిసే గతంలోనే రిటైనింగ్ వాల్ నిర్మించారు. కానీ పునర్నిర్మాణం పేరిట పాత గోడను తొలగించి అత్యంత నాసిరకంగా నిర్మించిన పర్యవసానంగా ఘోరం జరిగిపోయింది. ఒకరిద్దరు పెద్దలతోపాటు బంగారు భవిష్యత్తుగల యువభక్తులు కూడా తప్పించుకునే మార్గం దొరక్క సజీవసమాధి అయ్యారు. కూలిన గోడ వెనకున్న గూడుపుఠాణీ కథే వేరు. సొంత మీడియా సైతం దాచలేని కంతలు అందులో ఎన్నెన్నో! మంత్రులు దీనికి బాధ్యత వహించాలి. కానీ, వర్షం మీదా, చిన్న ఉద్యోగుల మీదా దీనిని నెట్టివేసే ప్రయత్నం జరుగుతోంది. తీరి కూర్చుని ఇలాంటి వరస విషాద ఉదంతాలకు కారణమవుతున్న సర్కారుకు ఒక్కరోజైనా అధికారంలో కొనసాగే నైతికార్హత వుందా? లక్షలాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతిని, మృతుల కుటుంబాల్లో విషాదం నెలకొని రెండ్రోజులైనా గడవకముందే ఆర్భాటంగా అమరావతి పునఃశంకుస్థాపన కార్యక్రమం జరిపారు. కానీ మరణించిన భక్తుల స్మృతిలో ఒక్క నిమిషం మౌనం పాటించాలన్న స్పృహ, కనీసం నివాళులర్పించాలన్న ఇంగితం ఒక్కరికీ లేకపోయింది. ఇదే అసలైన విషాదం.

మరో మహమ్మారిని ఎదుర్కొనేలా...

సందర్భం



కె. శ్రీనాథ్ రెడ్డి

కోవిడ్ వంటి మహమ్మారిని మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధమయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నేతృత్వంలో ఏప్రిల్ 16న ఈ మేరకు 'ద పాండెమిక్ ట్రీటీ' ఒప్పందం కుదిరింది. డబ్ల్యూహెచ్‌ఓ నేతృత్వంలో కుదిరిన రెండో అంతర్జాతీయ ప్రజారోగ్య ఒప్పందం ఇది. 2003లో 'ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్' చర్చల్లో నేను భారత్‌కు ప్రాతినిధ్యం వహించాను. పొగాకు నియంత్రణకు సంబంధించిన ఈ ఒప్పందాన్ని అమెరికా, జపాన్, అర్జెంటీనా వ్యతిరేకించినా, యూరోపియన్ యూనియన్ తటపటాయించినా చివరకు వాణిజ్య ప్రయోజనాల కంటే ప్రజారోగ్యమే ముఖ్యమని గుర్తించారు.

'ద పాండెమిక్ ట్రీటీ' విషయంలోనూ వాణిజ్య ప్రయోజనాలు కొందరి ప్రాధాన్యంగా ఉండింది. ఫలితంగా ఈ ఒప్పందంపై నాలుగేళ్లుగా చర్చలు, వాద ప్రతివాదాలూ నడిచాయి. కోవిడ్ వంటి మహమ్మారి విషయంలో ఎదురైన వైఫల్యాలను మాత్రం ప్రపంచ దేశాలన్నీ గుర్తించాయి. విపత్కర పరిస్థితుల్లో దేశాల మధ్య మరింత సమన్వయం, సహకారం అవసరమనీ, వట్టిమాటలు, సంఘీభావాలతో ప్రయోజనం తక్కువేననీ అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా ఒక ఒప్పందం అవసరాన్ని కూడా గుర్తించాయి. వాస్తవానికి ఈ ఒప్పందం గత ఏడాదే అమల్లోకి రావాల్సింది. ఒప్పంద ప్రతిలోని భాష విషయంలో కొన్ని దేశాలు విభేదించడంతో ఈ ఏడాదికి పొడిగించాల్సి వచ్చింది.

ధనిక దేశాల మొండిపట్టు

'ద పాండెమిక్ ట్రీటీ' ఏడాది క్రితమే కుదరకపోవడానికి రెండు ప్రధానమైన అంశాలు కారణం. ప్రపంచం మొత్తానికి టీకాలు, మందులు, టెక్నాలజీలు అందరికీ సమానంగా అందుబాటులో ఉండేలా హామీ పొందడం ఒకటైతే... ప్రమాదకరమైన సూక్ష్మజీవులను మొట్టమొదట గుర్తించిన దేశం దాన్ని ఇతర దేశాలతో పంచుకోవడం (టీకా, మందులపై ప్రయోగాలు, నిర్ధారణ పరీక్షల అభివృద్ధి వంటి వాటికోసం) రెండో విషయం. ధనిక దేశాలు తమ ఫార్మా కంపెనీల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఈ విషయాలపై పేటెంట్ హక్కులను రక్షించుకునే ప్రయత్నం చేశాయి. అదే సమయంలో తమకు టీకాలు, మందులు, టెక్నాలజీలు అందుబాటు ధరల్లో ఉండేలా చూడాలని పేద, మధ్యస్థాయి దేశాలు పట్టుబట్టాయి. హానికారక సూక్ష్మజీవులను ఇతర దేశాలతో పంచుకుంటున్నందుకు, క్లినికల్ ట్రయల్స్ ద్వారా తమ జనాభాల్లో టీకా, మందులను ప్రయోగించి చూస్తున్నందుకు తమకు ఈ వెసలుబాటు కల్పించాలని కోరాయి. ఈ వైరుధ్యం కారణంగా చర్చలు దీర్ఘకాలం కొనసాగాయి.

ఒప్పందంలోని పదాలను కూడా అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో మార్చాల్సి వచ్చింది. చివరకు ఈ 2 వివాదాస్పద అంశాలను కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సమావేశాల్లో చర్చలు కొనసాగించాలని నిర్ణయించారు. వరల్డ్ హెల్త్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ ట్రీటీని ప్రవేశపెట్టిన తరువాత ఇది అమల్లోకి వస్తుంది. ఫార్మా కంపెనీల ప్రయోజనాలను కాపాడేందుకు ధనిక దేశాలు ఎంత మూర్ఖంగా బేరాలాడాయి అంటే... సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకునే విషయంలో 'పరస్పర అంగీకారం ఆధారంగా' అన్న వాక్యాన్ని 'స్వచ్ఛంద పరస్పర అంగీకారం' అని మార్చేంత వరకూ ఒప్పుకోలేదు.



సానుకూలతలు

కోవిడ్ సమయంలో ధనిక దేశాలు టీకాలను నిల్వ చేసుకున్న దాఖలాలు ఇంకా తాజాగానే ఉన్నాయి. టీకాలు అందుబాటులో లేని చోట్ల కోవిడ్ వైరస్ వేగంగా రూపాంతరం చెందిన విషయమూ తెలిసిందే. ఒక్క విషయమైతే స్పష్టం. ద పాండెమిక్ ట్రీటీ విషయంలో ఎన్ని భేదాభిప్రాయాలు ఉన్నా 193 దేశాలు కొన్ని కీలక అంశాల విషయంలోనైతే ఏకాభిప్రాయానికి వచ్చాయి. కోవిడ్ వంటి మహమ్మారులు ప్రబలుతున్న సమయంలో సమాచారాన్ని వేగంగా, తగిన సమయంలో పంచుకోవాలన్నది వీటిల్లో ఒకటి. అలాగే టీకాలు, మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల తయారీదారులు తమ ఉత్పత్తిలో కనీసం 20 శాతాన్ని అందుబాటు ధరల్లో డబ్ల్యూహెచ్‌ఓకు అందించాలన్నది రెండోది. వ్యాధిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం మూడోది. మాస్కులు, పీపీఇ కిట్ల వంటి వాటి సరఫరా, లభ్యతల విషయంలో డబ్ల్యూహెచ్‌ఓకు పర్యవేక్షణ అధికారం దక్కడం ఒక విశేషం.

ఈ ఒప్పందం కోవిడ్ లాంటి మహమ్మారుల నివారణపై కూడా దృష్టి పెడుతోంది. వన్ హెల్త్ పద్ధతిని అనుసరించాలని సూచిస్తోంది. భౌగోళికంగా వేర్వేరు ప్రాంతాల్లో పరిశోధనలు చేపట్టాలనీ, ప్రమాదకర సూక్ష్మజీవులు పరిశోధనలకు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలనీ, మందులు, ఇతర ఆరోగ్య సంబంధిత ఉత్పత్తుల తయారీకి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవాలనీ కూడా ఈ ఒప్పందం ప్రస్తావిస్తోంది. అంతేకాకుండా... అంతర్జాతీయ స్థాయిలో వేర్వేరు రంగాలకు చెందిన నిపుణులను ఆరోగ్య అత్యవసర పరిస్థితులకు దీటుగా స్పందించేలా సిద్ధం చేయాలని, ఈ కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక వనరుల సమన్వయానికి, ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసేందుకూ, అంతర్జాతీయంగా సప్లై చెయిన్, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది.

ప్రజారోగ్యం విషయంలో దేశాలకు ఉన్న సార్వభౌమ అధికారాలను గుర్తించే ఈ ఒప్పందం, అందులోని అంశాలు ఏ రకంగానూ డబ్ల్యూహెచ్‌ఓ ఇస్తున్న ఆదేశాలుగా భావించరాదని స్పష్టం చేస్తోంది. దేశీ విధానాలు, కార్యక్రమాలను మార్చుకోవాల్సిన అవసరమూ లేదని తెలిపింది. అంటే ప్రయాణీకుల నిలిపివేత, టీకాలు తప్పనిసరి చేయడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేపట్టడం వంటివి.

- ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో 'ద పాండెమిక్ ట్రీటీ' పేరుతో అంతర్జాతీయ ప్రజారోగ్య ఒప్పందం కుదిరింది.
- 1. కోవిడ్ వంటి మహమ్మారుల సమయంలో సమాచారాన్ని పంచుకోవడం; 2. టీకాలు, మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల తయారీదారులు తమ ఉత్పత్తిలో 20 శాతాన్ని అందుబాటు ధరల్లో డబ్ల్యూహెచ్‌ఓకు అందించడం; 3. వ్యాధిని ఎదుర్కొనే సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకునే అంశాల్లో 193 దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.
- ఒప్పందాన్ని ఆమోదించిన దేశాల్లో అమెరికా లేకపోవడం, హానికారక సూక్ష్మజీవులపై ప్రపంచవ్యాప్త నిఘా అన్న అంశాన్ని బలహీన పరిచేదే.

నిపుణుల ఆమోదం...

ఈ ఒప్పందంపై ఏకాభిప్రాయం కుదరడంపై అంతర్జాతీయ నిపుణులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్య చట్టాల విషయంలో నిపుణుడైన అమెరికా న్యాయవాది లారెన్స్ గోస్టిన్ దృష్టిలో ఈ ఒప్పందం ఒక ఘన విజయం. ఈ ఒప్పందంపై విమర్శకులు కూడా లేకపోలేదు. అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ ఉండగా... రిపబ్లికన్ పార్టీ నేతలు, ఒక వర్గం మీడియా వ్యాఖ్యాతలు అమెరికా ఈ చర్చల్లో పాల్గొనడాన్నే తప్పుపట్టారు. డబ్ల్యూహెచ్‌ఓ అమెరికా సార్వభౌమత్వంలో జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ ముసాయిదా ఒప్పందాన్ని తిరస్కరించారు. వాణిజ్యం, పర్యాటక రంగాలపై దీని ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచ ప్రభుత్వంగా మారే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత డబ్ల్యూహెచ్‌ఓ నుంచి ట్రంప్ వైదొలగడంతో ఈ ఒప్పందంపై చర్చలు వేగవంతమయ్యాయి. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సాగాయని కూడా చెప్పాలి.

ఇక్కడ ఒక కీలకమైన విషయం గురించి చెప్పుకోవాలి. ఒప్పందాన్ని ఆమోదించిన దేశాల జాబితాలో అమెరికా లేకపోవడం హానికారక సూక్ష్మజీవులపై ప్రపంచవ్యాప్త నిఘా అన్న అంశాన్ని బలహీన పరిచేదే. సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి కూడా ఎంతవరకూ సాధ్యమవుతుందన్నది చూడాలి. కాబట్టి ఆ యా దేశాల స్థాయిలో వనరుల నిర్మాణం, ప్రాంతీయ స్థాయిలో సహకారం వంటి ఇతర మార్గాలను అన్వేషించాల్సి ఉంటుంది. అంతర్జాతీయ స్థాయి సవాళ్లకు అంతే స్థాయి స్పందన కూడా అవసరమవుతుంది. పాండెమిక్ ట్రీటీ ఈ దిశగా వెళ్లేందుకు తగిన చోదక శక్తిని ఇస్తోంది!

వ్యాసకర్త 'పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ' డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్

('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

గురి పెద్దది కావాలి!



బహుశా విదేశీ శక్తులు సృష్టించడానికి యత్నిస్తున్న గందరగోళంలోకి మనల్ని లాగుతున్నారు. కాబట్టి, 'పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పాలి' అనడంలో అర్థం లేదు. అది నేర్చుకోదు, నేర్చుకోలేదు. ఇదే చక్రం పునరావృతం కావడం కోసం మన సైనికులను కోల్పోవడంలో ప్రయోజనం లేదు. రాబట్టుకోవాల్సిందల్లా నేలను. గొప్ప శక్తులు అలాగే చేస్తాయి.

– జోసెఫ్ టి. నూనీ, వ్యాఖ్యాత

ఏం పెరిగినట్టు?



ఏప్రిల్ 2025లో జీఎస్టీ ఆదాయం రికార్డు స్థాయిలో పెరిగిందని చెబుతున్నారు. కానీ విషయాన్ని దగ్గరగా పరిశీలిస్తే – తిరిగి చెల్లింపులను సవరించిన తర్వాత జీఎస్టీ కలెక్షన్ల పెరుగుదల 9.1 శాతం. ద్రవ్యోల్బణం 2.8 శాతం ఉందనుకుంటే, వాస్తవిక పెరుగుదల కేవలం 6.3 శాతం. అది పెద్ద విషయమే కాదు.

– అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

ఉండాల్సిన వైరాగ్యం



ఇంద్రియ సంబంధ విషయాల్లో నైపుణ్యంతో వ్యవహరించి మనసును తిరిగి ఆత్మ దగ్గరికి తేవడమే వైరాగ్యం. సంతోషం పట్ల లాలస నుంచి మనసు స్వేచ్ఛ పొందడంలో వైరాగ్యం ఉపకరిస్తుంది.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

మార్పు లేదు!



విస్కీ జనరల్స్ నుంచి ధార్మిక జనరల్స్ దాకా పాకిస్తాన్ ప్రయాణించింది. కానీ ఇండియా పట్ల దాని ద్వేషం మాత్రం అలాగే స్థిరంగా ఉంది.

– ఎం.జె. అక్బర్, సంపాదకుడు

మార్చాల్సింది...



దృశ్యాన్ని మార్చలేనప్పుడు– ఫొటోగ్రాఫర్ తన కోణాన్ని, లెన్స్‌ను మార్చుకుంటాడు. జీవితంలోనూ అంతే– పరిస్థితిని మార్చలేనప్పుడు, దృష్టికోణాన్ని మార్చుకోవాలి.


– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

ఒక అగ్ని పర్వతం

భారత దేశానికి స్వాతంత్య్రం ఇచ్చిన బ్రిటిష్ లేబర్ పార్టీలో సభ్యత్వం కలిగిన భారతీయ మేధావి ఆయన. మౌంట్‌బాటన్ అయితే భారత్‌కు స్వాతంత్య్రాన్ని ఇచ్చే ప్రక్రియను తొందరగా పూర్తి చేస్తాడని బ్రిటన్ ప్రధానికి సలహా ఇచ్చిన ముందుచూపున్న దేశ భక్తుడు ఆయన. ఆయనే వీకే కృష్ణ మీనన్. 1924లో ఇంగ్లాండు కెళ్ళి, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పొలిటికల్ సైన్స్ పట్టా పొందిన ఆయన రెండు దశాబ్దాల పాటు అక్కడే ఉన్నారు. ఆ రోజుల్లో ఆయన బ్రిటిష్ రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఏర్పరచుకుని, లేబర్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. మరోవైపు లండన్ నగరంలో 'ఇండియా లీగ్' సంస్థ స్థాపించి భారత్ స్వాతంత్య్రానికి కృషి చేసేవారు.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం లేబర్ పార్టీకి చెందిన బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ ఇండియాకు స్వాతంత్య్రం ఇవ్వాలని భావించారు. ముందుగా వైస్రాయ్ లార్డ్ వేవెల్‌ను మార్చాలనుకున్నారు. అది తెలుసుకున్న మీనన్ ప్రధాని అట్లీతో, 'మీరు ఇండియాకు త్వరగా స్వాతంత్య్రం ఇవ్వాలనుకుంటే, ఒక మిలిటరీ అధికారికి ఈ పని పురమాయించండి' అని సలహా ఇచ్చారు. రాయల్ నేవీ ఆఫీసర్ లూయిస్ మౌంట్ బాటన్ పేరును వైస్రాయ్ పదవికి సూచించారు. ఈ విషయం ప్రధాని అట్లీ, కేబినెట్‌లో చర్చించి ఆయననే భారత్‌కు వైస్రాయ్‌గా పంపారు. బ్రిటిష్ పార్లమెంట్ ఇచ్చిన గడువులోపే ఆయన తన పనిని పూర్తిచేయడం తెలిసిందే. ఇంగ్లాండులోని అధికార వర్గంతో ఈయనకు ఉన్న సంబంధాలను గుర్తించిన ప్రధాని నెహ్రూ బ్రిటన్‌లో మొట్ట మొదటి ఇండియా హై కమిషనర్‌గా మీనన్‌ను (1947) నియమించారు. 1957 జనవరి 23న ఐక్యరాజ్యసమితి సదస్సులో, భారత ప్రభుత్వం తరఫున కశ్మీరు విషయంపై అవిరామంగా ఎనిమిది గంటలు వాదించి, పాకిస్తాన్ నాయకులు నోరు మెదపకుండా చేసి రికార్డ్ సృష్టించారు మీనన్. రాజ్యాంగ ముసాయిదా రాసే రోజుల్లో దాని ప్రవేశిక (భారత ప్రజలమైన మేము... అని సాగే ప్రియాంబుల్) డ్రాఫ్ట్ రాసి పెట్టిన ఘనత కృష్ణ మీనన్‌దే.



వీకే కృష్ణ మీనన్

1953లో కృష్ణ మీనన్ రాజ్యసభ సభ్యులు అయ్యారు. ఆ తర్వాత 1957లో బాంబే (ముంబై) నార్త్-ఈస్ట్ నియోజక వర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఈయన గెలుపు కోసం అలనాటి బాలీవుడ్ హీరో దేవానంద్, ఇతర సినీ నటులు విస్తృతంగా ప్రచారం చేశారు. తర్వాత నెహ్రూ కేబినెట్లో మీనన్ రక్షణ మంత్రి అయ్యారు. 1961 డిసెంబర్ 17న (ప్రధాని నెహ్రూను ఒప్పించి) 'ఆపరేషన్ విజయ్' పేరుతో గోవా వైపు ఇండియన్ ఆర్మీని తరలించి కేవలం 36 గంటల్లోనే పోర్చుగీసువారి ఆధీనంలో ఉన్న గోవా ప్రాంతాన్ని భారత్ భూభాగంలో కలిపారు మీనన్.

1962 అక్టోబరులో చైనా-భారత్ యుద్ధంలో భారత్ ఓటమి చవి చూడటంతో విమర్శలకు తాళలేక ఆయనను నెహ్రూ రక్షణ మంత్రి పదవి నుంచి తప్పించారు. 78వ ఏట ఆయన మరణించినప్పుడు 'ఒక అగ్ని పర్వతం అంతరించింద'ని ఇందిరా గాంధీ వాపోయారు. ఇంతటి మహోన్నత నాయకుణ్ణి ఇప్పటి రాజకీయ నాయకులు గుర్తు చేసుకోకపోవటం శోచనీయం.

– జిల్లా గోవర్ధన్, విశ్రాంత ఈపీఎఫ్ కమిషనర్, ముంబై । 98190 96949

(నేడు కృష్ణమీనన్ జయంతి)

ముస్లింల సంక్షేమానికే వక్ఫ్ సవరణలు

అభిప్రాయం



డా॥ జి. మనోహర్ రెడ్డి

వక్ఫ్ అంటే ఇస్లామ్‌లో పవిత్రమైన, మతపరమైన సేవా కార్యక్రమానికి అందించే విరాళాలు అని అర్థం. ఇస్లాం చట్టాల ప్రకారం రూపొందించిన ధార్మిక సంస్థ వక్ఫ్ బోర్డు. ఇంత పవిత్రమైన సంస్థను మన భారతదేశంలో అక్రమాలకు వినియోగించుకుంటూ అపవిత్రం చేస్తున్నారు. వక్ఫ్‌బోర్డులో జవాబుదారీతనం లోపించడంతో పారదర్శకత కోసం కేంద్రం చర్యలు తీసుకుంది. వక్ఫ్ ఫలాలు ముస్లింలందరికీ దక్కేలా ప్రభుత్వం చారిత్రాత్మకమైన చట్ట సవరణలు చేసింది. అయితే రాజకీయాలే లక్ష్యంగా కొన్ని పక్షాలు ముస్లిం మైనారిటీలను తప్పుడు సమాచారంతో వంచిస్తున్నాయి.

చట్ట సవరణ చేయడం వల్ల ముస్లిం మైనారిటీల హక్కులకు భంగం కలుగుతుందనీ; ముస్లిం ధార్మిక సంస్థల ఆస్తులను, భూములను లాక్కుంటారనీ ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. వాస్తవానికి సవరణల వల్ల ప్రయోజనం పొందేది ముస్లిం సామాజిక వర్గమే. వక్ఫ్ భూములను దుర్వినియోగపరుస్తున్న శక్తులకు ఈ చట్టంలోని సవరణలు యమపాశాలయ్యాయి. అందుకే నిరాధార ఆరోపణలు.

భారత దేశంలో రక్షణ, రైల్వే శాఖల తర్వాత వక్ఫ్ బోర్డులు అధికంగా భూములు కలిగున్నాయి. 2018 సెంట్రల్ వక్ఫ్ బోర్డు కౌన్సిల్ (సీడబ్ల్యూసీ) నివేదిక ప్రకారం దేశంలో 8 లక్షల ఎకరాలకుపైగా వక్ఫ్ ఆస్తులుండగా, వీటి విలువ రూ. 10 లక్షల కోట్లకుపైగా ఉంటుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశవ్యాప్తంగా 60 వేలకు పైగా వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. వక్ఫ్ భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే వాటిని అన్యాక్రాంతం చేస్తున్నాయని సచార్ కమిటీ కూడా ఆక్షేపించింది. వక్ఫ్ ఆస్తులను సమర్థవంతంగా వినియోగించుకుంటే కనీసం 10 శాతం అంటే సంవత్సరానికి రూ. 12 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలవని సచార్ కమిటీ అంచనా వేసింది. 2006లో నివేదికను సమర్పించిన సచార్ కమిటీ వక్ఫ్ నిర్వహణను మెరుగుపరచడానికి వివిధ చర్యలను సిఫార్సు చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సచార్ కమిటీ సిఫార్సులను నిర్లక్ష్యం చేసి ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేసింది. బుజ్జగింపు ఓట్ల రాజకీయాల కోసం 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు చేసిన సవరణలు దేశానికి గుదిబండగా మారాయి.

వక్ఫ్ చట్టంతో ఇంతకాలం ముస్లింలలో కొందరి ఆధిపత్యమే కొనసాగుతుండగా, ప్రస్తుత సవరణలతో ముస్లింలలోని ఇతర వర్గాలలైన షియా, బొహ్రా, అఘాఖానీ, పస్మాందా ముస్లింలకు



కూడా వక్ఫ్‌బోర్డులలో ప్రాతినిధ్యం వస్తుంది. వక్ఫ్ కౌన్సిల్‌తో పాటు రాష్ట్ర బోర్డుల్లో ఇద్దరు ముస్లిమేతరులకు స్థానం కల్పించారు. వక్ఫ్ బోర్డులో కనీసం ఇద్దరు మహిళలుండడం కూడా తప్పనిసరి. ఎంపీలు, న్యాయమూర్తులు, ముస్లిమేతరులను సభ్యులుగా చేసి కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ బోర్డులను పునర్వ్యవస్థీకరించారు. వక్ఫ్ ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జీతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి స్థాయి ఉన్నతాధికారి ఉంటారు. వక్ఫ్ ఆదాయం నుండి వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలకు జీవనభృతి కల్పించేలా చట్టానికి సవరణలు చేశారు. మహిళా వారసులకు స్పష్టమైన రక్షణ కల్పించేలా చట్టాన్ని సవరించారు. కనీసం ఐదేళ్లుగా ఇస్లాంను అనుసరిస్తున్న వాళ్ల మాత్రమే దానాలివ్వడానికి అర్హులని ఎన్డీఏ ప్రభుత్వం సవరణలు చేసింది.

ముస్లిమేతరులకు స్థానం కల్పించడాన్ని తప్పుపడుతూ హిందూ దేవాలయాల్లో హిందూయేతరులకు చోటిస్తారా అనే ప్రశ్నలొస్తున్నాయి. హిందూ దేవాలయాలు ప్రభుత్వం ఆధీనంలోని ఎండోమెంట్ శాఖ, ప్రభుత్వం ఏర్పాటు చేసే బోర్డు, కమిటీల పరిధుల్లో పనిచేస్తున్నాయి. ప్రభుత్వం ఆధీనంలో మతపరమైన విభజన ఉండదు. అదే వక్ఫ్ బోర్డు ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ఒక స్వతంత్ర బోర్డుగా ఉందనే అవగాహన లేకుండా ముస్లింలను తప్పుదోవ పట్టిస్తూ కుహనా లౌకికవాదులు వ్యాఖ్యానిస్తున్నారు. ముస్లిమేతరులకు వక్ఫ్ బోర్డులో కాకుండా వక్ఫ్ కౌన్సిల్‌లో మాత్రమే స్థానం కల్పించారనేది ఇక్కడ గమనార్హం. మరోవైపు వక్ఫ్‌కు సంబంధించిన కేసులకు వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. దేశంలో ఇతర మతాలకు అలాంటి ప్రత్యేక సౌలభ్యం లేదని గమనించాలి.

చట్టానికి నూతన సవరణలతో వక్ఫ్ ఆస్తులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయడంతో ఆస్తుల దుర్వినియోగానికి అడుకట్ట వేయవచ్చు. వక్ఫ్ ఆస్తులను డిజిటలైజ్ చేయడం ద్వారా అవకతవకలు అరికట్టవచ్చు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు కూడా కేంద్ర ప్రభుత్వం ఈ సవరణలు చేసింది. రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ల కింద గుర్తించిన ప్రాంతాల్లోని గిరిజనులకు చెందిన భూములకు వక్ఫ్ చట్టం వర్తింపచేయడాన్ని నిషేధించారు. దీంతో గిరిజనుల ఆస్తులు, భూములు పరిరక్షించబడుతాయి. వక్ఫ్ ప్రకటించిన జాతీయ స్మారక చిహ్నాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఈ సవరణలు అవకాశం కల్పించాయి. మొత్తం మీద వక్ఫ్ బోర్డులో తీసుకొచ్చిన ఈ సవరణలు, సంస్కరణలు చరిత్రలో నిలిచిపోతాయనడం అతిశయోక్తి కాదు.

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ప్రేమ

ప్రేమ, కరుణ, జాలి, దయ వంటివి అప్పటికప్పుడు మనిషిలో సహజంగా ఉద్భవించేవి. ప్రపంచం వీటితోనే పెనవేసుకుని ఉంది. బండి చక్రం చక్కగా తిరగడానికి దానికి గ్రీజ్ పూస్తాం. అలాగే ప్రపంచం చక్కగా నడవటానికి ప్రేమ అనే గ్రీజ్ అవసరం. ఈ ప్రేమ అంతరాత్మ నుంచి పుట్టుకొచ్చేది. అది ఉన్నంతసేపే మనిషి సజీవంగా ఉన్నట్టు లెక్క. దానికున్న శక్తి అలాంటిది.

జ్యోతిర్మయం

అడవికి వెళ్ళే క్లిష్ట పరిస్థితిలోనూ సీతాదేవి సుమంత్రుడితో అయోధ్యలో తాను పెంచే చిలుక వంటి పక్షులకు తన వనవాస కాలంలో ఆహార ఏర్పాట్లు చూసుకోమని కోరింది. తాను లేని సమయంలో ఆ పక్షులేవీ బాధ పడకూడదన్నది ఆమె మనసు మాట. ఈ దయాపూరిత ప్రేమే రావణుడు సీతను పుష్పక విమానంలో తీసుకుపోతున్నప్పుడు జటాయువు అనే పక్షి అమిత వేగంతో వచ్చి రావణుని అడ్డుకునేలా చేసింది.

ఏదీ ఆశించక పంచే ప్రేమకు శక్తి ఎక్కువ. ప్రపంచం ఇప్పటికీ ఇలా ఉండటానికి కారణం అదే. ఏదీ ఆశించక ప్రేమ చూపితే ప్రపంచం మీ మీద ప్రేమ వర్షాన్ని కురిపిస్తుంది. అంతే తప్ప అర్హత చూసో, లాభం చూసుకునో, పెద్దవాళ్ళో – చిన్నవాళ్ళో అని చూసి లెక్కలు వేసుకునో ప్రేమ చూపిస్తే అందువల్ల వచ్చే ఫలితాలు అంత సంతోషంగా ఉండవు. అంతేకాదు, అది ప్రమాదం కూడా. ప్రేమ, కరుణ వంటి వన్నీ దైవిక సంబంధమైనవి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.షష్ఠి ప.1.20 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పునర్వసు సా.5.47 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.6.03 నుండి 7.37 వరకు, తదుపరి రా.1.46 నుండి 3.22 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.03 నుండి 7.14 వరకు, అమృతఘడియలు: ప.3.27 నుండి 5.02 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.37, సూర్యాస్తమయం: 6.15.

588 మండలాలపై వడగాడ్పుల ప్రభావం

- వడదెబ్బ మృతులకు పరిహారం రూ.4 లక్షలకు పెంపు
- హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2025 విడుదల చేసిన మంత్రి పొంగులేటి


హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2025ను విడుదల చేస్తున్న మంత్రి పొంగులేటి, ఐఏఎస్ అధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, అర్వింద్‌కుమార్


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మొత్తం 612 మండలాలకు గాను 588 మండలాలు వడగాడ్పులకు ప్రభావితమయ్యే అవకాశం ఉందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వేసవికాలంలో వడదెబ్బ వల్ల మరణించేవారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచినట్లు గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2025ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వడగాడ్పులపై 12 శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరినందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని.. ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్ల సరఫరాకు స్థానిక కంపెనీల సీఎస్ఆర్ నిధులు వినియోగించుకోవాలని కోరారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కొత్తగూడెం, మెదక్, కరీంనగర్ పట్టణ ప్రాంతాలపై మరింత దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. గతనెల 15న హీట్‌వేవ్‌ను స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్‌గా నోటిఫై చేసినట్లు చెప్పారు. వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారాన్ని వేగంగా మంజూరు చేసేలా ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి

వేడి ప్రదేశాల్లో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటలకు ఒకసారి విశ్రాంతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ కార్మికులకు విశ్రాంతి, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ సదుపాయంపై దృష్టి సారించాలని కార్మిక సంక్షేమ శాఖను ఆదేశించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రచారం చేయాలని స్థానిక సంస్థలు, మునిసిపాలిటీల అధికారులను కోరారు. పార్కుల వద్ద పక్షులు, వీధి జంతువుల కోసం నీటి తొట్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

5 నుంచి హైకోర్టుకు వేసవి సెలవులు

- జూన్ 6వ తేదీ వరకు ఇస్తూ రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు
- మే 7, 14, 21, 28, జూన్ 4న అందుబాటులో వెకేషన్ బెంచ్‌లు



సాక్షి, హైదరాబాద్: మే 5 నుంచి జూన్ 6 వరకు హైకోర్టుకు వేసవి సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మే 5, 12 19, 26, జూన్ 2 తేదీల్లో కేసుల ఫైలింగ్, మే 7, 14, 21, 28, జూన్ 4 తేదీల్లో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. హెబియస్ కార్పస్, ముందస్తు బెయిల్, ట్రయల్ కోర్టు తిరస్కరించిన వాటిపై బెయిల్ అప్లికేషన్లు, ఇతర అత్యవసర కేసులను సెలవుల్లోని బెంచ్‌ల వద్ద ఫైలింగ్ చేయొచ్చని చెప్పారు. లంచ్ మోషన్ కేసులు, అత్యవసర పిటిషన్ల మెన్షన్ (విచారణ కోరడం)లపై డివిజన్ బెంచ్‌లో సీనియర్ న్యాయమూర్తి నిర్ణయం తీసుకుంటారు.

మే 7న..
సింగిల్ బెంచ్: జస్టిస్ పుల్ల కార్తీక్
డివిజన్ బెంచ్: జస్టిస్ సూరేపల్లి నందా, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు
మే 14..
సింగిల్ బెంచ్: జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు
డివిజన్ బెంచ్: జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు
మే 21..
సింగిల్ బెంచ్: జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు
డివిజన్ బెంచ్: జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు
మే 28..
సింగిల్ బెంచ్: జస్టిస్ కె.శరత్
డివిజన్ బెంచ్: జస్టిస్ నగేశ్ భీమపాక, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి
జూన్ 4..
సింగిల్ బెంచ్: జస్టిస్ కె.సుజన
డివిజన్ బెంచ్: జస్టిస్ కె.శరత్, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు

పోలీసు వాహనాలపై 17,391 చలానాలు పెండింగ్

- చెల్లించాల్సిన మొత్తం రూ.68,67,885
- సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పదేపదే చెప్పే పోలీసులే.. ఆ నియమాలు తమకు పట్టవన్నట్లు ప్రవర్తిస్తున్నారు. పోలీసు సిబ్బంది, అధికారులు వాడే వాహనాలు సాధారణంగా తెలంగాణ డీజీపీ పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉంటాయి. ఇలా డీజీపీ పేరిట ఉన్న పోలీసు వాహనాలపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 17,391 పెండింగ్ చలానాలు ఉన్నాయి. ఈ చలానాల కింద మొత్తం రూ.68,67,885 చెల్లించాల్సి ఉంది. హైదరాబాద్ ట్రాఫిక్ మన్‌గా పేరుపొందిన లోకేంద్రసింగ్ అనే వ్యక్తి ఆర్టీఐ కింద దరఖాస్తు చేయగా, ఈ మేరకు వివరాలు వెల్లడయ్యాయి. 'ఇది నిజంగా ప్రజలకు చెడ్డ ఉదాహరణ. నేను ట్రాఫిక్ పోలీసులను చాలా గౌరవిస్తాను. అలాగే చట్టాన్ని అమలు చేసే అధికారుల పారదర్శకత, జవాబుదారీతనం పట్ల నాకు నమ్మకం ఉంది. భవిష్యత్తులో పోలీసులు ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలకు పాల్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ అభ్యర్థిస్తారని నేను ఆశిస్తున్నాను' అని లోకేంద్రసింగ్ పేర్కొన్నారు.

పోలీసు వాహనాలపై పెద్ద ఎత్తున చలాన్లు పెండింగ్‌లో ఉండటంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. 'చలాన్ల చెల్లింపుపై ట్రాఫిక్ వాళ్లు పెట్టిన డిస్కౌంట్ ఆఫర్లు వీళ్లు మర్చిపోయినట్టు కనిపిస్తోంది' అని ఒకరు. 'ఈ వాహనాలను కూడా ప్రయాణం మధ్యలో ఆపి, మిగతా వారందరికీ చేస్తున్నట్లుగా, డబ్బు చెల్లించిన తర్వాతే వాహనాలను ముందుకు అనుమతించాలి' అని మరొకరు కామెంట్ చేశారు. 'ఈ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచి చెల్లిస్తారు. కానీ, జరిమానాలను ఆ వాహనాలు నడిపిన డ్రైవర్ల నుంచి వసూలు చేయాలి' అని మరొకరు కామెంట్ పెట్టారు.

'వాంటెడ్'లు చిక్కుతున్నారు!

- ఫింగర్ ప్రింట్ డివైజ్‌లతో వాంటెడ్ క్రిమినల్స్ గుర్తింపు
- ఈ ఏడాది ఇప్పటివరకు 38 మంది అరెస్ట్



సాక్షి, హైదరాబాద్: నేరం చేసి పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరిగే మోస్ట్ వాంటెడ్‌లు చిక్కుతున్నారు. తెలంగాణ పోలీసులు వాడుతున్న మొబైల్ సెక్యూరిటీ ఫింగర్ ప్రింట్ డివైజ్‌లు పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నేరస్తులను పట్టేస్తున్నాయి. క్షేత్ర స్థాయి విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది, పాస్‌పోర్టు వెరిఫికేషన్ చేసే స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సైతం ఈ మొబైల్ సెక్యూరిటీ డివైజ్‌లను వాడుతున్నారు. ఎవరినైనా అనుమానిస్తే వెంటనే ఈ మొబైల్ సెక్యూరిటీ ఫింగర్ ప్రింట్ డివైజ్‌లతో వేలిముద్రలను పరీక్షిస్తున్నారు. ఈ వేలిముద్రలను ఫింగర్‌ప్రింట్ డివైజ్.. పోలీస్‌డేటాలోని నేరస్తుల వేలిముద్రల డేటాబేస్‌తో రియల్ టైంలో తనిఖీ చేసి రిజల్ట్ ఇస్తుంది. ఒకవేళ ఈ డేటాబేస్‌లోని వేలిముద్రలతో సరిపోలినట్లయితే వెంటనే సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. ఇలా పలు కేసులలో నేరస్తులుగా ఉండి తప్పించుకు తిరుగుతున్న 38 మందిని ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 15 వరకు గుర్తించారు.

2019 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు గుర్తించిన వాంటెడ్ నేరస్తుల సంఖ్య ఇలా ఉంది..

2019	2020	2021	2022	2023	2024	2025
61	52	97	138	119	161	38

మహిళలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్ కల్పించాలి

మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రామునాయక్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్‌ల గ్రేడ్–3 ప్రమోషన్‌లలో దళిత, గిరిజనులను చిన్న చూపు చూస్తున్నారని, అవినీతి అక్రమాల మాయలో కొందరు సీడీఎంఏ కార్యాలయాన్ని తమ అడ్డాగా మార్చుకుంటున్నారని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ రాము నాయక్ ఆరోపించారు. దళిత గిరిజనులతోపాటు మహిళలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సీడీఎంఏను తమ అడ్డాగా మార్చుకున్న ఉద్యోగులపై సమగ్ర విచారణ జరిపి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 93 ఇచ్చిన గ్రేడ్–3 మున్సిపల్ కమిషనర్ ప్రమోషన్ వెంటనే రద్దు చేయాలని గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజన, వికలాంగులు, మహిళలు, వెనుకబడిన వర్గాల హక్కులను చట్ట వ్యతిరేకంగా తుంగలో తొక్కి, అవినీతి అక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని రామునాయక్ ఆరోపించారు.

సీఎస్‌ను కలిసిన పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నూతన చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావును తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఈ.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వణుకుతున్న దాయాది

భారత్‌ను నిలువరించండి

- అరబ్ దేశాలకు విజ్ఞప్తులు
- రాయబారులతో షరీఫ్ భేటీ
- ఉగ్రవేటలో మేం భారత్‌తోనే
- పాక్‌కు అమెరికా స్పష్టీకరణ
- మీ గడ్డపై ముష్కరులు: వాన్స్
- వారి వేటలో భారత్‌కు తోడ్పడండి
- దాయాదికి ఉపాధ్యక్షుని హితవు
- మాది 'ఉగ్ర'చరిత్రే: బిలావల్
- ఎనిమిదో రోజూ పాక్ కాల్పులు

ఇస్లామాబాద్/వాషింగ్టన్/శ్రీనగర్/న్యూఢిల్లీ: భారత 'పహల్గాం ప్రతీకార' ప్రయత్నాలు చూసి పాకిస్తాన్ బెదిరిపోతోంది. ఉద్రిక్తతలను ఎలాగైనా తగ్గించేలా భారత్‌ను ఒప్పించాలంటూ అరబ్ దేశాలను ఆశ్రయించింది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ తదితర దేశాలకు పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ శుక్రవారం ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పాక్‌లోని ఆ దేశాల రాయబారులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దక్షిణాసియాలో సుస్థిరతనే కోరుతున్నామంటూ శాంతి వచనాలు వల్లెవేశారు. పహల్గాం దాడితో పాక్‌కు ఏ సంబంధమూ లేదంటూ పాత పాటే పాడారు. పాక్‌లో చైనా రాయబారి జియాంగ్ జైడాంగ్‌తో కూడా షహబాజ్ భేటీ అయ్యారు. ఉగ్రవాదంపై పోరుతో భారత్‌కు తాము పూర్తిస్థాయిలో దన్నుగా నిలుస్తామని అమెరికా పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి తమ పూర్తి మద్దతుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ స్పష్టం చేశారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయమై నిర్ణాయక వ్యాఖ్యలు చేశారు. పాక్ భూభాగం నుంచి మారణకాండకు దిగుతున్న ఉగ్రవాదులను వెదికి పట్టుకోవడంలో భారత్‌కు సహకరించాలని దాయాదికి హితవు పలికారు. ''ఇరుదేశాల మధ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. అవి రెండు అణుదేశాల ప్రాంతీయ యుద్ధంగా మారొద్దన్నదే మా ఉద్దేశం. ఏం జరుగుతుందో చూద్దాం'' అని గురువారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అభిప్రాయపడ్డారు. పహల్గాం దాడి సమయంలో వాన్స్ కుటుంబంతో పాటు భారత్‌లోనే ఉండటం తెలిసిందే. దాయాదుల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలని బ్రిటన్ ఆకాంక్షించింది. పహల్గాం దాడిని హౌస్ ఆఫ్ లార్డ్స్ తీవ్రంగా ఖండించినట్టు పేర్కొంది. వాటిని నిరసిస్తూ బ్రిటన్‌లో కొద్ది రోజులుగా శాంతియుత ఆందోళనలు జరుగుతున్న వైనం కూడా సభలో చర్చకు వచ్చినట్టు పేర్కొంది.

అదేమీ రహస్యం కాదు: బిలావల్

పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయంగా మారడం నిజమేనని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చైర్‌పర్సన్ బిలావల్ భుట్టో కూడా అంగీకరించారు. మూడు దశాబ్దాలుగా పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల అంతర్జాతీయ మీడియా సాక్షిగా అంగీకరించడం తెలిసిందే. దీనిపై స్కై న్యూస్ ఇంటర్వ్యూలో బిలావల్ ఈ మేరకు స్పందించారు. రక్షణ మంత్రి వ్యాఖ్యలతో ఏకీభవిస్తారా అని ప్రశ్నించగా, 'అది పెద్ద రహస్యమేమీ కాదు. పాక్‌ది ఉగ్రవాద గతమే'' అంటూ పాక్ నిర్వాకాన్ని బాహాటంగా అంగీకరించారు. అయితే దానివల్ల దేశం ఎంతగానో నష్టపోయిందని వాపోయారు. ''ఉగ్రవాదం పాక్‌కే కాదు, అంతర్జాతీయ సమాజానికి కూడా పెనుబెడదగా పరిణమించింది. పాక్ దశలవారీగా ఉగ్రవాదానికి మద్దతిస్తూ వచ్చింది. మా సమాజం ఇస్లామీకరణ, సైనికీకరణ దశల గుండా సాగింది. వీటన్నింటివల్లా మేం నష్టపోతూ వచ్చాం. అయితే వాటినుంచి పాఠాలు నేర్చుకున్నాం. సింధూ పరివాహక నదులకు భారత్ నీరు వదలకుంటే రక్తం పారుతుందంటూ బిలావల్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. తన ఉద్దేశం అది కాదని ఆయన తాజాగా చెప్పుకొచ్చారు. ''నీటిని ఆపడాన్ని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని మా ప్రభుత్వమే చెప్పింది. యుద్ధం జరిగితే పారేది రక్తమేగా. అదే నేనూ చెప్పా'' అన్నారు. మరోవైపు సింధూ జల ఒప్పందం నిలుపుదలను నిరసిస్తూ భారత్‌కు దౌత్య నోటీసులివ్వాలని పాక్ యోచిస్తోంది. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికల మీదా లేవనెత్తేందుకు సిద్ధమవుతోంది.

ఐదు సెక్టర్లలో కాల్పులు

పాక్ వరుసగా ఎనిమిదో రోజు కాల్పుల విరమణకు తూట్లు పొడిచింది. జమ్మూ కశ్మీర్‌లో ఐదు జిల్లాల వెంబడి నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి గురువారం రాత్రి కూడా కాల్పులకు తెగబడింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, నౌషేరా, అఖ్నూర్ ప్రాంతాల్లో ఎలాంటి కవ్వింపులూ లేకుండానే పాక్ దళాలు తేలికపాటి ఆయుధాలతో కాల్పులకు దిగినట్టు సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు. ''తొలుత ఉత్తర కశ్మీర్‌లో కుప్వారా, బారాముల్లా జిల్లాల్లో మొదలైన కాల్పులు జమ్మూ ప్రాంతంలోని పూంచ్, అఖ్నూర్ సెక్టర్లకు విస్తరించాయి. అనంతరం నౌషేరాలోని సుందర్బనీ, జమ్మూ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు గుండా పర్గ్వాల్ సెక్టర్లోనూ కాల్పులకు తెగబడ్డాయి. వాటిని భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది'' అని తెలిపారు. ఉద్రిక్తతలు మరింత పెరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాల ప్రజలు సురక్షితంగా తలదాచుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన కమ్యూనిటీ, వ్యక్తిగత బంకర్లను సిద్ధం చేసుకుంటున్నారు. కథువా, సాంబా, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో ఇంకా పంటకోతలు జరగాల్సి ఉంది. పాక్‌తో భారత్ 3,323 కి.మీ. మేరకు సరిహద్దును పంచుకుంటోంది. ఇందులో 2,400 కి.మీ. మేరకు అంతర్జాతీయ సరిహద్దు గుజరాత్ నుంచి జమ్మూ దాకా విస్తరించింది. 740 కి.మీ. నియంత్రణ రేఖ, యాక్చువల్ గ్రౌండ్ పొజిషన్ లైన్ (ఏజీపీఎల్)తో పాటు మరో 110 కి.మీ. సియాచిన్ ప్రాంతంలో విస్తరించి ఉంది.

హాకింగ్‌కు విఫలయత్నాలు

పాక్ ప్రేరేపిత హ్యాకర్ గ్రూపులు భారత వెబ్‌సైట్లపై శుక్రవారం మరోసారి భారీగా సైబర్ దాడులకు దిగాయి. జమ్మూలోని ఆర్మీ స్కూల్స్, రిటైర్డ్ సైనికుల ఆరోగ్య సేవలు తదితరాలకు సంబంధించిన సైట్లను హ్యాక్ చేసేందుకు విఫలయత్నం చేశాయి. సైబర్ గ్రూప్ హోక్స్1337, నేషనల్ సైబర్ క్రూ పేరిట దాడులు జరిగినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ''పాక్‌తో పాటు పలు పశ్చిమాసియా దేశాలు, ఇండొనేసియా, మొరాకో తదితర చోట్ల నుంచి ఈ సైబర్ దాడులు జరిగాయి. వాటికి పాల్పడ్డ పలు సంస్థలు ఇస్లామిక్ భావజాలానికి మద్దతు పలుకుతున్నట్టు చెప్పుకున్నాయి. వాటన్నింటినీ సమర్థంగా తిప్పికొట్టాం'' అని తెలిపాయి. పహల్గాం దాడి నుంచీ ఈ తరహా దాడులు విపరీతంగా పెరిగిపోయినట్టు వెల్లడించాయి. ఇదంతా పాక్ హైబ్రిడ్ యుద్ధ తంత్రంలో భాగమని అనుమానిస్తున్నారు.

ఉద్రిక్తతలపై త్వరలో భద్రతా మండలి భేటీ

ఐక్యరాజ్యసమితి: భారత్, పాకిస్తాన్‌ల మధ్య తీవ్రరూపం దాల్చిన ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా మండలి త్వరలోనే సమావేశమయ్యే అవకాశముంది. మండలి అధ్యక్షుడు, ఐరాసలో గ్రీసు శాశ్వత ప్రతినిధి ఇవాంజెలిస్ సెకెరిస్ ఈ మేరకు వెల్లడించారు. ఇలాంటి సమావేశంలో సభ్య దేశాలు తమ అభిప్రాయాలను పరస్పరం వ్యక్తం చేసుకోవడం ఉద్రిక్తతలు చల్లారేందుకు దోహదపడుతుందన్నారు. అణు పాటవం కలిగిన దక్షిణాసియాలోని పొరుగుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ విషయంలో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలంటూ సభ్యదేశాలేవీ తనను కోరలేదన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండిస్తామని చెప్పారు. మే నెలకు గాను 15 దేశాలతో కూడిన భద్రతా మండలి అధ్యక్ష బాధ్యతలను గురువారం గ్రీస్ చేపట్టింది.



శుక్రవారం గంగా ఎక్స్‌ప్రెస్ వేపై సైనికుల విన్యాసాలు

రోడ్డుపై వైమానిక గర్జన

వాయుసేన యుద్ధ విమానాల అసాధారణ ఫీట్

గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై తొలిసారి రాత్రివేళ ల్యాండింగ్, టేకాఫ్

షాజహాన్‌పూర్ (యూపీ): పహల్గాం దాడి ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం నాటి పాకిస్తాన్ సైనిక విన్యాసాలకు మన సైన్యం దీటుగా బదులిచ్చింది. సంప్రదాయ యుద్ధక్షేత్రాలకు భిన్నంగా నడిరోడ్డుపైనా యుద్ధవిమానాల ల్యాండింగ్, టేకాఫ్ జరిపి వాయుసేన సత్తా చాటింది. అత్యంత అధునాతన శత్రు భీకర రఫేల్‌తో పాటు సుఖోయ్-30, ఎంకేఐ, మిరాజ్-2000, మిగ్-29, జాగ్వార్, సీ-130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్-32 విమానాలతో పాటు ఎంఐ-17 వీ5 హెలికాప్టర్లను కూడా ఈ అధునాతన ఎయిర్‌స్ట్రిప్‌పై ల్యాండింగ్, టేకాఫ్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలోని గంగా ఎక్స్‌ప్రెస్‌వే ఈ ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలకు వేదికైంది. పగటి పూటే గాక అవసరమైతే కారుచీకట్లోనూ నిర్భీతిగా యుద్ధవిమానాలను రోడ్లపై కూడా దింపగలమని వాయుసేన నిరూపించింది. 594 కిలోమీటర్ల పొడవైన గంగా ఎక్స్‌ప్రెస్ వేలో జలాలాబాద్ సమీపంలోని పిరూ గ్రామం వద్ద నిర్మించిన 3.5 కిలోమీటర్ల పొడవైన ఎయిర్‌స్ట్రిప్‌పై శుక్రవారం రాత్రి ఎయిర్‌ఫోర్స్ యుద్ధవిమానాలు ఇలా ల్యాండై అలా టేకాఫ్ తీసుకున్నాయి. తద్వారా దేశంలో పగలు, రాత్రి తేడా లేకుండా అన్నివేళలా ఫైటర్‌జెట్ల ల్యాండింగ్, టేకాఫ్‌కు అనువైన తొలి ఎక్స్‌ప్రెస్‌వే గా ఈ మార్గం నిలిచింది.



గంగా ఎక్స్‌ప్రెస్ వేపై లాండవుతున్న ఫైటర్

తొలిసారిగా శుక్రవారమే పరీక్ష

గంగా ఎక్స్‌ప్రెస్ వే ఎయిర్‌స్ట్రిప్‌ను శుక్రవారమే తొలిసారిగా పరీక్షించారు. ఎయిర్‌ఫోర్స్ విభాగంలోని టాప్ ఫైటర్లు దీన్ని వినియోగించాయి. గంగా ఎక్స్‌ప్రెస్ వే ఇప్పటికే 85 శాతం నిర్మాణం పూర్తయింది. యూపీలో ఆగ్రా-లఖ్‌నవూ, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేల మీదా ఎయిర్‌స్ట్రిప్‌లను నిర్మించారు. గంగా ఎక్స్‌ప్రెస్ వే మీద మాత్రమే ప్రస్తుతానికి రాత్రివేళ ఆపరేషన్‌కు అనువుగా అధునాతన లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను సిద్ధంచేశారు. ఈ ఎయిర్‌స్ట్రిప్‌ను సంఘ వ్యతిరేక శక్తులు పాడుచేయకుండా కనిపెట్టేందుకు 250కి పైగా సీసీటీవీ కెమెరాలను అమర్చారు. ఎయిర్‌స్ట్రిప్ పరీక్షను స్వయంగా తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు, వందలాది మంది పాఠశాల విద్యార్థులు వచ్చారు. రక్షణ శాఖ, యూపీ రాష్ట్ర అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోజంతా చక్కర్లు

రాత్రిపూట ల్యాండింగ్, టేకాఫ్‌కు ముందు పగటిపూట యుద్ధ విమానాలను ఎయిర్‌స్ట్రిప్‌పై చాలాసార్లు విజయవంతంగా దింపారు. యుద్ధ సమయాల్లో వైమానిక స్థావరాలు, రన్‌వేలను శత్రు విమానాలు ధ్వంసం చేస్తే అత్యవసరంగా యుద్ధ విమానాలను దించడానికి, మళ్లీ సమరానికి సిద్ధమై వెనువెంటనే టేకాఫ్ తీసుకోవడానికి వీలుగా ఎక్స్‌ప్రెస్ వేలపై ఇలా ఎయిర్‌స్ట్రిప్‌లను నిర్మిస్తున్నారు. యుద్ధ సమయాల్లో సైనికులు, ఆయుధాలు, సైనిక ఉపకరణాలను మోసుకెళ్లే భారీ సరకు రవాణా విమానాలు సైతం దిగేలా వాటిని అత్యంత పటిష్టంగా నిర్మించారు. ఈ ఎయిర్‌స్ట్రిప్‌ను అత్యంత అరుదుగా మాత్రమే వాడే అవకాశం ఉందని తెలిసి కూడా మన్నిక, నాణ్యతలో ఏమాత్రం రాజీపడకుండా అధునాతన ఇంజనీరింగ్ నైపుణ్యంతో నిర్మించారు. అందుకు క్యాట్-2 ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ సాంకేతికతను వినియోగించారు. మంచు, వర్షం, పొగమంచు, తక్కువ దృగ్గోచరత వంటి సందర్భాల్లోనూ ల్యాండింగ్, టేకాఫ్ సాధ్యమయ్యేలా ఎక్స్‌ప్రెస్ వేలో ఎత్తయిన, అనువైన ప్రదేశంలోనే స్ట్రిప్‌ను నిర్మించారు. వరదలు, భూకంపం వంటి విపత్తుల వేళ సైన్యాన్ని వెంటనే రంగంలోకి దించడానికీ ఈ స్ట్రిప్ ఉపయోగపడనుంది. అత్యంత తక్కువ ఎత్తులో దూసుకొస్తూ ల్యాండింగ్‌నూ పరీక్షించారు.

ఇప్పుడు ఈ బామ్మే రికార్డు!



లండన్: బ్రిటన్‌కు చెందిన ఈథెల్ కేటర్‌హామ్ అనే 115 ఏళ్ల బామ్మ ప్రపంచంలోనే అత్యధిక కాలం జీవించి ఉన్న వ్యక్తిగా నిలిచారు. గెరంటాలజీ రీసెర్చ్ గ్రూప్ ఈ విషయం శుక్రవారం ప్రకటించింది. బ్రెజిల్‌కు చెందిన నన్, టీచర్ సిస్టర్ ఇనాహ్ కనబర్రో 116 ఏళ్ల వయస్సులో బుధవారం కన్నుమూయడంతో ఈథెల్ ఈ స్థానం దక్కించుకున్నారని వివరించింది. దక్షిణ ఇంగ్లండ్‌లోని షిప్టన్ బెల్లింజర్‌లో, మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమవటానికి ఐదేళ్ల ముందే 1909 ఆగస్ట్ 21న ఈమె జన్మించారు. మొత్తం 8 మంది తోబుట్టువుల్లో ఈథెల్ ఏడోవారు. 1927లో 18 ఏళ్ల వయస్సులో భారత్‌కు వచ్చారు. ఓ బ్రిటిష్ అధికారి ఇంట్లో ఆయాగా ఉన్నారు. మూడేళ్ల అనంతరం తిరిగి ఇంగ్లండ్‌కు చేరుకున్నారు. నార్మన్ అనే బ్రిటిష్ ఆర్మీ అధికారితో వివాహం కాగా, ఆయనతోపాటు హాంకాంగ్, జిబ్రాల్టర్‌లో గడిపారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు.

పాకిస్తాన్‌పై దాడి చేస్తే ఈశాన్య రాష్ట్రాలను ఆక్రమిస్తాం

యూనుస్ సలహాదారు ప్రేలాపన

ఢాకా/న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు పాకిస్తాన్‌పై భారత్ దాడి చేసిన పక్షంలో చైనా సాయంతో ఏడు ఈశాన్య రాష్ట్రాలను స్వాధీనం చేసుకుంటామని బంగ్లాదేశ్ తాత్కాలిక అధ్యక్షుడు యూనుస్ సలహాదారు ఏఎల్ఎం ఫజలుర్రహ్మాన్ బెదిరించారు. మంగళవారం ఆయన ఫేస్‌బుక్ పేజీలో 'ఈ విషయంలో సైనికపరమైన ఏర్పాటు కోసం చైనాతో చర్చలు జరిపే అవసరముందని భావిస్తున్నా' అని మాజీ సైనికాధికారి కూడా అయిన ఫజలుర్రహ్మాన్ పేర్కొన్నారు. అయితే, ఈ వ్యాఖ్యలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని విదేశాంగ శాఖ తెలిపింది. ఇటువంటి వాటిని తాము ప్రోత్సహించం, బలపరచం అని స్పష్టం చేసింది. వ్యక్తిగత అభిప్రాయాలను ప్రభుత్వంతో ముడిపెట్టవద్దని కూడా కోరింది. పొరుగుదేశాలతో శాంతియుత సంబంధాలను కొనసాగించాలన్నదే తమ అభిమతమని వివరించింది.

సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం

విఝింజమ్ సీపోర్ట్ ప్రారంభోత్సవంలో ప్రసంగించిన మోదీ

తిరువనంతపురం: కంటైనర్ల ద్వారా సరుకు రవాణా కోసం ప్రత్యేకంగా నిర్మించిన అతిపెద్ద విఝింజమ్ అంతర్జాతీయ సీపోర్ట్‌తో కేరళ రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం సుసాధ్యమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిలషించారు. భవిష్యత్తులో ఈ సీపోర్ట్ సామర్థ్యం మూడు రెట్లు పెరుగుతుందని, దాంతో కంటైనర్ కార్గో రవాణా విభాగంలో భారత సామర్థ్యం మరింత ఇనుమడిస్తుందని ప్రధాని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని శుక్రవారం కేరళలోని తిరువనంతపురం జిల్లా కేంద్రంలోని విఝింజమ్ వద్ద రూ.8,686 కోట్ల వ్యయంతో నిర్మించిన డీప్‌వాటర్ సీపోర్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించారు.

అప్పుడలా.. ఇప్పుడిలా


''గతంలో భారత కంటైనర్ల రవాణా వ్యవహారంలో 75 శాతం విదేశీ పోర్టుల్లో జరిగేది. దాని వల్ల దేశం భారీ స్థాయిలో ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అప్పటి పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా మారుతున్నాయి. ఇప్పుడు దేశ సంపద భారత్‌కే ఉపయోగపడుతోంది. గతంలో భారత్‌ను దాటిపోయిన నిధులు ఇప్పుడు స్వదేశంలోనే నూతన ఆర్థిక అవకాశాలను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా కేరళలోని విఝింజమ్ ప్రజలకు అవకాశాలు పెరిగాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో తొలినాళ్ల నుంచీ కేరళ నౌకలు భారత్‌కు సరుకు రవాణాలో కీలక భూమిక పోషించాయి. సముద్ర మార్గంలో అంతర్జాతీయ వాణిజ్యంలో భారత హబ్‌గా కేరళ ఎదుగుతోంది. ఇప్పుడు కేరళను మెరుగైన ఆర్థికశక్తిగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది'' అని మోదీ అన్నారు.

అదానీని పొగిడిన మోదీ

అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్(ఏపీసెజ్) ఈ డీప్‌వాటర్ పోర్ట్‌ను నిర్మించింది. ఈ నేపథ్యంలో ఈ సంస్థ అధినేత గౌతమ్ అదానీని మోదీ పొగిడారు. '' అదానీ గుజరాత్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి. సొంత రాష్ట్రంలోనూ ఓడరేవులున్నాయి. అయినాసరే గుజరాత్‌ను కాదని కేరళలో ఇంత పెద్ద సీపోర్ట్‌ను కట్టాడని తెలిస్తే గుజరాత్ ప్రజలు సైతం అసూయపడతారు'' అని సరదాగా అదానీని మోదీ పొగిడారు. ''2014లో సరుకు రవాణా నౌకలు, ప్రజారవాణా, ఇతర పడవల ద్వారా 1.25 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందితే ఇప్పుడు వాళ్ల సంఖ్య 3.25 లక్షలకు పెరిగింది. ఈ కార్మికుల సంఖ్యాపరంగా భారత్ ప్రపంచ టాప్-3 స్థానం పొందింది. సరుకు రవాణా విషయంలో టాప్-30లో రెండు భారతీయ నౌకాశ్రయాలు స్థానం దక్కించుకున్నాయి'' అని మోదీ అన్నారు.

స్వప్నం సాకారమైంది

''కేరళ స్వప్నం సాకారమైంది. అంతర్జాతీయ జలరవాణా, వాణిజ్యం, సరుకు రవాణా చిత్రపటంలో ఈ సీపోర్ట్ భారత్‌కు కొత్త దారులు తెరిచింది'' అని మోదీ అన్నారు. కార్యక్రమంలో కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, సీఎం విజయన్, గౌతమ్ అదానీ, శశిథరూర్ పాల్గొన్నారు. '' మూడో మిలీనియంలో వృద్ధి అవకాశాలకు విఝింజమ్ సీపోర్ట్ సింహద్వారంగా నిలవనుంది'' అని సీఎం విజయన్ అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు, అదానీ సంస్థ సంయుక్తంగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో ఓడరేవును నిర్మించారు.



వేదికపై కేరళ సీఎం విజయన్‌తో మోదీ మాటామంతి



కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌తో కరచాలనం

ఈ ఇద్దరిని నా పక్కన చూశాక కొందరికి అస్సలు నిద్రపట్టదు

విపక్షాల 'ఇండియా' కూటమిలో కీలక భాగస్వామి అయిన సీపీఎం సీనియర్ నేత, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ మోదీతోపాటు వేదికను పంచుకున్నారు. దీంతో కాంగ్రెస్‌నుద్దేశిస్తూ మోదీ సరదా వ్యాఖ్యలు చేశారు. ''సీఎం విజయన్‌కు నేనో విషయం చెప్పదల్చుకున్నా. విపక్షాల ఇండియా కూటమిలో మీరూ ఒక మూలస్తంభం. ఇక కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సైతం వేదికపైనే ఉన్నారు. మీ ఇద్దరినీ నా పక్కన చూశాక కొందరికి అస్సలు నిద్ర పట్టదు. మలయాళంలోకి నా ప్రసంగాన్ని తర్జుమా చేస్తున్న వ్యక్తి సరిగా చెప్తున్నారో లేదో నాకు తెలీదుగానీ నా ఈ సందేశం చేరాల్సిన వారికి ఇప్పటికే చేరిపోయింది'' అని వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ''పహల్గాం తర్వాత కూడా విపక్ష నేతల నిద్రలు పాడుచేయడం మీదే మోదీ దృష్టిపెట్టారు. మేం మాత్రం నిద్రలేని రాత్రులు గడిపైనాసరే మిమ్మల్ని మీ ప్రభుత్వ తప్పులకు బాధ్యులను చేస్తాం'' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. సొంత కాంగ్రెస్ పార్టీ నేతలతో శశిథరూర్ ఇటీవల అంటీముట్టనట్లు వ్యవహరించడం తెల్సిందే. ''శుక్రవారం నా సొంత నియోజకవర్గం తిరువనంతపురంలో ప్రధానికి స్వాగతం పలికా. సీపోర్ట్ ప్రారంభంకావడం మాకెంతో గర్వకారణం'' అని శశిథరూర్ అంతకుముందు 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు.

ఉద్యోగికి పదోన్నతి హక్కు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ఒక ఉద్యోగికి పదోన్నతి హక్కు కాదని, అనర్హతకు గురి కాని పక్షంలో పదోన్నతి విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తమిళనాడుకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఒకరు తనకు ఎస్సైగా ప్రమోషన్ ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారంటూ వేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం విచారించింది. ''ఉద్యోగికి పదోన్నతి హక్కు లేదు, కానీ పదోన్నతుల ఎంపికల్లో పరిగణనలోకి తీసుకోవాలని కోరే హక్కుంది'' అని వివరించింది. ప్రమోషన్ ఇప్పించాలన్న పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ అందిన అర్జీపై విచారణకు అంగీకరించింది. విధి నిర్వహణలో తోటి ఉద్యోగిని కొట్టినందుకు పిటిషనర్‌పై ఉన్న కేసులను కొట్టేసినా ప్రమోషన్లలో ఆయన పేరును పరిశీలించకపోవడం, ఇతర ప్రయోజనాలను పునరుద్ధరించకపోవడంపై ఎస్పీని ధర్మాసనం ప్రశ్నించింది.

పహల్గాం వెనుక ఐఎస్ఐ హస్తం

లష్కరే తొయిబా, ఐఎస్ఐ బంధాన్ని ప్రస్తావించిన ఎన్ఐఏ ప్రాథమిక నివేదిక

న్యూఢిల్లీ: బైసారన్‌లో ఉగ్రవాదుల ముందస్తు ప్రణాళిక, దాడి, పరారీ తదితరాల వెనుక పాకిస్తాన్ సైనిక నిఘా సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటలిజెన్స్(ఐఎస్ఐ) హస్తం ఉందని ప్రాథమికంగా తెలుస్తోందని జాతీయ దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పహల్గాం దాడి వెనుక ఐఎస్ఐ, పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తొయిబా(ఎల్ఈటీ)ల సమన్వయం కనిపిస్తోందని ఎన్ఐఏ దర్యాప్తు ప్రాథమిక నివేదిక స్పష్టంచేస్తోంది. సీనియర్ ఐఎస్ఐ అధికారుల మార్గదర్శకంలో లష్కరే తొయిబా ఈ దాడి ప్రణాళికను రూపొందించి 'రెసిస్టెన్స్ ఫ్రంట్' ముష్కరుల ద్వారా దానిని అమలుచేసిందని తెలుస్తోంది. ఎల్ఈటీ ప్రధాన కార్యాలయంలో ఈ ప్లాన్‌కు తుది రూపునిచ్చారని సమాచారం. దాడిలో హాష్మీ మూసా, అలీ భాయ్ అనే ఇద్దరు పాక్ ఉగ్రవాదులు పాల్గొన్న విషయం తెల్సిందే. ఈ ఇద్దరూ పాక్‌లోని తమ ముఖ్యనాయకుల నుంచి ఎప్పటికప్పుడు ఆదేశాలు అందుకునేవారని ఎన్ఐఏ అదుపులో ఉన్న కొందరు వెల్లడించారు. వీళ్లు వారం ముందే భారత్‌లోకి చొరబడి ఓవర్ గ్రౌండ్ వర్కర్ల సాయంతో బస, భోజనం, రవాణా సదుపాయాలు పొందారని తేలింది.

ఆధారాల సేకరణలో బిజీబిజీ

ఎన్ఐఏ అత్యంత విశాల గడ్డిమైదానంలో ఆధారాల సేకరణలో బిజీగా ఉంది. ప్రస్తుతానికి 40కిపైగా ఖాళీ తూటాలను స్వాధీనంచేసుకున్నారు. మొత్తం ప్రదేశాన్ని 3డీ చిత్రంగా మార్చి దాడి జరిగిన తీరును విశ్లేషిస్తున్నారు. సమీప మొబైల్ టవర్లలో రికార్డయిన ఫోన్ కాల్ డేటాను తెప్పిస్తున్నారు. దాడికి వారం ముందు ఈ ప్రాంతంలో శాటిలైట్ ఫోన్ల వినియోగం ఒక్కసారిగా ఎక్కువైందని కనిపెట్టారు. బైసారన్‌లో మూడు శాటిలైట్ ఫోన్ల వినియోగాన్ని గుర్తించారు. వీటిలో రెండింటి సిగ్నళ్లను ట్రేస్ చేసి విశ్లేషిస్తున్నారు.

ఢిల్లీ సహా ఉత్తరాదిన భారీ వర్షం

వివిధ ఘటనల్లో ఏడుగురు మృతి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాలు శుక్రవారం ఉదయం ఈదురు గాలులు, వర్షాలతో అతలాకుతలమయ్యాయి. రహదారులపైకి వరద నీరు చేరడంతోపాటు, పలు చోట్ల చెట్లు కూలడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విమానాల రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడింది. వర్షం సంబంధిత ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. నజఫ్‌గఢ్ ప్రాంతంలోని ఖర్ఖారీలో ఇంటిపై చెట్టు కూలినపడినట్లు ఉదయం 5.30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. భారీ వర్షం, తీవ్ర ఈదురుగాలుల కారణంగా ఒకే గది ఉన్న చిన్న ఇంటిపై పక్కనే ఉన్న చెట్టు కూలి పడింది. ఘటనలో ఆ ఇంట్లోని ఐదుగురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఒక మహిళ(28), ఆమె ముగ్గురు చిన్నారులు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహిళ భర్త గాయాలతో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. అదే సమయంలో చావ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో పాపారావత్ గ్రామంలో గోడ కూలి ఇద్దరు బాలురు సహా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారని చెప్పారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, మధుర రోడ్లపై పెద్ద ఎత్తున వరద నిలిచిపోయింది. ఘజియాబాద్‌లో రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరి కనిపించాయి. ఫరీదాబాద్‌లో వరదలో సగం వరకు మునిగిన కారును జనం బయటకు తీస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

200 విమానాలు ఆలస్యం

ఈదురు గాలుల ప్రభావం ఢిల్లీలో విమానాల రాకపోకలపైనా పడింది. మూడు విమానాలను దారి మళ్లించగా 200కు పైగా ఆలస్యంగా నడిచాయని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. కుండపోతతో ట్రాఫిక్ అంతరాయం, వరదలు, చెట్లు, ఇళ్లు కూలిన ఘటనలకు సంబంధించి 100 కాల్స్ అందాయని ఫైర్ విభాగం తెలిపింది.

'పహల్గాం'పై వ్యూహమేది?

సీడబ్ల్యూసీ తీర్మానం ఆక్షేపణ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి దీటుగా బదులిచ్చే విషయంలో మోదీ సర్కారు వద్ద స్పష్టమైన వ్యూహమే లేదంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ''న్యాయం కోసం దేశమంతా ఎదురు చూస్తోంది. ఇప్పటికైనా సమర్థంగా వ్యవహరించాలి. ఈ విషయంలో అంతర్జాతీయ మద్దతు కూడగట్టాలి. పాక్‌కు మర్చిపోలేని రీతిలో గుణపాఠం చెప్పాలి'' అని సూచించారు. ఖర్గే సారథ్యంలో శుక్రవారం జరిగిన పార్టీ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. ''ఇది రాజకీయాలకు సమయం కాదు. విభేదాలను పక్కన పెట్టి ఈ విషయంలో దేశమంతా ఒక్కతాటిపైకి వచ్చి శక్తిని చాటాలి'' అని భేటీ అభిప్రాయపడింది. నిఘా, భద్రతా లోపాలను సరిచేసుకోవాలని సూచించింది.


చేతిపంపు మరమ్మతుల అనంతరం పరిశీలిస్తున్న అధికారులు

బోరుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతలబోరు గ్రామ పంచాయతీ పరిధి ఎర్రబోరు గ్రామంలో తాగునీటి బోర్‌కు అధికారులు మరమ్మతులు చేయించారు. 'గొంతెండిపోతోంది.. వాగు నీళ్లే శరణ్యం'శీర్షికతో 'సాక్షి' ప్రధాన సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈమేరకు ఎర్రబోరు గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.శివయ్య, ఏఈ జి.మహేశ్వరి సందర్శించి చేతిపంప్‌కు మరమ్మతులు చేయించారు. మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని, కొయ్యగట్టులో సౌర విద్యుత్ పంప్‌కు కూడా మరమ్మతులు చేయించి తాగునీరు అందిస్తామని డీఈ తెలిపారు. -పాల్వంచ రూరల్

గుర్తు తెలియని వ్యక్తి ఆకలి చావు



శంషాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆకలితో మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ మధురానగర్‌కాలనీ రోడ్డు నంబర్–5లోని గర్ల్స్ హాస్టల్ సమీపంలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం (37) ఉందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల విచారణలో చనిపోయిన వ్యక్తి కొద్ది రోజులుగా భిక్షాటనపై ఆధారపడి జీవిస్తున్నాడని తెలిసింది. సరైన ఆహారం లేకపోవడంతో ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

గొంతు తడవాలంటే ట్యాంకర్ రావాలి

నిర్మల్ జిల్లాలోని మారుమూల మండలం కుభీర్. ఈ మండలంలోని పార్డి(బి), హాల్దా గ్రామాలతోపాటు హాల్దా తండాలో ఈ వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. భూగర్భ జలాలు పడిపోవడంతో గ్రామాల్లోని బోర్లన్నీ ఎండిపోయాయి. దీంతో నీటి కోసం గోస పడుతున్నారు. గ్రామంలో నీళ్ల ట్యాంకర్‌తో నీటి పంపిణీ చేస్తున్నారు. రెండు రోజులకోసారి వచ్చే ట్యాంకర్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇక ట్యాంకర్ రాగానే ఎక్కువ నీటిని పట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈ నీటిని ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ముల్లో నింపుకొని వినియోగించుకుంటున్నారు. డ్రమ్ముల్లోని నీటినే రెండు రోజులు సర్దుబాటు చేసుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో పార్డి(బి) గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్


కుభీర్ మండలం పార్డి(బి) గ్రామంలో నీళ్ల ట్యాంకర్‌ను చుట్టుముట్టిన మహిళలు

చెలమతో.. చెలిమి

ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం బర్లగూడెం పంచాయతీ పరిధి పర్శికగూడెం, రామవరం గిరిజన గ్రామాల ప్రజలకు చెలమ నీరే దిక్కయ్యింది. పది రోజులుగా మంచినీటి పథకం పని చేయడం లేదు. గ్రామంలోని మంచి నీటి బోర్లు సైతం మరమ్మతులకు గురయ్యాయి. గ్రామస్తులు చేసేది లేక.. గ్రామ శివారులోని చెరువుకు దూరంగా చెలమ తవ్వి ఆ నీటిని ఉపయోగించుకుంటున్నారు. - వెంకటాపురం(కె)


చెలమ నుంచి నీటిని తోడుతున్న గ్రామస్తుడు

ముందస్తు బెయిల్ ఇవ్వలేం

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు చుక్కెదురు

- అరెస్టు చేయకుండా ఎలాంటి ఉత్తర్వులివ్వలేమన్న హైకోర్టు
- ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ ఇవ్వలేమని, విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేయవద్దంటూ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. తనను అన్యాయంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇరికించారని, అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయాలంటూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం తీర్పు రిజర్వు చేశారు. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసుకున్న న్యాయమూర్తి తాజాగా తీర్పు వెలువరించారు.

వాదనలు ఇలా..

ప్రభాకర్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'దర్యాప్తునకు సహకరించేందుకు ప్రభాకర్‌రావు సిద్ధంగా ఉన్నారు. అరెస్టు కాకుండా షరతులతో కూడిన ముందస్తు బెయిలివ్వాలి. ఇప్పటికే దర్యాప్తు పూర్తయ్యింది. పోలీసులు చార్జిషీట్ కూడా దాఖలు చేశారు..'అని తెలిపారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'ఫోన్ ట్యాపింగ్ కేసు వెనుక ఎవరున్నారు? చట్టవిరుద్ధంగా పనులు ఎలా చేశారు? అధికారుల బృందాన్ని ఎలా వినియోగించుకున్నారు.. ఇలాంటి వివరాలన్నీ తెలియాలంటే ప్రభాకర్‌రావు కస్టడీ తప్పనిసరి..'అని అని చెప్పారు

ఆధారాలున్నాయ్.. బెయిల్ ఇవ్వొద్దు

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. 'అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఇతర నిందితులు వెంటనే హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. కేసు నమోదు గురించి ముందే తెలిసి అమెరికా పారిపోయారంటే ఆయన పాత్ర ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు దర్యాప్తు అధికారుల వద్ద ఆధారాలున్నాయి. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలి..'అని విజ్ఞప్తి చేశారు.

తరగని జలనిధి


నిరంతరం జలం ఉండే ఊట బావి

జహీరాబాద్: ఏ కాలంలోనైనా సరే ఆ చెలమలో నిరంతరంగా నీరు ఉంటుంది. వందేళ్ల నుంచి ఎప్పుడూ ఎండని ఆ ఊట నీటి కుంట.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం గొటిగార్ గ్రామ పంచాయతీ కింద ఉన్న గోపినాయక్ తండాలో ఉంది. ఊట కుంట ప్రదేశం ఎర్ర రేగడి నేలలైనందున.. వర్షాధారం కింద మాత్రమే పంటలు సాగయ్యేవి. ఒక నీటి కడవ పట్టేంత ఉన్న చెలమలో మనుషులు, పశువులు నీరు తాగినా.. అంత మేర నీరు వచ్చి చేరుతుండేదని స్థానికులు చెబుతున్నారు. ఊట కుంట ఎత్తు ప్రదేశంలో ఉంది. దిగువ భాగంలో లోతైన గోతులు, లోయ ఉన్నా అక్కడ నీరు కనిపించక పోవడం విశేషం. రైతు కిషన్ నాయక్.. ఐదేళ్ల క్రితం ఊట చెలమ ఉన్న ప్రదేశంలో మూడు మీటర్ల గోతిని తీసి బావి మాదిరిగా మార్చాడు. దీనికి మోటారును అమర్చాడు. మొక్కజొన్న పంటకు, పశువుల మేతకు చెలమ నుంచి నీటిని వాడుకుంటున్నాడు. రెండు గంటల పాటు విద్యుత్ మోటారు నడుస్తుందని, తిరిగి వెంటనే నీరు వచ్చి చేరుతుందని రైతు పేర్కొన్నాడు. పరిసరాల్లో ఎక్కడ కూడా ఇలాంటి ఊట లేదని తెలిపాడు. ఊట ఎక్కువైనప్పుడు దిగువభాగంలో ఉన్న కందకంలోకి నీరు వదిలి పెడుతున్నట్లు పేర్కొన్నాడు. పక్కనే దిగువ ప్రదేశంలో కేషులమ్మ చెరువులో నీరు ఎండినా.. ఈ చెలమ మాత్రం ఎండిపోలేదని రైతు కిషన్ చవాన్ స్పష్టం చేశాడు.

క్లుప్తంగా...

టీపీసీసీ చీఫ్‌తో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ భేటీ



సాక్షి, హైదరాబాద్: బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గరేత్ వైన్ ఓవెన్ శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. హైదర్‌గూడలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కమిషన్ రాజకీయ, ఆర్థిక సలహాదారు నళినీ రఘురామన్‌లతో కలిసి ఆయన మర్యాద పూర్వకంగా మహేశ్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ అంశాలు, కులగణన, అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చర్చ జరిగినట్టు టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం పోరాడాలి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తికి గడువు సరికాదు: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కృష్ణానది జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమీక్ష పేరిట పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును సాగదీసేందుకే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాలమూరు జిల్లాలో పర్యటించారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయినా, రెండేళ్ల గడువు విధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నా ప్రాజెక్టులో తట్టెడు మట్టి ఎత్తలేదని, సొంత జిల్లాకు సీఎం రేవంత్ ద్రోహం చేస్తున్నాడని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే ఎత్తిపోతల పనులను ప్రభుత్వం ఆలస్యం చేస్తుందనే అనుమానాలను నిరంజన్‌రెడ్డి వ్యక్తం చేశారు. ఉద్దండాపూర్ మినహా నార్లాపూర్ పంప్‌హౌస్‌లో డ్రై రన్, ప్యాకేజీ 3లో 8 కిలోమీటర్ల మేర కాలువ పనులు మిగిలిపోయాయన్నారు.

అనుమతి లేని మదర్సాలపై చర్యలు తీసుకోవాలి

సీఎంకు ఎంపీ రఘునందన్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనుమతులు లేని మదర్సాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ నియోజకవర్గ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న తమ ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేసి.. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి శిక్షణ ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు తెలిపారు. జిన్నారం మండలంలో 70 మంది వరకు విద్యార్థులు ఉన్నారని, వారిలో 65 మంది బంగ్లాదేశ్ సరిహద్దు బిహార్‌లోని కిషన్‌గంజి ప్రాంతీయులేనని తెలిపారు. జిన్నారం ఆలయంలో విగ్రహాలను కోతులు ధ్వంసం చేశాయని పోలీసులు చెప్పడం శోచనీయమని వ్యాఖ్యానించారు. సదాశివపేట మున్సిపాలిటీలో బంగ్లాదేశీయులకు జనన ధ్రువపత్రం ఇచ్చారని, ఇస్నాపూర్‌లో 247 మంది నేపాల్ వారికి ఆధార్‌కార్డులు ఇచ్చారని ఆరోపించారు. వారం రోజుల్లో సీఎం స్పందించకపోతే కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

కులగణనపై కిషన్‌రెడ్డికి అనుమానం ఎందుకు?

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కులగణనపై తెలంగాణ బీజేపీ నేతలకు నిద్ర పట్టడం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. కులగణన విషయంలో కిషన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులగణన విషయంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యాడు కాబట్టి నిందలు వేసేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. కులగణనపై అసెంబ్లీలో చర్చ జరిగితే బీజేపీ ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారని, వారికి, పార్టీకి లేని అనుమానాలు కిషన్‌రెడ్డికి ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. బీసీ సంఘాలు చేసిన ప్రతిపాదనలను కూడా కులగణనలో పొందుపరిచామని, బీసీ రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందిన తర్వాత బీసీ సంఘాలన్నీ రేవంత్ రెడ్డిని సన్మానించిన విషయం కిషన్‌రెడ్డికి గుర్తు లేదా అని ప్రశ్నించారు. బీసీల పట్ల నిజంగా కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన జరిగేలా చూసుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు.

దాతృత్వంలో పెద్ద చెయ్యే..

'సామాజిక బాధ్యత'కు కంపెనీల భారీ వ్యయం..

నిర్దేశిత మొత్తాన్ని మించి వెచ్చించిన 13,571 కంపెనీలు

2017-18లో ఇలాంటి కంపెనీలు 4,945 మాత్రమే..

సీఎస్‌ఆర్ ఫండింగ్‌లో ప్రైవేటు సంస్థల వాటా 86%

2022-23లో సీఎస్‌ఆర్‌కు మొత్తం రూ.29,987 కోట్లు..

పేదవారి చదువుకే మూడింట ఒక వంతు ఖర్చు



సాక్షి, స్పెషల్ డెస్క్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా కంపెనీలు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నాయి. కంపెనీలు ఏటా ఇందుకోసం వెచ్చిస్తున్న మొత్తం క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2022–23లో దేశవ్యాప్తంగా 24,392 సంస్థలు సీఎస్‌ఆర్ కార్యక్రమాలకు రూ.29,987 కోట్లు ఖర్చు చేశాయి. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 12.8% ఎక్కువ. ఈ కంపెనీలు దేశ వ్యాప్తంగా మొత్తం 51,966 ప్రాజెక్టులు చేపట్టాయి. 2021–22లో 19,888 కంపెనీలు రూ.26,580 కోట్లు ఖర్చు చేశాయి. అయితే 2022–23లో 55.6% కంపెనీలు నిర్దేశిత మొత్తాన్ని మించి వ్యయం చేసి దాతృత్వంలో తమది పెద్ద చేయి అనిపించుకున్నాయి. సామాజిక బాధ్యతగా పేదవారి చదువుకే సంస్థలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

2022–23లో మొత్తం సీఎస్‌ఆర్ ఫండింగ్‌లో ప్రైవేటు సంస్థల వాటా ఏకంగా 86%. 13,571 కంపెనీలు నిర్దేశిత మొత్తం కంటే ఎక్కువగా వెచ్చించడం విశేషం. 2017–18లో ఇటువంటి కంపెనీల సంఖ్య 4,945 మాత్రమే. నిర్దేశిత మొత్తాన్ని మించి సీఎస్‌ఆర్‌కు విరివిగా ఖర్చు చేస్తున్న టాప్–10 సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్, ఐటీసీఎల్, మహానది కోల్‌ఫీల్డ్స్, గెయిల్ ఇండియా, విప్రో, ఎన్‌టీపీసీ, వేదాంత, మారుతీ సుజుకీ ఇండియా ముందున్నాయి. నిర్దేశిత మొత్తం వ్యయం చేసిన కంపెనీలు 1,622. ఇక,

పెద్ద చేయి విస్తరిస్తోంది..


రూపాయి కూడా విదిలించని కంపెనీల సంఖ్య 11,748 నుంచి 810కి దిగిరావడం శుభపరిణామం. సంస్థలు ఆర్జిస్తున్న లాభాల్లో మెరుగైన వృద్ధి సీఎస్‌ఆర్ నిధుల పెరుగుదలకు దోహదం చేస్తోంది. ఇక సీఎస్‌ఆర్‌లో భాగంగా 2022–23లో మూడు సంస్థలు రూ.500 కోట్లకుపైగా ఖర్చు చేశాయి. 37 కంపెనీలు రూ.100–500 కోట్లు, 337 సంస్థలు రూ.10–100 కోట్లు వెచ్చించాయి. కంపెనీలు పేదల విద్య కోసం అత్యధికంగా రూ.10,086 కోట్లు వెచ్చించాయి. ఆరోగ్య సంరక్షణకు రూ.6,830 కోట్లు ఖర్చు చేశాయి.

ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీలు..

అన్‌లిస్టెడ్‌తో పోలిస్తే లిస్టెడ్ కంపెనీలే సీఎస్‌ఆర్‌లో ముందంజలో ఉన్నాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో (ఎన్‌ఎస్‌ఈ) నమోదైన 1,394 సంస్థలు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేసిన మొత్తం రూ.17,967 కోట్లు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఈ మొత్తం 15.7%అధికం. వీటిలో 66 ప్రభుత్వ సంస్థలు చేసిన వ్యయాలు అంత క్రితం ఏడాదితో పోలిస్తే 19% ఎగసి రూ.3,717 కోట్లకు చేరాయి. 2022–23లో 56 ప్రభుత్వ కంపెనీలు రూ.3,136 కోట్లు వెచ్చించాయి. 544 సంస్థలు విద్య కోసం రూ.1,104 కోట్లు ఖర్చు పెట్టాయి. ఆ తర్వాత ఆహారం, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం కోసం రూ.720 కోట్లు ఖర్చు పెట్టాయి.

సీఎస్‌ఆర్ చట్టం ఏం చెబుతోందంటే..

2014 ఏప్రిల్‌లో అమలులోకి వచ్చిన కార్పొరేట్ సామాజిక బాధ్యత చట్టం ప్రకారం ఒక కంపెనీ రూ.500 కోట్ల విలువ కలిగి.. రూ.1,000 కోట్ల ఆదాయం లేదా రూ.5 కోట్ల నికరలాభం గత ఆర్థిక సంవత్సరంలో ఆర్జిస్తే.. అంత క్రితం మూడు ఆర్థిక సంవత్సరాల్లో పొందిన లాభాల్లో సగటు మొత్తంపై 2% తప్పనిసరిగా సీఎస్‌ఆర్ కార్యక్రమాలకు వెచ్చించాలి.



అభివృద్ధి అంటే హైటెక్ సిటీ కాదు

ఓల్డ్‌సిటీ, గౌలిగూడ లాంటి చాలా ప్రాంతాలు ఉన్నాయి

ముద్ర రుణాలు ఎంతమందికి ఇచ్చారు

దిశ కమిటీ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్(హైదరాబాద్): అభివృద్ధి అంటే కేవలం హైటెక్ సిటీ మాత్రమే కాదని.. ఓల్డ్‌సిటీ, గౌలిగూడ, అంబర్‌పేట, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ సిటీనేనన్నారు. దిశ కమిటీ సమావేశం శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ సంస్థలు నగర మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. మంచినీరు, డ్రైనేజీ వంటి సమస్యలు బస్తీల్లో సాధారణంగా కనబడుతుంటాయన్నారు.జీహెచ్‌ఎంసీలో కూడా విస్తరణ, జనాభా పెరుగుదల నేపథ్యంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం పూర్తిస్థాయిలో సమాచారాన్ని సమర్పించాలన్నారు. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, పాతబస్తీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ప్రాథమిక సౌకర్యాల సమస్యలు మరింతగా తలెత్తుతున్నాయని చెప్పారు. హైటెక్ సిటీతోపాటు ఓల్డ్ సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందుకు సాగాల్సిన



ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అవసరం ఉందన్నారు. అభివృద్ధి బడ్జెట్ కేవలం కొత్త ప్రాంతాలకే కాకుండా పాత పట్నానికి కూడా సమానంగా కేటాయించాల్సిందేనని తెలిపారు. ప్రతి డివిజన్‌కు సంబంధించిన అవసరాలను గుర్తించి కేంద్రానికి వివరాలు అందించాలన్నారు.

మెట్రో రైలు ప్రతిపాదనలను కేంద్రానికి పంపించాలి

మెట్రోరైల్ ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన మొదటి ఫేజ్‌ను విస్తరించి, 2, 3, 4 ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కిషన్‌రెడ్డి చెప్పారు. ఆ వివరాలు అందితే కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, రుణాలు లభించేలా సహకరిస్తుందన్నారు. ఉప్పల్–ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణలో ఆలస్యం పట్ల కిషన్‌రెడ్డి సీరియస్ అయ్యారు ప్రయాణ సౌలభ్యం కోసం ప్రాధాన్యతతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.400 కోట్ల వ్యయంతో నిర్మితమైన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను మే 5న కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించనున్నారన్నారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ కింద రోడ్డుపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కిషన్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిలతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముద్ర రుణాలపై నివేదిక తయారు చేయండి..

హైదరాబాద్‌కు చెందిన 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముద్ర రుణాల కోసం మొదటిసారి దరఖాస్తు చేసినవారిలో ఎంత మందికి రుణాలు మంజూరయ్యాయో తెలపాలని కిషన్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. రుణాల మంజూరుపై పూర్తి నివేదికను తయారు చేయాలని అధికారులు, బ్యాంకులకు ఆయన ఆదేశించారు. ప్రాసెసింగ్‌లో ఉన్నవారి వివరాలు, ఇప్పటికే మంజూరు అయినవి, రిజెక్ట్ అయినవి, బ్యాంకుల నుంచి అప్రూవల్ పొందిన దరఖాస్తుల సంఖ్య లాంటి విషయాలన్నీ స్పష్టంగా పొందుపరిచిన పూర్తి లిస్టును తయారుచేయాలని కేంద్రమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

జీసీసీలో జూనియర్ అసిస్టెంట్లతో చాకిరీ

గ్రూప్–4లో నియమితులైన 53 మంది

జిల్లా కేడర్‌లో ఉన్నా, ఇష్టానుసారంగా పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ)లో కొత్తగా నియమితులైన జూనియర్ అసిస్టెంట్ల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియమితులైన వారందరికీ ఒకే తరహా వేతనాలు ఉండగా, జీసీసీలో పనిచేసేవారికి భారీగా కోత పెడుతూ వేతనాలు చెల్లింపులు చేయడంపై ఆగ్రహిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో గ్రూప్–4 సర్వీసుల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో 8 వేల మందికి జూనియర్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఇందులో భాగంగా జీసీసీలో 53 మంది నియమితులయ్యారు. డిసెంబర్‌లో చేరిన ఈ జూనియర్ అసిస్టెంట్లకు ఇతర శాఖల్లోని జేఏలతో పోలిస్తే..వేతన చెల్లింపుల్లో భారీ వ్యత్యాసం ఉంది. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.10వేల వరకు వ్యత్యాసం ఉండడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వారికి నిర్దేశించిన విధులు, పోస్టింగ్ ఇవ్వడంలో నిబంధనలు పాటించకపోవడం, జిల్లాస్థాయి కేడర్ కాకుండా ఇష్టానుసారంగా పోస్టింగులు ఇచ్చారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను వర్తింపజేయకుండా ఈపీఎఫ్ చెల్లిస్తున్నా, నిబంధనల ప్రకారం బేసిక్, డీఏపై 12శాతం చెల్లించాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా అత్యంత పరిమిత మొత్తాన్ని చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మధ్యంతర భృతిని కూడా ఎత్తివేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్, కార్యదర్శితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. పలువురు జూనియర్ అసిస్టెంట్లకు పనిగంటలతో సంబంధం లేకుండా 24 గంటలు విధులు కేటాయిస్తున్నారని, తయారీ కేంద్రాల్లో లాభనష్టాలను కూడా ఉద్యోగులపై రుద్దుతున్నారని, మరికొందరికి పెట్రోల్ బంకుల్లో పనులు కేటాయించడం, కొందరికి మార్కెటింగ్ పనులు అప్పగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్డీఎస్‌ఏ నివేదిక అధ్యయనానికి కమిటీ

ఐదుగురు ఇంజనీర్లతో ఏర్పాటుచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

కాళేశ్వరం మూడు బరాజ్‌ల పునరుద్ధరణపై చర్యలు

సత్వర చర్యలు సిఫారసు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల వైఫల్యాలకుగల కారణాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) సమర్పించిన తుది నివేదిక ఆధారంగా మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. నివేదికపై అధ్యయనం చేసి, తదుపరి చర్యలను సిఫారసు చేసేందుకు నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్), ఈఎన్సీ (ఓఅండ్ఎం), రామగుండం చీఫ్ ఇంజనీర్, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్లతో కమిటీ వేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీకి ఈఎన్సీ (జనరల్) నేతృత్వం వహిస్తారు. తుది నివేదికలోని అంశాలపై సత్వరం అధ్యయనం చేసి, బరాజ్‌ల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు నివేదిక ఆధారంగా బాధ్యులను గుర్తించి చర్యలను ఈ కమిటీ సిఫారసు చేయనుంది.

నివేదికలోని సూచనలపై దృష్టి: మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ పూర్తిగా నిరుపయోగంగా మారిందని, ఇవే రకమైన సమస్యలు మిగిలిన బ్లాక్‌లలో కూడా ఏర్పడి ఉండవచ్చని ఎన్డీఎస్‌ఏ అభిప్రాయపడింది. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో కూడా ఇలాంటి సమస్యలే ఏర్పడటంతో 3 బరాజ్‌లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయని స్పష్టం చేసింది. ఈ బరాజ్‌ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. బరాజ్‌ల అధ్యయనం కోసం దేశంలోని ప్రతిష్టాత్మక సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించింది. మేడిగడ్డ బరాజ్ వైఫల్యానికి నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలే కారణమని తేల్చి చెప్పింది. ఈ బరాజ్‌ల నిర్మాణ సమయంలో జియో ఫిజికల్, టెక్నికల్ పరీక్షలు చేయలేదని తప్పు పట్టింది. పరీక్షలు చేయకుండానే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ ప్రాంతాలను మార్చారని ఆక్షేపించింది. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్ కుంగుబాటుకు సీకెంట్ పైల్స్ అమరిక సరిగ్గా లేకపోవడమే కారణమని తెలిపింది. బరాజ్‌లలో నీటి నిల్వతో ఒత్తిడి పెరిగి పిల్లర్ల కింది నుంచి ఇసుక జారి ఏడో బ్లాక్ కుంగిందని తేల్చిచెప్పింది. ఈ బరాజ్ గేట్ల నుంచి వేగంగా దూకే వరదలో ఉండే తీవ్రమైన పీడన శక్తిని నిర్వీర్యం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను దిగువన నిర్మించిన టెయిల్ పాండ్ డిజైన్లలో ప్రతిపాదించలేదని తప్పు పట్టింది. దీని వల్ల దిగువభాగంలో రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతిని బరాజ్ వైఫల్యానికి కారణమైందని వెల్లడించింది. మేడిగడ్డ బరాజ్‌లోని కుంగిన ఏడో బ్లాక్‌ను పూర్తిగా తొలగించాలని సూచించింది. ఈ బరాజ్‌ల పునరుద్ధరణకు ఏ చర్యలు తీసుకోవాలన్నా మూడు నెలల సమయమే మిగిలి ఉంది. ఆ తర్వాత వర్షాలు ప్రారంభమై నదిలో వరద పెరుగుతుంది. ఎన్డీఎస్‌ఏ తుది నివేదికలోని ఈ అంశాలను కమిటీ అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణను సిద్ధం చేయనుంది.

తాగునీటి అవసరాలపై 5న త్రిసభ్య కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో మిగిలి ఉన్న నీటి నిల్వల నుంచి తాగునీటి అవసరాల కోసం రెండు తెలుగు రాష్ట్రాలు పెట్టుకున్న ఇండెంట్ (విజ్ఞప్తుల)పై చర్చించి, నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 5న కృష్ణా నది యాజమాన్య బోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ సమావేశం కానుంది. కృష్ణా బోర్డు సభ్యకార్యదర్శి, తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్సీలు ఇందులో సభ్యులు. ఈనెల 31 దాకా నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి ఏకంగా 10 టీఎంసీలు కావాలని ఏపీ గత నెల 26న ఇండెంట్ సమర్పించింది. రానున్న జూలై నెలాఖరుదాకా శ్రీశైలం నుం చి 5.70 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాలువ నుంచి 10.50 టీఎంసీల నీళ్లు కావాలని తెలంగాణ ఇండెంట్ పెట్టింది. కోటికి పైగా జనాభా కలిగిన హైదరాబాద్/శివారు ప్రాంతాలతో పాటు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు కలిపి.. నెలకు 3.5 టీఎంసీల చొప్పున మూడునెలలకు 10.50 టీఎంసీలు కావాలని తెలంగాణ ఇండెంట్ పెట్టుకోగా.. ఏపీ మాత్రం సాగర్ నుంచి ఒక్కనెలకే 10 టీఎంసీలు కావాలని విజ్ఞప్తి చేయడం గమనార్హం.

'మిస్‌వరల్డ్' పకడ్బందీగా నిర్వహించాలి

భద్రత సమీక్షలో అధికారులకు డీజీపీ జితేందర్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలకు పకడ్బందీగా భద్రత ఏర్పాట్లను చేయాలని డీజీపీ జితేందర్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన భద్రత ఏర్పాట్లపై చర్చించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలకు పకడ్బందీగా భద్రత చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. 120 దేశాల నుంచి కంటెస్టెంట్లు రానున్నారని ఇప్పటివరకు 116 దేశాల కంటెస్టెంట్ల సమాచారం వచ్చిందన్నారు. పోటీల ప్రారంభ వేదికను గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తుండగా ఫైనల్ పోటీలను ఈనెల 31న హైటెక్స్‌లో నిర్వహించనున్నామన్నారు. శాంతిభద్రతల అడిషనల్ డీజీపీ మహేశ్‌భగవత్, అడిషనల్ డీజీ, మిస్ వరల్డ్ పోటీలకు పోలీస్ నోడల్ ఆఫీసర్ స్టీఫెన్ రవీంద్ర, డీజీ ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, హైదరాబాద్ అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, ఇంటిలిజెన్స్ ఐజీ కార్తికేయ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టూరిజం కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, మల్టీజోన్ల ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బోగీలు భగభగ.. ఏసీలో చల్లగా..

▶ మొదటి పేజీ తరువాయి

జనరల్ లేదా స్లీపర్ కోచ్‌లనే ఎంచుకోవటం కద్దు. కాని వేసవి భగ భగలతో బోగీలు ఉడికిపోతున్న నేపథ్యంలో చార్జీ భారమైనా చాలామంది ఇప్పుడు ఏసీ కోచ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో అన్ని రైళ్లలో ఏసీ కోచ్‌లు నెల ముందే నిండిపోతున్నాయి. దాదాపుగా అన్ని రైళ్లలోనూ నెల తర్వాత వెయిటింగ్ జాబితా చూపిస్తోంది. ఏసీ కోచ్‌లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండటంతో రైల్వే శాఖ దీనిపై దృష్టి సారించింది. ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చనే ఉద్దేశంతో ఏసీ ఎకానమీ క్లాస్ కోచ్‌ల సంఖ్య పెంచుతోంది. కొత్తగా మరిన్ని రైళ్లలో ఆ కేటగిరీని ప్రవేశపెడుతోంది.

రెండేళ్ల క్రితం నుంచి థర్డ్ ఏసీ ఎకానమీ

రైళ్లలో గతంలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ.. ఇలా మూడు రకాల ఏసీ కోచ్‌లు మాత్రమే ఉండేవి. పేద, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ రెండేళ్ల క్రితం కొత్తగా థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లను/ ప్రవేశపెట్టింది. సాధారణ థర్డ్ ఏసీ కోచ్‌లోని ఓ కూపేలో 8 బెర్తులుంటే, ఎకానమీ ఏసీ కోచ్‌లో తొమ్మిదుంటాయి. కూపేల వైశాల్యం కూడా తగ్గించడం వల్ల



శుక్రవారం రాత్రి నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఏసీ బోగీల వద్ద ప్రయాణికుల రద్దీ

ఇలాంటి ఓ కోచ్‌లో అదనంగా మరో కూపే ఉంటోంది. అంటే ఈ కూపే ద్వారా అదనంగా తొమ్మిది బెర్తులు అందుబాటులో ఉంటాయన్నమాట.

సాధారణ కోచ్ కంటే తక్కువ చార్జీ

సాధారణ థర్డ్ ఏసీ కోచ్ కంటే ఎకానమీ కోచ్ టికెట్ ధర తక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే అల్పాదాయ వర్గాలు వేసవి వేడిని దృష్టిలో పెట్టుకుని ఈ ఎకానమీ ఏసీ కోచ్‌లలో ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే దక్షిణ మధ్య రైల్వేలో వీటి సంఖ్యను పెంచుతున్నారు. స్లీపర్ కోచ్‌ల సంఖ్యను కుదించటం ద్వారా ఈ తరహా కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గత వేసవిలో జోన్ పరిధిలో ఎకానమీ కోచ్‌లు కేవలం 20 రైళ్లలోనే ఉండగా, ప్రస్తుతం 30కి చేరాయి. అయినా రద్దీని తట్టుకునే పరిస్థితి లేకపోవడంతో త్వరలో మరిన్ని రైళ్లలో కూడా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో ప్రయాణ తేదీకి 15 రోజులకు చేరువకాగానే కొన్ని ముఖ్యమైన రైళ్లలో ఏసీ కోచ్‌లకు టికెట్ల విక్రయం ఆపేసే పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో 'రిగ్రెట్' (ఐఆర్‌సీటీసీ పరిభాషలో బెర్తులు లేవు అని అర్థం) అని చూపుతోంది.

థర్డ్ ఏసీ దొరక్కపోవడంతో ఏసీ స్లీపర్ బస్సులో తీసుకున్నా..



మార్చి ప్రారంభంలో కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్లొచ్చాం. కేవలం వారం రోజుల వ్యవధిలోనే థర్డ్ ఏసీ టికెట్లు లభించాయి. కానీ ఇప్పుడు బెంగళూరు వెళ్లాల్సి రావటంతో, ఆన్‌లైన్ రిజర్వేషన్ కోసం ప్రయత్నిస్తే రిగ్రెట్ చూపుతోంది. అసలు టికెట్లే లేవని చూపిస్తోంది. నెలన్నర ముందే ఏసీ టికెట్లు అయిపోతున్నాయి. ఎండాకాలంలో మామూలు బోగీల్లో వెళ్లాలంటే భయం వేస్తోంది. గత్యంతరం లేక ఎక్కువ చార్జీ చెల్లించి ఏసీ స్లీపర్ బస్సులో బుక్ చేసుకున్నాం. రైళ్లలో ఏసీ కోచ్‌ల సంఖ్య పెంచటమో, అదనపు రైళ్లను నడపటమో చేస్తే బాగుంటుంది. – జి.రవికుమార్, బాగ్‌లింగంపల్లి

సరిపడా రేక్స్ లేవు

వేసవి రద్దీ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు 100కు పైగా ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఇప్పటికే కొన్ని నడుస్తున్నాయి. జూన్ వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయి. వాస్తవానికి మరో 200 ప్రత్యేక రైళ్లను నడిపినా కూడా రద్దీకి సరిపోయే పరిస్థితి లేదు. కానీ అన్ని రేక్స్ అందుబాటులో లేవు. దీంతో అదనపు రైళ్ల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని రైల్వే బోర్డు స్థానిక అధికారులకు సూచించింది. వేరే ప్రాంతాల నుంచి కూడా కోచ్‌లను కేటాయించే పరిస్థితి లేకపోవటంతో ఈ అలర్ట్ జారీ చేసింది.

రాష్ట్రంలో 230 రైళ్ల రాకపోకలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం 230 వరకు ప్రయాణికుల రైళ్లు తిరుగుతుంటాయి. వేసవి సెలవుల నేపథ్యంలో వీటిల్లో ప్రయాణానికి ప్రతిరోజూ 30 వేల మంది వరకు అదనంగా ప్రయత్నిస్తున్నట్టు అధికారులు చెబుతు న్నారు. దీంతో రిజర్వేషన్లు దొరక్క చాలామంది జనరల్ కోచ్‌లలో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. చాలామంది అనధికారికంగా స్లీపర్ కోచ్‌లలో కూడా ఎక్కేస్తున్నారు. ఎండలతో ఉడికిపోతున్న బోగీలు ప్రయాణికుల కిటకిటతో మరింత వేడెక్కిపోతున్నాయి.

చిన్న పరిశ్రమకు అప్పు కరువు

▶ మొదటి పేజీ తరువాయి

రుణాలు ఇప్పించాలని 2021–22 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నిర్ణయించింది. కానీ, బ్యాంకులు ఇచ్చింది మాత్రం లక్ష్యంలో 19 శాతమేనని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొంది. 2020–24 మధ్యకాలంలో బ్యాంకుల నుంచి చిన్న సంస్థలకు రుణాలు 14 నుంచి 20 శాతానికి పెరగ్గా, మధ్య తరహా సంస్థలకు 4–9 శాతానికి పెరిగాయి. ఎంఎస్‌ఎంఈలకు రుణ వితరణను పెంచేందుకు ఏర్పాటు చేసిన క్రెడిట్ గ్యారంటీ ఫండ్ ట్రస్ట్ (సీజీటీఎంఎస్‌ఈ)ను విస్తరించినా పరిమిత ఫలితాలే సాధించినట్లు నివేదిక పేర్కొంది.

పీడిస్తున్న నైపుణ్య లేమి

నైపుణ్య లేమి ఎంఎస్‌ఎంఈలను వేధిస్తోంది. ఈ సంస్థల్లో పనిచేసేవారిలో ఎక్కువ మందికి సాంకేతిక శిక్షణ లేకపోవడం సంస్థల ఉత్పాదకత, నిర్వహణపై ప్రభావం చూపుతోంది. మరోవైపు అనేక ఎంఎస్‌ఎంఈలు నాణ్యత పెంపు కోసం అవసరమైన ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై నిధులు వెచ్చించడం లేదు. దీంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ పోటీలో భారతీయ ఎంఎస్‌ఎంఈలు నిలదొక్కుకోలేకపోతున్నాయని నీతి ఆయోగ్ విశ్లేషించింది. నాణ్యమైన విద్యుత్, ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో ఆధునిక సాంకేతికతను ఈ రంగం అందిపుచ్చుకోలేకపోతోంది. ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై ఈ సంస్థలకు అవగాహన ఉండటం లేదు. జాతీయ, అంతర్జాతీయ పోటీలో రాణించాలంటే ఆధునిక సాంకేతికతను స్థానిక ఎంఎస్‌ఎంఈలు అందిపుచ్చుకోవాలని నీతి ఆయోగ్ సూచించింది.

భాగస్వామ్యాలతోనే పోటీతత్వం

ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం, సంస్థల నడుమ భాగస్వామ్యాలు, అంతర్జాతీయంగా పోటీ పడటం ద్వారా ఎంఎస్‌ఎంఈలు సుస్థిర ఆర్థిక ప్రగతి సాధిస్తాయని నివేదిక వెల్లడించింది. డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ, భాగస్వామ్య ఒప్పందాలు, మార్కెట్‌తో ప్రత్యక్ష అనుసంధానం తదితరాల ద్వారా ఎంఎస్‌ఎంఈల పురోగతి సాధ్యమవుతుందని పేర్కొంది. ఈశాన్య, తూర్పు భారత్‌లో ఎంఎస్‌ఎంఈ రంగం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది.



..విచారణకు ప్రత్యేక న్యాయస్థానం

నగర పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. సైబర్ నేరాల కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. -10లో



అందాల ఆతిథ్యం..

మరికొద్ది రోజుల్లో నగర వేదికగా మిస్ వరల్డ్ పోటీల జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భాగ్య నగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.0/26.0

నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

30 ఏళ్ల క్రితం కబ్జా.. మూడ్రోజుల్లో విముక్తి

సాక్షి, సిటీబ్యూరో: ముప్పై ఏళ్ల క్రితమే కబ్జాకు గురైన రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి మూడు రోజుల క్రితం విముక్తి కల్పించారు రెవెన్యూ అధికారులు. ఇప్పటికే రెండుసార్లు సర్వే చేయడంతో పాటు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. సరూర్‌నగర్ మండలం లింగోజిగూడ డివిజన్ సర్వే నంబర్ 86లో 1.21 ఎకరాల ప్రభుత్వ భూమిపై అధికార పార్టీకి చెందిన ఓ నేత భూమిపై కన్నేశాడు. పక్కనే ఉన్న ఓ ప్రైవేటు పట్టాదారును ఉసిగొలిపి ప్రభుత్వ భూమిని పట్టా భూమిలో కలిపేందుకు యత్నించాడు. ఇప్పటికే ఆ భూమిలో నాలుగు తాత్కాలిక గదులు నిర్మించి, కూలీలకు అద్దెకు ఇచ్చాడు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలియడంతో ఈ భూమికి విముక్తి కల్పించాలని నిర్ణయించారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీఓ వెంకట్‌రెడ్డి సహా తహసీల్దార్ వేణుగోపాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి మూడు రోజుల క్రితం చుట్టూ హద్దురాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు ఫెన్సింగ్ వైర్లను చుట్టారు. తాత్కాలిక గదుల్లో అద్దెకున్న వారంతా వారం రోజుల్లో ఖాళీ చేసి వెళ్లిపోయవాల్సిందిగా ఆదేశించారు. ఈ భూమికి సమీపంలో మరో 250 గజాల స్థలాన్ని కూడా అధికారులు కాపాడారు.

'ఎర్లీబర్డ్' రికార్డు .. రూ.900.93 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎర్లీబర్డ్ పథకం వల్ల రికార్డు స్థాయిలో రూ. 900.93 కోట్ల ఆస్తిపన్ను వసూలైనట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. ఈ పథకం వల్ల గత సంవత్సరం రూ. 831.23 కోట్లు వసూలు కాగా, ఈ సంవత్సరం అంతకుంటే ఎక్కువ వసూలైనట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే ఏడాది ఆస్తి పన్నును చెల్లించేవారికి 5 శాతం రాయితీ ఇవ్వడమే 'ఎర్లీబర్డ్' పథకం. 7,93,552 మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నారు. ఎర్లీబర్డ్ ద్వారా ఆస్తి పన్ను వసూళ్లు ఏటికేడు పెరుగుతోంది. 2023–24లో రూ.785.94 కోట్లు, 2024–25లో రూ. 831.23 కోట్లు, 2025–26లో రూ. 900.93 కోట్లు ఆదాయం సమకూరింది.

తెరపైకి వెండింగ్ జోన్‌లు

వీధి వ్యాపారుల కోసం..

- ట్రాఫిక్ చిక్కులు లేకుండా..
- మున్సిపల్ శాఖ సన్నాహాలు

సాక్షి, సిటీబ్యూరో: దశాబ్ద కాలానికి పైగా ఆలోచనల్లో ఉన్న స్ట్రీట్ వెండింగ్ జోన్లు మళ్లీ తెరపైకి వచ్చాయి. చిరు వ్యాపారుల వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు రద్దీని బట్టి గ్రీన్, యాంబర్, రెడ్ జోన్లుగా వెండింగ్ జోన్లను ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఎంతో కాలంగా ఉన్నాయి. అందుకనుగుణంగా కొన్ని సర్కిళ్లలో కొన్ని వెండింగ్ జోన్లను మాత్రం ఏర్పాటు చేసినప్పటికీ అవి స్వల్పకాలమే మనుగడలో ఉన్నాయి. బాగా రద్దీ ఉండే ప్రాంతాల్లో రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటంతో చిరువ్యాపారుల ఉపాధికి భంగం వాటిల్లకుండా వెండింగ్‌జోన్లు ఏర్పాటు చేయాలనేది ఆలోచన.

- ఫుట్‌పాత్‌లపై కూడా జరుగుతున్న వ్యాపారాలతో పాదచారులకు నడిచేందుకు దారి ఉండటం లేదు. వెండింగ్ జోన్ల వల్ల పాదచారులకు సదుపాయంతో పాటు, ట్రాఫిక్ చిక్కులుండవనేది ఆలోచన. గ్రీన్ జోన్ అంటే.. ట్రాఫిక్ తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేసేవి. వీటివల్ల వాహనదారులకు కానీ, చిరువ్యాపారులకు కానీ ఎలాంటి ఇబ్బంది ఉండదు. వాటిని రోజంతా తెరచుకోవచ్చు. యాంబర్ జోన్లంటే రద్దీ ఎక్కువ ఉండే సమయాలు మినహా, మిగతా సమయాల్లో అక్కడ వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. ఇక రెడ్ జోన్లంటే ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు. వాటిల్లో ఎలాంటి వ్యాపారాలను అనుమతించరు.

మొత్తం 30 సర్కిళ్లలో..

- జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం 30 సర్కిళ్లలోనూ ఈ స్ట్రీట్ వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాల్సిందిగా మున్సిపల్ పరిపాలన శాఖ జీహెచ్ఎంసీకి సూచించింది. జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొంది. స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుతో పాటు ఆయా జోన్లలో వ్యాపారాలు చేసుకునే వారందరికీ చిరు వ్యాపారులుగా గుర్తింపు కార్డులు కూడా ఇవ్వాలని యూసీడీ విభాగానికి సూచించింది.
- గ్రేటర్ నగరం విస్తృతంగా పెరుగుతూ, శివార్లలో కూడా రద్దీ పెరుగుతుండటతో జీహెచ్ఎంసీ వెలుపల ఉన్న 26 శివారు స్థానిక సంస్థల్లో సైతం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు స్ట్రీట్ వెండింగ్ జోన్లను గుర్తిస్తూ మార్కింగ్ చేయాలని ఆదేశించింది. శివారు స్థానిక సంస్థల్లో ఘట్‌కేసర్, కొంపల్లి, పీర్జాదిగూడ, పోచారం, ఆదిభట్ల, బండ్లగూడ జాగీర్, జల్‌పల్లి, కొత్తూరు, మణికొండ, మీర్‌పేట్, నార్సింగి, తుక్కుగూడ, తుర్కయాంజాల్ ఉన్నాయి. స్ట్రీట్ వెండర్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ లివ్లీహుడ్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండింగ్) యాక్ట్-2014 అమలు చేసేందుకుగాను మున్సిపల్‌శాఖ ఇందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



విదేశీ వన్యప్రాణి

ముచ్చర్లలో అన్యదేశ జంతు ప్రదర్శన శాల



200 ఎకరాల్లో ఎగ్జోటిక్ జూ పార్కు

- సింగపూర్ తరహాలో రూపుదిద్దే యోచన
- ఇప్పటికే స్థలం కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- పీపీపీ విధానంలో పనులు ప్రారంభించనున్న టీఎఫ్‌డీసీ
- మరో రెండేళ్లలో అందుబాటులోకి..

విదేశీ జంతు జాతులను కనులారా చూసి ఆనందించాలని ఉందా? వేరే దేశంలోనో, దూర ప్రాంతాలకు వెళ్లో ఈ వన్యప్రాణులను చూసి రావటం అసాధ్యమని భావిస్తున్నారా? అయితే.. మీరు ఏమాత్రం చింతించనవసరంలేదు. రెండేళ్లు ఆగితే మన వద్దే ఎగ్జోటిక్ జూ పార్కు (విదేశీ జంతు ప్రదర్శన శాల) అందుబాటులోకి వచ్చే అవకాశముంది. నగర శివారులోని ముచ్చర్లలో ఇది ఏర్పాటు కానుంది. 200 ఎకరాల్లో విదేశీ (అన్యజాతి) జంతు ప్రదర్శనశాల సందర్శకులకు కనువిందు చేయనుంది. సింగపూర్ జూ తరహాలో దీనిని రూపుదిద్దనున్నారు. పీపీపీ పద్ధతిలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ జూ పార్కును ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం స్థలం కేటాయించింది. ప్రపంచంలోని ఇతర దేశాలకు చెందిన జంతువులను మాత్రమే ఇక్కడ ఉంచుతారు. ఇతర జూ పార్కులతో పాటు పెద్ద పెద్ద ఫామ్స్‌లలో పెంపకం చేపట్టే వారి వద్ద నుంచి వివిధ రకాల జంతువులను ఇక్కడికి తరలించి సందర్శకులకు అందుబాటులో ఉంచనున్నారు. రానున్న రెండేళ్లలో ఈ ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కు అందుబాటులోకి రానుంది. – చార్మినార్

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలకు తోడు నాలుగో సిటీగా ఏర్పడనున్న ఫ్యూచర్ సిటీకి దగ్గరల్లో విదేశీ జంతు ప్రదర్శన శాల అందుబాటులోకి రానుంది. పాతబస్తీ చాంద్రాయణగుట్ట మీదుగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కలుపుతూ ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు కారిడార్ ఎక్స్‌టెన్షన్ ఏర్పాటు కానున్న దృష్ట్యా కొత్తగా ఏర్పడనున్న ఈ జూ పార్కుకు రోడ్డు మార్గంతో పాటు మెట్రో రైలు సేవలు కూడా అందుబాటులో ఉండనున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్)తో పాటు రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) తదితర అత్యంత సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఈ జూ పార్కుతో పాటు మరో 1,500 ఎకరాల అటవీ ప్రాంతాన్ని జూ సఫారీ పార్కు ఏర్పాటు చేయడానికి అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా.. ప్రస్తుతం 380 ఎకరాల్లో 2,200 జంతువులతో కొనసాగుతున్న నెహ్రూ జూ పార్కుకు అదనంగా ఈ విదేశీ జంతు ప్రదర్శన శాల అందుబాటులోకి రానుంది.

ఏయే దేశాల నుంచి..

ఆఫ్రికా, దక్షిణ అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన జంతు జాతులను ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కుకు తరలించనున్నారు. నెహ్రూ జూ పార్కులోని జంతువులు అక్కడే ఉండనున్నాయి. ఒకవైళ ఇప్పటికే ఇక్కడ ఉన్న విదేశీ జంతువుల సంతానం పెరిగితే వాటిని మాత్రమే అక్కడికి తరలించనున్నారు. జంతు మార్పిడిలో భాగంగా ఇతర దేశాల్లోని జూ పార్కుల నుంచి అవసరమైన జంతు జాతులను కొత్త జూ పార్కుకు తరలించనున్నారు. అలాగే.. ప్రైవేట్ యాజమాన్యాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫామ్స్ నుంచి జంతువులను ఖరీదు చేసి ఇక్కడికి తీసుకురానున్నారు. నెహ్రూ జూ పార్కులో కొనసాగుతున్న ప్రస్తుత జంతు సేకరణకు భిన్నంగా ఈ ప్రక్రియ కొనసాగనుంది.

దేశంలోనే అతిపెద్దగా..

200 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఎగ్జోటిక్ యానిమల్ జూ పార్కు దేశంలో అతి పెద్దది కానుందని జూ పార్కు అధికారులు తెలిపారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని శ్రీ చామరాజేంద్ర జంతు ప్రదర్శన శాల (మైసూర్ జూ)లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇతర దేశాల జంతువులకు ఆవాసంగా కొనసాగుతోంది. అంతరించిపోతున్న జంతు జాతుల పరిరక్షణ జరుగుతోంది. దీనికి తోడు ఆదాయంతో పాటు సందర్శకులకు వినోదం లభిస్తోంది. ఈ తరహాలోనే నగర శివారు ముచ్చర్లలో విదేశీ జంతు ప్రదర్శన శాల ఏర్పాటు కానుంది. అయితే ముచ్చర్ల జూ పార్కు మైసూర్ జూ పార్కు కన్నా.. విశాలంగా ఏర్పాటు కానుంది.

పనులు చకచకా..



విదేశీ జంతు ప్రదర్శన శాల ఏర్పాటుకు పనులు చకచకా జరుగుతున్నాయి. ముచ్చర్లలో ఈ జూ పార్కు రూపుదిద్దుకోనుంది. దీంతో పాటు అక్కడే దాదాపు 1,500 ఎకరాల అటవీ స్థలాన్ని సైతం సఫారీ పార్కుకు కోసం పరిశీలిస్తున్నాం. రానున్న రెండేళ్లలో కొత్త జూ పార్కు సందర్శకులకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

– డాక్టర్ సునీల్ ఎస్.హీరేమత్, డైరెక్టర్, తెలంగాణ జూ పార్క్స్



విద్యుత్ మీటర్ల కొను'గోలుమాల్'

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ మీటర్ల జారీ వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. ఎలాంటి నిర్మాణాలు, భూమికి సంబంధించిన రికార్డులు లేకపోయినా క్షేత్రస్థాయి సిబ్బందికి అడిగినంత ఇస్తే చాలు మీటర్లు జారీ చేయిస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికే కాదు.. ఆయా భూముల్లో అక్రమ నిర్మాణాలకు కారణమవుతున్నారు. ఇప్పటికే సరూర్‌నగర్ సర్కిల్ మునగనూరు సర్వే నంబర్ 90లో 6.28 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, 54 తాత్కాలిక ఇళ్లను నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంతో స్థానికంగా ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించగా, విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులు జారీ చేసింది. తాజాగా దుండిగల్, రాయదుర్గం పోలీసు స్టేషన్ల పరిధిలోనూ పెద్ద సంఖ్యలో విద్యుత్ మీటర్లు బయటపడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డిస్కం రిలీజ్ చేసిన 24 గంటల్లోనే సంబంధిత దరఖాస్తుదారు నివాస గృహం/వాణిజ్య భవనానికి క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నెలలు గడుస్తున్నా అమర్చడం లేదు. కానీ.. మరుసటి నెల నుంచే ఆయా మీటర్లకు రీడింగ్ నమోదు చేసినట్లు రికార్డులు చూపిస్తూ ప్రతి నెలా మినిమం బిల్లులు జారీ చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాలు, నిర్మాణాలు లేకపోయినా జారీ



ఇంట్లో నిల్వ ఉంచిన విద్యుత్ మీటర్లు

అక్రమంగా 42 విద్యుత్ మీటర్లు..

ఇంట్లో అక్రమంగా దాచిన 42 విద్యుత్ మీటర్లను విద్యుత్ శాఖ అధికారుల ఫిర్యాదుపై రాయదుర్గం పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకొని కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేశారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్‌వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 24 గంటల్లో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ మీటర్లు ఇంట్లో అక్రమంగా దాచి ఉంచారని విద్యుత్ శాఖలోని సైబర్ సిటీ జోన్ ఇబ్రహీంబాగ్ డివిజన్ ఏడీఈ అంబేద్కర్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు చిత్రపురి కాలనీలోని ఓ ఇంట్లో తనిఖీలు చేయగా 42 విద్యుత్ మీటర్లు దొరికాయి. కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డిపై కేసు నమోదు చేశారు. మీటర్లు నిల్వ ఉంచడంపై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ ప్రకటించారు.

ఆస్పత్రి భవన నిర్మాణంలో ఇన్ని ఉల్లంఘనలా?

యజమానులపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం

సాక్షి, సిటీబ్యూరో: ఆస్పత్రి కోసం నిర్మిస్తున్న భవనంలో ఉన్న ఉల్లంఘనలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. దాని యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వివరణ ఇవ్వాలంటూ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని డాక్టర్ శంకర్స్ ఆసుపత్రి నిర్మాణంలో నిబంధనల్ని ఉల్లంఘించారని స్థానికులు ఇటీవల ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు.

దీన్ని పరిగణనలోకి తీసుకున్న రంగనాథ్ శుక్రవారం ఆ ఆస్పత్రి భవనాన్ని సందర్శించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అందులో ఉన్న ఉల్లంఘనల్ని పరిశీలించారు. అక్కడ ఉన్న రహదారులను ఆక్రమించారని, నాలుగు అంతస్తులకు అనుమతి తీసుకుని సెల్లార్‌తో పాటు ఆరు అంతస్తులు ఎలా నిర్మిస్తారని యజమాని డాక్టర్ శంకర్‌ని ప్రశ్నించారు. అనుమతులన్నింటినీ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండా లైసెన్స్ ఎలా మంజూరు చేశారని అధికారులను ప్రశ్నించారు. దీనిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ చీఫ్ ప్లానర్ శ్రీనివాస్‌కు సూచించారు.



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న రంగనాథ్

బతుకమ్మ కుంట పనుల్లో వేగం పెంచండి..

ఈ ఏడాది బతుకమ్మను బతుకమ్మ కుంటలో ఆడేలా లక్ష్యం నిర్దేశించుకున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల వేగాన్ని పెంచాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. త్వరలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సైతం బతుకమ్మ కుంట సందర్శనకు రానున్నారని, అప్పటికి ఈ చెరువుకు ఓ రూపాన్ని తీసుకురావాలని స్పష్టం చేశారు. శుక్రవారం బతుకమ్మ కుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులను రంగనాథ్ పరిశీలించారు.

భవనాలు ఆకాశంలోకి.. జలాలు పాతాళంలోకి..

గ్రేటర్‌లో ఏటా పెరుగుతున్న హైరైజ్ నిర్మాణాలు

- అడుగంటుతున్న భూగర్భ నీటి మట్టాలు
- ఇష్టారీతిన అనుమతులిస్తున్న యంత్రాంగం
- కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం
- భూమిలోకి ఇంకని వర్షపు నీరు
- శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, గండిపేట, శంషాబాద్‌లలో అట్టడుగున..

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో హైరైజ్ భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ.. భూగర్భ జలాలు పాతాళానికి జారుతున్నాయి. వర్షపాతం సాధారణం కంటే 20 శాతం ఎక్కువే నమోదవుతున్నా ఆ స్థాయిలో భూమిలోకి నీరు చేరడం లేదు. చాలా అపార్ట్‌మెంట్లలో బోర్లు అడుగంటిపోతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలలో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం గ్రేటర్ పరిధిలో గతేడాది జనవరిలో 8.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ఈ ఏడాది జనవరి నాటికి 9.46కు పడిపోయాయి. గతేడాది మార్చిలో 10.89 మీటర్ల లోతుకు చేరగా.. ఈ మార్చి నాటికి ఏకంగా 11.94 మీటర్ల లోతుకు పడిపోయాయి.

హైరైజ్ అపార్ట్‌మెంట్లు.. గేటెడ్ కమ్యూనిటీలు..

- కాస్మోపాలిటన్ సంస్కృతి, పట్టణీకరణ, వలసలు, ఉద్యోగావకాశాలు, అభివృద్ధి, అంతర్జాతీయ మౌలిక వసతులు, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలు.. ఇలా రకరకాల కారణాలతో గ్రేటర్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ ఏర్పడింది. దీంతో హైరైజ్ అపార్ట్‌మెంట్లు, బడా గేటెడ్ కమ్యూనిటీలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి.
- 2019– 2020 మధ్యకాలంలో జీహెచ్ఎంసీ పరిధిలో 17,538 భవన నిర్మాణ అనుమతులు మంజూరు కాగా.. గత నాలుగేళ్లలో వంద శాతానికిపైగా వృద్ధి నమోదయింది. భూగర్భ జలాల వినియోగం గురించి ఏమాత్రం ఆలోచించకుండా అధికారులు ఇష్టారీతిన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. దీంతో శేరిలింగంపల్లి, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, నానక్‌రాంగూడ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మాణంలో ఉండటమే నీటి ఎద్దడికి ప్రధాన కారణం.
- నగరంలో దాదాపు 70 శాతం కొత్త ప్రాజెక్టులు ఈ ప్రాంతాల్లోనే నిర్మాణంలో ఉన్నాయి. డెవలపర్లు నిర్మాణం కోసం భూగర్భ జలాలపై ఆధారపడుతుంటారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత చాలా గేటెడ్ కమ్యూనిటీలు నీటిని ఆదా చేయడానికి వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టులను సరైన రీతిలో నిర్వహణ చేయడం లేదు. ముందస్తు ప్రణాళికలు, ఇంకుడు గుంతలు వంటి సమగ్ర వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీల నుంచి వృథాగా పోతోంది.

శివార్లలోనూ ఇదే దుస్థితి..

అపార్ట్‌మెంట్లలో ఇష్టారీతిన బోర్లువేయడం, గేటెడ్ కమ్యూనిటీలలో నీటి వినియోగం పెరుగుతుండటంతో ఎద్దడి ఏర్పడుతోంది. మరోవైపు ఇంకుడు గుంతలు ఏర్పాటు, వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో భూగర్భ మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం నగరంలో అంతర్భాగమయ్యాయి. పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. చెరువులు, కుంటలు దాదాపు కనుమరుగయ్యాయి. ఒకటి రెండు ఉన్నా..వాటి చుట్టూ భారీ నిర్మాణాలు, సీసీ రోడ్లే. పూర్తిగా కాంక్రీట్ జంగిలే. ప్రతి 25 నుంచి 50 ఫీట్ల దూరంలో ఒక బోరు బావిని తవ్వుతుండటం, సెప్టెంబర్/అక్టోబర్ మాసాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ... భూమిలోకి నీరు ఇంకకపోవడం, చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా లేకపోవడంతో భూగర్భంలోని నీరు పాతాళానికి పడిపోయింది. ప్రధానంగా శేరిలింగంపల్లి, సరూర్ నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంకర్‌పల్లి, చేవెళ్ల, మెయినాబాద్, కొత్తూరు, శంషాబాద్, రాజేంద్రనగర్, కందుకూరు మండలాల్లో భూగర్భ మట్టాలు బాగా పడిపోయాయి.


ట్యాంకర్లే ఆధారం..

ఎండిపోయిన బోరుబావులతో నగరవాసులు అల్లాడుతున్నారు. కొంతమంది పరిమిత స్థాయిలో సరఫరా అయ్యే వాటర్‌బోర్డు నీటితో సరిపెట్టుకుంటుంటే.. మరికొందరు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ల వైపు మొగ్గు చూపిస్తుంటే.. ఇంకొందరు ప్రైవేట్ ట్యాంకర్లకు భారీ చార్జీలు చెల్లిస్తున్నారు. నెలకు నీటి ట్యాంకర్ల ధర రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు ఉంటోంది. వేసవికాలంలో వంట చేయడం, స్నానం చేయడం, బట్టలు ఉతకడం కూడా ఇప్పుడు విలాసంగా మారిందని నార్సింగిలోని ఓ బడా గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వ్యాపారవేత్త అన్నారు. కమ్యూనిటీలో వర్షపు నీటి నిల్వ వ్యవస్థ పూర్తిగా ఎండిపోయిందని కొన్నిసార్లు తాగునీటి సరఫరా చాలా ప్రమాదకరంగా ఉందన్నారు.



ప్రధాన మండలాల్లో భూగర్భ జలాలు (మీటర్ల లోతులో)

మండలం	డిసెంబర్	జనవరి	ఫిబ్రవరి	మార్చి
శేరిలింగంపల్లి	12.59	13.97	15.07	23.12
సరూర్‌నగర్	12.66	14.80	18.83	19.78
ఇబ్రహీంపట్నం	14.11	15.75	16.89	18.48
మహేశ్వరం	9.74	10.09	10.26	13.88
శంకర్‌పల్లి	8.45	9.77	11.31	12.86
చేవెళ్ల	9.14	10.23	10.83	12.00
మొయినాబాద్	7.87	8.76	10.02	11.91
కొత్తూరు	8.37	9.41	9.97	11.65
గండిపేట్	9.87	10.08	10.70	10.13
శంషాబాద్	8.36	8.80	9.41	9.88
రాజేంద్రనగర్	8.33	8.76	9.46	9.89
కందుకూరు	6.72	7.69	8.99	9.52



క్రిప్టో కరెన్సీ బాధితుడికి సొమ్ము రిఫండ్

సాక్షి, సిటీబ్యూరో: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మి, మోసపోయిన బాధితుడికి సైబరాబాద్ పోలీసులు కాస్తా ఉపశమనం కల్పించారు. నిందితుడు వాలెట్‌లో ఉన్న సొమ్మును ఫ్రీజ్ చేసి, బాధితుడికి తిరిగి అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సైబరాబాద్‌కు చెందిన వ్యక్తికి నకిలీ ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ పేరుతో కేటుగాళ్లు వల వేశారు. ఎంసీ–వీఐపీ–బీటీసీ–గ్రూప్–888/702 అనే నకిలీ వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా చేర్పించారు. థర్డ్ పార్టీ అప్లికేషన్ ద్వారా క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని అతడిని నమ్మించారు. మోసగాళ్ల మాటలను నమ్మిన అతడికి నకిలీ లింక్‌లను పంపించారు. దీంతో బాధితుడు రూ.20.39 లక్షల సొమ్మును కేటుగాళ్లు చెప్పిన లింక్‌ల ద్వారా ప్రైవేట్ వ్యాలెట్లకు చెల్లింపులు చేశాడు. అధిక లాభాలు కాదు కదా పెట్టిన సొమ్ము కూడా తిరిగి రాకపోయే సరికి తాను మోసపోయినట్లు గుర్తించి సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు చెల్లింపుల ప్రక్రియలను విశ్లేషించారు. దీంతో చెల్లింపులు ఆఫ్రికాలోని సీషెల్స్‌లో ఉన్న అంతర్జాతీయ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌తో అనుసంధానమైన వ్యాలెట్లకు బదిలీ అయినట్లు గుర్తించారు. దీంతో వాలెట్లు, కేవైసీ (నో యువర్ కస్టమర్) తదితర వివరాలను ఇవ్వాలని పోలీసులు ఎక్స్ఛేంజ్ నోటీసులు పంపించారు. ఆయా సమాచారం మేరకు నిందితుడి వాలెట్‌లో రూ.3,22,205 సొమ్ము ఉందని గుర్తించిన పోలీసులు.. వాలెట్‌ను ఫ్రీజ్ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు అందులోని సొమ్మును బాధితుడికి తిరిగి అప్పగించారు.

యువకుడి దారుణ హత్య

చాంద్రాయణగుట్ట: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.వట్టెపల్లికి చెందిన మహ్మద్ మజీద్(25) తీగలకుంటలో స్టార్ పాన్ షాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం దుకాణం వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మాట్లాడుదామని అతడిని బయటికి పిలిచారు. ఈ క్రమంలో వారి మధ్య మాట మాట పెరిగి వాగ్వాదానికి దారితీసింది. దీంతో ఆగ్రహానికిలోనైన వారు కత్తితో విచక్షణ రహితంగా మజీద్‌పై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికే మజీద్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడిపై ఎలాంటి నేర చరిత్ర లేదని, హత్యకు గల కారణాలు తెలియరాలేదని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

సైబర్ నేరాల విచారణకు
ప్రత్యేక న్యాయస్థానం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన పోలీసులు
- ఇప్పటి వరకు సీసీఎస్ అధికారిక కోర్టులోనే ఇవీ
- ఫలితంగా ట్రయల్‌లో తీవ్ర జాప్యం
- నగదు రిఫండ్ ప్రక్రియ వేగవంతమయ్యేలా చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి మరింత ఉపశమనం కలిగించేలా నగర పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీని ద్వారా నిందితులను దోషులుగా నిరూపించే ప్రక్రియతో పాటు ఫ్రీజ్ చేసిన నగదు రిఫండ్ చేసే ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. సిటీ పోలీసుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక కోర్టుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో పేర్కొన్నారు.

సెల్‌తో మొదలై స్టేషన్ వరకు...

సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు కోసం నగరంలో ఆది నుంచీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లేదు. 2007 వరకు డేటా థెఫ్ట్, ఎదుటి వ్యక్తుల్ని కించపరచడం తదితర సైబర్ నేరాలు మాత్రమే ఎక్కువగా జరుగుతుండేది. ఈ కేసుల్ని ఒకప్పుడు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులే నమోదు చేసి, దర్యాప్తు చేసేవారు. నానాటికీ ఇలాంటి కేసులతో పాటు ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్నవీ పెరుగుతుండటంతో ప్రత్యేక విభాగం అవసరమని భావించారు. దీంతో సీసీఎస్ ఆధీనంలో సైబర్ క్రైమ్ సెల్ ఏర్పాటు చేశారు. సైబర్ నేరాలను ఈ అధికారులు దర్యాప్తు చేసినా... పోలీస్ స్టేషన్ హోదా లేకపోవడంతో కేసు మాత్రం సీసీఎస్‌లోనే నమోదయ్యేది. సైబర్ క్రైమ్ కేసుల నమోదు, దర్యాప్తు కోసం ప్రత్యేక ఠాణా అవసరమంటూ పోలీసులు ప్రతిపాదించడంతో 2010లో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ ఏర్పాటైంది.

అప్పటి నుంచి సీసీఎస్ కోర్టే డిజిగ్నేటెడ్..

ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే కేసుల విచారణ చేపట్టడానికి ఓ డిజిగ్నేటెడ్ కోర్టు ఉంటుంది. అప్పట్లో కేసుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం, సీసీఎస్‌లో అంతర్భాగంగా, ఆ విభాగం డీసీపీ పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఠాణా ఏర్పడటంతో సీసీఎస్ కోర్టునే సైబర్ క్రైమ్ ఠాణాకు డిజిగ్నేట్ చేశారు. అప్పటి నుంచి సైబర్ నేరాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లను అధికారులు నాంపల్లిలోని 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఏసీజేఎం) కోర్టులోనే దాఖలు చేస్తున్నారు. ఓ పక్క సైబర్ నేరాలు, మరోపక్క సీసీఎస్‌లో నమోదయ్యే భారీ ఆర్థిక నేరాలు నానాటికీ పెరిగిపోతుండటంతో ఈ న్యాయస్థానంపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. ఈ రెండు విభాగాలకు తోడు సీసీఎస్ ఆధీనంలోనే ఉండే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కేసుల్నీ ఏసీజేఎం న్యాయస్థానంలోనే విచారించాల్సి ఉంది. ఇలాంటి అనివార్య కారణాల నేపథ్యంలో సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ఇటీవల పెరిగిన రిఫండ్ ప్రక్రియ...

ఆర్థికాంశాలతో ముడిపడి ఉన్న సైబర్ నేరాల్లో బాధితులుగా మారిన వారికి రెండు మూడేళ్ల క్రితం రిఫండ్ అనేది ఉండేది కాదు. నేరగాళ్లు చిక్కినప్పటికీ నగదు రికవరీ దుర్లభమయ్యేది. అయితే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌తో పాటు 1930 నెంబర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయి. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు కంటే ముందు నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లోని నగదును ఫ్రీజ్ చేస్తున్నారు. ఈ మొత్తం బాధితులకు తిరిగి ఇవ్వాలంటే న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసి, న్యాయమూర్తి అనుమతి పొందాల్సి ఉంటుంది. కోర్టులో ఉన్న పని భారంతో ఈ ప్రక్రియ కూడా ఆలస్యమై బాధితులకు పూర్తిస్థాయి ఊరట లభించట్లేదు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారం కోసం సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఈ కోర్టులో సైబర్ క్రైమ్ ఠాణాలో మాత్రమే కాకుండా నగరంలోని అన్ని పోలీసుస్టేషన్లలో నమోదయ్యే సైబర్ క్రైమ్ కేసులు విచారించేలా ప్రతిపాదనలు రూపొందించారు.

బైక్‌లపై గస్తీ

- సైబరాబాద్ షీ టీమ్స్‌కు ద్విచక్ర వాహనాల అందజేత
- మహిళల భద్రత మరింత వేగంగా



సాక్షి, సిటీబ్యూరో: మహిళల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు సైబరాబాద్ షీ టీమ్స్ ముందడుగు వేసింది. బాధిత మహిళలను క్షణాల్లో చేరుకునేందుకు వీలుగా షీ టీమ్స్ పోలీసులకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ (బీజీఎల్), సైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సహకారంతో 12 హోండా యాక్టివా స్కూటర్లను మహిళా పోలీసు సిబ్బందికి అందజేశారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో మహిళలు, పిల్లల నిఘాను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహిళల భద్రత, సాధికారత వైపు, ప్రజా భద్రతను బలోపేతం చేయడానికి, వేగవంతమైన ప్రతిస్పందనను నిర్ధారించడంలో ఇది చురుకైన చర్యగా అభివర్ణించారు. సున్నితమైన ప్రదేశాలకు వేగంగా వెళ్లడానికి, నేరాలను నిరోధించడానికి, శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) డాక్టర్ గజరావు భూపాల్, డీసీపీ (ఎస్‌బీ) సాయి శ్రీ; ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్; ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, బీజీఎల్ ఎండీ రామ్ మోహన్ రావు కర్నాటి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- శ్రీనగర్‌కాలనీలోని శ్రీసత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రదర్శనలో డైరెక్ట్ వీవర్స్ 50 శాతం రాయితీపై అమ్మకాలు నిర్వహించనున్నారు.
- నాంపల్లి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో శ్రీధర్ దేశ్ పాండే రచనలు సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం, కాళేశ్వరం ప్రాజెక్టు : ప్రశ్నలు– విమర్శలు– వక్రీకరణలు– వివరణలు పుస్తకావిష్కరణ సభ సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీకాలనీలో లులుమాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఇండియా ఎక్స్–2025 ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవులు సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

నాలుగుగంటలపాటు అఘోరి విచారణ

- ఒకరోజు కస్టడీకి తీసుకున్న మోకిల పోలీసులు
- ప్రగతి రిసార్ట్స్‌లో గంటన్నర పాటు సీన్ రికన్‌స్ట్రక్షన్
- కస్టడీ అనంతరం షాద్‌నగర్ కోర్టుకు..
- అక్కడి నుంచి చంచల్‌గూడ జైలుకు తరలింపు



అఘోరిని షాద్‌నగర్ కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

శంకర్‌పల్లి/షాద్‌నగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అఘోరి అలియాస్ శ్రీనివాస్‌ను శుక్రవారం మోకిల పోలీసులు విచారించారు. మంచిర్యాల జిల్లా, కృష్ణపల్లికి చెందిన అఘోరి శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్‌లో ఉంటున్న ఓ మహిళా సినీ నిర్మాతను పూజల పేరుతో మోసి చేసి, చంపుతానని బెదిరించి రూ.9.80 లక్షలు వసూలు చేసిన వ్యవహారంలో ఫిబ్రవరి 25న మోకిల పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గత నెల 22న అతడిని ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. 23న చేవెళ్ల జూనియర్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. అప్పటి నుంచి చంచల్‌గూడ జైలులో ఉన్న అఘోరిని మూడు రోజుల కస్టడీకి అనుమతించాలని మోకిల పోలీసులు చేవెళ్ల కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో.. కోర్టు ఒకరోజు కస్టడీకి అనుమతించింది.

ప్రశ్నల వరంపర..

కోర్టు ఒకరోజు మాత్రమే అనుమతి ఇవ్వడంతో అఘోరి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న విషయం, సీన్ రీకన్‌స్ట్రక్షన్, రిమాండ్ తరలింపు తదితర అంశాలను చివరి నిమిషం వరకు పోలీసులు గోప్యంగా ఉంచారు. మోకిల సీఐ వీరబాబు సుమారు నాలుగు గంటల పాటు అఘోరిని విచారించారు. సదరు మహిళా సినీ నిర్మాత ఎలా పరిచయం అయ్యారు? మొదటిసారి ఎక్కడ కలుసుకున్నారు? ఎన్ని రోజులు వాళ్లతో ఉన్నావు? పూజలు ఎక్కడ చేశారు? ఆమె వద్ద నుంచి ఎన్ని లక్షలు తీసుకున్నావు? తీసుకున్న డబ్బుతో ఏం కొనుగోలు చేశావ్? మిగిలిన డబ్బు ఇప్పుడు ఎక్కడుంది? ఇవన్నీ ఎందుకు చేస్తున్నావు? నీ వెనకాల ఎవరన్నా ఉండి చేయిస్తున్నారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. అడిగిన ప్రశ్నలకు అఘోరి ఓపిగ్గా సమాధానం చెబుతూ సహకరించినట్లు పోలీసులు తెలిపారు.

షాద్‌నగర్ కోర్టుకు అఘోరి

కస్టడీ సమయం ముగిసిన అనంతరం చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టాల్సి ఉండగా జడ్జి సెలవులో ఉండడటంతో షాద్‌నగర్ కోర్టుకు తీసుకొచ్చి జడ్జి ఎదుట హాజరుపరిచారు. అఘోరి తరఫు న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. బెయిల్ పిటీషన్‌ను సోమవారానికి వాయిదా వేసినట్లు అఘోరి తరఫు న్యాయవాది కుమార్ తెలిపారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసులు అఘోరిని చంచల్‌గూడ జైలుకి తరలించారు.

శానిటేషన్ నిర్వహణ సజావుగా జరగాలి



సాక్షి సిటీబ్యూరో: శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి తెలుగు తల్లి ఫ్లైఓవర్, లోయర్ ట్యాంక్ బండ్ ట్రాన్స్‌ఫార్మర్ పాయింట్, ఖైరతాబాద్ బడా గణేష్, ఖైరతాబాద్ పార్కు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులతో పాటు శానిటేషన్ ను పరిశీలించారు. బడా గణేష్ ప్రాంతంలో శానిటేషన్ వర్కర్లతో కమిషనర్ మాట్లాడారు. అక్కడే ఎఫ్.ఆర్.ఎస్ అటెండెన్స్‌ను పరిశీలించారు. అదేవిధంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్‌లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఐడీ కాలనీ వద్దకు వెళ్లి అక్కడ కాలనీ వాసులతో మాట్లాడారు. శానిటేషన్ కార్మికులు రోజు వస్తున్నారా అని ఆరా తీశారు. ప్రతి రోజు వస్తున్నారని కాలనీ వాసులు కమిషనర్‌కు తెలిపారు. పక్కనే ఉన్న పార్కు ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి నుంచి నేరుగా సెక్రెటరియేట్ పరిసరాలను పరిశీలించారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్‌తో పాటు లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఎస్సీటీపీసీని సందర్శించి రాంకీ వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో వ్యక్తి మృతి

కళాశాలలో కుమార్తెను దిగబెట్టేందుకు వెళ్తూ కుప్పకూలిన తండ్రి



ఆజాద్‌కు సీపీఆర్ చేస్తున్న సిబ్బంది

శంషాబాద్: కుమార్తెను కళాశాలలో దిగబెట్టేందుకు వెళుతున్న ఓ తండ్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుప్పకూలిపోయాడు. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ సీఐ బాలరాజు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఆజాద్ కుమార్తె తబత్ నస్రీన్ బీదర్‌లోని షహీన్ వర్సిటీలో చదువుకుంటోంది. కుమార్తెను కళాశాలలో దిగబెట్టేందుకు ఆజాద్ కుమార్తెతో కలిసి రాంచి నుంచి గురువారం రాత్రి ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బీదర్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. పిల్లర్ నంబర్ 1 వద్దకు రాగానే ఆజాద్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సిబ్బంది అతడికి సీపీఆర్ చేసి ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తండ్రి తన కళ్లేదుటే చనిపోవడంతో కుమార్తె తీవ్ర కన్నీటి పర్యంతమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

బాలుడిపై బాలిక లైంగికదాడి

- పోలీసులకు బాధితుడి తల్లి ఫిర్యాదు
- కేసు నమోదు

బంజారాహిల్స్: మైనర్ అయిన తన కుమారుడిపై బ్రదర్ అంటూనే ఓ బాలిక లైంగిక దాడికి పాల్పడిందంటూ బాలుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో పనిమనిషిగా ఉన్న ఓ మహిళ తన భర్తతో పాటు కుమారుడితో కలిసి అక్కడే సర్వెంట్ క్వార్టర్స్‌లో ఉంటుంది. స్కూల్ సెలవులు కావడంతో కుమారుడు ఇంటి వద్ద ఉంటున్నాడు. ఇదిలా ఉండగా వీరి క్వార్టర్స్ పక్క గదిలో ఉండే మరో పనిమనిషి అయిన బాలిక ఉంటుంది. సదరు బాలిక మహిళ కుమారుడిని బ్రదర్ అని, ఆమె కుమారుడు ఆ బాలికను సిస్టర్ అంటూ పిలుచుకునేవారు. ఒకసారి సదరు బాలిక తన కుమారుడిని ముద్దు పెట్టుకోవడంతో అతడిని నిలదీసింది. మార్చి నెలలో తాను గదిలో ఒంటరిగా ఉండగా బాలిక తనను ముద్దు పెట్టుకుందని చెప్పాడు. నిన్ను ఇష్టపడుతున్నానని, నిన్ను ఏమి చేసినా మౌనంగా ఉండాలని, లేకపోతే దొంగతనం కేసు పెట్టి మీ తల్లి ఉద్యోగం తీయిస్తానని బెదిరించిందని చెప్పుకొచ్చాడు. దీంతో ఆమె చెప్పినట్లు బాలుడు చేసేవాడు. ఈ క్రమంలో బాలుడిపై ఆమె లైంగిక దాడికి పాల్పడింది. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్రామానుజులు అందరికీ ఆదర్శం



శంషాబాద్ రూరల్: సమాజంలో అందరూ సమానమే అని చాటిన వ్యక్తి భగవద్రామానుజులు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని సమతా స్ఫూర్తి కేంద్రంలో నిర్వహించిన శ్రీ భగవద్రామానుజుల 1008 జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పేదలు, నిమ్న వర్గాలను ఆధ్యాత్మిక భావన మార్గం చూపడంలో రామానుజాచార్య అందరికీ ఆదర్శమన్నారు. నాడు సమాజంలో అందరూ సమానమే అని చాటిన శ్రీ భగవద్రామానుజులు.. నేడు సమానత్వాన్ని చాటి చెబుతున్న చినజీయర్ స్వామి మహనీయులని కొనియాడారు. ఈ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చినజీయర్‌స్వామి గవర్నర్‌కు రామానుజుల మూర్తి జ్ఞాపిక, మంగళాశాసనాలు అందజేశారు.

రాజకీయ కక్షతోనే కాళేశ్వరంపై దుష్ప్రచారం

శ్రీధర్ దేశ్ పాండే పుస్తకాల ఆవిష్కరణ సభలో హరీష్‌రావు

నాంపల్లి: తెలంగాణ సాగునీటి రంగ నిపుణులు శ్రీధర్ దేశ్‌పాండే రచించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రశ్నలు–విమర్శలు– వక్రీకరణలు–వివరణలు', సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ సభ శుక్రవారం రాత్రి నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎస్.నిరంజన్‌రెడ్డి హాజరై గ్రంథాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... పుస్తక రచయిత శ్రీధర్ దేశ్‌పాండేకు తెలంగాణ పట్ల ఉండే మమకారం, ప్రేమ చూసినట్లు చెప్పారు. ఆయన నీటికి నిజాయితీకి మారుపేరు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నిలబడితే వారు చేసిన మంచిని కొనసాగిస్తే చరిత్ర పుటల్లో నిలిచిపోతారనే రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతుల ప్రయోజనాలను, రాష్ట్ర ప్రయోజనాలను బలి పెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నారన్నారు. 2007లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం కేసీఆర్ ఆదేశాల మేరకు మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ప్రభుత్వం నీటిపారుదల శాఖ మంత్రితో భేటీ అయినట్లు తెలిపారు. ఆనాటి గవర్నర్ విద్యాసాగర్ రావు ముందే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి తెలంగాణ నీటి కష్టాలను వివరించానని తెలిపారు. శ్రీధర్ దేశపాండే రాసిన ఈ పుస్తకంలో సిడబ్ల్యూసీ రిపోర్టు, పర్మిషన్లు ఉన్నాయని అన్నారు. గ్రావిటీ ద్వారా వచ్చే నీళ్ళకు లిఫ్టు పెట్టారని అవివేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లి వరకు కూడా లిఫ్ట్‌తోనే వస్తాయని కానీ గ్రావిటీతో రావని, ఇది కేవలం దుష్ప్రచారమే అన్నారు.

ఈ వాస్తవాన్ని కూడా దేశపాండే పుస్తకంలో ప్రచురించడం జరిగిందన్నారు. స్టేట్ ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదికలో కూడా మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మాణాన్ని తప్పుపట్టలేదన్నారు. జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాష్, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షులు కె.సీతారామారావు, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశం, సీనియర్ జర్నలిస్టు పి.వేణుగోపాల స్వామి, టీఎన్జీఓ మాజీ అధ్యక్షులు దేవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: డీఎస్ఎం కాలనీ 11కేవీ ఫీడర్ లోధ సబ్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు డీఎస్ఎం, అశోక్‌కాలనీ, సనత్‌నగర్, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం, మెథడిస్ట్ చర్చి లైన్, డీ మార్ట్ ఏరియాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్ సింగ్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా శ్రీముఖి 11కేవీ ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కల్పతరు, బ్రిగాడే అపార్ట్‌మెంట్స్‌లో విద్యుత్ ఉండదన్నారు.

ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోషం



ఫిలింనగర్: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సంతోషం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన ట్రాఫిక్‌గా అడ్మిన్‌గా పనిచేశారు. 2007 బ్యాచ్‌కు చెందిన సంతోషం గతంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా, శామీర్‌పేట ఎస్‌హెచ్‌ఓగా కూడా పనిచేశారు. ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాసులును గోషామహల్‌కు బదిలీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దంటూ అవగాహన



ఫిలింనగర్: బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని, అందువల్ల చెత్త సేకరించే వాహనాలకు నివాసితులు చెత్త ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఇందిరానగర్ బస్తీలో శానిటేషన్ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. చెత్త సేకరించే వాహనానికే చెత్త ఇవ్వాలని, ఒకవేళ వాహనం రాకపోతే వారి నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రజావాణిలో 251 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 251 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 75, విద్యుత్ శాఖకు 23, రెవెన్యూ శాఖకు 46, ప్రవాసి ప్రజావాణికి 05, ఇందిరమ్మ ఇళ్ల కోసం 41 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 61 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద పాలిమర్స్ హబ్‌గా తెలంగాణ

బంజారాహిల్స్: దక్షిణ భారతదేశంలో మన రాష్ట్రం అతిపెద్ద పాలిమర్స్ హబ్ నిలిచిందని తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(టీజీఐఐసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్లాస్టిక్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ప్రముఖ వాణిజ్య సంఘం తెలంగాణ అండ్ ఆంధ్రా ప్లాస్టిక్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (తాప్మా) శుక్రవారం బంజారాహిల్స్ పార్క్ హయత్ హోటల్‌లో పాలిమర్స్ కాన్ఫరెన్స్-2025ను నిర్వహించింది. ఇందులో 'స్మార్ట్, సస్టైనబుల్, స్పెషలైజ్డ్: ప్లాస్టిక్స్ ఇన్నోవేషన్‌లో కొత్త దశ' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 250 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే కాస్మోస్ ఫిలిమ్స్ లిమిటెడ్, కోఫ్లీ ప్రింటింగ్, డీఐసీ ఇండియా లిమిటెడ్, విండ్మోలర్ అండ్ హోల్షెర్ తదితర ప్రముఖ సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. గౌరవ అతిథిగా హాజరైన విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ దక్షిణ భాగంలో రెండో ప్రత్యేక ప్లాస్టిక్స్ పార్కును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. తాము స్థలాన్ని ఖరారు చేసే పనిలో ఉన్నట్లు చెప్పారు. అలాగే ప్రతి జిల్లాలో మహిళా శక్తి ఇండస్ట్రీయల్ హబ్స్ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన వివరించారు. తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ కేంద్రం అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆలిండియా ప్లాస్టిక్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి వెన్నం, తాప్మా అధ్యక్షుడు నరేంద్ర, కాన్ఫరెన్స్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, ప్రతినిధులు ప్రేమ్ కంకారియా, ఏపీపీఎస్ చక్రవర్తి, కమలేష్‌గుప్తా, రాహుల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో..

ప్రభుత్వ స్కూళ్ల సత్తా

- చతికిలపడ్డ ప్రైవేట్ పాఠశాలలు
- నగరంలో ఖైరతాబాద్ మూడో స్థానం
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు



ఎన్బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన టెన్త్ పాస్ అయిన విద్యార్థులు

బంజారాహిల్స్: రెండు రోజుల క్రితం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా అంతగా రాణించలేదు. ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తీర్ణత కూడా మెరుగ్గా కనిపించలేదు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ, నాలుగు మైనార్టీ, రెండు రెసిడెన్షియల్, రెండు ఎయిడెడ్ స్కూళ్లలో ఈసారి పదో తరగతి ఫలితాలు 92 శాతం దాటాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా హైదరాబాద్ జిల్లా పరిధిలోనే అత్యధిక మార్కులు రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థిని హాసిని సాధించింది.

- రాజ్‌భవన్ హైస్కూల్‌లో విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు పెద్ద ఎత్తున సాధించారు. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ 500లకుపైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య ఈ సారి భారీగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన టీచర్లు, ప్రత్యేక తరగతులు ఈసారి ఉత్తీర్ణత శాతం పెరగడానికి దోహదపడ్డాయి.
- ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులతో పాటు విద్యార్థులు ఆకలితో ఉండకుండా అల్పాహారం కూడా అందించారు. ఇది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడింది.
- ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగానే మొన్నటి ఫలితాల్లో కనిపించింది. పేరుకు మాత్రం వందశాతం ఉత్తీర్ణత సాధించామంటూ గొప్పలు పోయినా మార్కుల దగ్గరికి వచ్చేసరికి అంతగా రాణించినట్లు కనిపించలేదు. ప్రతియేడాది ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి తొలగించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టారు.
- ఈ సారి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరతారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత స్కూల్ యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఇవి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడానికి ప్రధాన కారణమని ఉపాధ్యాయులు తెలిపారు.
- మరో వైపు హైదరాబాద్ జిల్లా పరిధిలో 12 జోన్లు ఉండగా ఖైరతాబాద్ జోన్ ఫలితాల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈ జోన్ పరిధిలోని విద్యార్థులు కూడా ఎక్కువగా పది పరీక్షలు రాశారు. మిగతా జోన్లతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య పాటశాలల సంఖ్య ఎక్కువగా ఉన్న ఫలితాలు కూడా ఆ స్థాయిలోనే తీసుకురాగలిగారు.

నగరంలోనే మొదటి స్థానం



విద్యార్థిని హాసిని

బంజారాహిల్స్: రెండు రోజుల క్రితం వెలువడ్డ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థిని హాసిని నిలిచింది. రాజ్‌భవన్ హైస్కూల్‌లో చదువుతున్న హాసిని 574 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్‌గా నిలిచింది. తండ్రి ప్రవీణ్ ఆటో డ్రైవర్ కాగా తల్లి ధనశ్రీ గృహిణి. ఈ సందర్భంగా రాజ్‌భవన్ హైస్కూల్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. తనకు డాక్టర్ కావాలని ఉందని ఈ సందర్భంగా హాసిని తెలిపింది.

ప్రభుత్వ పథకాల్లో 60నుంచి 90 శాతం నిధులు కేంద్రానివే..

– ఎంపీ ఈటల రాజేందర్

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకపోయినా రైల్వే పనులకు నిధులు తామే తీసుకొని వస్తున్నామని, కేంద్రం నిధులు రాష్ట్రం నిధులు అని సంకుచిత వాదులు మాట్లాడతారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై లెటర్ రాస్తే అధికారులు స్పందించకపోతే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ 'జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ 'దిశ' సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. ధనికులు, పేదలకు మధ్య అంతరం పెరుగుతోందని, నిజమైన పేదల పురోభివృద్ధి కోసం కొన్ని స్కీములను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. స్మార్ట్ సిటీ, అమృత నగరాలు, స్వచ్ఛ భారత్ వంటి స్కీములను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని నగరాల అభివృద్ధికి నేరుగా డబ్బులు కేటాయిస్తున్నారని అన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఉద్దేశంతో.. వారికి దిశానిర్దేశం చేయడానికే దిశ సమావేశం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. అనేక స్కీములలో 60 శాతం నుంచి 90 శాతం నిధులు కేంద్రమే ఇస్తోంది.. అయినా రాష్ట్ర ప్రభుత్వ వాటా కేటాయించకపోవడం వల్ల నిధులు ఖర్చు చేయలేకపోతున్నారని అన్నారు. కేంద్రం స్ఫూర్తి అర్థం చేసుకోవాలని అధికారులను కోరుతున్నామని వారు అన్నారు.

- కార్యక్రమంలో భాగంగా చింతల రాంచంద్రారెడ్డి పలు అంశాలను ప్రస్తావించారు.
- రోడ్డు నంబర్-46లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం ఎందుకు పూర్తి చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై స్పష్టత కావాలన్నారు.
- జూబ్లీహిల్స్ డివిజన్ పరిధి ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్ ప్రాంతంలో రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, వెంటనే ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.
- ఒక్కో నియోజకవర్గంలో నాలుగు వేల ఇళ్లు ఇస్తామన్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇళ్లపై ప్రణాళికలు రూపొందించారా లేదా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.
- ముద్రా లోన్స్ ఎంతమందికి ఇచ్చారు..? ఎంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని ప్రశ్నించారు. అర్హులైన చిరువ్యాపారులు, వ్యాపారస్తులకు ముద్రా లోన్లు ఇవ్వాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా ముద్రా లోన్లు ఎన్ని ఇచ్చారో చెప్పాలన్నారు.
- గోదావరి ఫేజ్-1, 2 తాగునీటి రిజర్వాయర్లు మనకు సరిపోవడం లేదు. గ్రావిటీతో జీహెచ్ఎంసీ నీటి సరఫరా చేస్తే ఎలా ఉంటుందో ఆలోచన చేయాలని సూచించారు. అలాగే మంజీరా నీరు కూడా ప్రజలకు ప్రతిరోజూ అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు.

లబ్ధిదారుడి ఇంట్లో భోజనం



శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమని కార్పొరేటర్ వనం సంగీత అన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో ప్రభుత్వం రేషన్‌దారులకు అందిస్తున్న సన్న బియ్యం పంపిణీలో పాల్గొని శుక్రవారం రేషన్ అందించారు. స్థానిక లబ్ధిదారుడి ఇంట్లో సన్నబియ్యం రుచిని ఆస్వాదించారు. నేతలు శ్రీనివాసయాదవ్, మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్, మాజిద్, గని, నాగరాజు, శరత్‌గౌడ్, జావీద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రైస్ అని భ్రమపడొద్దు

ఫిలింనగర్: ప్రభుత్వం రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో క్వింటాల్ రైస్‌కు కిలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కలుపుతోందని, కొంత మంది అవి ప్లాస్టిక్ రైస్ అని భ్రమపడుతున్నారని, అది పౌష్టికాహారమని టీపీసీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. ఫిలింనగర్ దుర్గాభవానీనగర్ బస్తీలో రేషన్ షాపులో ఆమె సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికంగా ఉన్న మహిళలకు బియ్యంలో వచ్చే ఫోర్టిఫైడ్ రైస్ గురించి అవగాహన కల్పించారు. బియ్యాన్ని నీళ్లలో వేయగానే తేలియాడే కొన్ని గింజలను ప్లాస్టిక్ రైస్ అనుకొని పారేస్తున్నారని, అలా చేయవద్దని సూచించారు. రేషనింగ్ ఆఫీసర్ శంకర్, రేషన్ డీలర్ రాంమోహన్, బస్తీ అధ్యక్షుడు ఆర్.ఎల్లయ్య పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- దేశ పౌరుల్ని చంపే హక్కు కేంద్రానికి ఎవరిచ్చారు?
- న్యాయస్థానాలు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టాలి
- వామపక్షాల రాష్ట్ర సదస్సులో పలువురు వక్తల డిమాండ్



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

హిమాయత్‌నగర్: కగార్ ఆపరేషన్ పేరుతో రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మానవ సంహారాన్ని తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సు వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సదస్సు జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర దేశాలతో యుద్ధం జరిగే క్రమంలో కూడా యుద్ధనీతి ఉంటుందని, దేశ పౌరులైన మావోయిస్టులను తేదీ, సమయం నిర్దేశించి చంపేస్తామని ప్రకటించే హక్కు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఘటనలను న్యాయస్థానాలు సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బీజేపీది రాక్షస మనస్తత్వం కలిగిన ప్రభుత్వం అన్నారు. అధికారంలో ఉన్న వారికి మానవత్వం లేదా, యుద్ధంలో ఒకరు ఆయుధాన్ని కిందపడేసి శాంతిని కోరుకుంటున్నామంటే అతడిని చంపుతారా, అది ధర్మామా చెప్పాలని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో శాంతి నెలకొనకపోగా, చర్యకు ప్రతి చర్య ఉంటుందన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హత్యలతో గతంలోనే స్పష్టమైందనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్రామయ్య, సీపీఐ ఎంఎల్ మాస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.జి.రాంచందర్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఆర్.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి ఎ.జానకిరాములు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రాజా రమేష్, ఎస్.యు.సి.ఐ(కమ్యూనిస్టు) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.మురహరి, సీపీఐ న్యూడెమోక్రసీ నాయకులు విశ్వనాథ్, అరుణోదయ నాయకురాలు విమలక్క ప్రసంగించారు.

వైభవంగా ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు

బంజారాహిల్స్: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆవరణలోని శివాలయంలో శుక్ల యజుర్వేద కాణ్వ శాఖ హవనం వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శ్రీవిజయ శంకర దేశిక ట్రస్ట్ వేద పాఠశాల సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా జగద్గురు శంకర భగవత్పాద పూజ, వేద స్వస్తి పూజలు నిర్వహించినట్లు వేద పండితులు జ్యోతిశ్చంద్ర శర్మ తెలిపారు. చిర్రావూరి శివరామకృష్ణ వేదార్థోపన్యాసంలో 50 మందికి పైగా వేద పండితులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.శ్రీనివాస శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు మురళీధర శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మున్సిపల్ చాంబర్స్‌లో అగ్ని ప్రమాదం

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ చాంబర్స్ భవనంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కార్యాలయంలోని ఫర్నిచర్, ఫైల్స్, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సమాచారం అందడంతో మున్సిపల్ చాంబర్ రాష్ట్ర చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రాత్మకమైన ఈ భవనం అగ్ని ప్రమాదం సంభవించడం బాధాకరం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భవన మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

రేకుల ఇళ్లలో.. కాలం గడుపుతున్నాం



ఎమ్మెల్సీ కవితకు వినతి పత్రం అందజేస్తూ..

ఫిలింనగర్: ఫిలింనగర్ దుర్గాభవానీనగర్‌లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు శాశ్వత ఇళ్లు నిర్మించేలా చొరవ తీసుకోవాల్సిందిగా బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి విజ్ఞప్తి చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందజేశారు. దాదాపు 150 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయని, బస్తీ అభివృద్ధికి కూడా నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న రేకుల గదుల్లో ఉంటూ ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నామని అన్నారు. తమ కాలనీ అభివృద్ధితో పాటు తాము సౌకర్యవంతంగా నివసించేలా శాశ్వత ఇళ్లు నిర్మించి ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కవితను కలిసిన వారిలో బస్తీ అధ్యక్షుడు వి.గౌడు నాయక్, ప్రధాన కార్యదర్శి జానీనాయక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాల కూల్చివేత



ఎమ్మెల్యే కాలనీలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. కొంతకాలంగా ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. కాగా పలువురు ప్లాట్ల యజమానులు తమ ఇళ్ల వెనుక ఉన్న స్థలాలను ఆక్రమించి స్విమ్మింగ్ పూల్స్, గార్డెన్స్, సర్వెంట్ రూమ్స్ తదితర నిర్మాణాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించినట్లు గుర్తించిన అధికారులు పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా ఇళ్ల యజమానులు, అధికారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేతలు చేపడతారంటూ కొంత మంది వాదించగా, కోర్టు స్టే ఆర్డర్స్ ఉన్నాయంటూ మరికొంతమంది గొడవకు దిగారు. తమకు 2017లోనే 489 గజాల స్థలాన్ని ప్రభుత్వం నుంచి జీఓ 59 కింద క్రమబద్ధీకరణ చేస్తున్నామని, 245 గజాల స్థలం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నా.. రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారని విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కరీముల్లా ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో స్టే ఉన్నప్పటికీ రెవెన్యూ సిబ్బంది కూల్చారని ఆరోపించారు.



ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన గార్డెన్లు, నిర్మాణాలను చూపిస్తున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి

హిందీ ప్రచారసభ వార్షికోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



హిమాయత్‌నగర్: హిందీ ప్రచారసభ హైదరాబాద్ స్థాపించబడి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల చివరి వారంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న 90వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ శుక్రవారం హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆహ్వాన పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పూలమొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రచారసభ ప్రతినిధులు జె.వెంకటరామ్, నరసింహారెడ్డి, శృతికాంత్ భారతి, కె.రామచందర్, ఏకే రాజు, శివలింగం పాల్గొన్నారు.

మూడేళ్లలో సినిమా రంగంలో ఎన్నో మార్పులు



వెంగళరావునగర్: రానున్న మూడేళ్లలో సినిమా రూపురేఖలు మారనున్నాయని, ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు తెలిపారు. యూసుఫ్‌గూడలోని తెలుగు సినీ, టీవీ డిజిటల్ వెబ్ సిరీస్ ఔట్‌డోర్ లైట్‌మెన్ యూనియన్ మీటింగ్ హాల్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం యూనియన్ నేతలతో మాట్లాడుతూ ఇండస్ట్రీలో లైట్‌మెన్ పని చాలా ముఖ్యమైందన్నారు. రానున్న రోజుల్లో టెక్నాలజీకి అనుగుణంగా పని చేస్తూ సినిమా ఇండస్ట్రీ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. కార్మికులకు సినిమా ఇండస్ట్రీ ఎల్లవేళలా సహకారం అందిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఫిలింఛాంబర్ ఫెడరేషన్ అధ్యక్షుడు వి.అనిల్‌కుమార్, జనరల్ సెక్రటరీ అమ్మిరాజుతో పాటు లైట్‌మెన్ యూనియన్ అధ్యక్షుడు సీసీ.శ్రీను, ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు సోమశేఖర్, శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, నాగశ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వెంకటేష్, తిరుమల్‌రెడ్డి, కోశాధికారి ఈశ్వర్‌రెడ్డి, ఈసీ మెంబర్లు, లైట్‌మెన్ సభ్యులు, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4వ తేదీన రవీంద్రభారతిలో అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీసగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలకు కేవలం సగర కులస్తులే కాకుండా యావత్ బీసీలు పాల్గొని మన ఐక్యత చాటాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాల పోస్టర్‌ను తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, సగర ఆత్మగౌరవ భవనం చైర్మన్ ఎ.మారుతి సాగర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మన జాతి కోసం పనిచేయని అగ్రకులాల నాయకుల జయంతులను బీసీలు దగ్గరుండి నిర్వహిస్తారని, మన జాతికి వన్నెతెచ్చిన, మన జాతి గౌరవాన్ని ఆకాశానికి ఎత్తిన నాయకుడి జయంతి ఉత్సవాలకు భారీగా తరలివచ్చి బీసీల ఐక్యత చూపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సగర ఉప్పరుల జనాభా ఏడున్నర లక్షలు ఉన్నా, కేవలం అర శాతం సుమారు లక్షన్నర జనాభా ఉన్న వెలమలు 8 మంది ఎమ్మెల్యేలు, 4 శాతం జనాభా ఉన్న రెడ్డి కులస్తులు 43 మంది ఎమ్మెల్యేలు ఉంటే సగర కులస్తులు ఒక్క ఎమ్మెల్యే లేకపోవడం, కనీసం నామినేటెడ్ పోస్టుల్లో కూడా లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బాలగోని బాలరాజ్ గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, సంఘం మహిళా నాయకురాలు తంగడపల్లి పల్లవి సగర, ఆంజనేయులు, కె.పి.రాములు, జయమ్మ పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలనూ పట్టించుకోవడం లేదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ శ్రీవెంకటేశ్వర హౌస్ బిల్డింగ్ సొసైటీ నుంచి 30 ఏళ్ల క్రితం స్థలం కొనుగోలు చేశామని, ఈ స్థలం తమ ఆధీనంలో ఉందని రెవెన్యూ అధికారులు తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విశ్రాంత చీఫ్ ఇంజినీర్ కరీముల్లా ఆరోపించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్- 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయితే రెవెన్యూ అధికారులు ఈ తీర్పును పట్టించుకోకుండా ఫెన్సింగ్ వేస్తున్నారని ఆరోపించారు. జీఓ 59 కింద 489 గజాల స్థలం క్రమబద్ధీకరించుకున్నామని, దాన్ని కూడా ప్రభుత్వ స్థలమంటూ కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉన్నతాధికారులను, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.



ప్రస్తుతం ప్రపంచం మొత్తం హైదరాబాద్‌ వైపే చూస్తోంది. మరి కొద్ది రోజుల్లో నగర వేదికగా ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక మిస్‌ వరల్డ్‌ పోటీల నేపథ్యంలో హైదరాబాద్‌ విశిష్టత విశ్వవ్యాప్తం కానుంది. ఈ నేపథ్యంలో దేశానికే తలమానికమైన భాగ్యనగరాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 10 నుంచి 31వ తేదీ వరకూ జరగనున్న 72వ మిస్‌ వరల్డ్‌–2025 పోటీల్లో భాగంగా తెలంగాణ ప్రత్యేకతలను ప్రపంచానికి తెలిపేలా, అంతర్జాతీయంగా తెలంగాణకు బ్రాండ్‌ ఇమేజ్‌ పెంచేలా కార్యాచరణ సిద్ధం చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే 7వ తేదీ నుంచే సన్నాహక కార్యక్రమాలు ప్రారంభం కానుండగా 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ మిస్‌ వరల్డ్‌ పోటీల కంటెస్టెంట్లు హైదరాబాద్‌ చేరుకోనున్నారు. ఇందులో భాగంగా మిస్‌ వరల్డ్‌ చైర్‌పర్సన్‌, సీఈఓ జూలియా ఎవెలిన్‌ మోర్లీ శుక్రవారం నగరంలోని రాజీవ్‌ గాంధీ ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోగా.. వారికి ఘన స్వాగతం పలికారు.జూలియాతో పాటు విచ్చేసిన మిస్‌ వరల్డ్‌ అధికారిణి కెర్రీ ఇతర అధికారులకు భారతీయ సంప్రదాయం పద్ధతిలో ఘన స్వాగతం పలికారు.

– సాక్షి, సిటీబ్యూరో

- అంతర్జాతీయ యవనికపై తెలంగాణ బ్రాండ్‌ ఇమేజ్‌ పెంచేలా..
- హైదరాబాద్‌లో మే 7 నుంచి 31 వరకూ వేడుకగా పోటీలు
- తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటక, ఆధ్యాత్మిక, మెడికల్‌, సేఫ్టీ టూరిజాన్ని తెలియజేసేలా ప్రణాళికలు
- తెలంగాణ గ్రోత్‌ స్టోరీ ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక థీమ్స్‌, టూరిస్ట్‌ సర్క్యూట్స్‌

అందాల ఆతిథ్యం.. అంతర్జాతీయ గౌరవం..







సుమారు 120 దేశాల నుంచి కంటెస్టెంట్‌లు పాల్గొననున్న ఈ మెగా ఈవెంట్‌ను సువర్ణ అవకాశంగా మలుచుకొని రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. 'ప్రపంచం కళ్లన్నీ తెలంగాణవైపే!' అనే స్లోగన్‌తో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి, చరిత్ర, పర్యాటక ఆకర్షణలు, మెడికల్‌, సేఫ్టీ టూరిజం, తెలంగాణ గ్రోత్‌ స్టోరీ, ఇతర ప్రత్యేకతలు ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక థీమ్స్‌, టూరిస్ట్‌ సర్క్యూట్లు రూపొందించారు. ఇందులో భాగంగా మిస్‌ వరల్డ్‌–2025 కార్యక్రమం ప్రయాణ ప్రణాళికలు, వేదికలను తెలంగాణతో పాటు హైదరాబాద్‌ నగరంలో ప్రత్యేకంగా రూపొందించారు.

నగర వేదికగా మిస్‌ వరల్డ్‌ థీమ్స్‌, టూరిస్ట్‌ సర్క్యూట్స్‌..

హైదరాబాద్‌ హెరిటేజ్‌ వాక్‌.. (మే 12న..)
హైదరాబాద్‌ సాంస్కృతిక వారసత్వం, గొప్పదనం ప్రపంచానికి తెలియజేసేలా నగరంలోని చారిత్రాత్మక ఆనవాలైన చార్మినార్‌, లాడ్‌ బజార్‌లలో ప్రత్యేకంగా 'హెరిటేజ్‌ వాక్‌' నిర్వహిస్తారు.

చౌమహల్లా ప్యాలెస్‌ సందర్శన.. (మే 13న..)
నగరానికే తలమానికమైన చౌమహల్లా ప్యాలెస్‌ సందర్శిస్తారు. అక్కడ లైవ్‌ మ్యూజిక్‌ కాన్సర్ట్‌ను తిలకిస్తారు.

ఎక్స్పీరియం ఎకో పార్క్‌ సందర్శన.. (మే 16న..)
గ్రూప్‌–2 మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లు మే 16 సాయంత్రం.. హైదరాబాదు నగరానికే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఎక్స్పీరియన్‌ ఎకో పార్కును సందర్శిస్తారు.

మెడికల్‌ టూరిజం పై పరిచయం.. (మే 16న..)
వివిధ దేశాల నుంచి రోగులను ఆకర్షించే ఉద్దేశంతో మెడికల్‌ టూరిజాన్ని సైతం పరిచయం చేయనున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్‌ టూరిజం ఈవెంట్‌కు గ్రూప్‌–1 మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లు హాజరవుతారు. హైదరాబాద్‌లోని ఆధునిక ఆస్పత్రుల ప్రత్యేకతలను వారికి వివరిస్తారు.

ఘనంగా గ్రాండ్‌ ఫినాలే..
మే 22న నిర్వహించే మిస్‌ వరల్డ్‌ టాలెంట్‌ ఫినాలేలో.. 23న హెచ్‌ 2 హెచ్‌ ఛాలెంజ్‌ ఫినాలేలో కంటెస్టెంట్లు పాల్గొంటారు. 24న మిస్‌ వరల్డ్‌ టాప్‌ మోడల్‌, ఫ్యాషన్‌ ఫినాలే – జ్యువెలరీ/పెర్ల్‌ గది షో మిస్‌ వరల్డ్‌ టాప్‌ మోడల్‌, ఫ్యాషన్‌ ఫినాలే కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. 26న బ్యూటీ విత్‌ ఫ్యాషన్‌ కాంటెస్ట్‌ నిర్వహిస్తారు. చివరగా 31వ తేదీన మిస్‌ వరల్డ్‌ గ్రాండ్‌ ఫినాలే నిర్వహిస్తారు. ఇవే కాకుండా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని నాగార్జునసాగర్‌, బౌద్ధవనం ప్రాజెక్టు, వరంగల్‌ వెయ్యి స్థంభాల గుడి, వరంగల్‌ పోర్ట్‌, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయం, ప్రతిష్టాత్మక యాదగిరి గుట్ట దేవాలయం తదితర ప్రదేశాలను సందర్శిస్తారు.

మిస్‌ వరల్డ్‌ ఆటల తుది పోటీలు.. (మే 17న..)
మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లు గచ్చిబౌలి ఇండోర్‌ స్టేడియంలో నిర్వహించే మిస్‌ వరల్డ్‌ స్పోర్ట్స్‌ ఫైనల్‌ పోటీల్లో పాల్గొంటారు.

రామోజీ ఫిలిం సిటీ సందర్శన.. (మే 17న..)
ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్‌ సిటీలో ఒకటిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌ సిటీని మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్లు సందర్శిస్తారు.

సేఫ్టీ టూరిజం.. (మే 18న..)
మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లు తెలంగాణ పోలీస్‌ ఇంటిగ్రేటెడ్‌ కమాండ్‌ అండ్‌ కంట్రోల్‌ సెంటర్‌ను సందర్శించి తెలంగాణ ప్రభుత్వం పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వం సేఫ్టీ టూరిజం ఇనీషియేటివ్‌ను పరిశీలిస్తారు.

సచివాలయ సందర్శన.. (మే 18న..)
మిస్‌ వరల్డ్‌ కంటెస్టెంట్‌లకు అధికారులు తెలంగాణ రాష్ట్ర గ్రోత్‌ స్టోరీ, చరిత్రను తెలియజేస్తారు. ట్యాంక్‌ బండ్‌ పైన ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే సండే ఫండే కార్నివాల్‌ను కూడా సందర్శిస్తారు.

ఐపీఎల్‌ మ్యాచ్‌కు హాజరు.. (మే 20 లేదా 21..)
ఉప్పల్‌లోని రాజీవ్‌ గాంధీ ఇంటర్నేషనల్‌ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్‌ మ్యాచ్‌కు గ్రూప్‌–1 కంటెస్టెంట్లు హాజరవుతారు.

తెలంగాణ కళాకారులచే ఆర్ట్స్‌, క్రాఫ్ట్స్‌ వర్క్‌ షాప్‌.. (మే 21న..)
గ్రూప్‌–2 కంటెస్టెంట్లు శిల్పారామంలో తెలంగాణ కళాకారులచే నిర్వహించే ఆర్ట్స్‌, క్రాఫ్ట్స్‌ వర్క్‌ షాప్స్‌కు హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు.



నగరానికి మిస్‌వరల్డ్‌ లిమిటెడ్‌ సీఈఓ జూలియా మోర్లి

శంషాబాద్‌: హైదరాబాద్‌ నగరంలో త్వరలో 2025 మిస్‌వరల్డ్‌ పోటీలు జరగనుండటంతో ఇప్పటికే అతిథుల రాక మొదలైంది. శుక్రవారం ఉదయం మిస్‌వరల్డ్‌ లిమిటెడ్‌ సీఈఓ జూలియా మోర్లి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా శంషాబాద్‌ విమానాశ్రయంలో ఆమెకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆమెకు పూలమాల వేసి తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఆమెతో పాటు మిస్‌వరల్డ్‌ అధికారి కెర్రి తదితరులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే వెల్‌నెస్‌..

సికారా క్లినిక్స్‌ ఆధ్వర్యంలో గ్లామ్‌ సోరీ



సాక్షి, సిటీబ్యూరో: వెల్‌నెస్‌ అనేది ఆత్మవిశ్వాసంతోనే ప్రారంభమవుతుందని ప్రముఖ సినీ నటి పూనమ్‌ కౌర్‌ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌ సికారా క్లినిక్స్‌లో శుక్రవారం నిర్వహించిన గ్లామ్‌ సోరీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సికారా క్లినిక్స్‌ సైన్స్‌–అందం సమ్మిళితంగా నిలుస్తుందని, ఈ కార్యక్రమం ఈ తరం వ్యక్తులను శక్తిమంతం చేయడం పట్ల వారి నిబద్ధతను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా జీఎస్‌టీ అసిస్టెంట్‌ కమిషనర్‌ శ్రీలీల పాల్గొని మహిళల నేతృత్వంలోని వ్యవస్థాపకతకు, వేగంగా అభివృద్ధి చెందుతున్న వెల్‌నెస్‌ పరిశ్రమకు సికారా క్లినిక్స్‌ చేసిన అసాధారణ సహకారాన్ని ప్రశంసించారు.

షారన్‌కు మిస్‌ ఇంటర్నేషనల్‌ క్లాసిక్‌ కిరీటం

థాయ్‌లాండ్‌ గ్రాండ్‌ ఇండి రాయల్‌ ఫైనల్‌లో కిరీటం గెలుచుకున్న నగరవాసి..



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన షారన్‌ కార్మెల్‌ ఫెర్నాండెజ్‌ థాయ్‌లాండ్‌ పట్టాయా గార్డెన్‌ క్లిఫ్‌ రిసార్ట్‌– స్పా వేదికగా జరిగిన గ్రాండ్‌ ఇండి రాయల్‌ ఫైనల్‌లో మిస్‌ ఇంటర్నేషనల్‌ క్లాసిక్‌– 2025 కిరీటాన్ని దక్కించుకున్నారు. ఇండి రాయల్‌ మిస్‌, మిసెస్‌ ఇంటర్నేషనల్‌ సీజన్‌ 10లో భాగంగా 'ది పవర్‌ ఆఫ్‌ ది క్రౌన్‌' థీమ్‌తో ఈవెంట్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా షారన్‌ కార్మెల్‌ ఫెర్నాండెజ్‌ మాట్లాడుతూ.. ఈ కిరీటం తనకు చాలా ప్రత్యేకమని, భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం గౌరవంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తమ కంఫర్ట్‌ జోన్‌ నుంచి బయటకు వచ్చి ఎదగడానికి సాహసించే ప్రతి మహిళకూ నిదర్శనమన్నారు. న్యాయ పరిపాలన నుంచి ఆరోగ్య సంరక్షణ వరకూ వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇరవై మందికి పైగా ఫైనలిస్టులు ఈ ప్రతిష్టాత్మక టైటిల్స్‌ కోసం పోటీపడ్డారు. అందం, వాక్చాతుర్యం, స్ఫూర్తిదాయకమైన ప్రయాణంతో షారన్‌ ఈ కిరీటం అందుకున్నారు.

తెలుగులో ఆకాష్‌ యూట్యూబ్‌ చానల్‌..

నీట్‌, జేఈఈ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి వినూత్న వేదిక

సాక్షి, సిటీబ్యూరో : 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు, ముఖ్యంగా నీట్‌, జేఈఈ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి విద్య–శిక్షణ సేవలందించడానికి ఆకాష్‌ ఎడ్యుకేషనల్‌ సర్వీసెస్‌ ఆధ్వర్యంలో తెలుగు భాషలో ప్రత్యేకంగా యూట్యూబ్‌ చానల్‌ ప్రారంభించారు. ఈ నూతన వేదిక విద్యార్థులకు వారి ప్రాంతీయ భాషలో అధిక–నాణ్యత విద్యా సామాచారాన్ని అందిస్తుందని ఆకాష్‌ చీఫ్‌ అకడమిక్‌ హెడ్‌ ధీరజ్‌ కుమార్‌ మిశ్రా తెలిపారు. కోర్‌ సబ్జెక్టులను నేర్చుకోవడంలో, అధునాతన విద్యను అభ్యసించడంలో భాష ఎప్పుడూ అడ్డంకి కాకూడదని, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు విద్యా పరమైన సేవలను అందించడానికి ఈ యూట్యూబ్‌ చానల్‌ ప్రారంభించనట్లు పేర్కొన్నారు. ఈ వేదిక విద్యార్థులు జాతీయ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు వారి సొంత భాషలో నేర్చుకోడానికి తోడ్పాటునందిస్తుంది. ఇందులో 8–12 తరగతుల కోసం తెలుగులో ప్రత్యేక సెషన్‌లు ఉంటాయని వివరించారు. ఔత్సాహిక విద్యార్థులు https:// www. youtube. com/ @OfficialAakashtelugu లింక్‌లో నీట్‌, జేఈఈ సేవలు పొందవచ్చు.

బ్రెయిన్‌ ట్రైనింగ్‌ ల్యాబ్‌

దేశంలో మొట్టమొదటి స్పోర్ట్స్‌

వోక్సెన్‌ స్పోర్ట్స్‌ అకాడమీ-సిక్స్‌ ఎస్‌ స్పోర్ట్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు



సాక్షి, సిటీబ్యూరో: నగర వేదికగా ప్రపంచ స్థాయి విద్యతో పాటు అత్యుత్తమ క్రీడా శిక్షణ అందించడమే లక్ష్యంగా వోక్సెన్‌ స్పోర్ట్స్‌ అకాడమీ, సిక్స్‌ ఎస్‌ స్పోర్ట్స్‌ ప్రారంభమైంది. నగరంలోని హోటల్‌ తాజ్‌ డెక్కన్‌ వేదికగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వోక్సెన్‌ స్పోర్ట్స్‌ అకాడమీ, సిక్స్‌ ఎస్‌ స్పోర్ట్స్‌ ప్రారంభించారు. ఇందులో ప్రముఖ జాతీయ బ్యాడ్మింటన్‌ కోచ్‌ పుల్లెల గోపీచంద్‌, భారత మాజీ క్రికెటర్‌, మాజీ చీఫ్‌ సెలెక్టర్‌ ఎమ్మెస్కే ప్రసాద్‌, వరల్డ్‌ అథ్లెటిక్స్‌ పతక విజేత అంజు బాబీ జార్జ్‌ తదితరలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వోక్సెన్‌ యూనివర్సిటీ వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ రాల్‌ రోడ్రిగ్జ్‌ మాట్లాడుతూ.. అథ్లెట్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ కోసం విద్యా సంస్థలు క్రీడలను అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలకు అతీతంగా కెరీర్‌ మార్గాలను నిర్మించడానికి వోక్సెన్‌ యూనివర్సిటీ విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. దేశంలోని అథ్లెట్ల నిర్మాణాత్మక పరివర్తనకు అంతర్జాతీయ ప్రాముఖ్యత ఉందని సిక్స్‌ ఎస్‌ స్పోర్ట్స్‌ ఆంటోనీ చాకో తెలియజేశారు. అనంతరం తన క్రీడా జీవితంలో ఎదురైన అనుభవాలను వరల్డ్‌ అథ్లెటిక్స్‌ పతక విజేత అంజు బాబీ జార్జ్‌ పంచుకున్నారు. వోక్సెన్‌ స్పోర్ట్స్‌ అకాడమీ– సిక్స్‌ ఎస్‌ స్పోర్ట్స్‌లో ఆధునిక స్పోర్ట్స్‌ సైన్స్‌ సెంటర్‌, అథ్లెట్ల కోసం దేశంలోనే తొలి బ్రెయిన్‌ ట్రైనింగ్‌ ల్యాబ్‌, ఏఐ ఆధారిత స్పోర్ట్స్‌ ఇంటెలిజెన్స్‌ ప్లాట్‌ ఫామ్స్‌, స్పోర్ట్స్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీలో రీసెర్చ్‌, విద్య–క్రీడల్లో డ్యూయల్‌ కెరీర్‌ మార్గాలకు అవసరమైన నిర్మాణాత్మక ప్రణాళికలు వంటి పలు ప్రత్యేకతలున్నాయి.

ఆనందమే అందానికి వేదిక..

ఆటమ్న్‌ సెలూన్‌లో నటి డింపుల్‌ హయాతి సందడి





సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని నూతన ఆటమ్న్‌ సెలూన్‌ వేదికగా అందాలు నటి డింపుల్‌ హయాతి సందడి చేశారు. హెయిర్‌ బ్యూటీ, నెయిల్‌ సర్వీసులతో సౌందర్య సేవలందించే ఆటమ్న్‌ సెలూన్‌ నూతన బ్రాంచ్‌ను నిజాంపేట్‌లో నటి డింపుల్‌ హయాతి, బిజినెస్‌ హెడ్‌, కో–ఫౌండర్‌ శ్రీధర్‌ శుక్రవారం ప్రారంభించారు. 6 తన లక్కీ నెంబర్‌ అని, ఆటమ్న్‌ సెలూన్‌ 6వ బ్రాంచ్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఎల్లప్పుడూ ఆనందంగా ఉండటమే మోస్ట్‌ బ్యూటీఫుల్‌ థింగ్‌ అని ఆమె అన్నారు. త్వరలో మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాని పేర్కొన్నారు. హెయిర్‌ బ్యూటీ, బ్రైడల్‌, నెయిల్‌ ఆర్ట్‌ వంటి విభిన్న సేవలను నిపుణులతో అందిస్తున్నట్లు ఆటమ్న్‌ సెలూన్‌ కో–ఫౌండర్‌ శ్రీధర్‌ బాబు తెలిపారు. ఆధునిక హెయిర్‌ కట్స్‌, అధునాతన హెయిర్‌ ట్రీట్మెంట్స్‌ వంటి సేవలను నగరానికి పరిచయం చేస్తున్నట్లు వివరించారు.

సాక్షి రియల్టీ
శనివారం
3-05-2025



అనుకున్న సమయానికే..

గృహ ప్రవేశం

గడువులోగా భవన నిర్మాణాలు పూర్తి చేస్తున్న నిర్మాణదారులు

గడువులోగా భవన నిర్మాణాలను పూర్తి చేసి, గృహ కొనుగోలుదారులకు అందజేయడంలో దక్షిణాది నగరాలలో హైదరాబాద్ ముందంజలో నిలిచింది. గ్రేటర్‌లో 2024-25లో ఆర్థిక సంవత్సరంలో 57,304 యూనిట్లు డెలివరీ అయ్యాయి. 2023-24లో డెలివరీ అయిన 35,641 ఇళ్లతో పోలిస్తే ఏడాది కాలంలో 61 శాతం వృద్ధి రేటు నమోదైంది. ఇదే సమయంలో బెంగళూరులో 46,103, చెన్నైలో 19,650 యూనిట్లు డెలివరీ అయ్యాయి.

– సాక్షి, సిటీబ్యూరో

- యూనిట్ల డెలివరీలో హైదరాబాద్ టాప్
- దక్షిణాది నగరాలతో పోలిస్తే మన దగ్గరే అత్యధికం
- ఏడాదిలో కస్టమర్లకు 57,304 ఇళ్ల అందజేత
- అంతకుక్రితం ఏడాదితో పోలిస్తే 61 శాతం ఎక్కువ
- 81 వేల యూనిట్ల డెలివరీతో తొలి స్థానంలో పుణె

మార్చితో ముగిసిన 2025 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని తొమ్మిది నగరాలలో 4,06,889 యూనిట్లు డెలివరీ అయ్యాయని ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడించింది. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరం(2023-24)లో డెలివరీ అయిన 3,06,600 యూనిట్లతో పోలిస్తే ఏడాది కాలంలో డెలివరీలో 33 శాతం వృద్ధి నమోదైంది. గడువులోగా గృహాల అందజేతలో అత్యధికంగా పశ్చిమాది నగరాల వాటా 55 శాతంగా ఉంది. గత మూడు ఆర్థిక సంవత్సరాలలో 10 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, గడువులోగా కస్టమర్లకు అందజేశారు.

ఒక్క ఢిల్లీలోనే క్షీణత..

గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ వెనకబడి ఉంది. 2023-24 ఫైనాన్షియల్ ఇయర్‌తో పోలిస్తే 2024-25లో ఈ నగరంలో యూనిట్ల డెలివరీలో 8 శాతం క్షీణత నమోదైంది. అత్యధికంగా కోల్‌కతాలో, అత్యల్పంగా ముంబైలో గృహాలు డెలివరీ అయ్యాయి. ఏడాది కాలంలో కోల్‌కతాలో 88 శాతం, ముంబైలో 22 శాతం వృద్ధి నమోదైంది.

డెలివరీలో వేగవంతం..

2018-19 మధ్య కాలంలో లాంచింగ్ అయిన ప్రాజెక్టులు 2025 ఆర్థిక సంవత్సరంలో డెలివరీ దశకు చేరుకున్నాయి. కరోనా మహమ్మారి కాలంలో లాక్‌డౌన్, ప్రయాణాలపై ఆంక్షలు, కార్మికుల వలసలు తదితర కారణాలతో భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగాయి. రెండేళ్లుగా సానుకూల మార్కెట్ సెంటిమెంట్లు, నగదు ప్రవాహం పెరగడంతో పాటు నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు స్పెషల్ విండో ఫర్ అఫర్డబుల్ అండ్ మిడ్ ఇన్‌కం హౌసింగ్(ఎస్‌డబ్ల్యూఏఎంఐహెచ్) ఫండ్ లభ్యత తదితర కారణాలతో నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. దీంతో పాటు రెరాలో నమోదైన ప్రాజెక్టులు గడువులోగా పూర్తి చేయాలనే పలు కఠిన నిబంధనలతో డెవలపర్లు ప్రాజెక్ట్ డెలివరీపై దృష్టిసారించారు. దీంతో 2025 ఆర్థిక సంవత్సరంలో కస్టమర్లకు గృహాల డెలివరీ పెరిగాయి.

నగరాల వారీగా యూనిట్ల డెలివరీ:

నగరం	2023-24	2024-25	వృద్ధి (శాతం)
కోల్‌కతా	9,441	17,718	88
హైదరాబాద్	35,641	57,304	61
చెన్నై	13,148	19,650	49
పుణె	58,049	81,563	41
థానే	55,479	77,017	39
నవీ ముంబై	15,415	21,112	37
బెంగళూరు	36,568	46,103	26
ముంబై	34,471	41,999	22
ఢిల్లీ-ఎన్‌సీఆర్	48,388	44,423	-8

గ్రేటర్‌లో ఇదీ పరిస్థితి..

హైదరాబాద్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 71 వేల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 35 వేలు ప్రైమరీ, 36 వేలు సెకండరీ యూనిట్లు ఉన్నాయి. అదే 2018-19లో మొత్తం 63 వేల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో ప్రైమరీ 29 వేలు, సెకండరీ యూనిట్లు 34 వేలు ఉన్నాయి. 2018-19లో ప్రైమరీ యూనిట్ల వాటా 46 శాతం కాగా.. సెకండరీ యూనిట్ల వాటా 54 శాతంగా ఉంది. అదే 2024-25లో ప్రైమరీ యూనిట్ల వాటా 49 శాతం కాగా.. సెకండరీ యూనిట్ల వాటా 51 శాతంగా ఉంది.





సెకండ్.. సో బెటర్

- కరోనాతో పెరిగిన ఇంటి అవసరం
- సెకండ్ హ్యాండ్ హోమ్స్‌కు గిరాకీ
- మంచి ప్రాంతం, మౌలిక వసతులుంటే కొనడం ఉత్తమం
- 38 శాతం నుంచి 43శాతానికి పెరిగిన రీ సేల్ ప్రాపర్టీల వాటా

ఐటీ కారిడార్ సమీప ప్రాంతాల్లోని ఇళ్లకు అధిక డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తి రంగానికి ప్రత్యేకించి గృహ విభాగానికి కరోనా మహమ్మారి బూస్ట్‌లా బలానిచ్చింది. హోం ఐసోలేషన్, వర్క్ ఫ్రం హోమ్ వంటి కారణంగా సొంతింటి అవసరం తెలిసి రావడంతో నివాస విభాగం శరవేగంగా అభివృద్ధి చెందింది. దీంతో కోవిడ్ తర్వాత కొత్త ఇళ్లకే కాదు రీసేల్ ప్రాపర్టీలకూ గిరాకీ పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో రిజిస్ట్రేషన్ అయిన ప్రాపర్టీలలో సెకండ్ హ్యాండ్ హోమ్స్ వాటా 38 శాతంగా ఉండగా.. 2024-25 నాటికి 43 శాతానికి పెరిగిందని ఇంటిగ్రేటెడ్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్లేస్ స్క్వేర్ యార్డ్స్ నివేదిక వెల్లడించింది.

డెవలపర్ నుంచి నేరుగా కొనుగోలుదారులు కొనుగోలు చేసే ప్రాపర్టీలను ప్రైమరీగా, ఇంటి యజమాని మరొక కస్టమర్‌కు రీసేల్ చేస్తే దాన్ని సెకండరీ ప్రాపర్టీగా పరిగణిస్తారు. దేశంలోని 7 ప్రధాన నగరాలలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.07 లక్షల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో 1.22 లక్షల రీసేల్ ప్రాపర్టీలు ఉండగా 2024-25 నాటికి మొత్తం 5.44 లక్షల యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. సెకండ్‌హ్యాండ్ ప్రాపర్టీలు ఏకంగా 2.33 లక్షలకు పెరిగాయి. ప్రైమరీ యూనిట్లు 2018-19లో 1.84 లక్షలుగా ఉండగా.. 2024-25 నాటికి 3.11 లక్షలకు చేరాయి. అంటే రీసేల్ ప్రాపర్టీలలో 38 శాతం నుంచి 43 శాతానికి పెరిగితే.. ప్రైమరీ యూనిట్లు 62 శాతం నుంచి 57 శాతానికి తగ్గాయి.

ఐటీ హబ్‌కు చేరువలో..

రోడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ వంటి మెరుగైన మౌలిక వసతులు ఉన్న ప్రాంతాలలో రీసేల్ ప్రాపర్టీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, హబ్సిగూడ, ఉప్పల్, పోచారం వంటి ఐటీ కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రాంతాల్లోని సెకండ్ హ్యాండ్ హోమ్స్ డిమాండ్ ఎక్కువగా ఉంది. మెట్రో కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లోని నాణ్యమైన ఇళ్లకు ధర కాస్త ఎక్కువైనా కొనేందుకు కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రయోజనాలివీ

- కొత్త నిర్మాణాల కంటే రీసేల్ ప్రాపర్టీల ధరలు అందుబాటులో ఉంటాయి.
- రోడ్లు, విద్యా, వైద్య సంస్థలు, మార్కెట్లు, రవాణా సదుపాయాలతో స్థిరమైన మౌలిక వసతులు ఉంటాయి.
- నిర్మాణం పూర్తయ్యే వరకూ వేచి చూడాల్సిన అవసరం లేకుండా గృహ ప్రవేశం చేసేయవచ్చు.
- రీసేల్ ప్రాపర్టీలకు జీఎస్‌టీ వర్తించదు కాబట్టి కొనుగోలుదారులకు డబ్బు ఆదా అవుతుంది.
- కొత్త ప్రాజెక్టులు పెద్దగా లేని ప్రాంతాలలో సెకండ్‌హ్యాండ్ హోమ్స్ యజమానితో బేరసారాలకు అవకాశం ఉంటుంది.
- రీసేల్ ప్రాపర్టీలకు సైతం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు తక్కువ వడ్డీలోనే గృహ రుణాలను అందిస్తున్నాయి.
- కొత్త ఇంటి కొనుగోలు సమయంలో డెవలపర్‌కు ముందుగా చెల్లించే 10-15 శాతం డౌన్ పేమెంట్‌ను చెల్లించి, బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అదే రీసేల్ ప్రాపర్టీలో అయితే ఇదేమీ అక్కర్లేదు.

2024-25లో నగరాల వారీగా రిజిస్ట్రేషన్ గణాంకాలు:

నగరం	ప్రైమరీ	సెకండరీ	మొత్తం యూనిట్లు
ముంబై	71,000	69,000	1.40 లక్షలు
పుణె	76,000	24,000	లక్ష
థానే	49,000	30,000	79,000
బెంగళూరు	39,000	33,000	72,000
హైదరాబాద్	35,000	36,000	71,000
నవీ ముంబై	23,000	29,000	52,000
గ్రేటర్ నోయిడా	18,000	12,000	30,000

లగ్జరీ పెరగడమే రీసేల్‌కు బూస్ట్..

కరోనా కంటే ముందు వరకూ బెంగళూరు, చెన్నై, ముంబై వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు అందుబాటులోనే ఉండేవి. డెవలపర్లు కూడా అఫర్డబుల్ హౌసింగ్ నిర్మాణాలకే ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే ఏటేటా భూముల ధరలు పెరుగుతుండటంతో చౌక ఇళ్ల నిర్మాణ వ్యయప్రయాసంగా మారింది. దీంతో లగ్జరీ, విశాలమైన గృహ నిర్మాణాల వైపు ఆసక్తి పెరిగింది. కొత్త ప్రాజెక్టుల లాంచింగ్స్ పరిమిత స్థాయిలో ఉండటం, అందుబాటు గృహాల స్థానంలో ఖరీదైన గృహాల సరఫరా పెరగడంతో సెకండ్ హ్యాండ్ ప్రాపర్టీల వైపు సామాన్య, మధ్య తరగతి ప్రజలు మొగ్గు చూపుతున్నారు.



జాగ్రత్తలివీ..

- సెకండ్ హ్యాండ్ ప్రాపర్టీలు కొనేముందు ఇంటి వాస్తవ విలువ, మార్కెట్ ధరలను పూర్తిగా అధ్యయనం చేసుకున్న తర్వాతే నిర్ణయానికి రావడం ఉత్తమం.
- సాధారణంగా రీసేల్ ప్రాపర్టీలు వ్యవస్థీకృత రంగంలో విక్రయాలు జరగవు కాబట్టి మధ్యవర్తుల మాటలు నమ్మకూడదు. ఒకటికి రెండుసార్లు పునఃసమీక్ష చేసుకున్న తర్వాతే ముందడుగు వేయాలి.
- లీకేజీలు, నిర్వహణ సమస్యలను గృహ యజమాని దాచిపెట్టే అవకాశాలు ఉంటాయి కాబట్టి థర్డ్‌పార్టీతో సమగ్రంగా అధ్యయనం చేయించిన తర్వాత కొనుగోలు చేయడం బెటర్.
- 10-15 ఏళ్లకు పైబడి పాత ఇంటిని కొనకపోవడమే ఉత్తమం. బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంలో అయితే పాత ఇంటిని కొన్నా.. దాని కూల్చేసి కొత్త ఇంటిని నిర్మించుకుంటేనే కలిసొస్తుంది.
- లింక్ డాక్యుమెంట్లు, సేల్ డీడ్, ఆస్తి పన్ను పత్రాలు ఇతరత్రా డాక్యుమెంట్లను న్యాయ సలహా తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.



సుందరం..

పూజా మందిరం





సాక్షి, సిటీబ్యూరో: కట్టిన ఇల్లు కొంటున్నా.. దగ్గరుండి కట్టించుకుంటున్నా.. ఇంట్లో ప్రత్యేకంగా పూజ గది ఉండాలని కోరుకుంటున్నారు. ఇంటి విస్తీర్ణం మేరకు ప్రత్యేకంగా పూజ గది ఏర్పాటు చేసుకుంటున్న వారు కొందరైతే మరికొందరు మాత్రం మార్కెట్‌లో కోరుకున్న డిజైన్లు, విభిన్న ఆకృతుల్లో లభించే పూజా మందిరాలను కొనుగోలు చేసుకొని ఏర్పాటు చేసుకుంటున్నారు.

- పూజా గది ఏర్పాటు చేసుకునే సౌలభ్యం లేని వారు పూజా మందిరాలపై ఆధారపడుతున్నారు. ఒకప్పుడు చెక్కతో గోడకు ఒకచోట దేవుడి ఫొటోలు పెట్టుకునేలా ఏర్పాట్లు చేసుకునేవారు. కానీ సొంతిల్లు కొనుగోలు చేసిన వారు మాత్రం ప్రస్తుతం.. చిన్నదైనా సరే పూజా మందిరం ప్రత్యేకంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలాంటివారి కోసం దాదాపు నగరంలోని అన్ని ఫర్నీచర్ షోరూంలలో పూజా మందిరాలు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఒకటి, రెండు డిజైన్లు మాత్రమే ఉండగా.. వాటినే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కానీ, ప్రస్తుతం కావాల్సిన డిజైన్‌లో నచ్చిన ఆకారంతో పూజా మందిరాలు రెడీగా ఉన్నాయి. నచ్చిన విధంగా కావాలంటే ఆర్డర్‌పై తయారు చేసే అవకాశాన్ని కస్టమర్లకు కల్పిస్తున్నారు.

ధరల్లో వ్యత్యాసం..

పూజా మందిరాల్లో సైజు, డిజైన్, ఆకృతిని బట్టి ధరలు ఉంటాయి. సహజంగా వెడల్పు, ఎత్తును బట్టి పూజా మందిరాలు తయారు చేస్తున్నారు. స్థలానికి అనుగుణంగా ఆర్డర్‌పై తయారు చేయించుకోవచ్చు. అయితే వీటి తయారీలో ఉపయోగించే చెక్కను బట్టి ధరలు ఆధారపడి ఉంటాయి. టేక్‌వుడ్, సీసం వుడ్ ఇలా కావాల్సిన అభిరుచికి అనుగుణంగా తయారు చేయించుకునే అవకాశం ఉంది. సాధారణ చెక్కతో చిన్న సైజువి ఒక మోస్తారు సైజు వరకు రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు లభ్యమవుతున్నాయి. సహజంగా మందిరాలను ఓం, స్వస్తిక్ బొమ్మలతో తయారు చేయించుకుంటున్నారు.



ప్రత్యామ్నాయ పెట్టుబడుల వెల్లువ

సాక్షి, సిటీ బ్యూరో: దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రత్యామ్నాయ పెట్టుబడులు(ఏఐఎఫ్) వెల్లువెత్తుతున్నాయి. 2024 డిసెంబర్ చివరి నాటికి రూ.73,903 కోట్లకు చేరాయి. గతేడాది డిసెంబర్ నాటికి అన్ని రంగాల్లో ఏఐఎఫ్‌లు కలిపి రూ.5,06,196 కోట్లు రాగా.. ఇందులో 15 శాతం వాటా రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చాయని అనరాక్ నివేదిక వెల్లడించింది. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్టులకు ఏఐఎఫ్ పెట్టుబడులు జీవాన్నిస్తున్నాయని, డెవలపర్లకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ తర్వాత అత్యధికంగా ఐటీ, ఐటీఈఎస్ రంగంలోకి రూ.30,279 కోట్ల ఏఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి. ఆ తర్వాత ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.26,807 కోట్లు, ఎన్‌బీఎఫ్‌సీ రూ.21,929 కోట్లు, బ్యాంకులు రూ.21,273 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్‌ఎంసీజీ రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఏఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా.. ఇతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్ల పెట్టుబడులు వెళ్లాయి. రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరంగా వివిధ దశల్లో ఉన్న నిధుల సమస్యకు ఏఐఎఫ్ రూపంలో పరిష్కారం లభించినట్టయింది.

వంట గది

ఆహ్లాదం



చిమ్నీ పాత్ర కీలకం

సాక్షి, సిటీబ్యూరో: ఇంటిలో వంట గది ప్రత్యేకతే వేరు. కుటుంబ సభ్యుల ఆనందం, ఆరోగ్యంలో కిచెన్ కీలకమైంది. వంట ఏదైనా సరే ఘాటు వాసన, పొగ ఇళ్లంతా వ్యాపించి ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. అందుకే వంట గదిలో చిమ్నీల ఏర్పాటు అనివార్యమైపోయింది. దీంతో ఇంటిలో ఘాటు వాసనలు వ్యాపించకపోవడమే కాకుండా చమురు, జిడ్డు మరకలు గోడలు మసకబారకుండా శుభ్రంగా ఉంటాయి.

చిమ్నీ రకాలు బోలెడు

వాల్ మౌంటెడ్: స్టౌ గోడకు ఆనుకొని ఉంటే వాల్‌మౌంటెడ్ చిమ్నీ ఏర్పాటు చేసుకోవచ్చు. వీటిని గోడలకు అమర్చడం వల్ల నేరుగా పొగ, ఘాటు వాసనలను సంగ్రహించుకోవడంలో బాగా పనిచేస్తాయి.

ఇన్‌బిల్ట్: కిచెన్ క్యాబినెట్ లేదా గోడలో ఇన్ బిల్ట్ చిమ్నీ కలిసిపోతుంది. ఘాటైన వాసనలు పీల్చే శక్తివంతమైన వ్యవస్థగా పనిచేస్తుంది.

టెలిస్కోపిక్: ఈ రకం పైకప్పులలో ఇమిడిపోతాయి. వంట చేసేటప్పుడు చిమ్నీని పొడిగించుకోవచ్చు కూడా. చిన్న వంటగదిలో ఉపయోగపడతాయి.

కార్నర్: స్థలం తక్కువగా ఉండే వంట గదిలో ఓ మూలన వినియోగిస్తారు.

డక్ట్‌లెస్: గొట్టాలను అమర్చడానికి వీలులేని వంట గదిల్లో వినియోగిస్తారు. ఇవి గాలిని వెలుపలికి వదలకుండా వాటిలో ఉండే ఫిల్టర్స్ పొగ, ఆవిరి, చమురును పీల్చుకొని శుద్ధి చేస్తాయి.

కన్వర్టబుల్: డక్టెడ్, డక్ట్‌లెస్ చిమ్నీలుగా మార్చుకునే అవకాశం ఉండేవే కన్వర్టబుల్. దీన్ని వంట గదికి అనుగుణంగా మార్చుకునే వీలుంటుంది.

స్టాండింగ్: కుక్‌టాప్ వద్ద వాలుగా ఉండే ఈ చిమ్నీ విలాసవంతంగా కనిపిస్తుంది. టెక్నీషియన్స్ ద్వారా శుభ్రం చేయించుకోవాల్సి ఉంటుంది. బయటకు కనిపించకుండా సీలింగ్ మౌంటెడ్‌లో అమరుస్తారు.



ఐలాండ్: స్టౌ వేదిక ద్వీపంలా, కిటికీల చెంత స్టౌలు ఉంటే ఐలాండ్ లేదా సీలింగ్ మౌంటెడ్ చిమ్నీలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇవి గోడల నుంచి దూరంగా ఉండటం వల్ల మరింతగా వాసనలు, పొగను సంగ్రహిస్తాయి.

ఫార్మా జీసీసీలకు హబ్ భారత్



సాక్షి, సిటీబ్యూరో: ఫార్మా రంగంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్‌గా భారత్ అవతరిస్తోంది. అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలు ఇండియాలో జీసీసీల ఏర్పాటుపైనే దృష్టి సారిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు తిరోగమనంలో ఉన్నప్పటికీ మన దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటం, వినియోగం కూడా బాగుంటుండటంతో అవి భారత్ వైపే మొగ్గు చూపిస్తున్నాయి. 2,500లకు పైగా సెంటర్లు, 45 లక్షల మందికి పైగా నిపుణులతో త్వరలోనే భారత జీసీసీ మార్కెట్ పరిమాణం 100 బిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమిస్తోందని ఎర్నెస్ట్ అండ్ యంగ్ నివేదిక పేర్కొంది.

- లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ విభాగాలలో 2024లో 100 సెంటర్లు ఉండగా.. 2030 నాటికి వీటి సంఖ్య 160కి, వీటిలో ఉద్యోగుల సంఖ్య 4,20,000కి చేరనుందని అంచనా వేసింది. భారత్‌లో టెక్నాలజీ నిపుణుల లభ్యత గ్లోబల్ కంపెనీలకు ఆకర్షణీయంగా ఉంటుండగా.. ఇక్కడ వర్ధమాన స్టార్టప్ వ్యవస్థ కూడా జీసీసీల ఏర్పాటుకు మరో సానుకూలాంశంగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు వివరించాయి. దిగ్గజ కంపెనీల జీసీసీల నియామకాలు కూడా భారీగానే ఉంటున్నాయి. డిమాండ్, వ్యూహాత్మక ప్రాధాన్యం పెరుగుతుండటం వంటి అంశాల కారణంగా ఫార్మా దిగ్గజాలు భారత్‌లోని తమ హబ్‌లలో జోరుగా నియామకాలు చేపడుతున్నాయి.

క్లుప్తంగా...




నిరసన తెలుపుతున్న మహిళలు

గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ ఎప్పుడు ఇస్తారు 'బాబూ..'?

మహిళల ఆందోళన

డాబాగార్డెన్స్ (విశాఖ): ఒక వైపు తమ పాలన 'సూపర్'అని కూటమి పార్టీల నేతలు చెప్పుకుంటుంటే.. మహిళలు మాత్రం 'వేస్ట్'అంటున్నారు. ప్రభుత్వం చెబుతున్నది ఒకటైతే.. జరుగుతున్నది మరొకటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి వంటగ్యాస్ సబ్సిడీ విషయంలో మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ సబ్సిడీ 30 శాతం మందికి కూడా జమ కాలేదని వారు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ), 31వ వార్డు, కృష్ణాగార్డెన్స్ రామాలయం వద్ద మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఐద్వా, సిటూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. మరోవైపు గ్యాస్ సిలిండర్ ధర పెంపు దుర్మార్గమన్నారు. ప్రతి మహిళా ఖాతాలో నెలకు రూ.1,500 వేస్తామన్న హామీని నీరుగార్చారని, ఇప్పటి వరకు కనీసం 15 రూపాయలు కూడా జమ కాలేదన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కూడా అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు.

ఉదయభాను గరికిపాటి కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: నంది అవార్డు గ్రహీత, నాటక ప్రయోక్త ఉదయభాను గరికిపాటి (72) శుక్రవారం కన్నుమూశారు. ఉదయభాను నాటక రంగంలో విశేష కృషి చేశారు. చిక్కడపల్లిలోని తన నివాసంలో 'భూమిక' అనే నట శిక్షణాలయాన్ని స్థాపించారు. ఈ వేదిక ద్వారా ఉదయభాను ఎన్నో ప్రయోగాలు చేసి పలువురి ప్రశంసలు పొందారు. రైల్వేలో పని చేస్తున్న రోజుల్లో, రిటైరైన తర్వాత కూడా ఆయన నాటక రంగానికి ఎంతో సేవ చేశారు.

కవితకు ఇప్పటికైనా సోయి వచ్చినందుకు సంతోషం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం గురించి అధికారంలో ఉన్నన్ని రోజులు పట్టించుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఇప్పటికైనా సోయి వచ్చినందుకు సంతోషంగా ఉందని, కార్మిక దినోత్సవం రోజున ఆమె నిజాలు మాట్లాడారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వ్యాఖ్యానించారు. భౌతిక తెలంగాణ వచ్చినా సామాజిక తెలంగాణ ఇంకా రాలేదని ఆమె చెప్పడం హర్షణీయమన్నారు. శుక్రవారం సీఎల్పీ మీడియా హాలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కవితకు సామాజిక తెలంగాణకు ఎందుకు గుర్తు రాలేదన్నారు. ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రులు.. ఇలా పలు కీలక హోదాల్లో ఆమె సామాజిక వర్గానికి చెందిన వారు ఉన్నప్పుడు సామాజిక న్యాయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆమె సామాజిక తెలంగాణ గురించి ప్రశ్నించి ఉంటే బాగుండేదన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో తగాదాలు వచ్చి, తన ప్రాధాన్యం తగ్గిపోవడం వల్లనే కవిత ఇప్పుడు మాట్లాడుతున్నారని, అప్పుడే కేసీఆర్‌ను కవిత ప్రశ్నించి ఉండాల్సిందని అయిలయ్య అన్నారు. కుల గణన విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయంతో దేశంలోనే రేవంత్‌రెడ్డి హీరోగా నిలవడాన్ని బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, తెలంగాణ బీజేపీ నేతలకు దిమ్మ తిరిగిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు.

తెలంగాణ పట్ల టీడీపీకి మొదట్నుంచీ ద్వేషమే

బీఆర్ఎస్ నేత రాజీవ్ సాగర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్ల టీడీపీకి మొదట్నుంచీ ద్వేషమే ఉందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత మేడె రాజీవ్‌సాగర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన సమయంలో కట్టుబట్టలతో గెంటేశారని ఏపీ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏపీ, తెలంగాణ రెండు కళ్లని చెప్పిన చంద్రబాబు ఎప్పుడూ తెలంగాణ కన్నును పొడవాలనే చూస్తున్నారని ఆరోపించారు. యావత్ తెలంగాణ సమాజం రోడ్డు మీదకు వచ్చి ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడితే టీడీపీ అధినేత తెలంగాణకు వ్యతిరేకంగా పావులు కదిపారని రాజీవ్ సాగర్ గుర్తుచేశారు. అసలు చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకు తెలంగాణ అంటేనే ఇష్టం ఉండదన్నారు. పదేళ్లలో కేసీఆర్ వందేళ్ల అభివృద్ధి చేస్తే ఓర్వలేక ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.

విదేశీ విద్య రూటు మారుతోంది!

అధిక జీతాలు, కెరీర్ పురోగతికే భారతీయ విద్యార్థుల పెద్దపీట

- ఉన్నత విద్య చదివిన దేశంలోనే ఉద్యోగంలో స్థిరపడేందుకు ప్రణాళిక
- భారతీయుల ప్రాధాన్య గమ్యస్థానంలో వెనుకబడ్డ అమెరికా
- విదేశీ విద్య గమ్యస్థానాల ఎంపికలో ఆస్ట్రేలియాకు అగ్రస్థానం
- ఆ తర్వాత యూకేకు ఓటు



సాక్షి, అమరావతి: విదేశీ విద్యను ఎంపిక చేసుకోవడంలో భారతీయ విద్యార్థుల రూటు మారుతోంది. కెరీర్ పురోగతి ఉన్న దేశాల యూనివర్సిటీల్లోనే చదువుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఉద్యోగ అవకాశాలు మెరుపర్చుకోవడం, అధిక ఆదాయాన్ని ఆర్జించడం వంటి ప్రాథమిక లక్ష్యాలను బేరీజు వేసుకుని విదేశాల్లో విద్యపై నిర్ణయం తీసుకుంటున్నారు. భారతీయ విద్యార్థులు కెరీర్ కేంద్రీకృత విద్యకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు ఇటీవల అంతర్జాతీయ కన్సల్టెన్సీ 'ఐడీపీ ఎడ్యుకేషన్' చేసిన అధ్యయనంలో తేలింది.

విద్య కోసం విదేశీ గమ్యస్థానాలను ఎంచుకోవడంలో విద్యార్థుల ప్రాధాన్యతలు ఇలా (శాతం)..

అంశం	శాతం
కెరీర్ పురోగతి	77
ఉద్యోగ నియామకాలు	70
వర్సిటీల ద్వారా కొలువులు	69
స్కాలర్‌షిప్‌ల లభ్యత	55
పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశాలు	54
పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత అక్కడే ఉద్యోగం (ప్రస్తుతం చదువుతున్నవారు)	45
పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన చోటే ఉద్యోగం (చదువుకు ప్రణాళిక వేస్తున్నవారు)	43

ఉద్యోగాలు వచ్చే వర్సిటీల్లోనే చదువు..

- 70 శాతం మంది భారతీయ విద్యార్థులు విదేశీ విద్య గమ్యస్థానాన్ని ఎంచుకోనే సమయంలో ఉద్యోగ నియామకాలను కీలకమైన అంశంగా పరిగణిస్తున్నట్టు 'ఐడీపీ ఎడ్యుకేషన్' వెల్లడించింది.
- కెరీర్ అవకాశాలు పెంచుకోవడానికి అటువంటి అవకాశాలు కల్పించే సంస్థలకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపింది. దీనిని దృష్టిలో పెట్టుకుని చాలా విదేశీ సంస్థలు ప్రతిభ గల భారతీయ విద్యార్థులను ఆకర్షించడానికి వివిధ ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేస్తున్నాయి.
- విశ్వవిద్యాలయాల ఎంపికలోనూ విద్యేతర అంశాలకు భారతీయ విద్యార్థులు ప్రాధాన్యం ఇస్తున్నారు. చదువు ముగిసిన తర్వాత ఎంత మంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారనే లెక్కలను పరిగణనలోకి తీసుకుని ప్రవేశాలకు దరఖాస్తు చేస్తున్నారు. ఇలాంటి దృక్పథంలో ప్రపంచ సగటు (60శాతం) కంటే భారత్‌లో తొమ్మిది శాతం (69%) ఎక్కువగా ఉంది.
- గతంలో భారతీయుల ఇష్టమైన విదేశీ విద్య గమ్యస్థానంగా ఉన్న అమెరికాను అధిగమించి ఆస్ట్రేలియా అత్యంత ఆదరణ పొందిన ఎంపికగా నిలిచింది. ఆస్ట్రేలియాలో నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరతతోపాటు చదువు పూర్తయిన తర్వాత పని హక్కు కల్పించడం వల్ల ఇతర దేశాలతో పోలిస్తే అక్కడికి వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఆ తర్వాత యూకే రెండో స్థానంలో నిలిచింది.

దేశాభివృద్ధికి ఏపీని ఇంజన్‌గా చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. ఇవి కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కావు. ఆంధ్రప్రదేశ్ ఆశలకు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాది. ఈ సందర్భంగా వీరభద్రస్వామికి, అమరలింగేశ్వరస్వామికి, తిరుపతి వెంకన్న పాదాలకు నమస్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అని పేర్కొన్నారు. ప్రసంగాన్ని తెలుగులోనే ప్రారంభించిన ప్రధాని మోదీ మధ్యలో కొన్ని తెలుగు వాక్యాలు కూడా పలికారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పదేళ్లుగా చేయూతనిచ్చాం...

ఇంద్రుడి రాజధాని అమరావతి.. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి. ప్రతి ఆంధ్రా యువకుడి కలలు నిజమయ్యే నగరంగా అమరావతి తయారవుతోంది. ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీస్, విద్య, ఆరోగ్య రంగాల్లో రానున్న రోజుల్లో అమరావతి దేశంలోనే ప్రధాన నగరంగా నిలవబోతుంది. 2015లో అమరావతికి శంకుస్థాపన చేశా. ఈ పదేళ్లలో అమరావతికి అన్ని రకాలుగా సంపూర్ణ మద్దతు ఇచ్చాం. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం నాడు ఎన్టీఆర్ కలగన్నారు. మనందరం కలసి అమరావతి, ఆంధ్రప్రదేశ్‌ను వికసిత్ భారత్ దేశానికి గ్రోత్ ఇంజన్‌గా తయారు చేయాలి. రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు అందిస్తోంది. దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల మధ్య అనుసంధానం, పక్క రాష్ట్రాలతో కనెక్టివిటీ మెరుగుపడుతుంది. రేణిగుంట నుంచి నాయుడుపేట మధ్య నిర్మిస్తున్న కొత్త హైవే వల్ల తిరుపతి వెంకన్నను తక్కువ సమయంలో దర్శించుకోవచ్చు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో వేలాదిమంది యువతకు సరికొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

నవదుర్గా మిస్సైల్ లాంచ్ కేంద్రం..

అంతరిక్ష శక్తిగా దేశం అవతరించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. శ్రీహరికోట నుంచి లాంచ్ అయ్యే ప్రతీ రాకెట్ కోట్లాది మంది భారతీయులు గర్వించేలా చేస్తుంది. కోట్లాది మంది దేశ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో డీఆర్‌డీవో నవదుర్గా మిస్సైల్ లాంచింగ్ రేంజ్‌కు శంకుస్థాపన చేశాం. నాగాయలంకలో నిర్మించబోయే ఈ కేంద్రం కనక దుర్గమ్మలా దేశ రక్షణకు నిరంతరం శక్తిని ఇస్తుంది. జూన్ 21వ తేదీన విశాఖలో నిర్వహించే యోగాదినోత్సవానికి నన్ను ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఆరోజు యోగా ప్రచారం చేయడమే కాదు.. ప్రపంచ ప్రజలంతా ఏపీవైపు చూసేలా చేయాలి.

మూడేళ్లలో నిర్మిస్తాం

అమరావతి పనులను మూడేళ్లలో పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా కొత్త రాజధానిని ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా అమరావతిని నిర్మించి ప్రపంచ పటంలో నిలబెడతామన్నారు. గత పది నెలల్లో కేంద్ర సహకారం, మోదీ ఆశీస్సులతో అమరావతి పనులను పట్టాలెక్కించామన్నారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిని క్వాంటం వ్యాలీ సిటీగా మారుస్తామన్నారు. అమరావతి ఆర్కిటెక్చరల్ జోన్‌గా, కాంక్రీట్ జంగిల్‌గా మిగిలిపోకుండా జవాబుదారీతనంతో ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పాలనలో అమరావతి వరల్డ్ క్లాస్ రాజధానిగా ఎదుగుతుందన్నారు.

తిరుమల అటవీ ప్రాంతంలో మంటలు

అదుపులోకి తెచ్చేందుకు అటవీ, అగ్నిమాపకశాఖ చర్యలు



పాపవినాశనం డ్యామ్ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంటలు

తిరుమల: తిరుమల తుంబురు తీర్థం సమీపంలోని అటవీప్రాంతంలో గురువారం రాత్రి ప్రారంభమైన మంటలు శుక్రవారం పాపవినాశనం డ్యామ్ వరకు వచ్చాయి. వేసవి కావడం, ఎండి చెట్లు ఎక్కువగా ఉండటంతో మంటలు వ్యాపించినట్టు అధికారులు తెలిపారు. అటవీశాఖ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు. అగ్నిమాపక వాహనాలు చేరుకునే పరిస్థితి లేకపోవడంతో సిబ్బందే మంటలను ఆర్పేందుకు ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టారు. వీలైనంత త్వరలో మంటలను అదుపులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

వర్షం ఉధృతికే కూలింది!

- సింహగిరిలో కూలిన గోడపై ప్రభుత్వానికి దేవదాయ శాఖ కమిషనర్ నివేదిక
- సీఎం, మంత్రులు చెప్పిన అంశాలతో యథాతథంగా నివేదిక



సాక్షి, అమరావతి: సింహగిరిలో భక్తుల మృతి ఘటనకు సంబంధించి ఏపీ ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, ఇతర మంత్రులు ప్రచారం చేసిన అంశాలతోనే నివేదిక సిద్ధమైంది! చందనోత్సవం ఏర్పాట్లను ఏకంగా ఐదుగురు మంత్రులు స్వయంగా పర్యవేక్షించినప్పటికీ ఈ విషాదం చోటు చేసుకోగా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ నివేదికను సిద్ధం చేయించింది. వర్షం ఉధృతికి గోడ కూలిపోయిన కారణంగా భక్తులు మరణించినట్లు దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. సింహాచలంలో ఎలాంటి కాలమ్స్ లేకుండా కేవలం ఫ్లైయాష్‌తో అంత పెద్ద గోడ నిర్మాణాన్ని ఆదరాబాదరాగా చేపట్టడంతో అది కుప్పకూలి ఏడుగురు భక్తులు సజీవ సమాధి కావడం తెలిసిందే. తిరుపతి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తొక్కిసలాట చోటు చేసుకుని ఆరుగురు భక్తులు మృత్యువాత పడితే తన వైఫల్యాలను దాచిపెట్టేందుకు ఆపసోపాలు పడ్డ కూటమి సర్కారు సింహాచలంలో మాత్రం బహిరంగ విచారణ పేరుతో నాటకాన్ని రక్తి కట్టించి కాంట్రాక్టర్, ఉద్యోగులను బలి పశువులుగా మార్చి తప్పించుకునే యత్నాలు చేస్తోంది. సాక్షాత్తూ మంత్రుల పర్యవేక్షణలోనే ఇంత దారుణం జరిగిందంటే ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని ఇంజనీరింగ్ నిపుణులు, పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

ఏప్రిల్ 19న మౌఖిక ఆదేశాలు..

నూతన మెట్ల మార్గాన్ని గతంలో ఉన్నట్లు కాకుండా ప్లాన్ మార్చి 'వై' ఆకారంలో నిర్మాణం చేశారని, దీంతో గతంలో మెట్లు ప్రారంభమైన ప్రదేశంలో కూలిన గోడ నిర్మాణం చేపట్టినట్లు దేవదాయ శాఖ కమిషనర్ నివేదికలో పేర్కొన్నారు. గోడకు దిగువన రెండు వైపులా మెట్లు ఉన్నాయని, చందనోత్సవం సందర్భంగా మెట్ల గుండా ఒక వరుస క్యూలైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెట్లు, గోడను ఈవో సూచనల ప్రకారం నిర్మించినట్లు తెలిసిందన్నారు. కాగా దుర్ఘటనకు కారణమైన గోడకు సంబంధించి ఏప్రిల్ 19వ తేదీన దేవదాయ శాఖ అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చ జరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు. చందనోత్సవం సమీపించినా గోడ నిర్మాణం చేపట్టకపోవడంపై దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ముఖ్య అధికారి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. చందనోత్సవం నాటికల్లా నిర్మాణం పూర్తి చేయాలని ఆలయ ఇంజనీరింగ్ అధికారులకు మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు చెబుతున్నారు. దీంతో కూలిన గోడ ఏప్రిల్ 19వ తేదీ తర్వాతే నిర్మాణం జరిగినట్లు స్పష్టంగా వెల్లడవుతోంది.

ఏపీ సీఐడీ పరిధి సంగతి తేలుస్తాం

- ఎవరైనా సరే చట్ట ప్రకారమే నడుచుకోవాలి
- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన రాజ్ కేసిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ సీఐడీ పరిధి సంగతిని తేలుస్తామని, సీఐడీ కూడా చట్ట నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని పేర్కొంది. మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో విచారణకు హాజరు కావాలంటూ బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆంధ్రప్రదేశ్ సీఐడీ అధికారులు తనకు నోటీసులు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాజ్ కేసిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఐడీ నోటీసుల్లో జోక్యానికి నిరాకరిస్తూ హైకోర్టు గత నెల 4న ఇచ్చిన ఉత్తర్వులపై స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, సీఐడీ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారి, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13కి వాయిదా వేసింది. అంతకుముందు రాజ్ కేసిరెడ్డి తరపు న్యాయవాది శ్రీహర్ష పీచర వాదనలు వినిపించారు. రాజ్ హైదరాబాద్‌లో నివాసం ఉంటారని, అందువల్ల ఆయనకు నోటీసులు జారీ చేసే పరిధి ఏపీ సీఐడీకి లేదని వివరించారు. ఒక రాష్ట్రం తన పరిధిలోని ప్రాంతాలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రమే కలగజేసుకునే వీలుంటుందని తెలిపారు. తాము సీఐడీ నోటీసులను సవాలు చేస్తూ మొదట ఏపీ హైకోర్టులో పిటిషన్ వేశామని, అయితే ఏపీ సీఐడీ పరిధిలోకి తెలంగాణ రాష్ట్రం వస్తుందంటూ 2022లో హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తమ పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించిందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సీఐడీ పరిధి విషయంలో ఏపీ హైకోర్టు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చిందని.. పిటిషనర్‌ను సీఐడీ ఇప్పటికే అరెస్ట్ చేసిందని తెలిపారు. కాబట్టి నోటీసులను సవాలు చేస్తూ దాఖలు చేసిన ఈ వ్యాజ్యం నిరర్థకం అవుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఏపీ సీఐడీ పరిధిని తేలుస్తాం అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

రేవంత్‌పై కేసులో స్టేటస్ రిపోర్టు అందజేయండి

- అభియోగాలు నమోదు చేయాలని ట్రయల్ కోర్టుకు ఆదేశం
- తదుపరి విచారణ జూన్ 13కు వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలైన కేసులో ట్రయల్ కోర్టు విచారణపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ జూన్ 13కు వాయిదా వేసింది. ఆలోగా ట్రయల్ కోర్టులో కేసు స్థితి, జారీ చేసిన ఆదేశాలకు సంబంధించిన పత్రాలను అందజేయాలని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపనపల్లిలోని సర్వేనంబరు 127లో 31.5 ఎకరాలపై ఫిర్యాదుదారు (డీఫ్యాక్టో కంప్లైనెంట్) పెద్దిరాజు, ఎనుముల సోదరుల మధ్య వివాదం ఉంది. తన భూమిలోకి అక్రమంగా జొరబడి జేసీబీతో సొసైటీకి చెందిన గదిని కూల్చివేశారని, అంతేకాకుండా తనను కులం పేరుతో అసభ్యకరంగా దూషించారని పెద్దిరాజు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కొండల్‌రెడ్డి, ఇ.లక్ష్మయ్య, రేవంత్‌రెడ్డిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2019లో చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దాఖలైన ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ 2020లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ ప్రేరేపితంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రేవంత్ సమక్షంలో ఇతర నిందితులు నేరానికి పాల్పడ్డారని చెబుతూ ఆయన్ను కూడా నిందితుడిగా చేర్చారన్నారు. అందుకే ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేయాలని కోరుతున్నామని చెప్పారు.

ఎలాంటి స్టే ఆదేశాలు లేకున్నా రేవంత్‌రెడ్డి ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేయగలుగుతున్నారని పెద్దిరాజు తరపు న్యాయవాది పేర్కొన్నారు. 2019లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైతే నాలుగుసార్లేవిచారణ చేపట్టారన్నారు. సీఎం(ఏ-3)తోపాటు ఇతర నిందితులు కొండల్‌రెడ్డి(ఏ-1), ఇ.లక్ష్మయ్య(ఏ-2)పై వెంటనే అభియోగాలు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అభియోగాల నమోదు, విచారణ, తీర్పు సమయంలో ట్రయల్ కోర్టు ఆదేశించినప్పుడు విచారణకు హాజరు కావాలని రేవంత్‌కు గతంలో హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విచారణ స్థితిని తెలియజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.


ముంచెత్తిన నష్టం

▶ మొదటి పేజీ తరువాయి

మిల్లర్ల మీద ఆధారపడి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. లారీలు రావడం లేదని, మిల్లర్లు క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల తరుగు తీస్తేనే మిల్లులకు ధాన్యం ఇవ్వాలంటున్నారని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే చెప్పే పరిస్థితి కరీంనగర్, ఖమ్మం, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. తిరిగి ఆ ధాన్యాన్ని ఎండబెట్టి, తేమ శాతం 17 శాతం వచ్చిన తర్వాత విక్రయించాలంటే ఎన్ని రోజులు ఆగాలో తెలియని పరిస్థితి.

అయా జిల్లాల్లో ఇలా....

- ఖమ్మం జిల్లా వైరా మార్కెట్ యార్డులో ఆరబోసిన 3 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. కూసుమంచి మండలంలోనూ ధాన్యం తడిసింది.
- మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మరిపెడ, కేసముద్రం, డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, నర్సింహులపేట, బయ్యారం, గార్ల మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వ్యవసాయ మార్కెట్లు, ఐకేపీ సెంటర్లలో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది.
- సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో శుక్రవారం సాయంత్రం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. కమ్మరపల్లి, చీకోడ్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వర్షం ధాటికి కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. సకాలంలో తరలించకపోవడంతో కాంటాలు పెట్టిన బస్తాలు కూడా తడిసిపోయాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్‌లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది.మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యంలో చేరిన వర్షపు నీటిని శుక్రవారం ఎత్తిపోస్తూ రైతులు కనిపించారు. పోచమ్మవాడ కొనుగోలు కేంద్రంతో పాటు గోపాల్‌పూర్‌లోనూ ధాన్యం వర్షపునీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడితే.. చేతికందిన పంట కళ్ల ముందు వర్షపు నీటిలో కొట్టుకుపోవడంతో రైతు బండారి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. డివిజన్‌లోని అయా మండలాల్లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం తడిసిపోయింది.



పెద్దపల్లి జిల్లా మంథని మండలం గోపాల్‌పూర్‌లో నేలవాలిన వరిపైరు



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాలలో తాటిచెట్టుపై పడిన ఇంటిపైకప్పు

ఉమ్మడి వరంగల్‌లో గాలివాన బీభత్సం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.

- మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 279 స్తంభాలు విరగగా, ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి. దీంతో సుమారు 90 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గూడూరు మండలంలోని కొల్లాపురంలో గుండెల వెంకటమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా గోడకూలి ఆమె కాలు విరిగింది.
- వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణం, ఖానాపురం మండలం మనుబోతులగడ్డలో రోడ్లపై భారీ వృక్షాలు పడిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 45 స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- ములుగు జిల్లా వెంకటాపురం (ఎం), గోవిందరావుపేట మండలాల్లో పలు ఇళ్లు నేలకూలాయి.
- అకాలవర్షంతో భూపాలపల్లి సర్కిల్ పరిధిలో 351 స్తంభాలు నేలకొరిగాయని, సుమారు రూ.55 లక్షల నష్టం వాటిల్లినట్టు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో 66.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అడవి నుంచి కాల్వ ద్వారా సరాసరి కొనుగోలు కేంద్రంలోకి భారీగా వరదనీరు చొచ్చుకు వచ్చింది. వరదనీటితో కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం కొంత ఎర్రచెరువులోకి కొట్టుకుపోగా, మరికొంత తడిసి పనికిరాకుండా పోయింది. 2,590 క్వింటాళ్ల వరకు నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీరు



1 గంగిశెట్టి ప్రసీద
2 అంబటి ప్రణయ
3 సాహితి
4 దాకన్నగారి మధులిక తేజ
5 కట్ట కీర్తన

న్యాయపీఠంపై మహిళా తేజం

'నాన్న జడ్జి. చెల్లి కూడా జడ్జే. వారే నాకు స్ఫూర్తి' అంటుంది నిఖిషా. జడ్జి కావాలనేది కీర్తన హైస్కూల్ నాటి కల. 'మా కుటుంబం, బంధువులలో న్యాయవాదులు, జడ్జీలు ఎవరూ లేరు. అందుకే జడ్జి కావాలనుకున్నాను' అంటుంది మధులిక. 'పట్టుదల గట్టిగా ఉంటే తొలి ప్రయత్నంలోనే బ్రహ్మాండంగా విజయం సాధించవచ్చు' అంటుంది సాహితి.
...తెలంగాణ హైకోర్టు జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు ఎంపికైన విజేతలు వీరు. న్యాయమూర్తి కావాలనుకోవడానికి వారికి స్ఫూర్తి వేర్వేరుగా ఉండవచ్చు. అయితే పడిన కష్టం మాత్రం ఒక్కటే.
'న్యాయవ్యవస్థలో ఉన్నత స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి' అని జాతీయ స్థాయిలో నివేదికలు నొక్కి చెబుతున్న నేపథ్యంలో ఈ మహిళల విజయం... ఆశా కిరణం.

– అరవింద్ గంద్రాతి, 'సాక్షి' నెట్‌వర్క్

1 ఎన్నో సవాళ్లు... అయినా సరే...

న్యాయవాది కావాలనేది నా చిన్నప్పటి కల. జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. మధ్యతరగతి కుటుంబాల్లో ప్రత్యేకంగా స్టడీ రూమ్స్ లేకపోవడం ఇబ్బందిగా ఉంటుంది. ఏకాంతంగా చదువుకునే అవకాశం ఉండదు. లైబ్రరీలలో రాత్రి పొద్దుపోయే వరకు చదువుకునే వీలు అమ్మాయిలకు ఉండదు. మెటీరియల్ కలెక్ట్ చేసుకోవడం నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రిపేర్ కావడం వరకు...పేద, మధ్యతరగతి అమ్మాయిలకు ఎన్నో సమస్యలు ఉంటాయి. అయితే లక్ష్యాన్ని మాత్రమే చూస్తే ఆ సమస్యలు కనిపించవు.

– గంగిశెట్టి ప్రసీద, వరంగల్ సిటీ

2 పుట్టెడు దుఃఖంతో... తిరుగులేని పట్టుదలతో...

తెలంగాణ ఉద్యమంలో నర్సంపేట పట్టణం నుండి ముందు వరుసలో ఉండి ఉద్యమాన్ని నడిపించారు నాన్న. 2020లో నాన్న హత్యకు గురయ్యారు. నా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. నా కాళ్లపై నేను నిలబడి అమ్మకు అండగా ఉండాలనుకున్నాను. నాన్న ఆలోచనలకు అనుగుణంగా ఎల్ఎల్‌బీలో చేరినప్పటి నుంచి జడ్జి కావాలనే పట్టుదలతో చదివాను. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించడం సంతోషంగా ఉంది.

– అంబటి ప్రణయ, నర్సంపేట, వరంగల్

జడ్జిల కుటుంబం...

తండ్రి కె. ఖుషా హైదరాబాద్ సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి. చెల్లి భావన మహబూబ్‌నగర్‌లో 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి. తాజాగా అక్క నిఖీషా జూనియర్ సివిల్ జడ్జి పోస్ట్‌కు ఎంపికైంది. తండ్రి, ఇద్దరు కూతుళ్లతో వారిది జడ్జిల కుటుంబంగా మారింది. ఐటీ ఉద్యోగం వచ్చినా చట్టంపై అవగాహన ఉండాలని న్యాయమూర్తి కె. ఖుషా తన కూతుళ్లను న్యాయ విద్య చదివించారు.



నిఖీషా

అసలైన లక్ష్యం అదే...

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో నిఖీషా వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగంలో చేరింది. ఐటీ రంగంలో అనుభవం కోసం ఉద్యోగంలో చేరింది. అయితే ఆ ఉద్యోగం ఆశించిన స్థాయిలో సంతృప్తి ఇవ్వలేదు. ఆ సమయంలోనే 'నేను చేయాల్సిన ఉద్యోగం ఇది కాదు' అనుకుంది. 'నాన్నలాగే న్యాయమూర్తి కావాలి' అని తనలో నిద్రాణంగా ఉన్న లక్ష్యంపై దృష్టి పెట్టింది.

మానసిక స్థైర్యం... హరే కృష్ణ మంత్రం

మెయిన్స్ ఎగ్జామ్స్ సమయంలో నిఖీషా తల్లి సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. ఇంటర్వ్యూకు ముందు నాన్నకు బైపాస్ సర్జరీ జరిగింది. కవలబిడ్డలకు అప్పటికి సంవత్సరం కూడా నిండలేదు. ఇలా ఎన్నో ఒడిదొడుకులు వచ్చినా మానసికంగా కుంగిపోకుండా లక్ష్యాన్ని పదేపదే గుర్తు తెచ్చుకునేది. 'హరే కృష్ణ మంత్రం జపిస్తూ మానసిక స్థైర్యాన్ని పొందాను. విజయం సాధించాను. మా కుటుంబం నుంచి నేను కూడా న్యాయమూర్తిగా అడుగుపెడుతున్నందుకు ఎంతో గర్వం ఉంది' అంటుంది నిఖీషా.

3 తొలి ప్రయత్నంలోనే...

'లక్ష్యం ఏర్పర్చుకున్నప్పుడు ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురొచ్చినా పట్టుదలను వదలవద్దు. జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యేవారు సొంత నోట్స్ తయారు చేసుకోవడమే ఉత్తమం. ఇది ఒక హ్యాపీ మూమెంట్. నా పేరెంట్స్‌కు ఒక గిఫ్ట్.

– సాహితి, నంగనూరు, సిద్దిపేట జిల్లా

(తొలి ప్రయత్నంలోనే, 26 ఏళ్ల వయసులో జూనియర్ సివిల్ జడ్జి పోస్ట్‌కు ఎంపికైంది)

4 ఉద్యోగం కాదు... బాధ్యత

మా కుటుంబంలో ఎవరూ న్యాయవాదులు, జడ్జిలు లేరు. అదే నన్ను న్యాయమూర్తి కావాలనే లక్ష్యం వైపు నడిపించింది. కొంతకాలం న్యాయవాదిగా చేసిన అనుభవం జేసీజే పరీక్షలో తోడ్పడింది. జడ్జి పోస్ట్ అనేది ఉద్యోగం కాదు. విలువైన బాధ్యత.

– దాకన్నగారి మధులిక తేజ, హైదరాబాద్

5 చిన్ననాటి కల... తొలి ప్రయత్నంలోనే

చిన్ననాటి నుంచి జడ్జి అవ్వాలనేది నా కల. నా కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. హైకోర్టు, కరీంనగర్ కోర్టుల్లో న్యాయవాదిగా పలు కేసులు వాదించాను. రెండేళ్ల క్రితం నుంచి జేసీజే పరీక్షలకు సిద్ధమయ్యాను. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా క్రమపద్ధతిలో పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యాను.

– కట్ట కీర్తన, ఆరెపల్లి, కరీంనగర్

కూల్ సమ్మర్

సన్‌స్క్రీన్ ఓకేనా!

సమ్మర్‌లో సన్‌స్క్రీన్ లోషన్ వాడడం సర్వసాధారణం. 2030 నాటికి భారత సన్‌స్క్రీన్ మార్కెట్ బాగా పెరగనుందని ఒక నివేదిక అంచనా వేసింది. అయితే మరోవైపు చూస్తే... ఇంటర్నెట్‌లో ఒకవర్గం సన్‌స్క్రీన్ వాడొద్దు అని, వాటివల్ల జరిగే నష్టాలు ఇవి... అంటూ ప్రచారం చేస్తోంది. అందులో నిజం ఎంత?

ప్రధానంగా రెండు రకాల సన్‌స్క్రీన్‌లు ఉన్నాయి. 1. మినరల్ 2. కెమికల్

మినరల్ సన్‌స్క్రీన్‌లో జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్ లాంటి క్రియాశీల ఖనిజ పదార్థాలు ఉంటాయి. ఇవి యువి కిరణాలను నిరోధిస్తాయి. ఇక కెమికల్ సన్‌స్క్రీన్‌లు అధికశక్తి గల యూవీ కిరణాలను గ్రహిస్తాయి. చర్మాన్ని దెబ్బతీయకుండా నిరోధిస్తాయి. వీటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ క్రియాశీల పదార్థాలు ఉంటాయి.

ఇవేకాకుండా మార్కెట్‌లో కాంబినేషన్ సన్‌స్క్రీన్‌లు కూడా



అందుబాటులో ఉన్నాయి.

డెర్మటాలజిస్ట్‌లు 'సన్‌స్క్రీన్ వాడడం మంచిదే' అని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'సన్‌స్క్రీన్‌లోని ఇన్‌గ్రేడియెంట్స్ థైరాయిడ్ హార్మోన్లు, టెస్టోస్టెరాన్, ప్రొజెస్టెరాన్ స్థాయులను దెబ్బతీస్తాయని కొన్ని అధ్యయాలు సూచిస్తున్నాయి. అయితే ఇవి తక్కువస్థాయి ఆధారాలతో కూడిన ప్రాథమిక అధ్యయనాలు మాత్రమే. అందువల్ల సన్‌స్క్రీన్‌లు ఎండోక్రైన్ డిస్ట్రప్టర్లు అని నిర్ధారించడానికి ఈ ఆధారాలు సరిపోవు' అంటున్నారు డెర్మటలాజిస్ట్, ఇన్‌ఫ్లూయెంజ్ స్కిన్ అండ్ హెర్ క్లినిక్ ఫౌండర్ గీతికా శ్రీవాస్తవ.

జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్ ఇన్‌గ్రేడియెంట్స్ ఉపయోగించే ఫిజికల్ సన్‌స్క్రీన్స్ (మినరల్ సన్‌స్క్రీన్స్) సురక్షితమైనవని, ప్రభావ వంతమైనవని ఎఫ్‌డీఏ (ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్-రిసెర్చ్) నిర్ధారించింది.

హెల్త్ టిప్



బొప్పాయిలో పీచుపదార్థాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది విరోచనకారి మందుగా కూడా ఉపయోగపడుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు ఒక బొప్పాయి ముక్కను తీసుకుంటే జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉంటుంది.



వేసవి ఎండల్లో తకధిమి తాళంలో...

ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు సెలవులిచ్చారు. సమయాన్ని వృథా చేయకుండా వారిని సమ్మర్ క్యాంపుల్లో చేర్పించే తల్లిదండ్రులు కొందరైతే, నచ్చిన విషయాల్లో శిక్షణ ఇప్పించి, ముచ్చట తీర్చేవారు మరికొందరు. ఈ సమయంలో పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇప్పించడం మేలని అంటున్నారు నిపుణులు. పిల్లల్లో ఓపిక, సృజనాత్మకత, మేధోశక్తి, కళల పట్ల అభిమానం పెరిగేందుకు లలిత కళలు ఎంతో తోడ్పడతాయని అంటున్నారు.

వేసవి కాలమ్

పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇప్పిస్తాం సరే, కానీ ఏ నృత్యంలో శిక్షణ ఇప్పించాలి? అది వారి భవిష్యత్తుకు ఏ మేరకు తోడ్పడుతుందనేది చాలామంది తల్లిదండ్రుల సందేహం. కాలికి గజ్జె కట్టి లయబద్ధంగా నాట్యం చేసే శాస్త్రీయ నృత్యం ఉంది. పల్లె పదాలతో చలాకీగా అలరించే జానపద నృత్యం ఉంది. శరీరాన్ని స్ప్రింగులా మెలిదిప్పే వెస్టన్ ఉంది. మళ్లీ ఒక్కో విభాగంలో అనేక అంశాలు, రీతులు. వీటిలో ఏది పిల్లలకు మేలు? ఎందులో వారి రాణింపు?

ఇది తెలియాలంటే ముందుగా పిల్లల మనసు కనుక్కోవాలి. శాస్త్రీయ నృత్యంపై వారికి అవగాహన కల్పించాలి. శాస్త్రీయ నృత్యంలో ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నవారి గురించి వివరించాలి. వారి సాధించిన విజయాలను వారికి చెప్పాలి. అలా వారిలో నృత్యంపై ఇష్టాన్ని పెంచాలి.



ఎన్నో నృత్యాలు...

మన గొప్ప దేశంలో గొప్పవైన ఎన్నో నృత్యాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి, తమిళనాడులో భరతనాట్యం, తెలంగాణలో పేరిణి శివతాండవం, కర్ణాటకలో యక్షగానం, కేరళలో కథాకళి, మోహినీ ఆట్టం, ఒడిషాలో ఒడిస్సీ, మణిపూర్‌లో మణిపురి, ఉత్తర భారతదేశంలో కథక్.. శాస్త్రీయ నృత్యం కేవలం మానసికోల్లాసానికి మాత్రమే కాదు. మన దేశ చరిత్ర, కళలు, పురాణాలు, ఇతిహాసాలు, చారిత్రక అంశాలు, కావ్యాలు.. ఇలా అనేక విషయాలు వీటి ద్వారా తెలుస్తాయి.



ఏ శాస్త్రీయ నృత్యంలో ఏయే ప్రయోజనాలు?

భరతనాట్యం: భరతనాట్యంలో అనేక ముద్రలు ఉంటాయి. శరీరాన్ని కదిలిస్తూ, భావాలను అభినయించి చూపాలి. కాళ్లు, చేతులతో భంగిమలు పెట్టాలి. ఇదొక కసరత్తులా పనిచేస్తుంది. కండరాలకు శక్తి చేకూరుతుంది. శరీరంలో తేజస్సు నిండుతుంది.



కూచిపూడి: నాట్యంతోపాటు అభినయం ప్రధానం. ముఖ్యంగా నవరసాలను పలికించడంలో కూచిపూడిది ప్రత్యేక శైలి. సాధన చేస్తున్న క్రమంలో మానసికోల్లాసం రెట్టింపవుతుంది. ఒత్తిడి దూరమై, మనసులో ప్రశాంతత నిండుతుంది.

కథక్: కథక్‌లో కళాకారుడు తన చుట్టూ తాను తిరుగుతూ నాట్యం చేయాలి. చేతులు, కాళ్ల భంగిమలు ఇందులో అత్యంత ప్రధానం. దీనివల్ల మానసిక ఒత్తిడి దూరమవుతుందని వైద్యులు అంటున్నారు.

ఒడిస్సీ: త్రిభంగి ఆధారంగా రూపుదిద్దుకున్న ఒడిస్సీ నృత్యరీతిలో శరీరం మొత్తాన్ని కదిలిస్తూ నాట్యం చేయాలి. ఒంట్లో కొవ్వు దూరం చేసుకునేందుకు ఒడిస్సీ ఎంతో ఉపకరిస్తుంది. ఒడిస్సీ నృత్యం సాధన చేసేవారి ఊపిరితిత్తులు బలంగా తయారవుతాయని, కాళ్లు, కండరాలు బలంగా మారతాయని వైద్యులు అంటున్నారు.

కథాకళి: ముఖకవళికలు, కంటితో చూపే భావాలు కథాకళితో చాలా ప్రాధాన్యం ఉంది. ఈ నృత్యం సాధన చేసే వారు ముందుగా ముఖాభినయం, కళ్ల ద్వారా భావాలు పలికించడాన్ని సాధన చేస్తారు. ఈ నృత్యం చేయడం ద్వారా ఒంట్లోని కండరాలన్నీ సాంత్వన పొంది మరింత దృఢంగా మారుతాయి. ఆటిజంతో బాధపడే పిల్లలకు కథాకళి నేర్పిస్తే వారి ముఖభావాలు, చూపులు మెరుగుపడతాయని వైద్యులు అంటున్నారు.

పిల్లలు డాక్టర్ దగ్గరకు వెళ్లకుండా ఉండాలంటే డాన్స్‌కు చేరువైతే చాలు.

– కె

డైట్ ప్లాన్
నిర్వహణ: నిర్మలా రెడ్డి

'ఉత్సాహంగా తినండి. ఉత్సాహంగా జీవించండి. ఉత్సాహంగా ఉండండి! పోషకాలతో ఉండండి, దయతో ఉండండి, ఆకుపచ్చగా ఉండండి!' అనేది వీగన్ ప్రేమికుల మాట. మన ఆహారాల్లో శాకాహారం, మాంసాహారం గురించి తెలుసు. కొన్నాళ్లుగా వినిపిస్తున్నది వీగన్ ఆహారం. జంతు సంబంధిత ఆహారాలకు దూరంగా ఉంటూ మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎంచుకోవడం. వీటిలో.. పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు, గింజలు మొదలైనవి ఉంటాయి.

● వీగన్ డైట్

ప్రతి ముద్దలోనూ ఆరోగ్యం



శారద

'ఒక వ్యక్తి మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎంచుకుంటే రోజుకు 1,100 గ్యాలన్ల నీటిని ఆదా చేసినట్టే. పది కేజీల కార్బన్ ఉద్గారాలను తగ్గించి భూమికి మేలు చేసినట్టే. ఒక జంతువు జీవితాన్ని కాపాడిన వారవుతారు. మీ భోజన ఎంపిక మీ ఆరోగ్యం గురించే కాదు, భూమిపైన జంతుజాలం నివసించడానికి, ఆరోగ్యకరమైన భూమి కోసం కూడా' అంటున్నారు వీగన్ ప్రేమికులు.

'వీగన్ డైట్ ఎంపికలో సవాళ్లెన్నో ఉంటాయి. ప్రొటీన్లు, కాల్షియం, విటమిన్ బి12 పోషకాల కోసం ఆహార ఎంపికలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదాహరణకు.. ఉడికించిన శనగలను తీసుకుంటే ప్రొటీన్లు, విటమిన్లు, ఐరన్.. వంటి పోషకాలు లభిస్తాయి. శనగలను ఉడకబెట్టి, కూర లేదా సలాడ్ రూపంలో తయారుచేసి తీసుకోవచ్చు. సోయాబీన్స్‌లో మాంసాహారంతో సమానంగా ప్రొటీన్లు లభిస్తాయి. ఇందులోని ఐరన్, జింక్, క్యాల్షియం, విటమిన్లు, ఫ్యాటీ యాసిడ్స్.. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి బీపీని కంట్రోల్‌లో ఉంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు మహిళల్లో మెనోపాజ్ లక్షణాలను తగ్గిస్తాయి. వేరుశనగలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు,ఫైబర్ లభిస్తాయి. బరువును కంట్రోల్‌లో ఉంచడానికి సహకరిస్తాయి. క్వినోవాలో ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. మాంగనీస్, పొటాషియం, ఫాస్పరస్, విటమిన్ బి6 వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. చిక్కుడు జాతికి చెందిన రాజ్మా, బ్లాక్ బీన్స్ వంటివి ఆహారంలో భాగం చేసుకోవాలి. విటమిన్ బి, ఫైబర్, ప్రొటీన్లు లభించే ఈ చిక్కుళ్లు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బాదంపప్పు, పిస్తా, అక్రోట్ వంటి నట్స్ రోజూ కొన్ని తీసుకుంటే గుండెకు మేలు చేస్తాయి. నట్స్‌లో క్యాలరీలు ఎక్కువ కాబట్టి మితంగా తీసుకోవాలి. ఇలా మొక్కల ఆధారిత గింజలు, మొలకెత్తిన విత్తనాలను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. రుచికరంగా, ఆరోగ్యకరంగా జీవనశైలిని మార్చుకోవచ్చు.'

– శారద, ప్లాంట్‌ప్రెన్యూర్, సిమీస్ వరల్డ్, హైదరాబాద్

వీగన్ ప్రేమికుల కోసం కొన్ని మేలైన వంటకాలు



అరటిపండుతో ఐస్ క్రీం

కావలసినవి: 3 అరటిపండ్లు; 1/2 కప్పు కొబ్బరి పాలు (లేదా బాదం పాలు); 2 టేబుల్ స్పూన్లు మాపుల్ సిరప్ (తీపి కోసం); 1 టేబుల్ స్పూన్ వెనిల్లా సిరప్; 1/4 స్పూన్ ఉప్పు.

తయారీ: ● పండిన అరటిపండ్లను తొక్క తీసి, ముక్కలుగా కోసి, కనీసం 4 గంటలు ఫ్రీజర్‌లో ఉంచాలి. రాత్రిపూట పెడితే మరీ మంచిది. ● బ్లెండర్ లేదా ఫుడ్ ప్రాసెసర్‌లో గడ్డకట్టిన అరటిపండ్లను, కొబ్బరి పాలు, మాపుల్, వెనిల్లా సిరప్, ఉప్పు కలిపి, మృదువుగా, క్రీమీగా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి. ● బ్లెండ్ చేసిన మిశ్రమాన్ని మళ్ళీ ఫ్రీజర్‌లో పెట్టి 2 గంటల సేపు ఉంచాలి. ● తర్వాత తీసుకొని, మృదువైన ఐస్‌క్రీమ్ రుచిని ఆస్వాదించాలి.

మునగాకు స్మూతీ



కావలసినవి: మునగాకు పొడి – టీ స్పూన్; పసుపు – అర స్పూన్; బాదం పాలు/ కొబ్బరి పాలు – కప్పు ; అరటిపండు – 1; అవిసెగింజలు లేదా చియా గింజలు – టీ స్పూన్; తురిమిన అల్లం – అర టీ స్పూన్; నల్ల మిరియాలు – అర టీ స్పూన్; ఖర్జూరం – తగినంత; ఐస్ క్యూబ్స్ – తగినన్ని;

తయారీ: ● అన్ని పదార్థాలను మిక్సీజార్‌లోల వేసి, మిశ్రమం మృదువుగా అయ్యేవరకు బ్లెండ్ చేయాలి.● గ్లాస్‌లో పోసి, పుదీనా ఆకుతో అలంకరించి సర్వ్ చేయాలి. చిటికెడు దాల్చిన చెక్కపొడి చల్లుకోవచ్చు. ● ఈ స్మూతీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. సైనస్ సమస్యలు క్లియర్ అవుతాయి. రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

సిల్కెన్ టోఫు - చాక్లెట్ మూస్



కావలసినవి: కప్పు సిల్కెన్ టోఫు (డ్రైన్డ్); అరకప్పు డార్క్ చాక్లెట్ (కరిగించినది); 2 టేబుల్ స్పూన్ల తియ్యని కోకో పౌడర్ ; 2 టేబుల్ స్పూన్ల మాపుల్ సిరప్ లేదా అగావ్ సిరప్ (రుచికి తగినంత); స్పూన్ వెనిల్లా ఎసెన్స్; రాళ్ల ఉప్పు స్పూను; **అలంకరణకు...** తాజా బెర్రీలు (స్ట్రాబెర్రీ, రస్‌బెర్రీ లేదా బ్లూబెర్రీ); షేక్ చేసిన డార్క్ చాక్లెట్ లేదా కోకో నిబ్స్; విప్డ్ క్రీమ్

తయారీ: ● డార్క్ చాక్లెట్‌ను మైక్రోవేవ్ లేదా డబుల్ బాయిలర్‌లో మెల్లగా కరిగించాలి. కొద్దిగా చల్లబరచాలి. ● బ్లెండర్ లేదా ఫుడ్ ప్రాసెసర్‌లో, సిల్కెన్ టోఫు, కరిగించిన చాక్లెట్, కోకో పౌడర్, మాపుల్ సిరప్, వెనిల్లా ఎసెన్స్, చిటికెడు ఉప్పు వేసి, కలపాలి. మిశ్రమం మృదువుగా అయ్యే వరకు బ్లెండ్ చేయాలి. ● అవసరమైతే మరింత సిరప్ జోడించి, తీపిని సరిచూసుకోవచ్చు. ● సర్వింగ్ బౌల్ లేదా గ్లాసులో పోసి, 1–2 గంటల పాటు ఫ్రీజర్‌లో ఉంచాలి. ● సర్వ్ చేసే ముందు, తాజా బెర్రీలు, షేవ్ చేసిన చాక్లెట్ లేదా వేగన్ విప్డ్ క్రీమ్‌తో అలంకరించాలి.

కాలీఫ్లవర్ - క్యారట్ ఆమ్లెట్



కావలసినవి: కాలీఫ్లవర్ తరుగు – కప్పు; కారట్ తరుగు – అర కప్పుడు; శనగపిండి – పావు కప్పు; సోయా పాలు – పావు కప్పు; న్యూట్రిషనల్ ఈస్ట్ (మార్కెట్లో లభిస్తుంది) – టేబుల్ స్పూన్; పసుపు – కొద్దిగ; నల్ల ఉప్పు – రుచికి తగినంత; ఆలివ్ ఆయిల్ లేదా కొబ్బరి నూనె – టేబుల్ స్పూన్; కొత్తిమీర – తగినంత.

తయారీ: ● కాలీఫ్లవర్ పువ్వులను మెత్తగా అయ్యేవరకు ఆవిరిమీద ఉడికించి, గరిటతో మెత్తగా మెదపాలి. ● ఒక గిన్నెలో కాలీఫ్లవర్ గుజ్జు, తురిమిన కారెట్, శనగపిండి, సోయా పాలు, ఈస్ట్, పసుపు, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. ● పెనంపైన నూనె వేసి వేడి చేయాలి. ● కలిపిన మిశ్రమాన్ని పెనంపైన వేసి, ఆమ్లెట్‌లా స్పూన్‌తో సర్దాలి. గోధుమరంగు వచ్చేవరకు రెండు వైపులా ఉడికించి, కొత్తిమీరతో అలంకరించి, వేడిగా వడ్డించాలి.

ఒక ఐడియా నీటి వృథాకు చెక్ చెప్పింది!





● తాను రూపొందించిన పరికరంతో ప్రభాత్

ఇప్పుడు ఇంచు మించు ప్రతి ఇంటిలోనూ ఆర్వోలను వినియోగించడం పెరిగిపోయింది. ఆర్వో వాటర్ ఆరోగ్యానికి మంచో చెడో అనే విషయాన్ని పక్కన పెడితే... నీటి వినియోగంలో గ్లాసు నీటి శుద్ధికి నాలుగు గ్లాసుల నీరు వృథా అవుతుంది. భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నప్పుడు ఫరవాలేదు కానీ అవి అడుగంటిపోయి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుక్కునే వారికి ఆర్వోల వినియోగంలో అయ్యే నీటి వృథా ఒక ఇంజినీర్‌కు మంచి ఐడియానిచ్చింది. నీటి వృథాకు చెక్ చెప్పింది.

ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు వంటి మహానగరాలలో రోజువారీ అవసరాల కోసం నీటిని కొనుక్కోవటం గతంలో వేసవికాలానికి మాత్రమే పరిమితమయ్యేది. కానీ ఇప్పుడు ఏడాదిలో రెండు మూడు నెలలు మినహా అన్ని కాలాలు అదే దుస్థితి. ఆర్వోలు వినియోగించడం అనివార్యం అయిపోయింది.

బెంగళూరు నివాసి ప్రభాత్ విజయన్ ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారాన్ని కనుక్కోవాలని నిర్ణయించుకున్నాడు. హోరామావులో నివసిస్తున్న 45 ఏళ్ల ఈ టెక్ మేనేజర్ తన ఇంట్లో ఉపయోగిస్తున్న వాటర్ ప్యూరిఫయర్ ద్వారా గ్లాసు శుభ్రమైన నీటికి నాలుగింతల నీరు వృథా కావడాన్ని గమనించాడు. ఈ వృథా నీరు ఎలాంటి ఉపయోగమూ లేకుండా నేలలో కలిసిపోవడం అతన్ని తీవ్రంగా బాధించింది. వెంటనే దీనికి ఓ పరిష్కారం కనుక్కోవాలనుకున్నాడు. ఒక డ్రమ్ము, స్క్రూడ్రైవర్ ఆయుధాలుగా వెంటనే ఆ ఆలోచనను కార్యాచరణలో పెట్టాడు.

నీరు సమృద్ధిగా ఉండే కేరళలోని అలెప్పీకి చెందిన ప్రభాత్, ప్రతి చుక్కకు డబ్బు చెల్లించాల్సిన రోజు ఒకటి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. కానీ 2014లో బెంగళూరుకు వెళ్లాక పరిస్థితి మారిపోయింది. అతనుండే అపార్ట్‌మెంట్‌లో రోజువారీ అవసరాల కోసం కచ్చితంగా ట్యాంకర్ల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఒక్కో ట్యాంకర్ ధర రూ.1,000. అదే సమయంలో వాటర్ ప్యూరిఫయర్ ద్వారా పెద్దమొత్తంలో నీరు వృథా అవుతుండటం అతని దృష్టికి వచ్చింది. ఈ పరికరం ద్వారా ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని అనిపించింది. ఈ ప్రక్రియలో ఉపయోగించే రివర్స్ ఆస్మాసిస్ గురించి అధ్యయనం చేశాడు. ఈ విధానంలో ప్రతి లీటరు నీటికి నాలుగురెట్ల నీరు వృథా కావడం తప్పనిసరని అర్థం చేసుకున్నాడు. నీటి కొరత, అపార్ట్‌మెంటు వాసుల ఆందోళన, ఈ సమస్యతో స్వయంగా తాననుభవిస్తున్న కష్టం... ఇవన్నీ ప్రభాత్‌ను పరిష్కారం దిశగా ప్రేరేపించాయి. అందుకే ప్యూరిఫయర్‌లో వృథా అవుతున్న నీటిని తిరిగి వినియోగించుకోవడానికి ఒక సెటప్‌ను రూపొందించాడు.

రివర్స్ ఆస్మాసిస్ (ఆర్. ఓ.) అంటే...

రివర్స్ ఆస్మాసిస్ అనేది నీటి శుద్ధీకరణలో ఒక పద్ధతి. నీటిలోని మలినాలు, క్లోరిన్, లవణాలు, ధూళి ఇతర కలుషితాలను సెమీ–పెర్మెబుల్ పొరతో ఫిల్టర్ చేస్తారు.

నీటి వృథా నుంచి పునర్వియోగం దిశగా...

● ప్రభాత్ 50–లీటర్ డ్రమ్మును తన ఇంటిలో ఒక మూలన రెండు చదరపుటడుగుల స్థలంలో ఉంచారు.

● స్క్రూడ్రైవర్‌తో డ్రమ్ మూతకు ఒక చిన్న రంధ్రం చేసి డిశ్చార్జ్ పైపును చొప్పించాడు. దీన్ని ప్యూరిఫయర్‌కు అనుసంధానించడం ద్వారా డ్రమ్‌లోకి వచ్చి చేరిన నీటిని పాత్రల శుభ్రం, టాయిలెట్ క్లీనింగ్, ఇల్లు తుడవడం, గార్డెనింగ్‌కు ఉపయోగించడం మొదలుపెట్టాడు.

సింపుల్‌గా.... ఎలాంటి పెట్టుబడి అవసరం లేకుండా ఇప్పుడతను స్మార్ట్‌గా వృథా నీటిని రీయూజ్ చేస్తున్నాడు. ''ప్రస్తుతం నేను రూపొందించిన ఈ వ్యవస్థతో నెలకు కేవలం మా ఇంటినుంచే ఆరు పూర్తి నీటి ట్యాంకర్లకు సమానమైన నీటిని ఆదాచేస్తున్నాం. ఆ ఖర్చును మిగుల్చుకున్నాం. ఇప్పుడు ఇది మా కుటుంబ జీవన విధానంగా మారింది'' అని సంతోషంగా చెప్పాడు.

బాగుంది కదూ... మనం కూడా ఇలా స్మార్ట్‌గా ఆలోచిస్తే నీటి వృథాకు చెక్ చెప్పవచ్చు.



● ఇన్నోవేషన్

హరిణి.... హరిత ఇంధనం



అసాధారణ జ్ఞానం నుంచి మాత్రమే కాదు అవసరాల నుంచి కూడా ఆవిష్కరణలు పుడతాయి అని చెప్పడానికి హరిణి ఒక ఉదాహరణ. వంటగది వ్యర్థాల నుంచి బయోగ్యాస్‌ను తయారుచేసే ఆలోచన చేసి విజయవంతం అయింది. ఆ ఆలోచన తనను ఎంట్రప్రెన్యూర్‌ని చేసింది.

తమిళనాడులోని సేలంకు చెందిన హరిణి రవికుమార్ 'గ్రీన్ కనెక్ట్' వ్యవస్థాపకురాలు. 'గ్రీన్ కనెక్ట్' దేశ వ్యాప్తంగా వెయ్యి బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్లు సేంద్రియ వ్యర్థాలను విలువైన ఇంధన శక్తిగా మారుస్తాయి. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా ఉంటాయి.

హౌజ్‌హోల్డ్ కార్బన్ ఫుట్‌ప్రింట్స్‌ను తగ్గించడానికి ఆచరణాత్మక, శక్తిమంతమైన మార్గాలను 'గ్రీన్ కనెక్ట్' అందిస్తుంది. సహజమైన ప్రక్రియ ద్వారా వంటగది వ్యర్థాలను వంట ఇంధనంగా మార్చడానికి రూపొందించిన ఈ యూనిట్‌ను బాల్కనీలు, టెర్రస్‌లాంటి ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. వంటగది వ్యర్థాలతో బయోగ్యాస్, సేంద్రియ ఎరువుతో పాటు పోషకాలు అధికంగా ఉండే కంపోస్ట్‌ని ఉత్పత్తి చేస్తుంది. ఇది మొక్కలకు సహజ ఎరువుగా ఉపయోగపడుతుంది.

ఇలా....

● చెత్తను సేకరించిన తరువాత నాన్-ఆర్గానిక్ వేస్ట్ నుంచి ఆర్గానిక్ వేస్ట్‌ను వేరు చేయాలి. ● ఆర్గానిక్ వేస్ట్‌ను ఎయిర్‌టైట్ కంటెయినర్ లేదా డైజెస్టర్‌లో వేయాలి. ● టైట్ చాంబర్‌లో బయోగ్యాస్‌ను స్టోర్ చేయాలి. ● స్టోర్ చేసిన బయో గ్యాస్‌ను వంట గ్యాస్‌గా ఉపయోగిస్తారు.




● మీకు తెలుసా?



తరచూ నోటి పూత, పళ్ల లోంచి నెత్తురు కారడం, పంటి నొప్పి తో బాధపడేవారు కొత్తిమీర కషాయంతో పుక్కిలిస్తే ఆ సమస్యలన్నీ తగ్గుతాయి.

కొత్తిమీరని నూరి చెంచా కొత్తిమీర ముద్ద 2 గ్లాసుల నీళ్లలో వేసి గ్లాసు నీళ్లు మిగిలేలా మరిగించి వడగట్టి, కాస్త పంచదార వేసుకొని తాగితే పైత్యం, కడుపులో మంట, అధిక దాహం, వికారం, తల తిరుగుడు తగ్గుతాయి.

● ధనియాలు, జీలకర్రని సమానంగా తీసుకొని వేయించి, మెత్తగా దంచి, తగినంత కారం, ఉప్పు కలిపి అన్నంలో కలుపుకొని, నెయ్యి వేసుకొని తింటే, కడుపులో మంట, పైత్యం, తలతిరుగుడు, వాంతి, వికారం, అజీర్తి విరేచనాలు, తగ్గుతాయి.



సాఫ్ట్ టాయ్స్.. సమస్యలు హార్డ్!

పిల్లలు సాఫ్ట్ టాయ్స్‌తో ఆడుకోవడం... వాళ్లు టెడ్డీబేర్ లాంటి టాయ్స్‌ను నిత్యం అంటిపెట్టుకుని ఉండటం చూస్తుంటాం. అయితే ఆ సాఫ్ట్‌టాయ్స్‌లో అసంఖ్యాకమైన సూక్ష్మక్రిములు ఉంటాయని, పిల్లలు వాటిని హత్తుకుని ఉండటం వల్ల వాటినుంచి వారికి వ్యాపించి, అది ప్రమాదకరమైన వ్యాధులకు కారణమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. బ్లాంకెట్, టాయ్‌లెట్ సీట్, డస్ట్‌బిన్, సాఫ్ట్ టాయ్స్... వీటిలో ఉండే సూక్ష్మక్రిములను పరిశీలించి చూడగా ఆశ్చర్యకరమైన నిజాలు బయటపడ్డాయి. వీటన్నిటిలోనూ టాయ్‌లెట్ సీట్‌ను మించి సాఫ్ట్ టాయ్స్‌లోనే అత్యధిక బ్యాక్టీరియా ఉంటుందని తెలిసింది. అందువల్ల పిల్లలకు ఆడుకోవడానికి ఇచ్చే సాఫ్ట్ టాయ్స్ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వాటిని తరచు శుభ్రం చేస్తుండాలని, లేకపోతే వారికి అంతు తెలియని వ్యాధులు వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

● యోగా

భావోద్వేగాల బ్యాలెన్స్‌కు వశిష్ట



వశిష్ఠాసనాన్ని సైడ్ ప్లాంక్ పోజ్ అని కూడా అంటారు. అథ్లెటిక్స్ చేసే వ్యాయామాలను పోలి ఉంటుంది. కాబట్టి శరీరానికి తగినంత చురుకుదనం లభిస్తుంది. శరీర బరువు బ్యాలెన్స్‌ను సరిచూసుకోవడానికి ఈ ఆసనం ఉపయోగపడుతుంది.

ఎలా చేయాలంటే...

● మ్యాట్ పైన పడుకొని ఎడమచేతి వైపు తిరగాలి. తర్వాత ఎడమపాదం నుంచి కుడిమోకాలిని వంచి, ఎడమ చేతిని నేలకు ఆనించి శరీరాన్ని పైకి లేపాలి. బరువు మొత్తం చేతి మీద వేయడం సాధ్యం కాని వాళ్లు మోచేతి వరకు ఉంచాలి.


● కుడిచేతిని కుడి తుంటిపై ఉంచాలి. బరువు మొత్తం ఎడమ పాదం, ఎడమ చేతిపైనే ఉంటుంది కాబట్టి బాడీని బ్యాలెన్స్ చేయడం తప్పనిసరి. ● తుంటి భాగాన్ని వీలైనంత పైకి ఎత్తి, కుడిమడమ నుండి తల వరకు శరీరాన్ని ఒక సరళ రేఖలోఉంచేలా దృష్టి పెట్టాలి. ● కనీసం 5 దీర్ఘ శ్వాసలు తీసుకుంటూ, వదిలి ఉండగలగాలి. తర్వాత యథాస్థితికి వచ్చి, తిరిగి కుడివైపు ఇదే విధంగా చేయాలి.

ప్రయోజనాలు...

ఈ ఆసనం ద్వారా శక్తిస్థాయిలు పెరుగుతాయి. కండరాలు, వెన్నుముక సమస్యలు తగ్గి బలం పెరుగుతుంది. శరీరానికి, మైండ్‌కి, కండరాలకు సమతుల్యతనిస్తుంది. ఛాతీ, ఊపిరితిత్తులను బలోపేతం చేస్తుంది. ఎమోషన్స్‌ను బ్యాలెన్స్ చేస్తుంది.

సాక్షి సినిమా


ఏంటీ... ఈ కల



● విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే

విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా రూపొందుతోన్న చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'హృదయం లోపల...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు. 'ఏదో ఏదో గమ్మత్తులా ఏంటీ... ఈ కల.. ఏదో ఏదో అయ్యేంతలా ఉందే అలా...' అంటూ సాగే పల్లవితో ఈ పాట ఆరంభం అవుతుంది. కేకే సాహిత్యం అందించిన ఈ పాటని గాయని అనుమిత నదేశన్‌తో కలిసి అనిరుధ్ ఆలపించారు. ఈ పాటకి దార్ గై కొరియోగ్రఫీ అందించారు.

బకాసుర రెస్టారెంట్‌లో వినోదం



● ప్రవీణ్

హాస్య నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఈ సినిమా ద్వారా ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష, కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, 'కేజీఎఫ్' గరుడరామ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్దన్ ఆచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఎస్‌జే శివ మాట్లాడుతూ– ''హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'బకాసుర రెస్టారెంట్' రూపొందింది. వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రవీణ్‌లోని మరో కోణాన్ని చూపిస్తుంది'' అన్నారు.

ఆసక్తి గొలిపే చర్చలతో వేవ్స్



● నాగార్జున

'వేవ్స్'లో హీరో నాగార్జున మాట్లాడుతూ– ''పుష్ప' సిరీస్ సినిమాలు తెలుగు కంటే వేరే భాషల్లో ఎక్కువగా వసూళ్లు సాధించాయి. వందలో దాదాపు తొంబై మంది తమ ఒత్తిడి పోగొట్టుకునేందుకు తెరపై జరిగే మ్యాజిక్ (సినిమాలు) చూసేందుకు ఇష్టపడుతుంటారు. నేటి తరం ప్రేక్షకులు కథానాయకులను పుష్పరాజ్ ('పుష్ప'లో అల్లు అర్జున్), రాకీ భాయ్ ('కేజీయఫ్'లో యశ్), బాహుబలి ('బాహుబలి'లో ప్రభాస్) లాంటి లార్జర్ దేన్ లైఫ్ రోల్స్‌లో చూడాలనుకుంటున్నారు. నేనూ దాన్నే ఇష్టపడతాను. కేవలం హీరోల ఎలివేషన్ ఒక్కటే కాదు.. బలమైన కథలతోనే ఆయా చిత్రాలు బ్లాక్‌బస్టర్ అయ్యాయి. రాజమౌళి 'బాహుబలి' సినిమాని తెలుగులోనే తెరకెక్కించినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఆదరించారు'' అన్నారు.



● ఖుష్బూ

భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నాలుగు రోజుల వరల్డ్ ఆడియో, విజువల్ అండ్ ఎంటర్‌టైన్మెంట్ సమ్మిట్ (వేవ్స్) – 2025 రెండో రోజు సైతం అట్టహాసంగా సాగింది. ముంబైలోని జియో వరల్డ్ సెంటర్ వేదికగా జాతీయ, అంతర్జాతీయ సినీ ప్రముఖులు, దర్శక, నిర్మాతలు, ఔత్సాహిక సినీ రూపకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున సమ్మిట్‌కు హాజరయ్యారు. వివిధ వేదికలపై చర్చాగోష్ఠులు, ముఖాముఖీలు కొనసాగాయి. మీడియా – వినోద రంగంలో వివిధ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలనూ, వ్యూహాలనూ పరస్పరం పంచుకొనేందుకు వీలుగా గ్లోబల్ మీడియా డైలాగ్ అలాగే, క్రియేట్ ఇండియా ఛాలెంజ్ పోటీలోని విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. వేవ్స్ బజార్ వేదికగా వివిధ చిత్ర నిర్మాణ సంస్థలు, వ్యక్తుల మధ్య కంటెంట్ మార్కెటింగ్ అవకాశాల అన్వేషణ నడిచింది. భవిష్యత్తులో స్టూడియోలు, సాఫ్ట్ పవర్‌గా సినిమా, డిజిటల్ యుగంలో మారుతున్న కథాకథన రీతులు, మారుతున్న భారతీయ సినిమా ముఖచిత్రం తదితర అంశాలపై చర్చాగోష్ఠులు జరిగాయి. దక్షిణాది సినీ ప్రముఖులు నాగార్జున, విజయ్ దేవరకొండ, అమల అక్కినేని, సుప్రియ యార్లగడ్డ, ఖుష్బూ, కార్తి, రవి మోహన్, హిందీ చిత్ర సీమ నుంచి అనుపమ్ ఖేర్, ఆమిర్ ఖాన్, కరణ్ జోహార్, కరీనా కపూర్, సోనాలీ కులకర్ణి, 'ఆదిపురుష్' చిత్రదర్శకుడు ఓం రౌత్, ఆస్కార్ అవార్డు గెల్చిన మహిళా నిర్మాత గునీత్ మోంగా సదస్సు ప్రాంగణంలో ఉత్సాహంగా చర్చల్లో పాల్గొన్నారు.



హీరో ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ– ''ఇండియాలోనే కాదు... ప్రపంచవ్యాప్తంగా మంచి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఉండాలి. విదేశాల్లో డిస్ట్రిబ్యూషన్ గురించి మన నిర్మాతలు ఆలోచిస్తే మార్పు మొదలవుతుంది. దేశవ్యాప్తంగా మరిన్ని స్క్రీన్స్ పెంచేందుకు ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం చాలా ఉంది'' అన్నారు.



● కరణ్ జోహార్, కరీనా, విజయ్ దేవరకొండ

కృత్రిమ మేధ (ఏఐ) రాకపై ఆసిడెంట్ రిచర్డ్ జి. కెర్రీస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో ఆసక్తికరంగా వివరించారు. హాలు మొత్తం ప్రేక్షకులతో కిక్కిరిసిపోగా, మీడియా దిగ్గజం అరుణ్ పురీ సహా పలువురు కెర్రీస్ తెరపై చూపిన ఏఐ ఆధారిత సినిమా వీడియోలను చూశారు. పుగటో లాంటి సాఫ్ట్ వేర్లతో ఆడియోలో సౌండ్ ఎఫెక్ట్‌ల మొదలు సంగీత బాణీల దాకా ఎలా మార్చుకోవచ్చో సమావేశంలో వివరించిన తీరు హర్షధ్వానాలు అందుకుంది. భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చేరువ చేయడమనే అంశంపై నీతా అంబానీ ఇచ్చిన కీలకోపన్యాసం ఓ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

''ఇవాళ మన దేశానికి అతి పెద్ద మార్కెటింగ్ సాధనం... సినిమా. నేను కశ్మీర్‌లో షూటింగ్ చేస్తున్నా, నన్ను జనం గుర్తు పడుతున్నారంటే దానికి సినిమాయే కారణం! మనం మన (సినీ) సామ్రాజ్యాన్ని మరింత విస్తరించుకోవాల్సి ఉంది. దేశం సరిహద్దులు దాటి మన సినిమా ముందుకు వెళ్లాలంటే, అక్కడా మన సినిమాల డిస్ట్రిబ్యూషన్‌ను పెంచుకోవడమే మార్గం. అలాగే, బాక్సాఫీస్ వద్ద మన సినిమాల జోరు పెరగాలంటే, వివిధ భాషల నటులు కలసి సినిమాలు చేయాలి''.
– హీరో విజయ్ దేవరకొండ

''లార్జర్ దేన్ లైఫ్ పాత్రలతో పాటు కుటుంబాన్ని ప్రేమిస్తూ, కుటుంబ సభ్యుల కోసం ఏమైనా చేసే పాత్రలనూ ప్రేక్షకులు ఇవాళ ప్రేమిస్తున్నారు. ఇవాళ ప్యాన్ ఇండియా అనేది ఫ్యాషన్ అయిపోయింది. అసలు ఈ కంగాళీ పదం రాక ముందే మన మణిరత్నం తీసిన 'రోజా, బొంబాయి' లాంటివి అఖిల భారత చిత్రాలే కదా. అవన్నీ భాష, ప్రాంతాలకు అతీతంగా దేశవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్నాయి''. **– నటి ఖుష్బూ**

''ఇవాళ ఓటీటీ సహా అనేక రకాల కంటెంట్ అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రేక్షకులు హీరో వీరోచిత విన్యాసాలు, ఊహల్లో విహరింపజేసే భారీ పాటలు, డ్యాన్సులు చూసేందుకు సినిమా హాళ్ళకు వస్తున్నారు. అయితే, ప్రతిదీ భారీ, ప్యాన్ ఇండియా సినిమా కావాల్సిన పని లేదు. మంచి కథతో, చిన్న సినిమాలూ రావాలి''.
– హీరో కార్తి

''ఏ తెరపై ఏ కథ చెప్పినా... నిజాయతీగా, భావోద్వేగభరితంగా చెప్పడం కీలకం. ప్రేక్షకులు తెరపై ఎంత భారీతనాన్ని ఇష్టపడినప్పటికీ, సినిమా రూపకర్తలోని ఆ నిజాయతీ, నిబద్ధతను ఇట్టే గమనిస్తారు. ఆస్వాదిస్తారు, అభినందిస్తారు. సినిమా విజయానికి అదే ప్రధాన సూత్రం''. **– నటుడు అనుపమ్ ఖేర్**

''స్టోరీ టెల్లింగ్, కంటెంట్ క్రియేషన్ లాంటి పెద్ద పెద్ద మాటలు చెబుతాం కానీ, ప్రేక్షకులకు నచ్చిందా, లేదా అన్నదే ఆఖరికి మిగిలే అసలు పాయింట్. అంతే. ఎంచుకున్న ఆలోచనను బలంగా నమ్మాలి. అలా నమ్మిన ఆలోచనతో ముందుకు వెళ్ళాలి''.
– సుప్రియ యార్లగడ్డ, నిర్మాత, అన్నపూర్ణా స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

''ఉత్తరాది, దక్షిణాది లాంటి చీలికలు, భేదాల చుట్టూ తిరగకుండా, ఏది గొప్ప, ఏది తక్కువ అనే వాదన కన్నా, మనది భారతీయ సినిమా అనే భావన చాలా ముఖ్యం. భారతీయ సినిమా అంటే ఇదీ అని చూపాలంటే, నేను గురుదత్ తీసిన 'కాగజ్ కే ఫూల్, ప్యాసా' లాంటి సినిమాలు ప్రపంచానికి చూపాలంటాను''.
– దర్శక – నిర్మాత కరణ్ జోహార్

''కరోనా తర్వాత తమిళ సినిమాను తీసే విధానం, జనం చూసే విధానం కూడా మారాయి. రకరకాల వేదికలపై ఇప్పుడు కంటెంట్ అందుబాటులో ఉంది. మొబైల్‌తో కూడా సినిమా తీసేయచ్చు. అందులోనే రిలీజ్ చేయవచ్చు. చూడవచ్చు. అది ఒక మార్గం, అదనపు చేర్పు. అంతే తప్ప భారీ వెండితెర వినోదం మాత్రం ఎన్నటికీ చెరిగిపోదు, కరిగిపోదు''. **– తమిళ హీరో 'జయం' రవి**

- ముంబై నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

సరికొత్త కథ

ఆశిష్ గాంధీ, మానసా రాధాకృష్ణన్ జంటగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్య దర్శకత్వంలో ఆర్యయు రెడ్డి నిర్మిస్తున్నారు. ఒక్క పాట మినహా షూటింగ్ పూర్తయింది. ఆర్యయు రెడ్డి మాట్లాడుతూ– ''సరికొత్త కథాంశంతో రూపొందుతోన్న చిత్రమిది. మా దర్శకులు కిరణ్ కిట్టి, లక్ష్మీ చైతన్య కొత్తవారైనా చెప్పిన కథను చెప్పినట్లు తెరకెక్కించారు. మిగిలిన ఒక్క పాటను జానీ మాస్టర్ నేతృత్వంలో షూట్ చేస్తాం. గోపీసుందర్ అందించిన ఆరు పాటలు మా సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి. త్వరలో ఫస్ట్ లుక్‌ని, రెండు నెలల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం. మా బ్యానర్‌లో ఈ ఏడాది మరికొన్ని సినిమాలు ప్రారంభిస్తాం'' అన్నారు.



● ఆర్యయు రెడ్డి

థ్రిల్లింగ్ జర్నీ

రవిప్రకాశ్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '6 జర్నీ'. బషీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవిప్రకాశ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం మే 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బషీర్ ఆలూరి మాట్లాడుతూ– ''లవ్, సస్పెన్స్, యాక్షన్, థ్రిల్ అంశాలతో పాటు దేశభక్తి ప్రధానంగా ఉన్న సినిమా '6 జర్నీ'. ఈ సినిమా ఆడియన్స్‌ను తప్పక మెప్పిస్తుంది'' అని తెలిపారు. ''ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. మంచి సినిమాను ఆదరించే ప్రేక్షకులు మా సినిమానూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని అన్నారు హీరో సమీర్, నిర్మాత పాల్యం రవిప్రకాశ్ రెడ్డి. ''6 జర్నీ' అందరికీ నచ్చే చిత్రం'' అని హీరోయిన్ పల్లవి, నటి సాహితి చెప్పారు.



● పల్లవి

డార్క్ కామెడీ

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''డార్క్ కామెడీ కథతో రూపొందుతోన్న చిత్రమిది. కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న మా సినిమా షూట్ తుది దశలో ఉంది. ఈ చిత్రంలోని సర్‌ప్రైజింగ్ అంశాలు, వినోదం హైలైట్‌గా నిలుస్తాయి'' అని యూనిట్ పేర్కొంది.



● నరేశ్ అగస్త్య

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
260	13
80,502	24,347

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	17,998	▲	286
డోజోన్స్	41,285	▲	532
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,956	▲	100
డాక్స్	23,086	▲	590
షాంఘై (బుధవారం ముగింపు)	3,279	▼	8
నికాయ్	36,831	▲	378

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.60	84.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.50	113.39
€	యూరో	ఎస్‌బీఐ	93.82	96.49
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.85	60.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.91	55.09
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.01	67.72
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.66	23.17
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.14	23.92
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.76	12.58

జీడీపీ వృద్ధి 6.3 శాతమే

- 2025–26 అంచనాలకు ఎస్అండ్‌పీ మళ్లీ కోత
- వాణిజ్య విధానాలపై అస్పష్టత వల్లే



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించి భారత జీడీపీ వృద్ధి అంచనాలను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ మరోసారి తగ్గించింది. గత అంచనాలను 0.2 శాతం మేర తగ్గించి 6.3 శాతంగా ప్రకటించింది. 2026–27లో 6.5 శాతం నమోదు కావొచ్చని అంచనా వేసింది. అమెరికా వాణిజ్య విధానాల్లో నెలకొన్న అనిశ్చితులు ప్రభావం చూపించొచ్చని తెలిపింది. రక్షణాత్మక ధోరణులు పెరిగిపోతున్న తరుణంలో దీన్నుంచి ప్రయోజనం పొందే విజేతలు ఎవరూ ఉండరని పేర్కొంది. చైనా జీడీపీ సైతం 2025లో 0.7 శాతం మేర తగ్గిపోయి 3.5 శాతానికి.. 2026లో మరింత తగ్గి 3 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది. ఈ ఏడాది మార్చిలోనూ ఎస్అండ్‌పీ 2025–26 సంవత్సరం భారత జీడీపీ వృద్ధి అంచనాలను 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గించడం గమనార్హం. వృద్ధి అంచనాలకు కోత పెట్టడం ఇది రెండోసారి. అంచనాలకు మించి టారిఫ్‌ల వల్ల ఆర్థిక వ్యవస్థ ఏ మేరకు నిదానిస్తుందన్న దానిపైనే తమ ప్రాథమిక వృద్ధి అంచనాలు ఆధారపడి ఉంటాయని ఎస్అండ్‌పీ స్పష్టం చేసింది.

88కి రూపాయి..

2025 చివరికి డాలర్ మారకంలో రూపాయి విలువ 88 వద్ద స్థిరపడొచ్చని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. అమెరికా టారిఫ్‌ల ప్రకటన తర్వాత డాలర్–రూపాయి మారకంలో తీవ్ర ఆటుపోట్లు నెలకొనడం తెలిసిందే. ప్రస్తుతం 84 స్థాయిలో ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 1.5 శాతం, 2026లో 1.7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేసింది. అమెరికా టారిఫ్ విధానాలను మూడు బకెట్లుగా పేర్కొంది. చైనాతో దీర్ఘకాలంగా ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దాన్ని విడిగాను, ఐరోపా యూనియన్‌తో సంక్లిష్టంగా ఉండొచ్చని తెలిపింది. మిగిలిన దేశాలు ప్రతీకార చర్యలకు బదులు చర్చల ద్వారా అమెరికాతో ఒప్పందానికి రావచ్చని అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థలపై టారిఫ్‌ల వాస్తవ ప్రభావాన్ని చూడాల్సి ఉందని పేర్కొంది.

అమెరికాలో ఇక మేడిన్ ఇండియా ఐఫోన్లే!

మిగతా మార్కెట్ల కోసం చైనాలో తయారీ



న్యూఢిల్లీ: జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే మెజారిటీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని టెక్ దిగ్గజం యాపిల్ సీఈవో టిమ్ కుక్ తెలిపారు. ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్ మొదలైనవి వియత్నాంలో తయారైనవి ఉంటాయని పేర్కొన్నారు. ఇతరత్రా దేశాల్లో విక్రయించే ఉత్పత్తులు మాత్రమే అత్యధికంగా చైనాలో తయారవుతాయని పేర్కొన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై అమెరికా భారీగా టారిఫ్‌లు ప్రకటించిన నేపథ్యంలో కుక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొంత మినహాయింపులున్నా, వివిధ టారిఫ్‌లను కలిపితే చైనా నుంచి ఎగుమతి చేసే తమ ఉత్పత్తులపై ఏకంగా 145 శాతం సుంకాలు వర్తిస్తాయని కుక్ తెలిపారు. ఎస్అండ్‌పీ గ్లోబల్ విశ్లేషణ ప్రకారం 2024లో అమెరికాలో ఐఫోన్ విక్రయాలు 7.59 కోట్లుగా ఉండగా, మార్చిలో భారత్ నుంచి 31 లక్షలు ఎగుమతయ్యాయి. టారిఫ్ రేట్లు, పాలసీలు ప్రస్తుతం ఉన్నట్లుగానే కొనసాగితే జూన్ త్రైమాసికంలో తమ వ్యయాలపై రూ. 900 మిలియన్ డాలర్ల మేర ప్రతికూల ప్రభావం పడుతుందని కుక్ చెప్పారు.

బంగారం @ 96,800

- 10 గ్రాములకు రూ.1,080 పెరుగుదల
- రూ.1,600 జంప్ చేసిన వెండి



న్యూఢిల్లీ: బంగారం మళ్లీ మెరిసింది. జ్యువెలర్లు కొనుగోళ్లకు ముందుకు రావడంతో శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.1,080 పెరిగి రూ.96,800 వద్ద స్థిరపడింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం కేవలం రూ.180 లాభపడి రూ.96,350 వద్ద ముగిసింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్లో బంగారం పట్ల సానుకూల ధోరణి కనిపించింది. ఔన్స్‌కు 47 డాలర్లు పెరిగి 3,269 డాలర్ల స్థాయికి చేరింది. మరోవైపు వెండి ధర సైతం దేశీయంగా కిలోకి రూ.1,600 ఎగసి రూ.97,100 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల ధోరణితో జ్యువెలర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపించినట్టు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. యూఎస్ వాణిజ్య ఒప్పందాలపై తాజాగా నెలకొన్న సందిగ్ధతతో బంగారం పట్ల సానుకూల సెంటిమెంట్ ఏర్పడినట్టు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ వైస్ ప్రెసిడెంట్ జతీన్ త్రివేది తెలిపారు. అస్పష్టతకు తోడు వాణిజ్య సంప్రదింపులపై మారుతున్న అమెరికా వైఖరితో ఇన్వెస్టర్లు బంగారంలో షార్ట్ పొజిషన్లను కవర్ చేసుకునేందుకు మొగ్గు చూపించినట్టు చెప్పారు.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు సుప్రీంలో చుక్కెదురు

భూషణ్ స్టీల్ కొనుగోలు కేసు

న్యూఢిల్లీ: భూషణ్ స్టీల్ అండ్ పవర్ (బీఎస్‌పీఎల్)ను దక్కించుకోవడానికి సంబంధించి జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. కంపెనీ సమర్పించిన పరిష్కార ప్రణాళికను అత్యున్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఇది దివాలా చట్టానికి (ఐబీసీ) విరుద్ధమని, అక్రమమని స్పష్టం చేసింది. ఐబీసీ కింద బీఎస్‌పీఎల్ లిక్విడేషన్ ప్రక్రియను ప్రారంభించాల్సిందిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ని (ఎన్‌సీఎల్‌టీ) సుప్రీం కోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే, దివాలా చట్టం కింద 2021లో బీఎస్‌పీఎల్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 49% వాటా దక్కించుకుంది. తర్వాత దీన్ని 83%కి పెంచుకుంది. అయితే, ఇందుకు అనుసరించిన విధానం, నిబంధనలకు విరుద్ధంగా ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అలాగే, నిర్దేశిత గడువులోగా పరిష్కార ప్రణాళికను అమలు చేయలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజా ఆదేశాలిచ్చింది. కోర్టు ఆదేశాలను పరిశీలిస్తున్నామని, పూర్తి ఉత్తర్వుల కాపీ అందిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని ఎక్స్ఛేంజీలకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తెలిపింది.



ఈ వార్తలతో శుక్రవారం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు సుమారు 5% క్షీణించి రూ. 972 వద్ద ముగిసింది.

వాణిజ్య ఒప్పందంపై ఆశలతో లాభాలు

- సెన్సెక్స్ లాభం 260 పాయింట్లు
- బ్యాంకులు, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాలతో ముగిసింది. అమెరికా – భారత్ వాణిజ్య ఒప్పందంపై ఆశలు, రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్ల అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 260 పాయింట్లు పెరిగి 80,502 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 13 పాయింట్లు బలపడి 24,347 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే భారీ లాభాలు ఆర్జించాయి. ఐటీ, బ్యాంకుల షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 936 పాయింట్లు బలపడి 81,178 వద్ద గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 255 పాయింట్లు ఎగసి 24,589 వద్ద ఈ ఏడాది గరిష్టాన్ని నమోదు చేసింది. అయితే ద్వితీయార్థంలో గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో లాభాలు తగ్గాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీగా సూచీల్లో సర్వీసెస్ 1.67%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 0.69%, ఇంధన 0.57%, ఐటీ ఇండెక్సు అర శాతం పెరిగాయి. టెలికమ్యూనికేషన్ 2%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.66%, విద్యుత్, యుటిలిటీ 1%, మెటల్, రియల్టీ సూచీలు అరశాతం నష్టపోయాయి. మిడ్ క్యాప్ 1.67%, స్మాల్ క్యాప్ సూచీ 0.07 శాతం పతనమయ్యాయి.
- మార్చి క్వార్టర్ నికరలాభం 4% వృద్ధి నమోదుతో అదానీ పోర్ట్స్–సెజ్ షేరు 4% పెరిగి రూ.1,267 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 6% ఎగసి రూ.1,295 వద్ద గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,812 కోట్లు పెరిగి రూ.2.73 లక్షల కోట్లకు చేరింది.
- భూషణ్ స్టీల్ అండ్ పవర్‌ను దక్కించుకునేందుకు సమర్పించిన ప్రణాళికలు దివాలా పరిష్కార ప్రక్రియ చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయంటూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు 5.5% నష్టపోయి రూ.972 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 8% క్షీణించి రూ.948 వద్ద కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీకి రూ.13,731 కోట్ల నష్టం వాటిల్లింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2.37 లక్షల కోట్లకు దిగివచ్చింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌లతో చిన్న సంస్థలకు టెన్షన్ | పది నెలల గరిష్టానికి తయారీ రంగం

ఐవోబీ లాభం జూమ్

క్యూ4లో రూ. 1,050 కోట్లు • రూ. 4,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) గతేడాది (2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో నికర లాభం 30% జంప్‌చేసి రూ. 1,050 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 808 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 9,106 కోట్ల నుంచి రూ. 9,215 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం మరింత అధికంగా రూ. 6,629 కోట్ల నుంచి రూ. 7,634 కోట్లకు బలపడింది. ఈ ఏడాది సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 4,000 కోట్లు సమీకరించనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అజయ్ కుమార్ శ్రీవాస్తవ వెల్లడించారు. తద్వారా బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 94.61 శాతం నుంచి 90 శాతానికి దిగిరానున్నట్లు పేర్కొన్నారు. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) 3.1 శాతం నుంచి 2.14 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.57 శాతం నుంచి 0.37 శాతానికి తగ్గాయి.

ఐవోబీ షేరు ఎన్ఎస్ఈలో 0.6% లాభంతో రూ.38 వద్ద క్లోజైంది.

ఎన్ఎస్ఈ వేవ్స్ ఇండెక్స్ షురూ

ఎంటర్‌టైన్‌మెంట్, మీడియా, గేమింగ్ పరిశ్రమలకు ప్రాతినిధ్యం



ముంబై: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్‌ను ప్రవేశపెట్టింది. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించే 43 లిస్టెడ్ కంపెనీలతో ఇండెక్సు రూపొందించింది. తద్వారా ఫిల్మ్, టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, మ్యూజిక్, గేమింగ్ తదితర వివిధ పరిశ్రమలకు చోటు కల్పించింది. స్టోరీలు, మ్యూజిక్, ఇన్నోవేషన్, క్రియేటివ్ స్పిరిట్ ఇకపై దేశం నుంచి భారీగా ఎగుమతికానున్నట్లు 2025 వేవ్స్‌లో ఎన్ఎస్ఈ ఇండెక్స్‌ను విడుదల చేస్తూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. 2005 ఏప్రిల్1 ఇండెక్స్‌కు బేస్‌కాగా.. ప్రాథమిక విలువను 1,000గా నిర్ధారించారు. దేశీయంగా అత్యంత డైనమిక్ రంగాలలో ఒకటైన మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమ లోతును ప్రతిబింబించే విధంగా నిఫ్టీ వేవ్స్ ఇండెక్స్‌కు తెరతీసినట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ తెలియజేశారు.

సాక్షి స్పోర్ట్స్



ఐదో ర్యాంక్‌లో హంపి

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ర్యాంకింగ్స్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి పురోగతి సాధించింది. శుక్రవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో క్లాసికల్ ఫార్మాట్ మహిళల విభాగంలో హంపి ఒక స్థానం మెరుగుపర్చుకొని ఐదో ర్యాంక్‌లో నిలిచింది. గత నెలలో హంపి ఆరో స్థానంలో ఉంది. పుణేలో జరిగిన మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె టోర్నీలో హంపి విజేతగా నిలవడంతో ఆమె ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. భారత్‌కే చెందిన ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక 14వ స్థానంలో, వైశాలి 16వ ర్యాంక్‌లో నిలవగా... ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ 19వ స్థానంలో ఉంది. మరోవైపు క్లాసికల్ ఫార్మాట్ ఓపెన్ విభాగంలో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ 3వ ర్యాంక్‌లో, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 4వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ప్రజ్ఞానంద 7వ స్థానంలో, అరవింద్ చిదంబరం 12వ స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ 15వ స్థానంలో ఉన్నారు.



‘ఉత్తమ ప్లేయర్’గా సౌమ్య గుగులోత్

ఏఐఎఫ్‌ఎఫ్ వార్షిక అవార్డులు


భువనేశ్వర్: దేశవాళీ మహిళల ఫుట్‌బాల్ 2024–2025 సీజన్‌లో నిలకడైన ఆటతీరుతో రాణించిన తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్‌కు తగిన గౌరవం లభించింది. ఈ సీజన్‌కుగాను మహిళల విభాగంలో సౌమ్య ‘ఉత్తమ ప్లేయర్’ అవార్డును సొంతం చేసుకుంది. 2024–2025 ఇండియన్ ఉమెన్ లీగ్ (ఐడబ్ల్యూఎల్)లో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు ఆడిన సౌమ్య తొమ్మిది గోల్స్‌తో భారత టాప్ స్కోరర్‌గా నిలిచింది. అంతేకాకుండా తొలిసారి ఈస్ట్ బెంగాల్ జట్టుకు ఐడబ్ల్యూఎల్ టైటిల్ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. నిజామాబాద్ జిల్లాలోని కునేపల్లి గ్రామానికి చెందిన 23 ఏళ్ల సౌమ్య ఖాతాలో రెండోసారి ఐడబ్ల్యూఎల్ టైటిల్ చేరింది. 2021–2022 ఐడబ్ల్యూఎల్ సీజన్ విజేత గోకులం కేరళ జట్టులోనూ సౌమ్య సభ్యురాలిగా ఉంది. 2015లో భారత అండర్–14 జట్టుకు... 2016లో భారత అండర్–16 జట్టుకు ఆడిన సౌమ్య 2016 నుంచి 2018 వరకు భారత అండర్–19 జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2021లో భారత సీనియర్ మహిళల జట్టులోకి ఎంపికైన సౌమ్య ఇప్పటి వరకు 33 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి ఐదు గోల్స్ సాధించింది. 2017లో ఇండియా రష్ సాకర్ క్లబ్ (ముంబై) తరఫున తొలిసారి ఐడబ్ల్యూఎల్‌లో బరిలోకి దిగిన సౌమ్య... 2019–2020 సీజన్‌లో కెంక్రె ఎఫ్‌సీ (ముంబై) తరఫున ఆడింది. 2021–2022 సీజన్‌లో గోకులం కేరళ జట్టుకు ఆడిన సౌమ్య 2022–2023లో క్రొయేషియాకు చెందిన డైనమో జాగ్రెబ్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఒక ఏడాది క్రొయేషియా లీగ్‌లో ఆడిన తర్వాత భారత్‌కు తిరిగి వచ్చిన సౌమ్య 2023–2024 ఐడబ్ల్యూఎల్‌లో మరోసారి గోకులం కేరళ జట్టు తరఫున బరిలోకి దిగింది.

టైటాన్స్ ఏడో గెలుపు
రైజర్స్ ఏడో ఓటమి


ఐపీఎల్‌లో గత సీజన్ రన్నరప్ సన్‌రైజర్స్ హైదరాబాద్ ‘ప్లే ఆఫ్స్’ వెళ్లే అవకాశాలకు దాదాపు తెరపడినట్లే! హైదరాబాద్ జట్టు అధికారికంగా ఇంకా నిష్క్రమించకపోయినా ఏడో ఓటమితో సమీకరణాలన్నీ సంక్లిష్టంగా మారిపోయాయి. ఆశలు నిలవాలంటే గుజరాత్‌పై కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పేలవ బౌలింగ్‌తో ఓటమిని మూటగట్టుకుంది. సొంత మైదానంలో గిల్, బట్లర్, సుదర్శన్ బ్యాటింగ్‌తో భారీ స్కోరు నమోదు చేసిన టైటాన్స్ దానిని నిలబెట్టుకుంది. ఏడో విజయంతో గుజరాత్ మరో మెట్టు పైకెక్కి ప్లే ఆఫ్స్‌కు చేరువైంది.

హైదరాబాద్ ‘ప్లే ఆఫ్స్’ ఆశలకు దెబ్బ!

- 38 పరుగులతో గుజరాత్ విజయం
- గిల్, బట్లర్ అర్ధ సెంచరీలు



అభిషేక్



గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఆడిన రెండు మ్యాచ్‌లలో నెగ్గిన గుజరాత్ టైటాన్స్ 2–0తో పైచేయి సాధించింది. శుక్రవారం జరిగిన పోరులో గుజరాత్ 38 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (38 బంతుల్లో 76; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (37 బంతుల్లో 64; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... సాయి సుదర్శన్ (23 బంతుల్లో 48; 9 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులే చేయగలిగింది. అభిషేక్ శర్మ (41 బంతుల్లో 74; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు.

పరుగుల వరద...

తొలి 2 ఓవర్లలో 16 పరుగులతో గుజరాత్ ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. అయితే తర్వాతి 4 ఓవర్లలో ఏకంగా 66 పరుగులు వచ్చాయి. షమీ ఓవర్లో సుదర్శన్ 5 ఫోర్లతో (4, 0, 4, 4, 4, 4) చెలరేగిపోగా, కమిన్స్ ఓవర్లో గిల్ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. హర్షల్ ఓవర్లోనూ సుదర్శన్ 4 ఫోర్లతో దూకుడు ప్రదర్శించాడు. పవర్‌ప్లే ముగిసేసరికి టైటాన్స్ 82 పరుగులు చేసింది. ఆ జట్టుకు ఐపీఎల్‌లో ఇదే అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. తొలి వికెట్‌కు గిల్‌తో 41 బంతుల్లోనే 87 పరుగులు జోడించిన అనంతరం సుదర్శన్ వెనుదిరిగాడు. ఆ తర్వాత 25 బంతుల్లో గిల్ అర్ధ సెంచరీ పూర్తయింది. మరోవైపు బట్లర్ కూడా దూకుడు కనబర్చాడు. 22 పరుగుల వద్ద అతను ఇచ్చిన క్యాచ్‌ను కమిన్స్ వదిలేయడం కూడా కలిసొచ్చింది. అన్సారీ ఓవర్లో 6, 4 కొట్టిన బట్లర్ 31 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఉనాద్కట్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్ ఆసక్తికరంగా సాగింది. ఈ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన గుజరాత్...3 వికెట్లు కోల్పోయింది.

అభిషేక్ పోరాటం వృథా...

భారీ ఛేదనలో తొలి వికెట్‌కు 49 పరుగులు జత చేశాక ట్రవిస్ హెడ్ (16 బంతుల్లో 20; 4 ఫోర్లు) వెనుదిరిగాడు. అభిషేక్ సిక్సర్లతో ధాటిగా ఆడటంతో పవర్‌ప్లేలో 57 పరుగులు వచ్చాయి. ఇషాన్ కిషన్ (13) పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడగా, అభిషేక్‌కు క్లాసెన్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) సహకరించాడు. 28 బంతుల్లోనే అభిషేక్ హాఫ్ సెంచరీ పూర్తయింది. అభిషేక్, క్లాసెన్ మూడో వికెట్‌కు 33 బంతుల్లో 57 పరుగులు జత చేసినా... చేయాల్సిన రన్‌రేట్ పైపైకి వెళ్లడంతో బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. 31 బంతుల్లో 86 పరుగులు చేయాల్సిన స్థితిలో అభిషేక్ అవుట్ కాగా... మరో మూడు బంతులకే క్లాసెన్ కూడా వెనుదిరగడంతో హైదరాబాద్ ఆశలు గల్లంతయ్యాయి. చివర్లో నితీశ్ కుమార్ రెడ్డి (10 బంతుల్లో 21 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ప్యాట్ కమిన్స్ (10 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) కొన్ని షాట్లు ఆడినా అది సరిపోలేదు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) క్లాసెన్ (బి) అన్సారీ 48; గిల్ (రనౌట్) 76; బట్లర్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 64; సుందర్ (సి) నితీశ్ రెడ్డి (బి) ఉనాద్కట్ 21; షారుఖ్ (నాటౌట్) 6; తెవాటియా (సి) అనికేత్ (బి) ఉనాద్కట్ 6; రషీద్ (సి) అండ్ (బి) ఉనాద్కట్ 0; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 224. వికెట్ల పతనం: 1–87, 2–149, 3–206, 4–218, 5–224, 6–224. బౌలింగ్: షమీ 3–0–48–0, ఉనాద్కట్ 4–0–35–3, కమిన్స్ 4–0–40–1, హర్షల్ 3–0–41–0, అన్సారీ 4–0–42–1, కమిందు 2–0–18–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) రషీద్ (బి) ప్రసిద్ 20; అభిషేక్ (సి) సిరాజ్ (బి) ఇషాంత్ 74; ఇషాన్ కిషన్ (సి) ప్రసిద్ (బి) కొయెట్జీ 13; క్లాసెన్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ 23; అనికేత్ (సి) షారుఖ్ (బి) సిరాజ్ 3; నితీశ్ రెడ్డి (నాటౌట్) 21; కమిందు (సి) బట్లర్ (బి) సిరాజ్ 0; కమిన్స్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 186. వికెట్ల పతనం: 1–49, 2–82, 3–139, 4–141, 5–145, 6–145. బౌలింగ్: సిరాజ్ 4–0–33–2, ఇషాంత్ 3.2–0–35–1, ప్రసిద్ 4–0–19–2, కొయెట్జీ 4–0–36–1, సుందర్ 1–0–6–0, రషీద్ 3–0–50–0, సాయికిషోర్ 0.4–0–1–0.

ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లక్నో	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్తాన్	11	3	8	0	6	-0.780
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	10	2	8	0	4	-1.211

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ఫ.తే–ఫలితం తేలనివి, పా–పాయింట్లు, ర.రే– రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × చెన్నై
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



శ్రీశాంత్‌పై మూడేళ్ల నిషేధం

కేరళ క్రికెట్ సంఘం క్రమశిక్షణా చర్యలు

తిరువనంతపురం: భారత మాజీ పేస్ బౌలర్ ఎస్. శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ సంఘం (కేసీఏ) తీవ్ర చర్యలు తీసుకుంది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు అతనిపై మూడేళ్ల నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. కేరళ ఆటగాడు సంజు సామ్సన్ చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టులోకి ఎంపిక కాకపోవడంతో శ్రీశాంత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఒక మళయాళ టీవీ చానల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ... సామ్సన్‌ను విజయ్ హజారే వన్డే టోర్నీకి కేరళ క్రికెట్ సంఘం ఎంపిక చేయకపోవడం తప్పుడు నిర్ణయమని శ్రీశాంత్ వ్యాఖ్యానించాడు. దీని వల్లే అతను చాంపియన్స్ ట్రోఫీ అవకాశాలు కోల్పోయాడని అభిప్రాయపడ్డాడు. ఈ క్రమంలో కేరళ సంఘంపై పలు ఆరోపణలు చేసిన అతను... సామ్సన్‌తో పాటు ఇతర కేరళ క్రికెటర్లకు తాను అండగా ఉంటానని, కేరళ సంఘం నుంచి వారిని రక్షిస్తానని అతను పేర్కొన్నాడు. ఇదే కారణంగా శ్రీశాంత్‌పై వేటు పడింది. ఈ వివాదం మొదలైన సమయంలో శ్రీశాంత్‌తో పాటు కేరళ క్రికెట్ లీగ్‌లో అతను సహ యజమానిగా ఉన్న కొల్లామ్ ఏరీస్ టీమ్‌కు కూడా కేసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

‘నేను తప్పు చేయలేదు’

కేసీఏ తనపై నిషేధం విధించడంపై స్పందిస్తూ తాను ఎలాంటి తప్పూ చేయలేదని స్పష్టం చేశాడు. ‘నిజాయితీగా చెప్పాలంటే అసలు నేను ఏం తప్పు చేశానో అర్థం కావడం లేదు. సామ్సన్ మనవాడు. అందుకే ఒక మంచి ఉద్దేశంతో అతడికి మద్దతు పలికానంతే. కేసీఏను ఎక్కడా విమర్శించలేదు. అసోసియేషన్‌లో ఉన్నవారు కాస్త పెద్ద స్థాయిలో క్రికెట్ ఆడిన వారైతే బాగుండేది అని మాత్రమే అన్నాను. సామ్సన్ మాత్రమే కాదు కేరళ ఆటగాళ్లు ఎవరికైనా మనం అండగా నిలవాలి నాపై నిషేధం వెనక ఎలాంటి కారణం ఉందో నాకు అర్థం కాలేదు. కేరళ అభిమానులే దీనిని నిర్ణయించండి’ అని శ్రీశాంత్ చెప్పాడు. భారత్ తరఫున 90 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన శ్రీశాంత్ టి20, వన్డే వరల్డ్ కప్‌లు గెలిచిన జట్లలో భాగంగా ఉన్నాడు.

క్లుప్తంగా...

లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులు

- 5వ తేదీ నుంచి 17వరకు మీ సేవా కేంద్రాల్లో స్వీకరణ
- ఇంటర్‌లో గణితం నుంచి బీటెక్ సివిల్ వరకు అర్హత

సాక్షి, హైదరాబాద్: లైసెన్సుడు సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానించింది. ఈనెల 5 నుంచి రాష్ట్రంలోని అన్ని మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మీసేవా కేంద్రాల్లోనే ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్‌లో గణితంతో 60% మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పనిదినాల్లో శిక్షణ ఇస్తామని, ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం 9849081489, 7032634404, 9441947339 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇంజనీరింగ్ సెట్‌కు 94 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజున ఉదయం 93.46 శాతం, సాయంత్రం 94.28 శాతం విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరైనట్టు ఈఏపీసెట్ కోకన్వీనర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి జేఎన్‌టీయూహెచ్ నేతృత్వంలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్) నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రి, ఫార్మా సెట్ పూర్తయింది. శుక్రవారం మొదలైన ఇంజనీరింగ్ సెట్ ఈ నెల 4వ తేదీతో ముగుస్తుంది.

మోడల్ స్కూల్ అడ్మిషన్లకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: మోడల్ స్కూళ్లలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. మొదటి దశ ప్రవేశాల కోసం ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ శ్రీనివాసచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ కోసం ‘దోస్త్’ రెడీ

నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి

- అందుబాటులో మొత్తం 3,93,467 సీట్లు
- నేటి నుంచి రిజిస్ట్రేషన్.. 10 నుంచి వెబ్ ఆప్షన్లకు చాన్స్
- 29న తొలిదశ సీట్ల కేటాయింపు.. జూన్ 30 నుంచి తరగతులు



దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న బాలకిష్టారెడ్డి, దేవసేన తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులకు ‘దోస్త్’ఆహ్వానం పలికింది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి తలుపులు తెరిచింది. తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సేవలు (దోస్త్) నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యా మండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన, మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకూ రూ.200 చెల్లించి ‘దోస్త్’లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈనెల 10 నుంచి 22 వరకూ వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చినట్టు చెప్పారు. మొత్తం మూడు దశల్లో దోస్త్ కౌన్సెలింగ్ ఉంటుందని, తొలి దశ సీట్ల కేటాయింపు వివరాలను ఈ నెల 29న ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 1,057 డిగ్రీ కాలేజీలుండగా, దోస్త్ పరిధిలో 3,93,467 సీట్లు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది జీరో అడ్మిషన్లు నమోదైన 80 కాలేజీలకు ఈసారి అనుమతి ఇవ్వడం లేదన్నారు.

ఈ వెబ్‌కు లాగిన్ అవ్వాలి

రాష్ట్రంలోని ఏ కాలేజీకైనా ఇంటి వద్దే ఉండి డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసేందుకు ‘దోస్త్’వీలు కల్పిస్తుంది. https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ తేలిక. ఇక్కడే సమాచారం అంతా ఉంటుంది. అన్ని డిగ్రీ కోర్సుల వివరాలను దీని ద్వారా తెలుసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌తో ‘దోస్త్’ఐడీ పొంది, దరఖాస్తు ఫీజు చెల్లించిన తర్వాత పిన్ వస్తుంది. ఇది చివరి వరకూ జాగ్రత్తగా ఉంచుకోవాలి. ఐడీ ద్వారా లాగిన్ అయి, ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చు. విద్యార్థి మొబైల్ నంబర్‌కు ఆధార్ లింక్ అయి ఉంటే, మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దీనిద్వారా ‘దోస్త్’వెబ్‌కు లాగిన్ అవ్వొచ్చు. ‘దోస్త్’మొబైల్ యాప్ కూడా అందుబాటులో ఉంది. సెల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా దీనికి లాగాన్ అవ్వొచ్చు. ఏ మార్గంలోనైనా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.


సీట్ల కేటాయింపు ఇలా..: వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సీట్లు కేటాయిస్తారు. వచ్చిన సీటు నచ్చితే వెంటనే ఆన్‌లైన్ ద్వారా సీటును అంగీకరించాలి. లేని పక్షంలో తదుపరి కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు ఇవ్వొచ్చు. 2024 ఏప్రిల్ 1 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను సీటు పొందే సమయంలో చూపించాలి. ‘దోస్త్’కు సంబంధించి మొత్తం 40 హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర హెల్ప్‌లైన్ సెంటర్ ఒకటి, విశ్వవిద్యాలయాల సేవా కేంద్రాలు ఆరు, జిల్లా కేంద్రాలు 33 వీటిలో ఉన్నాయి. హెల్ప్ లైన్ నంబర్ 040–23120416 ద్వారా సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారం చేసుకోవచ్చు.

దోస్త్ ముఖ్యమైన తేదీలు ఇవీ..

ఏది	ఎప్పటి నుంచి ఎప్పటివరకు...
తొలి దశ రిజిస్ట్రేషన్	**3.5.25 - 21.5.25**
వెబ్ ఆప్షన్లు	10.5.25- 22.5.25
ధ్రువపత్రాల పరిశీలన (ప్రత్యేక కేటగిరీలకు)	21.5.25 - 22.5.25
తొలి దశ సీట్ల కేటాయింపు	29.5.25
సెల్ఫ్ రిపోర్టింగ్	30.5.25 - 09.6.25
రెండో దశ రిజిస్ట్రేషన్	**30.5.25 - 08.6.25**
వెబ్ ఆప్షన్లు	30.5.25 - 09.6.25
ధ్రువపత్రాల పరిశీలన (ప్రత్యేక కేటగిరీలకు)	09.6.25
సీట్ల కేటాయింపు	13.6.25
సెల్ఫ్ రిపోర్టింగ్	13.6.25 - 18.6.25
మూడో దశ రిజిస్ట్రేషన్	**13.6.25 - 19.6.25**
వెబ్ ఆప్షన్లు	13.6.25 - 19.6.25
ధ్రువపత్రాల పరిశీలన (ప్రత్యేక కేటగిరీలకు)	18.6.25
సీట్ల కేటాయింపు	23.6.25
సెల్ఫ్ రిపోర్టింగ్	23.6.25 - 28.6.25
అన్ని దశల్లో సీట్లు పొందిన వారు	
కాలేజీలో రిపోర్టింగ్ చేయాల్సిన తేదీ	24.6.25- 28.6.25
కాలేజీలో విద్యార్థుల ఓరియంటేషన్	24.6.25 - 28.6.25
డిగ్రీ మొదటి సెమిస్టర్ క్లాసులు	30.6.25 నుంచి

అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు, భర్తీ అయిన సీట్ల వివరాలు సాక్షి ప్లస్‌లో

క్లాస్ రూంలో ఏఐ..



చేయూతనిస్తేనే చదువు

- ఫీజు చెల్లించలేక కూలీ పనులకు వెళ్తున్న నర్సింగ్ విద్యార్థిని
- దాతలు సాయం చేయాలని కోరుతున్న తల్లిదండ్రులు



వైరా రూరల్: నిరుపేద కుటుంబమైనా ఆడ బిడ్డలను గొప్పగా చదివించాలని తల్లిదండ్రులు కలలు కన్నారు. కానీ ఫీజు చెల్లించలేక కుమార్తె చదువును మధ్యలో ఆపేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఖమ్మం జిల్లా వైరా మండలం అష్టగుర్తికి చెందిన కొమ్మాజి ఏసోబు–బాలకుమారి దంపతులు సుతారీ, వ్యవసాయ పనులకు వెళ్తారు. మొదటి కుమార్తె శ్రావణి సూర్యాపేటలోని ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫస్ట్ ఇయర్‌లో చేరింది. ఏటా కళాశాల ఫీజు రూ.50 వేలు, హాస్టల్ ఫీజు రూ.50 వేలు. అయితే ఫస్టియర్ ఫీజు సువిధ ట్రస్ట్ బాధ్యులు రూ.30 వేలు, శ్రావణి తల్లిదండ్రులు రూ.5 వేలు ఫీజు చెల్లించగా.. మిగతా ఫీజు బకాయి పడ్డారు. మరో నెలలో పరీక్షలు జరగనుండగా కళాశాల నిర్వాహకులు శ్రావణిని ఇంటికి పంపించేశారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆమె తల్లితో కలిసి మిర్చి కోత పనులకు వెళ్తోంది. శ్రావణి నర్సింగ్ పూర్తిచేసేలా దాతలు చేయూతనివ్వాలని ఆమె తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు దాతలు ‘ఎస్‌బీఐ, సోమవరం బ్రాంచ్, ఖాతా నంబర్ 62264985053, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0013328’ ద్వారా ఆర్థికసాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 190 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 72,507 మంది..
- ఇందిరమ్మ ఇళ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు..
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పరీక్ష కేంద్రాలకు మూడంచెల భద్రత ఏర్పాటు: మహేశ్‌భగవత్

5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూభారతి

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెల 4వ తేదీ నుంచి నీట్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం వారు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీట్‌తోపాటు, భూభారతి, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రంలో నీట్ నిర్వహణకు 190 కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 72,507 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు.

590 మండలాల్లో అవగాహన సదస్సులు

ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో భూభారతిని అమలు చేస్తున్నామని పొంగులేటి చెప్పారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను 31వ తేదీలోపు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు కాలేదో లిఖిత పూర్వకంగా దరఖాస్తు దారునికి తెలపాలని కలెక్టర్లకు సూచించారు. 590 మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికను మరింత వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇళ్లను కేటాయించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

దోస్త్ 2024-25లో అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు, భర్తీ అయిన సీట్ల వివరాలు

మేనేజ్‌మెంట్	కాలేజీలు	మొత్తం	భర్తీ అయిన	మిగిలిపోయిన	బాలురు	బాలికలు మొత్తం
ప్రభుత్వ	124	50100	12497	12297	24794	25306
అటానమస్	29	32460	12979	12829	25808	6652
ఎయిడెడ్	27	11310	3060	3002	6062	5248
ఎయిడెడ్ అటానమస్	3	1320	0	698	698	622
ప్రైవేటు	714	285750	48061	56449	104510	181240
ప్రైవేటు అటానమస్	4	5750	2143	1373	3516	2234
రైల్వే	1	390	162	80	242	148
వర్సిటీ అటానమస్	2	2967	1213	783	1996	971
వర్సిటీ కాలేజ్	4	3420	662	2110	2772	648
మొత్తం	908	393467	80777	89621	170398	223069

రెసిడెన్షియల్ కాలేజీల్లో అడ్మిషన్లు ఇలా.. (2024-25)

కేటగిరీ	కాలేజీలు	అందుబాటులో	భర్తీ అయినవి	మిగిలినవి
ఎస్సీ రెసిడెన్షియల్	28	7880	4255	3625
ఎస్టీ రెసిడెన్షియల్	22	5480	2500	2980
బీసీ రెసిడెన్షియల్	29	10294	2018	8276
మొత్తం	79	23654	8773	14881

దోస్త్ పరిధిలో లేని కాలేజీలు... సీట్లు (2024-25)

కాలేజీల సంఖ్య	సీట్లు	భర్తీ	మిగిలినవి
70	40603	17649	22954

దోస్త్, నాన్-దోస్త్, రెసిడెన్షియల్ కాలేజీలు... అందుబాటులో సీట్లు... భర్తీ అయినవి (2024-25)

కాలేజీలు	సీట్లు	భర్తీ అయినవి	మిగిలినవి
1057	457724	196820	360904




బీబీపేటలోని తిమ్మయ్యగారి సుశీల నారాయణరెడ్డి జెడ్పీ హైస్కూల్ ముఖద్వారం

- డిజిటల్ తరగతులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు..
- సీసీ కెమెరాల నిఘా
- సౌర విద్యుత్ ప్లాంట్
- అందుబాటులో శానిటరీ ప్యాడ్స్ కాల్చేసే యంత్రం

సర్కారు బడి.. ఆధునిక వసతుల ఒడి..

కార్పొరేట్‌కు తీసిపోని సర్కారు పాఠశాల

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అది సర్కారు బడి.. కానీ కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా అన్ని వసతులతో ఉంటుంది. ఆధునిక హంగులతో నిర్మించిన పాఠశాల భవనంలో.. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అదే బీబీపేటలోని తిమ్మయ్యగారి సుశీల నారాయణరెడ్డి జెడ్పీ హైస్కూల్. పాఠశాల పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి.. తన తల్లిదండ్రులు తిమ్మయ్యగారి సుశీల, నారాయణరెడ్డి పేరిట రూ.6 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు. రెండంతస్తుల్లో కలిపి 30 గదులున్నాయి.

ఇక్కడంతా స్మార్ట్ బోధనే..

ఈ హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్ ఉంది. కంప్యూటర్ ల్యాబ్‌లో 45 కంప్యూటర్లున్నాయి. విద్యార్థులకు విడతల వారీగా కంప్యూటర్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆట స్థలం కూడా ఉంది. ఆధునిక మరుగుదొడ్లు నిర్మించారు. పాఠశాలలోని తరగతి గదులతో పాటు కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, కాన్ఫరెన్స్ హాల్, పాఠశాల చుట్టూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడేం జరిగినా హెడ్మాస్టర్ గదిలో అంతా కనిపిస్తుంది. ఈ పాఠశాలలో 610 మంది విద్యార్థులుండగా.. వారిలో 210 మంది విద్యార్థినులున్నారు. ఈ నేపథ్యంలో నెలసరి సమయంలో సానిటరీ ప్యాడ్స్ మార్చుకునేందుకు విద్యార్థినులకు సౌకర్యం కల్పించారు. మార్చుకున్న ప్యాడ్స్‌ను కాల్చేసే ఓ మెషీన్‌ను కూడా అందుబాటులో ఉంచారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉన్నా, ఇక్కడి సౌకర్యాలను చూసి చాలామంది పిల్లలు బీబీపేట ఉన్నత పాఠశాలలో చేరుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలో 610 మంది విద్యార్థులు ఉండగా, అందులో 143 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.


ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ప్రతినెలా రూ. లక్షన్నర వరకు వ్యయం

పాఠశాలలో పరీక్షల నిర్వహణకు జిరాక్స్ మెషీన్‌ను కూడా కొనుగోలు చేశారు. అయిదు కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్‌ను కూడా నెలకొల్పారు. పూర్వ విద్యార్థుల సహకారంతో భారీ నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులు, వాచ్‌మన్లు కలిపి ఎనిమిది మంది ఉన్నారు. పాఠశాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడం వారి విధి. పాఠశాల నిర్వహణకు ప్రతినెలా రూ.లక్షన్నర వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన మొత్తాన్ని వ్యాపారవేత్త సుభాష్‌రెడ్డితోపాటు పూర్వ విద్యార్థులు సమకూరుస్తున్నారు.


కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు


సైన్స్ ల్యాబ్‌లో..


డిజిటల్ స్క్రీన్ ద్వారా బోధన


పాఠశాలలోని సౌర విద్యుత్ ప్లాంట్

రామగుండం ఉద్యోగులకు రిలీవ్ ఉత్తర్వులు


మూతపడిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

సాక్షి ఎఫెక్ట్

రామగుండం: బదిలీ అయిన రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రానికి చెందిన వివిధ శాఖల ఉద్యోగులను ఎట్టకేలకు రిలీవ్ చేశారు. వీరిని గత నెలలో యాదాద్రికి బదిలీ చేస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్.. ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. అయితే, బదిలీ ఉత్తర్వులు వెలువడి సుమారు నెల రోజులు కావస్తున్నా.. ఉద్యోగులు రిలీవ్ కావడం లేదు. దీంతో 'బదిలీ అయినా కదలరు' శీర్షికతో శుక్రవారం 'సాక్షి' డిజిటల్ పేజీలో కథనం ప్రచురితమైంది. దీంతో ఆరుగురు ఇంజనీర్లు, 55 మంది (మరో ఐదుగురు మెడికల్ లీవ్‌లో ఉన్నారు) ఓఅండ్‌ఎం ఉద్యోగులను రిలీవ్ చేసినట్లు బీ-థర్మల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.విజేందర్ శుక్రవారం తెలిపారు. తాను కూడా రెండు రోజుల్లో రిలీవ్ కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో పరిపాలన, ఇంజనీర్లు, గ్రేడ్-2 ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.


బదిలీ అయినా కదలరు
బదిలీలపై జెన్‌కో ఉద్యోగుల మధ్య సంఘర్షణ
'సాక్షి'లో ప్రచురితమైన కథనం

కాల్పుల విరమణ ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించాలి

పౌరహక్కుల సంఘాల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: శాంతి చర్చలు ప్రారంభించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించాలని పలు పౌర హక్కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పారామిలిటరీ దాడులు వెంటనే నిలిపివేయాలని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌర సమాజం, రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు, వ్యక్తులు కలిసికట్టుగా ప్రభుత్వాన్ని, ప్రతిపక్షాలతో సహా అన్ని రాజకీయ పక్షాలను శాంతి చర్చలవైపు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ శాంతి చర్చల కమిటీ ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ కార్యకర్త సోని సోరి, ఛత్తీస్‌గఢ్ బచావో ఆందోళన్ బేలా భాటియా, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కవితా శ్రీవాత్సవ తదితరులు ఈ ప్రకటన విడుదల చేశారు.


శుక్రవారం హైదరాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు. ఈ సందర్భంగా స్పీకర్ ఆయన్ను సత్కరించారు

బొమ్మను చూస్తే నీలా ఉంది!

- పుట్టినరోజు జరుపుకొనే వారి ఫొటోలతో చాక్లెట్లు
- కవర్‌పై ఫొటో చూసుకుంటూ మురిసిపోతున్న పిల్లలు
- వరంగల్‌లో విస్తరించిన కొత్త సంస్కృతి

సాక్షి, వరంగల్: పుట్టినరోజు కోసం ప్రత్యేకమైన చాక్లెట్లు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ఎవరైనా పుట్టినరోజు స్నేహితులకు చాక్లెట్లు ఇవ్వడం సాధారణమే. ఇందులో ప్రత్యేకత ఏముంది అనుకుంటున్నారా? నిజంగానే ఈ చాక్లెట్లలో ప్రత్యేకత ఉంది. పుట్టినరోజు చేసుకుంటున్న వారి ఫొటోలను చాక్లెట్ కవర్‌పై ముద్రిస్తున్నారు. వాటిని స్నేహితులు, తోటి విద్యార్థులకు ఇస్తూ తెగ ఆనందపడుతున్నారు. ఇప్పుడు ఈ సంస్కృతి వరంగల్ నగరంలో రోజురోజుకూ విస్తరిస్తోంది. వీటిని ఇక్కడ తయారు చేస్తున్న సంస్థ.. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వారి నుంచి ఆర్డర్ తీసుకుంటూ.. పిల్లలకు మరిచిపోలేని జ్ఞాపకాలను అందిస్తోంది. దీంతో పాఠశాల విద్యార్థులు తమ ఫొటోతో ముద్రించిన చాక్లెట్లు మిత్రులకు ఇస్తూ సంబర పడిపోతున్నారు.

అందరికీ నచ్చేలా.. టేస్టీగా..

ఈ చాక్లెట్లు పిల్లల్నే కాదు.. పెద్దలను కూడా ఆకట్టుకుంటున్నాయి. కొబ్బరిపొడి, కొబ్బరి నూనె, తేనె కలిపి వివిధ పద్ధతుల్లో తయారు చేసే ఈ చాక్లెట్ల రుచికి అందరూ ఫిదా అవుతుండటంతో వీటికి మార్కెట్లో యమ డిమాండ్ పెరుగుతోంది. వరంగల్ కేంద్రంగా ప్రారంభమైన ఓరుగల్లు హోంమేడ్ చాక్లెట్ల (ఓరుగల్లు ఫొటోస్ ర్యాపర్ హోంమేడ్ చాక్లెట్లు) గురించి సామాజిక మాధ్యమాలు ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ద్వారా తెలుసుకుంటున్న ప్రజలు వీటిపై ఆసక్తి చూపిస్తున్నారు. తమ పిల్లల పుట్టినరోజుల్ని ఘనంగా నిర్వహించుకునేందుకు వెనుకాడడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పట్టణాల నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయని ఈ సంస్థ నిర్వాహకులు కరుణాకర్, సందీప్ చెబుతున్నారు.


ముద్రించిన చాక్లెట్లు





మా అమ్మాయి సంబరపడింది



పరకాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మా కుమార్తె ఆరుషి ఒకటో తరగతి చదువుతోంది. ఓరుగల్లు హోంమేడ్ చాక్లెట్ల గురించి ఇన్‌స్ట్రాగామ్ ద్వారా తెలుసుకొని ఆర్డర్ ఇచ్చాం. పాప ఆరుషి ఫొటో చాక్లెట్ల కవర్‌పై ఉండటంతో తెగ సంబరపడిపోయింది. వారి పాఠశాలల్లోని ఇతర పిల్లల తల్లిదండ్రులు కూడా ఈ చాక్లెట్ల గురించి వాకబు చేశారు.

– డి.రవళి, పరకాల

బాబోయ్ పడిపోతున్నాయ్!




పిల్లపాళెం సమీపంలో గుంతలమయంగా స్వర్ణముఖి నది (ఇన్‌సెట్) తవ్వకాలు సాగిస్తున్న జేసీబీ

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి నదిలో నిత్యం ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. కూటమి నేతల కారణంగా ప్రమాదకర పరిస్థితులు దాపురించాయి. నదిలో సుమారు 20 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వేస్తుండడంతో విద్యుత్ స్తంభాలు పడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. గాలివాన వస్తే స్తంభాలు పడిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. – రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)



పిల్లపాళెం, కుర్రమంగళం, పెనగడం గ్రామాల వద్ద కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు

పర్యాటకుల స్వర్గధామం మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్



అల్లూరి జిల్లాకు ప్రాణప్రదమైనది పర్యాటక రంగం. సుందర ప్రకృతి దృశ్యాలతో దేశ విదేశీ టూరిస్టులను ఆకట్టుకునే ప్రదేశాలు మన్యంలో ఉన్నాయి. పర్యాటక ప్రాంతాలను, అక్కడికి వెళ్లే రహదారులను అభివృద్ధి చేస్తేనే కదా.. అవి పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఆ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే.. నిధులు విడుదలైనా పనులు మధ్యలో నిలిపివేస్తే .. ఇక ప్రగతి ఎలా సాధ్యం?

- బిల్లులు అందక నిలిచిపోయిన పర్యాటక ప్రాంతాల రహదారుల నిర్మాణం
- సన్‌రైజ్ వ్యూపాయింట్ రోడ్డుతోపాటు మురుగు కాలువలు, రిటైనింగ్ వాల్స్‌కు గ్రహణం
- 600 మీటర్లకు అటవీ అనుమతి లేక ఆగిన రహదారి నిర్మాణ పనులు
- వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో టూరిస్టు ప్రాంతాల అభివృద్ధికి పెద్ద పీట
- మాడగడ, రణజిల్లెడ రహదారుల నిర్మాణానికి రూ. 16 కోట్లు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో నిలిపి వేసిన పనులు

అరకు అందాలకు గ్రహణం



రణజిల్లెడ వాటర్ ఫాల్స్

అరకులోయ టౌన్: అందాల అరకులోయ ఎన్నో ప్రకృతి దృశ్యాలకు ఆలవాలం. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్, రణజిల్లెడ వాటర్ ఫాల్స్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఈ ప్రాంతాలకు వెళ్లే రహదారుల నిర్మాణానికి, మిగతా అభివృద్ధి పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. పనులు కొంత వరకు పూర్తయ్యాయి. ప్రస్తుత కూటమి సర్కారు వాటిని నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు వెళ్లే 3.75 కిలోమీటర్ల రహదారి, మురుగు కాలువలు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి మంజూరైన రూ.11 కోట్లతో పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ శరవేగంగా పనులు చేసుకొచ్చారు. అయితే చేసిన పనులకు సంబంధించి రూ.1.8 కోట్ల బిల్లును కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో ప్రస్తుతం పనులు నిలిపివేశారు.

అటవీ అనుమతులు లేక 600 మీటర్ల రహదారి నిలిపివేత

విశాఖ–అరకు రూట్‌లో బోసుబెడ గ్రామం నుంచి మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వరకు రహదారి నిర్మాణం తలపెట్టారు. సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద వేస్తున్న రహదారిలో 600 మీటర్ల మేర ఫారెస్టు పరిధిలో ఉందని అటవీ శాఖ అభ్యంతరం తెలిపింది. దీంతో రహదారి నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అరకులోయ మండలంలోని మాడగడ, బస్కీ పంచాయతీలతోపాటు, హుకుంపేట మండలం భూర్జ, అనంతగిరి మండలం పైనంపాడు ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుంది. మిషన్ కనెక్ట్‌లో భాగంగా పాడేరుకు చాలా సులువుగా అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే దేశ విదేశాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి ఈ ప్రాంత అందాలు తిలకించేందుకు వచ్చే పర్యాటకుల కష్టాలు తీరుతాయి. కూటమి ప్రభుత్వం స్పందించి సకాలంలో బిల్లులు చెల్లించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని గిరిజనులతోపాటు పర్యాటకులు కోరుతున్నారు.

● అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ రణజిల్లెడ వాటర్ ఫాల్స్ రహదారి పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లోనే రూ.1.8 కోట్ల బిల్లులు చెల్లించారు. ఆ తరువాత చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం 10 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం మిగిలిపోయింది.

బస్కీ రోడ్డు పనులు పూర్తి చేయరూ..

అరకులోయ మండలం మాడగడ పంచాయతీ నందివలస జంక్షన్ నుంచి బస్కీ గ్రామం వరకు 11 కిలోమీటర్ల రహదారి మరమ్మతు, సీసీ రోడ్లు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసింది. రహదారి మెటల్ పరిచి విడిచిపెట్టారు. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. చేసిన పనులకు కేవలం రూ.60 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారు. మిగతా బిల్లు చెల్లించాల్సి ఉంది. రహదారి త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

● ప్రముఖ సందర్శిత ప్రాంతాల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా పెద్ద పీట వేశారు. మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్‌కు, రణజిల్లెడ వాటర్ ఫాల్స్ వరకు రహదారి నిర్మాణానికి రూ.16 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పనులు పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

రోడ్డుపై మెటల్‌తో.. ప్రమాదం



నందివలస–బస్కీ రహదారి నిర్మాణ పనులు చేపట్టి అర్ధంతరంగా నిలిపివేశారు. రోడ్డుపై మెటల్ వేసి విడిచిపెట్టడంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. నందివలస జంక్షన్ నుంచి బస్కీ పంచాయతీ కేంద్రం వరకు రహదారి మరమ్మతు పనులు, ఇతర పనులు చేపట్టిన కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తిచేయాలి. ఇందుకు అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
– కిల్లో రామన్న, వైస్ ఎంపీపీ, అరకులోయ

బిల్లులు చెల్లిస్తే పనులు ప్రారంభిస్తాం



మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌కు రూ.1.80 కోట్ల బిల్లులు బకాయి ఉంది. దీంతో పనులు నిలిపివేశారు. సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద సుమారు 600 మీటర్ల మేర అనుమతులు లేక అటవీ అధికారులు పనులు నిలిపివేశారు. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తే పనులు మళ్లీ ప్రారంభిస్తాం.
– రామమ్, డీఈఈ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖ, అరకులోయ



అర్ధంతరంగా నిలిపి వేసిన మాడగడ వ్యూ పాయింట్ రహదారి పనులు.. రోడ్డు పక్కన వృథాగా ఉన్న మెటీరియల్



రాళ్లు పరిచి విడిచి పెట్టిన బస్కీ రహదారి

చెయ్యేరుకు గర్భశోకం

మంత్రి అండతో అనుయాయుల అరాచకాలు

- నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా
- నదిలో నుంచే హిటాచీల ద్వారా లోడింగ్
- చిత్తూరు, కుప్పం, మదనపల్లె, తమిళనాడు, బెంగళూరుకు తరలింపు
- అడుగంటుతున్న భూగర్భ జలాలతో పల్లెల్లో ఆందోళన

సాక్షి టాస్క్‌ఫోర్స్: అన్నమయ్య జిల్లాలో చెయ్యేరును పచ్చ తోడేళ్లు చెరబట్టాయి!. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అనుయాయులు నిత్యం వందలాది టిప్పర్లతో చెయ్యేరు నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా రాజంపేట నియోజకవర్గం బాలరాజుపల్లె సమీపంలోని బుడుగుంటపల్లె డీసిల్టేషన్ నుంచి ఇసుక తరలిపోతోంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం ఆరు రీచ్‌లు ఉన్నాయి. టంగుటూరు, కోమంతరాజుపురం, నారాయణ నెల్లూరుతోపాటు మిగిలిన మూడింటికి బుడుగుంటపల్లె వద్ద డీసిల్టేషన్ పాయింట్లు ఉన్నాయి. బుడుగుంటపల్లె ఇసుక పాయింట్లు రాయచోటికి దగ్గరగా ఉండటంతో మంత్రి పేరు చెప్పి అనుయాయులు యథేచ్ఛగా దోపిడీకి తెర తీస్తున్నారు. ఇక్కడ చెక్‌పోస్టులు నామమాత్రంగా మిగిలాయి.




చెయ్యేరు నదిలో హిటాచీ ద్వారా ఇసుకను తోడుతున్న దృశ్యం

అన్నమయ్య నుంచి తమిళనాడు, కర్ణాటకకు..

బుడుగుంటపల్లెలోని చెయ్యేరు పాయింట్ నుంచి ఇసుక రాష్ట్ర సరిహద్దు దాటుతోంది. కుప్పం, పుంగనూరు, చిత్తూరులో కెనాల్ పనుల కోసమంటూ నదిలో నుంచే హిటాచీలతో తవ్వేస్తూ ఇసుకను టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక టిప్పర్లు తమిళనాడుకు వెళుతున్నట్లు డ్రైవర్లే చెబుతున్నారు. పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా మైనింగ్‌శాఖ కళ్లు మూసుకుని కూర్చుంది.

ఎటు చూసినా భారీ గుంతలే..

అన్నమయ్య జిల్లాలో రీచ్‌లన్నీ చెయ్యేరు నదిలోనే ఉన్నాయి. ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో నది గర్భశోకంతో విలవిల్లాడుతోంది. చిత్తూరు, కుప్పం, మదనపల్లెతోపాటు చెన్నై, బెంగళూరుకు రాత్రివేళ టిప్పర్లలో చేరవేస్తున్నారు. నాణ్యమైన చెయ్యేరు ఇసుకకు మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కడికక్కడ తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా చెయ్యేరు భారీ గుంతలతో కనిపిస్తోంది. తాగునీటితోపాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బుడుగుంటపల్లె వద్ద చెయ్యేరు నదిలో ఏర్పడిన గుంతలు

ఇసుక దోపిడీపై సమగ్ర విచారణ జరపాలి



రాయచోటి సమీపంలోని ఇసుక క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతోంది. దీనికి సంబంధించి అనేకమార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇసుక ప్రతిరోజు వందలాది టిప్పర్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలి వెళుతోంది. సహజ వనరులైన ఇసుక, మట్టి దోపిడీ చేస్తున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆలోచించుకోవాలి. భూగర్భ జలాల సమస్య కూడా ఉత్పన్నమవుతోంది.
– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 57,863 మంది స్వామి వారిని దర్శించుకోగా 31,030 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.04 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీకోదండరాముని పుష్ప యాగానికి అంకురార్పణ



తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో శనివారం నిర్వహించనున్న పుష్పయాగానికి శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు.

నేత్రపర్వం చాత్మార్ ఉత్సవం

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్నకు చాత్మార్ ఉత్సవం శుక్రవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. శ్రీమద్ రామానుజుల తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అర్చకులు తొళక్క వాహనంపై ఉంచి అలంకరించారు. అనంతరం పూజాదికాలు జరిపించారు.





తేజోకుమార్‌కు వాక్యార్థ చక్రవర్తి బిరుదు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో ఐదు రోజుల పాటు జరిగిన శంకర జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రస్థానత్రయ భాష్య పారాయణం, శంకరుల పూజాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గోవింద భగవత్ పాదాచార్య వాక్యార్థంలో ప్రతిభ కనబరిచిన తేజో కుమార్‌కు 'వాక్యార్థ చక్రవర్తి' బిరుదును ప్రదానం చేశారు.

20 నుంచి ఎల్ఎల్ఎమ్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని లా కళాశాలలో ఎల్ఎల్ఎమ్ తొలి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 9వతేదీ లోపు పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం యాక్షన్ ప్లాన్

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం యాక్షన్ ప్లాన్ విడుదల చేసింది. ఈ నెల 18 వరకు సబ్జెక్టుల వారీగా బోధించాల్సిన అంశాలను వెల్లడించింది. ఆ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో పరీక్ష ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక వేసవి తరగతులు నిర్వహించాలి. 20 కంటే ఎక్కువ మంది ఫెయిలైన విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో, సమీపంలోని పాఠశాలల నుంచి ఫెయిలైన వారిని ఏకీకృతం చేయడం ద్వారా సమ్మర్ కోచింగ్ తరగతులను నిర్వహించాలి. మండల కేంద్రాల్లో కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు బెయిల్ పిటిషన్‌పై విజయవాడ సీఐడీ న్యాయస్థానంలో ఇరుపక్షాల వాదనలు శుక్రవారం ముగిశాయి. సీఐడీ తరపు న్యాయవాదులు తమ వాదనలను శుక్రవారం వినిపించారు. పీఎస్ఆర్ ఆంజనేయులు తరపు వాదనలు గురువారమే వినిపించిన సంగతి తెలిసిందే. న్యాయస్థానం తీర్పును ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

గిరిజన పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు రోడ్డులోని గిరిజన సంక్షేమ పాఠశాలలో (బాలురు) 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి (ఇంగ్లిష్ మీడియం) వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు.

• భలే వింత

మెరుపుల సరస్సండీ చూద్దాము రారండీ

మనకు సాధారణంగా మెరుపులు ఎప్పుడు కనిపిస్తాయి? వర్షాలు కురిసేటప్పుడే కదా. వర్షాలు ఎప్పుడు కురుస్తాయి? వర్షాకాలంలో. ఎప్పుడైనా వాతావరణంలో మార్పులు కారణంగా వేసవి, చలికాలాల్లో కూడా కురుస్తాయి. అంటే మెరుపులు రావాలంటే వర్షాలు పడాలి. కానీ వెనెజులా దేశంలో వర్షాలతో నిమిత్తం లేకుండా అక్కడ ఉన్న మరాకైబో సరస్సు (Lake Maracaibo)లో సంవత్సరానికి దాదాపు మూడు వందల రోజులూ మెరుపులు కనిపిస్తాయి. దీనిని 'ప్రపంచ మెరుపుల రాజధాని' అని కూడా పిలుస్తారు.



అక్కడ ఉన్న కాటాటంబో నది మరాకైబో సరస్సులో కలిసే ప్రాంతంలో ఈ ప్రత్యేక దృశ్యం కనిపిస్తుంది. ఈ మెరుపులు గంటకు 28 నుండి 40 చొప్పున ప్రధానంగా రాత్రి వేళలో కనిపిస్తాయి. ఇది ప్రపంచంలో ఎక్కడా జరగని ఒక వింత.

ఎందుకు ఇక్కడ మెరుపులు ఎక్కువగా సంభవిస్తాయి?

మరాకైబో సరస్సు చుట్టూ ఉన్న భౌగోళిక,వాతావరణ పరిస్థితులే ఈ మెరుపులకు కారణం. ఈ సరస్సు ఆండీస్ పర్వతాలు, కరీబియన్ సముద్రం మధ్య ఉండటం వలన కరీబియన్ నుండి వచ్చే వెచ్చని, తేమతో కూడిన గాలులు, ఆండీస్ నుండి వచ్చే చల్లని గాలులతో ఢీకొని విద్యుత్ తుఫానులను సృష్టిస్తాయి. సరస్సు నీరు రోజంతా వేడెక్కి, రాత్రి తేమను విడుదల చేయడం వల్ల మేఘాలు ఏర్పడి మెరుపులు ఉత్పన్నమవుతాయి. ఇలా అవ్వడం వల్ల రాత్రి సమయంలో ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. పూర్వకాలంలో నావికులు దీనిని ఒక దిక్సూచి లాగా భావించేవారు. ఈ సరస్సుకు ఉన్న ఈ ప్రత్యేక లక్షణం 2014లో 'ప్రపంచంలోనే అత్యధికంగా మెరుపులు కనిపించే ప్రాంతం'గా గిన్నీస్ బుక్ లో చోటు సంపాదించుకునేలా చేసింది. అయితే ఈ మెరుపులు అత్యంత శక్తివంతమైనవి కాకపోయినా, అవి నిరంతరం సంభవించడం వల్ల అటు శాస్త్రవేత్తల అధ్యయనాలకు ఉపయోగపడుతూ ఇటు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. స్థానికులు ఈ మెరుపులను దైవిక శక్తిగా భావిస్తూ జానపద కథల్లో దేవతల సంభాషణలుగానూ వర్ణిస్తారు.

• జీనియస్

13 ఏళ్లకు పదో తరగతి... 19 ఏళ్లకు సీఏ





15 ఏళ్లు వస్తేగానీ పదో తరగతి పరీక్షలు రాయడం కుదరదు. ఆ తర్వాత ఇంటర్మీడియేట్ పూర్తి చేసి, ఆపై సీఏ చేయాలంటే మరిన్ని సంవత్సరాలు పడుతుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన నందినీ అగర్వాల్ మాత్రం 19 ఏళ్లకే సీఏగా మారింది. దేశంలో అతి చిన్న మహిళా సీఏగా గిన్నిస్ రికార్డు అందుకుంది. చిన్నప్పటి నుంచి నందినికి చదువంటే చాలా ఇష్టం. చదువులో ముందుండే తనను తల్లిదండ్రులు, టీచర్లు బాగా ప్రోత్సహించేవారు. ఈ క్రమంలో తన ప్రతిభకు తగ్గట్టు రెండు క్లాసులు దాటి ముందు క్లాసులో వేశారు. అక్కడ ప్రతిభ చూపిన నందిని 13 ఏళ్లకే పదో తరగతి పరీక్షలు రాసి పాసయ్యింది. అందరూ తనను మెచ్చుకున్నారు. ఓసారి తన స్కూల్‌కి గిన్నిస్ రికార్డు అందుకున్న ఓ వ్యక్తి వచ్చారు. తాను కూడా ఏదో ఒక రోజు గిన్నిస్ రికార్డు అందుకోవాలని నందిని నిర్ణయించుకుంది. ఇంటర్ పూర్తికాగానే సీఏకు సన్నద్ధమయ్యింది. రాత్రీపగలూ పట్టుదలతో కష్టపడి చదివింది. ఈ సమయంలో నందిని అన్న సచిన్ తనకు ఎంతో సాయం చేశాడు. ఇద్దరూ కలిసి సీఏ ఫైనల్ పరీక్షలకు సిద్ధమయ్యారు. 2021లో 19 ఏళ్ల వయసులో సీఏ ఫైనల్ పరీక్షల్లో దేశంలో మొదటి ర్యాంకు సాధించింది నందిని. 800 మార్కులకు 614 మార్కులు సాధించింది. దేశంలో అతి చిన్న వయసులో సీఏగా మారిన యువతిగా గిన్నిస్ రికార్డు అందుకుంది. నందిని అన్న సచిన్‌కు ఆ పరీక్షల్లో 18వ ర్యాంకు వచ్చింది. అన్నాచెల్లెళ్లు సీఏ పరీక్షలో ఒకేసారి పాసవడం అరుదుగా జరిగే విషయం.

ప్రస్తుతం తన కెరీర్‌లో ముందుకు సాగుతున్న నందినిని ఎంతోమంది స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. విద్యాసంస్థలు ఆమెను ముఖ్యఅతిథిగా పిలిచి, తన చేత పిల్లల్ని ఉత్తేజపరిచే ప్రసంగాలు ఇప్పిస్తున్నాయి. 16 ఏళ్ల వయసులో తనను అప్రెంటిస్‌గా తీసుకునేందుకు ఎన్నో సంస్థలు సందేహించాయని, ఇప్పుడు అవే సంస్థలు తనకు ఉద్యోగం ఆఫర్ చేస్తున్నాయని వివరిస్తోంది నందిని. అనుకున్నది సాధించాలన్న పట్టుదల ఉంటే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా తప్పక సాధించవచ్చని అంటోంది.

• మన సినిమా | మైగ్రేషన్

జమైకాకు ఎగిరి పోదామా





పిల్లలూ... సమ్మర్ ఎంజాయ్ చేస్తున్నారా. ఈ సమ్మర్‌లో మీ ఫ్రెండ్స్ కాని, నైబర్స్ కాని హాలిడే ట్రిప్‌కి వెళ్ళడం చూశారా? మీరు కూడా వేళదామనుకుంటున్నారా. అయితే మీ పేరెంట్స్ ఒప్పుకోవడం లేదా. అలాంటి ప్రాబ్లమే మల్లార్డ్స్‌కి వస్తే సూపర్‌గా సాల్వ్ చేసుకుంది. మరి మల్లార్డ్స్ ఆ ప్రాబ్లమ్‌ని సాల్వ్ ఎలా చేసిందో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'మైగ్రేషన్' మూవీ చూడాల్సిందే. ఇంతకీ మల్లార్డ్స్ ఎవరు అని అనుకుంటున్నారా. మైగ్రేషన్ మూవీలో ఓ క్యూట్ కారెక్టర్. ఇది ఓ డక్స్ స్టోరీ. పామ్, మేక్ అనే బాతులకు డాక్స్ అనే కొడుకు, మల్లార్డ్స్ అనే కూతురు ఉంటారు. ఓ రోజు మల్లార్డ్స్‌కు వేరే డక్స్ గ్రూప్ వాళ్ళు జమైకా వెళుతూ కనిపిస్తారు. తనకు జమైకా వెళ్ళాలని ఉందని డాక్స్‌కు చెబుతుంది మల్లార్డ్స్. డాక్స్ వాళ్ళ నాన్న మాక్‌ని అడుగుతుంది. కాని మాక్ జమైకా మైగ్రేషన్ సేఫ్ కాదని వద్దంటాడు. కాని డాక్స్ వాళ్ళ అమ్మ పామ్ మాక్‌ని కన్విన్స్ చేయడంతో ఫ్యామిలీ మొత్తం జమైకా ట్రిప్ కి బయలుదేరుతుంది. ఫ్యామిలీతో పాటు అంకుల్ డాన్ బయలుదేరతాడు. అలా మల్లార్డ్స్ తన జమైకా ట్రిప్‌ను సాధించుకుంటుంది. కాని ఈ జమైకా ట్రిప్ ఫ్యామిలీ మొత్తానికి ఓ వంటవాడి వల్ల పెద్ద డేంజర్ వస్తుంది. ఆ డేంజర్ ఏమిటి వాళ్ళందరూ ఆ డేంజర్ నుంచి ఎలా బయటపడ్డారు అన్నది నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'మైగ్రేషన్' మూవీలో చూడాల్సిందే. ఇదో సూపర్ యానిమేటెడ్ ఫాంటసీ మూవీ. సో కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ టు క్రూజ్ టు జమైకా విత్ మల్లార్డ్స్ ఫ్యామిలీ.

- హరికృష్ణ ఇంటూరు

• మహనీయులు

బ్రిటిష్ వారిపై గర్జించిన సింహం

లాలా లజపత్ రాయ్



పిల్లలూ! బ్రిటిష్ వారి పాలనలో మన దేశం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. ఆ సమయంలో వారిని ఎదురించి, సంపూర్ణ స్వరాజ్యం కావాలని పోరాడిన నేతలెందరో ఉన్నారు. అలాంటివారిలో ఒకరు లాలా లజపత్ రాయ్.

లజపత్ రాయ్ 1865 జనవరి 28న పంజాబులో జన్మించారు. తండ్రి మున్షీ రాధాకృష్ణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి గులాబ్ దేవి. లజపత్ రాయ్ బాల్యం ఎక్కువగా జాగ్రోన్ ప్రాంతంలో గడిచింది. 1880లో లాహోర్‌లోని ప్రభుత్వ కళాశాలలో చేరిన లజపత్ రాయ్‌కి అనేక మంది దేశభక్తులతో పరిచయం ఏర్పడింది. వారి ప్రసంగాలు విన్న ఆయనలో దేశానికి తప్పకుండా స్వాతంత్ర్యం వచ్చి తీరాలన్న నిశ్చయం ఏర్పడింది.

న్యాయవిద్య చదివిన లజపత్ హరియాణాలోని హిసర్ ప్రాంతంలో లాయర్‌గా ప్రాక్టీసు మొదలుపెట్టారు. దేశంలో స్వాతంత్రోద్యమం ఉధృతమవుతున్న సమయంలో న్యాయవాద వృత్తిని వదిలి ఆ ఉద్యమంలో చేరారు. దేశానికి స్వాతంత్ర్యం రావడంతోపాటు దేశంలోని కుల అసమానతలు దూరం కావాలని, అందరూ కలిసిమెలిసి ఉండాలని, స్త్రీలను సమానంగా గౌరవించాలని ఆయన పోరాడారు. బ్రిటిష్ వారి దురాగతాలపై సింహంగా గర్జించారు. దీంతో ఆయన్ని 'పంజాబ్ కేసరి' అని పిలిచేవారు. బ్రిటిష్ వారు ఆయన్ని 1921 నుంచి 1923 వరకు జైల్లో ఉంచారు. 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లజపత్ రాయ్ నిరసన తెలిపారు. ఆ సమయంలో ఆయనపై లాఠీఛార్జి జరిగింది. తీవ్రంగా గాయపడ్డ ఆయన చికిత్స పొందారు. ఆపై కొద్దిరోజులకే 1928 నవంబరు 17న మరణించారు. దేశంలో అనేక చోట్ల లజపత్ రాయ్ విగ్రహాలు నెలకొల్పి ఆయన చేసిన సేవల్ని ఇప్పటికీ తలుచుకుంటారు.

జాలరికి చిక్కిన బంగారు చేప



అనగనగా ఓ నిరుపేద జాలారి. కష్టపడి సంపాదించిన దాంతోనే సుఖంగా జీవించాలని ఆలోచించే మనిషి అతను. కానీ అతను భార్యకు మాత్రం డబ్బు మీద ఆశ ఎక్కువ. ఒకసారి జాలరి చేపలు పడుతుండగా బంగారు రంగుతో మెరిసిపోతున్న ఓ చేప అతని వలలో చిక్కింది. తనను ఏమీ చేయొద్దని ఆ చేప జాలరిని బతిమాలుకుంది. దానిపై జాలిపడ్డ జాలరి ఏమీ ఆశించకుండా ఆ చేపను వదిలేశాడు. ఈ విషయం జాలరి భార్యకు తెలిసింది. ఈ విషయాన్ని ఎలాగైనా తనకు అనుకూలంగా మార్చుకోవాలని అనుకుంది. ఆ తర్వాత ఏమైందో తెలియాలంటే ప్రముఖ రష్యన్ రచయిత అలెగ్జాండర్ పుష్కిన్ రాసిన 'The Fisherman and the Goldfish' అనే ఈ పుస్తకం చదవండి. ఆకట్టుకునే ముఖచిత్రంతో ఉండే ఈ పుస్తకంలోని కథ చిన్నారుల్ని ఎంతో అలరిస్తుంది.

జిహ్వా చాపల్యం

• బాలల కథ





అనగనగా రాజుగారి భవనంలో ఓ వంటవాడు ఉండేవాడు. రాజుగారికి రుచికరమైన వంటలు చేసేవాడు. ఒకసారి వంటశాల ఆవరణలో పని చేసుకుంటూ ఉండగా ఓ జింక వచ్చింది. మొదట అతణ్ని చూసి భయపడిన జింక ఆ తర్వాత కాసేపు అక్కడే తిరిగింది. తర్వాత రోజు మళ్లీ వచ్చింది. వంటవాడు దాన్నేమీ అనకుండా తన పని తాను చేసుకుంటూ ఉండిపోయాడు.

ఇలా కొన్ని రోజులపాటు వంటశాల వద్దకు వచ్చిన జింక ఆ పరిసరాలకు అలవాటు పడింది. వంటవాడి ముందే తిరగడం, అక్కడే ఆడుకోవడం చేసేది. వంటవాడు దాన్ని గమనించినా, గమనించనట్టు ఉండిపోయాడు. దీంతో జింక నిర్భయంగా వంటశాలలోకి వచ్చి, తనకు నచ్చిన పదార్థాలు తినడం మొదలుపెట్టింది.

ఒక రోజు రాజుకు భోజనం వడ్డిస్తున్న సమయంలో వంటవాడు ఆ జింక గురించి చెప్పాడు. రాజుకు ఆ జింక మాంసం తినాలని ఆశపుట్టింది. దాన్ని చంపి, కూర వండాలని ఆదేశించాడు. దాన్ని చంపే ముందు తనకోసారి చూపించాలని అన్నాడు. వంటవాడు సరే అన్నాడు. తర్వాత రోజు జింక వంటశాలలోకి రాగానే దాని ముందు తేనె కలిపిన గడ్డిపరకల్ని ఉంచాడు వంటవాడు. జింక ఆనందంగా వాటిని తింది. వంటవాడు కొన్ని గడ్డిపరకల్ని దాని ముందు వేసుకుంటూ వెళ్లి రాజభవనం దాకా తీసుకొచ్చాడు. ఆ గడ్డిపరకల రుచి చూస్తూ ఉన్న జింక ఎక్కడికి వెళ్తున్నానో గమనించకుండా లోపలిదాకా వచ్చింది. వెంటనే భటులు తలుపులు మూసి దాన్ని పట్టుకున్నారు. జింక బెంబేలెత్తిపోయింది. భటులు దాని కాళ్లు కట్టేసి రాజుగారి దగ్గరికి తీసుకెళ్లారు.

దాన్ని లోపలి దాకా ఎలా తెచ్చానో వంటవాడు రాజుగారికి వివరించాడు. అంతా విన్న రాజు ఆ జింక వంక చూసి, 'స్వేచ్ఛగా అడవిలో తిరగాల్సిన జింక మన రాజభవనం దాకా వచ్చిందంటే కారణం జిహ్వా చాపల్యం. నోటికి రుచికరమైన పదార్థం దొరకగానే అపాయాన్ని గుర్తించకుండా ముందుకు వెళ్లడం చాలా చెడ్డ విషయం. ఈసారికి దీన్ని వదిలేయండి. బుద్ధి తెచ్చుకుంటే సరి. మరోసారి వస్తే అప్పుడు దీని సంగతి చూద్దాం' అన్నాడు. భటులు జింక కాళ్లకున్న బంధాలు తొలగించి, తలుపులు తీశారు. బతుకుజీవుడా అనుకుంటూ జింక అడవిలోకి పరుగులు పెట్టింది.

నీతి: జిహ్వాచాపల్యం పెంచుకొని అపాయాన్ని కొనితెచ్చుకోకూడదు.

జాతిపితపై గేయాల మాలిక



మన జాతిపిత మహాత్మాగాంధీ. ఆయన గురించి గేయాలు, గేయకథ కలిపి ఉన్న పుస్తకం ఇది. 6 నుంచి 12 సంవత్సరాల పిల్లలు చదివి, పాడుకునే విధంగా సరళమైన భాషలో ఈ పుస్తకం రాశారు రచయిత డా.పత్తిపాక మోహన్. ఇందులో గాంధీజీ జీవితంలోని ముఖ్యఘట్టాల ఫొటోలు సైతం ఉంటాయి. 2022లో ఈ పుస్తకం కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం అందుకుంది.

టారిఫ్‌లతో చిన్న సంస్థలకు టెన్షన్

- మధ్య స్థాయి కార్పొరేట్లకు కాస్త ఓకే..
- ఇండ్–రా నివేదిక



న్యూఢిల్లీ: ప్రతీకార టారిఫ్‌లతో చిన్న, మధ్య తరహా సంస్థలపై (ఎంఎస్‌ఎంఈ) ఒత్తిడి మరింత పెరిగిపోవచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) ఒక నివేదికలో తెలిపింది. అయితే, మధ్య స్థాయి కార్పొరేట్లకు (ఎంసీ) మాత్రం అనూహ్య ఆర్థిక షాక్‌ల నుంచి కాస్తంత రక్షణ ఉంటుందని పేర్కొంది. టారిఫ్‌ల ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉండే సెగ్మెంట్లకు చెందిన ఎంఎస్‌ఎంఈల నిర్వహణ పరిస్థితులు దిగజారవచ్చని వివరించింది. 2024 మార్చి 31 నాటి గణాంకాల ప్రకారం ఒత్తిడిలో ఉన్న ఎంసీల సంఖ్య 11 శాతమే ఉండగా, ఎంఎస్‌ఎంఈలు మాత్రం 23 శాతంగా ఉన్నాయి. కోవిడ్ పూర్వ స్థాయితో పోలిస్తే ఎంసీలు వ్యాపార పరిస్థితులను మెరుగ్గా నిర్వహించుకోగలిగే స్థితిలో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 1,898 లిస్టెడ్, అన్‌లిస్టెడ్ ఎంఎస్‌ఎంఈలు, 1,055 ఎంసీలపై ఈ అధ్యయనం నిర్వహించారు. 'సాధారణంగా ఎంసీలతో పోలిస్తే ఎంఎస్‌ఎంఈలు నిర్వహణ మూలధనం విషయంలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఉంటాయి. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లపై వాటికి తగినంత స్థాయిలో రుణాలు అవసరమవుతాయి. ఎంసీల్లాగా కాకుండా చాలా మటుకు ఎంఎస్‌ఎంఈలు ప్రమోటర్ల సారథ్యంలో ఉంటాయి. రుణదాతలు / సరఫరాదారులు / కస్టమర్లతో బేరమాడే పరిజ్ఞానం, నైపుణ్యాలు ఉన్నవారు రెండో అంచె మేనేజ్‌మెంట్‌లో అంతగా ఉండరు' అని ఇండ్–రా అసోసియేట్ డైరెక్టర్ నిర్మయ్ షా తెలిపారు.

రూ. 250 కోట్ల లోపు సంస్థలపై ప్రభావం..

రూ. 250 కోట్ల లోపు ఆదాయం ఉండి, ప్లాంటు..మెషినరీపై రూ. 5 కోట్ల లోపు పెట్టుబడులు ఉన్న ఎంఎస్‌ఎంఈలపై ప్రతీకార టారిఫ్‌ల ప్రభావం ఒక మోస్తరు నుంచి తీవ్ర స్థాయి వరకు ఉంటుందని ఇండ్–రా తెలిపింది. డిమాండ్ ఏమాత్రం మందగించినా ఎంసీలకన్నా ఎంఎస్‌ఎంఈలపైనే ఎక్కువగా ప్రభావం ఉండొచ్చని పేర్కొంది. అయితే, వడ్డీ రేట్ల తగ్గుదల, వ్యవస్థలో లిక్విడిటీ మెరుగుపడటం వంటి అంశాలు కాస్త సానుకూలంగా ఉండొచ్చని వివరించింది. ఎంఎస్‌ఎంఈల పెట్టుబడి వ్యయాలు కోవిడ్ తర్వాత కాస్త పుంజుకున్నప్పటికీ చారిత్రక స్థాయిలతో పోలిస్తే ఇంకా తక్కువగానే ఉన్నాయని నివేదిక వివరించింది. సుంకాలపరంగా అసమానతలున్న దేశాలపై ఏప్రిల్ 2న అమెరికా ప్రతీకార టారిఫ్‌లు ప్రకటించడం, ఆ తర్వాత వాటిని 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయడం తెలిసిందే.

భారత్–అమెరికా బీటీఏ చర్చనీయాంశాలు ఖరారు

న్యూఢిల్లీ: ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి (బీటీఏ) సంబంధించి చర్చించాల్సిన అంశాలను (టరమ్స్ ఆఫ్ రెఫరెన్స్) ఖరారైనట్లు అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో సమతౌల్యం సాధించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడగలదని పేర్కొన్నారు. భారత్ నిర్మాణాత్మకంగా వ్యవహరించడాన్ని స్వాగతిస్తున్నామని, ఇరు దేశాల వర్కర్లు, రైతులు, ఎంట్రప్రెన్యూర్లకు కొత్తగా అవకాశాలను కల్పించడంపై ఆసక్తిగా ఉన్నామని వివరించారు. బీటీఏపై చర్చలు జరపనున్నట్లు ఫిబ్రవరి 13న ఇరు దేశాలు ప్రకటించాయి. తొలి దశను ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాయి. భారత్‌లో తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మరింతగా అవకాశమివ్వాలని, టారిఫ్‌లను తగ్గించాలని, టారిఫ్‌యేతర అవరోధాలను తొలగించాలని అమెరికా కోరుతోంది. తద్వారా భారత్‌తో గణనీయంగా ఉన్న వాణిజ్య లోటును భర్తీ చేసుకోవాలని భావిస్తోంది.

98.24 శాతం రూ.2,000 నోట్లు వెనక్కి

ముంబై: ప్రజల వద్ద ఇప్పటికీ రూ.6,266 కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు ఉన్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్టు 2023 మే 19న ఆర్‌బీఐ ప్రకటించడం తెలిసిందే. అప్పటికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చలామణిలో ఉన్నాయి.



2025 ఏప్రిల్ 30 నాటికి వ్యవస్థలో రూ.6,266 కోట్ల విలువ చేసే నోట్లు మిగిలి ఉన్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. మొత్తం మీద 98.24 శాతం మేర రూ.2,000 నోట్లు వెనక్కి వచ్చినట్టు వెల్లడించింది. ఈ నోట్లు కలిగిన వారు ఆర్‌బీఐకి చెందిన 19 ఇష్యూ ఆఫీసులలో ఎక్కడైనా డిపాజిట్ చేసుకోవచ్చు. పోస్ట్ ద్వారా ఆర్‌బీఐ ఇష్యూ ఆఫీస్‌కు పంపొచ్చు.

వర్షాలతో సాగు సమృద్ధి

- వినియోగానికి ఊతం
- ఇండియా రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే అధికంగా నమోదు కావచ్చంటూ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వేసిన అంచనాలు వ్యవసాయ రంగానికి సానుకూలమని.. ఉత్పాదకత పెరుగుతుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్–రా) పేర్కొంది. దీనికితోడు వడ్డీ రేట్ల తగ్గింపు వినియోగానికి ఊతమిస్తాయని.. ప్రతీకార సుంకాలతో పడే ప్రభావాన్ని ఎదుర్కొని భారత్ బలంగా నిలబడగలదని అంచనా వేసింది. ఐఎండీ అంచనాలు కేవలం రైతులకే కాకుండా, ఆర్థిక వ్యవస్థకూ అనుకూలమేనని తెలిపింది. అయితే మొత్తం మీద వర్షపాతం ఎలా ఉంటుందన్న దానిపైనే ఈ ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేసింది. వాతావరణ మార్పులతో వర్షాల పరంగా ఎలాంటి ఊహించని షాక్‌లు లేకుండా సాధారణంగా ఉంటే మరో ఏడాది వ్యవసాయ రంగం స్థూల విలువ జోడింపు (జీవీఏ) 4 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా వేసింది. "2024 ఖరీఫ్, రబీ పరంగా మంచి సాగును చూశాం. 2025–26లోనూ రెండు సానుకూల పంట సీజన్లు, ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యిత స్థాయికి దిగువన ఉండడం, ద్రవ్య పరపతి విధాన సరళీకరణ అన్నవి ప్రతీకార సుంకాల ప్రభావాన్ని భారత్ తట్టుకుని నిలిచేలా చేస్తాయి" అని ఇండ్–రా ముఖ్య ఆర్థిక వేత్త దేవేంద్ర కుమార్ పంత్ తెలిపారు. ఈ ఏడాది జూన్–సెప్టెంబర్ మధ్య కాలంలో వర్షాలు భౌగోళికంగా వివిధ ప్రాంతాల్లో ఎలా ఉంటాయన్నది చూడాల్సి ఉంటుందని ఇండ్–రా తెలిపింది.

ఉపాధి కల్పనలో కీలక పాత్ర

2022–12 నాటికి జీడీపీ జీవీఏలో సాగు రంగం వాటా 18.5 శాతం ఉంటే, 2024–25లో 14.5 శాతానికి తగ్గినట్టు ఇండ్–రా తన నివేదికలో వెల్లడించింది. అయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పన పరంగా కీలక భూమిక పోషిస్తున్నట్టు తెలిపింది. సాగు రంగం నుంచి ఉపాధి కల్పన వాటా 2018 మార్చి నాటికి 44.1 శాతంగా ఉంటే, 2025 మార్చి నాటికి 46.1 శాతానికి పెరిగినట్టు వెల్లడించింది. ఇది వినియోగ డిమాండ్‌పై, ముఖ్యంగా గ్రామీణ డిమాండ్‌పై ప్రభావం చూపిస్తున్నట్టు తెలిపింది.

విక్రేతలకు అమెజాన్ జీరో రిఫరల్ ఆఫర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తమ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో విక్రయించే సెల్లర్లకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చడంపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా రూ. 300 లోపు ఖరీదు చేసే ఉత్పత్తులపై రిఫరల్ ఫీజును తొలగించింది. 135 కేటగిరీల్లో 1.2 కోట్ల ఉత్పత్తులకు ఇది వర్తిస్తుందని సంస్థ సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ తెలిపారు. అలాగే, ఈజీ షిప్, సెల్లర్ ఫ్లెక్స్‌లాంటి ఫుల్‌ఫిల్‌మెంట్ మాధ్యమాలను ఉపయోగించుకునే వారికి నేషనల్ షిప్పింగ్ రేట్లను రూ. 77 నుంచి రూ. 65కి తగ్గించినట్లు పేర్కొన్నారు. వీటన్నింటి వల్ల విక్రేతల వ్యయాలు తగ్గి, మరింత తక్కువ ధరలకే ఉత్పత్తులను విక్రయించేందుకు వీలు లభిస్తుందని వివరించారు. దేశవ్యాప్తంగా తమకు 16 లక్షల మంది పైగా సెల్లర్లు ఉండగా, తెలంగాణలో 50,000 పైచిలుకు ఉన్నట్లు చెప్పారు. తెలంగాణలో తమకు 6 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు, 1 సోర్టేషన్ సెంటరు ఉందని తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచి కూడా విక్రేతలు పెద్ద ఎత్తున తమ ప్లాట్‌ఫాంలో నమోదు చేసుకుంటున్నట్లు భట్నాగర్ చెప్పారు.

ఇండియాఏఐ మిషన్‌తో ఇంటెల్ ఇండియా జట్టు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కృత్రిమ మేధ సామర్థ్యాలను పెంపొందించేందుకు, నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు ఇండియాఏఐ మిషన్‌తో ఇంటెల్ ఇండియా చేతులు కలిపింది. ఇందుకోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం యువ ప్రొఫెషనల్స్, స్టార్టప్‌లకు మొదలైన వర్గాల కోసం యువఏఐ, స్టార్టప్ఏఐ, ఇండియాఏఐ డైలాగ్స్ ప్రోగ్రాంలతో పాటు భాషిణిని గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు కూడా చేరువ చేయడంపై మరింతగా దృష్టి పెడతారు. వేల కొద్దీ విద్యార్థులకు కృత్రిమ మేధలో శిక్షణనిచ్చేందుకు యువఏఐ తోడ్పడగలదని ఇండియాఏఐ మిషన్ సీఈవో అభిషేక్ సింగ్ తెలిపారు.

పది నెలల గరిష్టానికి తయారీ

ఏప్రిల్‌లో 58.2కి పీఎంఐ సూచీ



న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్లు పటిష్టంగా ఉండటంతో ఏప్రిల్‌లో దేశీ తయారీ రంగం పది నెలల గరిష్ట స్థాయికి చేరింది. తయారీ కార్యకలాపాల వృద్ధిని సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 58.2కి చేరింది. మార్చిలో ఇది 58.1గా నమోదైంది. పీఎంఐ పరిభాషలో స్కోరు 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ పటిష్టంగా ఉండటాన్ని తయారీ రంగ వృద్ధి సూచిస్తోందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. 2025–26లో విదేశాల నుంచి కొత్త ఆర్డర్లు గత 14 ఏళ్ల వ్యవధిలో చూస్తే అత్యధిక స్థాయిలో నమోదైనట్లు పీఎంఐ సర్వేలో పాల్గొన్న సంస్థలు తెలిపాయి. ప్రధానంగా ఆఫ్రికా, ఆసియా, యూరప్, మధ్యప్రాచ్యం, అమెరికా నుంచి పెద్ద స్థాయిలో కాంట్రాక్టులు వచ్చినట్లు, తయారీదారులు కూడా ఉత్పత్తిని పెంచేందుకు సిబ్బందిని పెంచుకుంటున్నట్లు సర్వేలో వెల్లడైంది. 400 పైగా తయారీ సంస్థలకు చెందిన పర్చేజింగ్ మేనేజర్లకు ఇచ్చిన వివరాల ఆధారంగా ఈ సూచీని రూపొందించారు.

ఎన్‌ఎండీసీ ఉత్పత్తి 15% అప్..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ దిగ్గజం ఎన్‌ఎండీసీ ఏప్రిల్‌లో 4 మిలియన్ టన్నుల ముడి ఇనుము ఉత్పత్తి చేయగా, 3.63 మిలియన్ టన్నులు విక్రయించింది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే ఉత్పత్తి 15 శాతం, విక్రయాలు 2.8 శాతం పెరిగినట్లు సంస్థ తెలిపింది. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల మైనింగ్ కంపెనీగా ఎదగాలన్న లక్ష్యానికి పటిష్టమైన పునాదులు వేస్తున్నట్లు సంస్థ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు.

ఎగుమతులు భళా

- 2024–25లో రూ.70.12 లక్షల కోట్లు
- పటిష్టంగా సేవల ఎగుమతులు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ దేశ ఎగుమతులు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. 2024–25లో 825 బిలియన్ డాలర్లు విలువైన (రూ.70.12 లక్షల కోట్లు) వస్తు, సేవల ఎగుమతులు నమోదైనట్లు వాణిజ్య శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ.778.13 బిలియన్ డాలర్లతో (రూ.66.14 లక్షల కోట్లు) పోల్చి చూస్తే 6 శాతం వృద్ధి కనిపించింది. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 820.93 బిలియన్ డాలర్లుగా ఏప్రిల్ 15న అంచనా వెల్లడించగా.. మార్చి నెలకు సంబంధించి సేవల ఎగుమతుల డేటాను ఆర్‌బీఐ విడుదల చేసిన నేపథ్యంలో మొత్తం ఎగుమతులను రూ.824.9 బిలియన్ డాలర్లకు సవరిస్తూ వాణిజ్య శాఖ గణాంకాలు విడుదల చేసింది. ఇందులో గత ఆర్థిక సంవత్సరంలో సేవల ఎగుమతులు 387.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2023–24లో ఉన్న 341.1 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే 13.6 శాతం పెరిగాయి. మార్చి నెలకు సేవల ఎగుమతులు 18.6 శాతం పెరిగి 35.6 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. సేవల ఎగుమతుల్లో టెలికమ్యూనికేషన్, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, ట్రాన్స్‌పోర్ట్, ట్రావెల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కీలక పాత్ర పోషించాయి. ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో మెరుగ్గా ఉన్నట్టు భారత ఎగుమతిదారుల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హాన్ తెలిపారు. అయితే, వాణిజ్య ఒప్పందం కోసం యూఎస్ దిగుమతిదారులు వేచి చూస్తున్నందున ఇది మన ఎగుమతులపై ప్రభావం చూపించొచ్చని చెప్పారు. ఎగుమతిదారులకు వడ్డీ రాయితీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో అధిక వడ్డీ రేట్లు ఉన్నాయని.. అంతర్జాతీయంగా పోటీ పడేందుకు వీలుగా కనీసం 5 శాతం మేర రాయితీ ఇవ్వాలని కోరారు.

బోర్డు సమావేశాలు

ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, అవెన్యూ సూపర్ మార్ట్స్, నెట్‌వెబ్ టెక్నాలజీస్, ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, డెక్కన్ బేరింగ్స్, అగ్రిటెక్ ఇండియా, హేమాద్రి సిమెంట్స్

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

03-5-2025

విశాఖ	450-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450-00
విజయవాడ	470-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	445-00
వరంగల్	447-00
రిటైల్ ధర	5.05

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,269.70	4.37
BAJFINANCE	8,868.00	2.7
INDUSINDBK	850.5	1.44
SBIN	799.8	1.41
HINDALCO	632.9	1.32

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	970	-5.81
BAJAJ-AUTO	7,809.00	-2.75
EICHERMOT	5,428.00	-2.5
HDFCLIFE	726.5	-2.31
HEROMOTOCO	3,741.00	-2.26

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,770
ఎన్‌ఎస్‌ఈ	1,00,895
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,08,490
ఎఫ్‌ఐఐ	+ 2770
డీఐఐ	+ 3,290

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.19 (రాత్రి 11.30కు)	$ 59.24 (క్రితం ముగింపు)
బ్రెంట్	61.23 (రాత్రి 11.30కు)	$ 61.04 (క్రితం ముగింపు)

మార్చి త్రైమాసిక ఫలితాలు

గోద్రెజ్ ప్రాపర్టీస్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 382 కోట్లు



ముంబై: రియల్టీ రంగ దిగ్గజం గోద్రెజ్ ప్రాపర్టీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం తగ్గి రూ. 382 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 471 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 1,915 కోట్ల నుంచి రూ. 2,681 కోట్లకు బలపడింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం దాదాపు రెట్టింపై రూ. 1,400 కోట్లకు చేరింది. 2023–24లో కేవలం రూ. 725 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,334 కోట్ల నుంచి రూ. 6,967 కోట్లకు ఎగసింది. ఎన్‌సీడీలు, బాండ్లు లేదా ఇతర రుణ సెక్యూరిటీల ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా రూ. 2,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 29,444 కోట్ల విలువైన బుకింగ్స్ సాధించినట్లు గోద్రెజ్ ప్రాపర్టీస్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ పిరోజ్‌షా గోద్రెజ్ పేర్కొన్నారు. 2023–24లో నమోదైన రూ. 22,527 కోట్లతో పోలిస్తే ఇది 31 శాతం వృద్ధి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 4 శాతం జంప్‌చేసి రూ. 2,241 వద్ద ముగిసింది.

క్రిసిల్ ఆర్థిక ఫలితాలు భేష్

షేరుకు రూ.8 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ ఆర్థిక ఫలితాలు మెప్పించాయి. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.159.84 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. గతేడాది (2024) ఇదే మార్చి క్వార్టర్‌లో ప్రకటించిన రూ.138 కోట్లతో పోలిస్తే ఇది 16% అధికం. క్రిసిల్ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. మొత్తం ఆదాయం రూ.759 కోట్ల నుంచి రూ.844 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గానూ ముఖ విలువ రూ.1 కలిగిన ప్రతి ఈక్విటీ షేరుపై రూ.8 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

ఫలితాల ప్రకటన నేపథ్యంలో క్రిసిల్ షేరు బీఎస్‌ఈలో 1% పెరిగి రూ.4,427 వద్ద ముగిసింది.

వరుణ్ బెవరేజెస్ లాభం అప్

క్యూ1లో రూ. 731 కోట్లు



న్యూఢిల్లీ: గ్లోబల్ పానీయాల దిగ్గజం పెప్సీకోకు దేశీ బాట్లర్ వరుణ్ బెవరేజెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025) తొలి క్వార్టర్‌లో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ1)లో నికర లాభం 33 శాతంపైగా జంప్‌చేసి రూ. 731 కోట్లను అధిగమించింది. గతేడాది(2024) క్యూ1లో రూ. 548 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,398 కోట్ల నుంచి రూ. 5,680 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 3,690 కోట్ల నుంచి రూ. 4,730 కోట్లకు పెరిగాయి. అమ్మకాల పరిమాణం 30 % వృద్ధితో 312.4 మిలియన్ కేసులను తాకింది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది.

ఫలితాల నేపథ్యంలో వరుణ్ బెవరేజెస్ బీఎస్‌ఈలో 1.5% నీరసించి రూ. 521 వద్ద ముగిసింది.

ఏఈఎల్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 3,845 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్(ఏఈఎల్) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 7.5 రెట్లు దూసుకెళ్లి రూ. 3,845 కోట్లను తాకింది. కన్జూమర్ గూడ్స్ సంస్థలో వాటా విక్రయంతో లభించిన వన్‌టైమ్ ఆర్జన, సోలార్ తయారీ, ఎయిర్‌పోర్టుల వృద్ధి ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 451 కోట్లు ఆర్జించింది. విల్మర్‌లో వాటా విక్రయంతో రూ. 3,286 కోట్లు లభించింది. ఇది మినహాయిస్తే రూ. 1,313 కోట్ల లాభం నమోదైంది. నిర్వహణ లాభం(ఇబిటా) 19 శాతం వృద్ధితో రూ. 4,346 కోట్లను తాకింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం భారీగా ఎగసి రూ. 7,099 కోట్లకు చేరింది. 2023–24లో కేవలం రూ. 3,241 కోట్ల లాభం ఆర్జించింది.

మారికో లాభం రూ. 345 కోట్లు అప్

షేరుకి రూ. 7 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం మారికో గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 8% పుంజుకుని రూ. 345 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 320 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,278 కోట్ల నుంచి రూ. 2,730 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు రూ. 1,894 కోట్ల నుంచి రూ. 2,336 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 7 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. వంట నూనె ల బ్రాండ్ సఫోలా విలువరీత్యా 26% వృద్ధిని అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఫుడ్స్ విభాగం 44% వృద్ధితో రూ. 900 కోట్ల టర్నోవర్ సాధించినట్లు వెల్లడించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,502 కోట్ల నుంచి రూ. 1,658 కో ట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 9,653 కోట్ల నుంచి రూ. 10,831 కోట్లకు పెరిగింది.

ఫలితాల నేపథ్యంలో మారికో షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.7% నీరసించి రూ. 699 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా లాభం డౌన్

క్యూ4లో రూ. 85 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం క్షీణించి రూ. 85 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గడం ఇందుకు కారణమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 105 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 279 కోట్ల నుంచి రూ. 261 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు రూ. 157 కోట్ల నుంచి రూ. 168 కోట్లకు పెరిగాయి. పద్మినీ కాంత్ మిశ్రాను ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్(టెర్మినల్స్)గా బోర్డు ఎంపిక చేసింది. ఈ నియామకం వెనువెంటనే అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా షేరు బీఎస్‌ఈలో 2.6 శాతం నష్టంతో రూ. 293 వద్ద ముగిసింది.

ఉజ్జీవన్ ఎస్‌ఎఫ్‌బీ లాభం వీక్

క్యూ4లో రూ. 83 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(ఎస్ఎఫ్‌బీ) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 75 శాతం క్షీణించి రూ. 83.4 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 330 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,765 కోట్ల నుంచి రూ. 1,843 కోట్లకు ఎగసింది. ప్రొవిజన్లు రూ. 79 కోట్ల నుంచి రూ. 265 కోట్లకు భారీగా పెరిగాయి. స్థూల మొండి బకాయిలు(ఎన్‌పీఏలు) 2.23 శాతం నుంచి 2.18 శాతానికి దిగిరాగా.. నికర ఎన్‌పీఏలు 0.28% నుంచి 0.5 %కి పెరిగాయి. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం రూ. 1,282 కోట్ల నుంచి రూ. 726 కోట్లకు భారీగా పడిపోయింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,464 కోట్ల నుంచి రూ. 7,201 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో ఉజ్జీవన్ షేరు బీఎస్‌ఈలో 3.2% నష్టంతో రూ. 42.5 వద్ద ముగిసింది.

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ లాభం ప్లస్

క్యూ4లో రూ. 108 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం పుంజుకుని రూ. 108 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 105 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 15 శాతం ఎగసి రూ. 430 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో న్యూజెన్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2% లాభంతో రూ. 1,005 వద్ద ముగిసింది.




సెమీస్‌లో రష్మిక జోడీ

సాక్షి, హైదరాబాద్‌: అంతర్జాతీయ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీఎఫ్‌) డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో హైదరాబాద్‌ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. జార్జియాలోని లొపాటా నగరంలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో రష్మిక (భారత్‌)–అలెగ్జాండ్రా షుబ్లేడ్జ్‌ (రష్యా) ద్వయం 6–3, 3–6, 10–8తో 'సూపర్‌ టైబ్రేక్‌'లో వర్వర పన్షిన–దరియా జెలిన్‌స్కాయ (రష్యా) జోడీపై విజయం సాధించింది. 1 గంట 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్‌ చేసింది. సింగిల్స్‌ విభాగంలో రష్మిక తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. రష్మిక 3–6, 2–6తో భారత్‌కే చెందిన అంకిత రైనా చేతిలో ఓడిపోయింది.

'క్రికెట్‌లో హెల్మెట్‌లాంటిది టెక్నాలజీ'

సమర్థంగా వాడుకోవాలన్న రవిశాస్త్రి



ముంబై: క్రీడల్లో టెక్నాలజీ కారణంగా ఎన్నో మార్పులు వచ్చాయని, వాటిని సమర్థంగా వాడుకోవడం ఆటగాళ్ల చేతుల్లో ఉందని భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత రవిశాస్త్రి అభిప్రాయ పడ్డాడు. తాను ఆడిన రోజులతో పోలిస్తే ఇప్పుడు అత్యంత అధునాతన సాంకేతికత అందుబాటులో ఉందని, ఇది ఆటగాళ్ల పనిని మరింత సులువు చేసిందని అతను అన్నాడు. నగరంలో జరుగుతున్న వరల్డ్‌ ఆడియో విజువల్‌ అండ్‌ ఎంటర్‌టైన్‌మెంట్‌ సమ్మిట్‌ (వేవ్స్‌)లో భాగంగా 'ఇంటర్‌సెక్షన్‌ ఆఫ్‌ స్పోర్ట్స్, టెక్నాలజీ ఆంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ అండ్‌ మీడియా' అనే అంశంపై రవిశాస్త్రి మాట్లాడాడు. 'గత 40–45 ఏళ్లలో ఆటలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ పురోగతిని నేను దగ్గరి నుంచి చూశాను. కిట్‌ బ్యాగ్‌లో బ్యాట్, ప్యాడ్‌లు ఉన్నట్లే మీడియా, టెక్నాలజీ కూడా కిట్‌ బ్యాగ్‌లో భాగంగా మారింది. సరిగ్గా చెప్పాలంటే అది ఒక హెల్మెట్‌లాంటిది. దానిని సరైన రీతిలో అందిపుచ్చుకొని సమర్థంగా వాడుకోవాలి. మా రోజుల్లో రేడియో, దూరదర్శన్‌ మాత్రమే ఉండేవి. ఇప్పుడు అందరికీ చేరువయ్యేందుకు ఎన్నో వేదికలు ఉన్నాయి. భారత జట్టు ఎక్కడ ఆట ఆడినా కోట్లాది మంది అభిమానులు చూస్తున్నారు. ఏఐ టెక్నాలజీ కూడా మీ కోసం, మీ టీమ్‌ కోసం ఎంతో ఉపయోగపడుతుంది. సాంకేతికత ఆటను చాలా అద్భుతంగా మార్చింది. ఇప్పుడు ప్లేయర్‌ వెనక్కి వెళ్లి 100 సార్లు రీప్లేలు చూసుకునే అవకాశం ఉంది. మీ బలాలు, బలహీనతలే కాదు, ప్రత్యర్థుల గురించి తెలుసుకునేందుకు ఇది కీలకంగా మారిపోయింది' అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.



క్రీడా గ్రామంలో కాదు...
క్రూజ్‌ షిప్‌లో

2026 ఆసియా క్రీడల్లో పోటీపడే క్రీడాకారులకు వసతి ఏర్పాటు



టోక్యో: కామన్వెల్త్‌ క్రీడలు, ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లాంటి మెగా ఈవెంట్లు జరిగితే ప్రపంచ వ్యాప్తంగా పాల్గొనే అంతర్జాతీయ అథ్లెట్ల కోసం ఆధునిక హంగులతో, సకల సౌకర్యాలతో క్రీడా గ్రామాన్ని నిర్మించడమేది ఆనవాయితీ. ఇప్పటి వరకు జరిగిన ప్రతీ మెగా ఈవెంట్‌లోనూ ఇదే జరిగింది. కానీ వచ్చే ఏడాది జపాన్‌ ఆతిథ్యమిచ్చే ఆసియా క్రీడల్లో మాత్రం క్రీడా గ్రామం కనిపించదు. దీని స్థానంలో ఫ్లోటింగ్‌ విలేజ్‌కు నిర్వాహకులు మొగ్గు చూపారు. అంటే నీటిపై తెలియాడే విలేజ్‌ అన్నమాట! ఇందుకోసం భారీ ఓడను వినియోగించనుంది. క్రూజ్‌ షిప్‌ తెలుసుగా... అత్యంత ఖరీదైన, విలాసవంతమైన ఓడ. నీటిపై కదలాడే నగరాన్ని తలపించే క్రూజ్‌షిప్‌లో ఏషియాడ్‌కు విచ్చేసే అథ్లెట్లకు బస కల్పించే ఏర్పాట్లను జపాన్‌ నిర్వాహకులు చేస్తున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్‌ 19 నుంచి అక్టోబర్‌ 4 వరకు జరిగే ఈ ఆసియా క్రీడల్లో ఆసియా దేశాలకు చెందిన 15 వేల మంది అథ్లెట్లు పాల్గొంటారు. వీరందరి బసకోసం రొటీన్‌గా క్రీడా గ్రామాన్ని నిర్మించకుండా క్రూజ్‌షిప్‌లోనే బస ఏర్పాట్లు చేయనున్నారు. ఇదే జరిగితే అథ్లెట్లకు ఇదో సరికొత్త అనుభూతిని అందిస్తుంది. జపాన్‌లోని అయిచి రాష్ట్రంలోని నగోయా నగరంలో ఆసియా క్రీడలతో పాటు పారా ఆసియా క్రీడలు జరుగుతాయి. దీనికి సంబంధించిన ఆర్గనైజింగ్‌ కమిటీ నగోయా రేవు సమీపంలోని కింజో పీర్‌ వద్ద క్రూజ్‌షిప్‌ను ఫ్లోటింగ్‌ విలేజ్‌గా వాడుకోనుంది. ఆర్చరీ, బాస్కెట్‌బాల్‌ 3x3, కనోయింగ్‌–కయాకింగ్, సైక్లింగ్, మౌంటెన్‌ బైక్‌ సైక్లింగ్, రేసింగ్‌ ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, జూడో, కబడ్డీ, కురాష్, మిక్స్‌డ్‌ మార్షల్‌ ఆర్ట్స్, రోయింగ్, రగ్బీ, సెపక్‌తక్రా, స్పోర్ట్‌ క్లైంబింగ్, స్క్వాష్, టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, వుషు తదితర పోటీల్లో పాల్గొనేందుకు 4600 మంది అథ్లెట్లు వస్తారని నిర్వాహకులు అంచనా వేశారు. ఈ 20 క్రీడాంశాలకు సంబంధించిన వేదికలన్నీ (స్టేడియాలు) కూడా నగోయా పోర్ట్‌కు అతి దగ్గరలోనే ఉండటంతో నిర్వాహకులు ఫ్లోటింగ్‌ విలేజ్‌ (క్రూజ్‌షిప్‌పై) వైపు మొగ్గినట్లు తెలిసింది. ఇంతకు ముందెన్నడూ చూడని గ్రామాన్ని ఆవిష్కరించనున్నామని, ఇది అథ్లెట్ల జీవితాల్లో చిరకాలం నిలిచిపోయే వినూత్న వేదికని ఆసియా క్రీడల సాంకేతిక అధికారి ఒకరు తెలిపారు. భారీ ఓడలో కంటెయినర్లతో తయారు చేసిన విల్లాలు ఉంటాయి. అంతేకాదు జిమ్, స్విమ్మింగ్‌పూల్‌ సదుపాయలెన్నో ఉంటాయి.

తండ్రి అయిన వెర్‌స్టాపెన్‌

ఆడబిడ్డకు జన్మనిచ్చిన వెర్‌స్టాపెన్‌ భాగస్వామి కెల్లీ పికెట్‌



మయామి గార్డెన్స్‌: ఫార్ములావన్‌ ప్రపంచ చాంపియన్‌ మ్యాక్స్‌ వెర్‌స్టాపెన్‌ (నెదర్లాండ్స్‌) అభిమానులకు శుభవార్త చెప్పాడు. మయామి గ్రాండ్‌ప్రికి ముందు తన భాగస్వామి కెల్లీ పికెట్‌ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని వెల్లడించాడు. 'ఈ ప్రపంచంలోకి స్వాగతం చిన్నారి లిలీ. నీ కోసం మా హృదయాలు ప్రేమతో నిండిపోయాయి. మేము నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాం' అని శుక్రవారం వెర్‌స్టాపెన్‌ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌ చేశాడు. మూడుసార్లు ఫార్ములావన్‌ చాంపియన్‌ నెల్సన్‌ పెకెట్‌ కుమార్తె అయిన కెల్లీ పికెట్‌తో తన అనుబంధాన్ని 2021లో వెర్‌స్టాపెన్‌ బహిర్గతం చేశాడు. ఏడుసార్లు ప్రపంచ చాంపియన్‌ లూయిస్‌ హామిల్టన్‌ మాట్లాడుతూ... 'చాలా సంతోషకరమైన విషయం. సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి అనంతరం వెర్‌స్టాపెన్‌తో మాట్లాడా. అతడు దీని కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు' అని అన్నాడు. గత నాలుగేళ్లుగా డ్రైవర్స్‌ చాంపియన్‌షిప్‌ టైటిల్స్‌ సాధిస్తూ వస్తున్న వెర్‌స్టాపెన్‌ ఈ సీజన్‌లో ఒక్క రేసులో విజేతగా నిలిచాడు.



కోహ్లి X ధోని

నేడు చెన్నై సూపర్‌ కింగ్స్‌తో రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు 'ఢీ'
రాత్రి గం. 7:30 నుంచి స్టార్‌ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ (ఐపీఎల్‌) టి20 టోర్నమెంట్‌ 18వ సీజన్‌లో మెరుగైన ఆటతీరు కనబరుస్తున్న రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు శనివారం చెన్నై సూపర్‌ కింగ్స్‌ (సీఎస్‌కే)తో తలపడనుంది. గత మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బెంగళూరు 'ప్లే ఆఫ్స్‌' బెర్త్‌ ఖరారు చేసుకోవడంపై దృష్టి పెడితే... ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబర్చిన చెన్నై సూపర్‌ కింగ్స్‌ ఇప్పటికే 'ప్లే ఆఫ్స్‌' రేసు నుంచి తప్పుకుంది. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన తొలి పోరులోనూ ఆర్‌సీబీ విజయం సాధించగా... సొంతగడ్డపై జరగనున్న పోరులో అదే జోరు కొనసాగించాలని బెంగళూరు భావిస్తోంది. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లాడిన బెంగళూరు 7 విజయాలు, 3 పరాజయాలతో 14 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. మరో విజయం సాధిస్తే ఇక 'ప్లే ఆఫ్స్‌'కు చేరినట్లే. మరోవైపు చెన్నై సూపర్‌ కింగ్స్‌ 10 మ్యాచ్‌ల్లో రెండింట గెలిచి 8 మ్యాచ్‌ల్లో ఓడింది. ఎలాగో ఇప్పటికే రేసు నుంచి తప్పుకున్న సీఎస్‌కే 'పోరాడితే పోయేదేముంది' అన్న తరహాలో విజృంభించాలని చూస్తోంది. దిగ్గజ ఆటగాళ్లు ధోని, కోహ్లి బరిలోకి దిగనుండటంతో ఈ మ్యాచ్‌పై మరింత ఆసక్తి నెలకొంది. ప్రస్తుత ఫామ్‌ ప్రకారం వచ్చే ఏడాది ధోని ఐపీఎల్‌ ఆడటంపై సందేహాలు నెలకొన్న నేపథ్యంలో ధోనీ, కోహ్లి కలిసి మైదానంలో కనిపించడం ఇదే చివరిసారి కావొచ్చని సామాజిక మాధ్యమాల్లో జోరుగా చర్చ సాగుతోంది! మరి ఈ పోరులో ధోని సేనను విజయం వరిస్తుందా... బెంగళూరు 'ప్లే ఆఫ్స్‌' బెర్త్‌ ఖరారు చూసుకుంటుందా చూడాలి.

జోరు మీదున్న కోహ్లి...

అంతర్జాతీయ టి20ల నుంచి తప్పుకున్న విరాట్‌ కోహ్లి... ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగి జట్టు అవసరాలకు తగ్గట్లు ఆడుతూ ముందుకు సాగుతున్నాడు. 10 మ్యాచ్‌ల్లో 63.29 సగటుతో 443 పరుగులు చేశాడు. ఇందులో 6 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కోహ్లి... 'ఆరెంజ్‌ క్యాప్‌' రేసులో ముందున్నాడు. మరో ఓపెనర్‌ ఫిల్‌ సాల్ట్‌ ఎక్కువసేపు నిలవలేక పోతుండగా... దేవదత్‌ పడిక్కల్, కృనాల్‌ పాండ్యా, టిమ్‌ డేవిడ్‌ మంచి టచ్‌లో ఉన్నారు. ముఖ్యంగా వన్‌డౌన్‌లో పడిక్కల్‌ ధనాధన్‌ షాట్లతో చెలరేగుతున్నాడు. కెప్టెన్‌ రజత్‌ పాటీదార్‌ నుంచి టీమ్‌ మేనేజ్‌మెంట్‌ భారీ ఇన్నింగ్స్‌ ఆశిస్తోంది.

21 ఐపీఎల్‌ చరిత్రలో బెంగళూరు, చెన్నై జట్ల మధ్య మొత్తం 34 మ్యాచ్‌లు జరిగాయి. చెన్నై జట్టు 21 మ్యాచ్‌ల్లో, బెంగళూరు 12 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఒక మ్యాచ్‌ రద్దు అయింది. బెంగళూరుపై చెన్నై అత్యధిక స్కోరు 226 కాగా, అత్యల్ప స్కోరు 82 పరుగులు. చెన్నైపై బెంగళూరు అత్యధిక స్కోరు 218 కాగా, అత్యల్ప స్కోరు 70 పరుగులు.

పెద్దగా ప్రభావం చూపలేకపోతున్న చెన్నై బౌలర్లపై బెంగళూరు బ్యాటర్లంతా కలిసికట్టుగా కదం తొక్కితే భారీ స్కోరు ఖాయమే. ఇక బౌలింగ్‌లో భువనేశ్వర్, హాజల్‌వుడ్, యశ్‌ దయాళ్‌ పేస్‌ భారం మోస్తుండగా... కృనాల్‌ పాండ్యా, సుయాశ్‌ శర్మ స్పిన్‌ బాధ్యతలు పంచుకుంటున్నారు.

సమష్టిగా సత్తా చాటితేనే!

ఐపీఎల్‌ టోర్నమెంట్‌ ఆరంభం (2008) నుంచి ఆడుతున్న ధోని... వచ్చే ఏడాది ఆటగాడిగా లీగ్‌లో పాల్గొనక పోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రుతురాజ్‌ గైక్వాడ్‌ గాయం కారణంగా ఈ సీజన్‌ మధ్యలో చెన్నై పగ్గాలు అందుకున్న ధోని... జట్టు విజయాల బాట పట్టించలేకపోయాడు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సీఎస్‌కే ఏమాత్రం ప్రభావం చూపలేకపోతోంది. స్వదేశీ, విదేశీ ఆటగాళ్లనే తేడా లేకుండా అంతా విఫలమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఓపెనర్‌ షేక్‌ రషీద్‌... వచ్చిన అవకాశాలను వృథా చేసుకుంటుండగా... మరో యంగ్‌స్టర్‌ ఆయుశ్‌ మాత్రే ఫర్వాలేదనిపిస్తున్నాడు. స్యామ్‌ కరన్, డెవాల్డ్‌ బ్రెవిస్, శివమ్‌ దూబే, రవీంద్ర జడేజా సమష్టిగా రాణించాల్సిన అవసరముంది. ఇక బౌలింగ్‌లో ఖలీల్‌ అహ్మద్, నూర్‌ అహ్మద్‌ కాస్త నయం కాగా... మిగిలిన వాళ్లు కూడా సత్తా చాటాలని టీమ్‌ మేనేజ్‌మెంట్‌ ఆశిస్తోంది. ప్రస్తుత స్థితిలో బెంగళూరు బ్యాటింగ్‌ జోరును అడ్డుకోవడం చెన్నై బౌలర్లకు కత్తిమీద సామే!

తుది జట్లు (అంచనా)

రాయల్‌ చాలెంజర్స్‌ బెంగళూరు: రజత్‌ పాటీదార్‌ (కెప్టెన్), కోహ్లి, సాల్ట్, దేవదత్‌ పడిక్కల్, కృనాల్‌ పాండ్యా, జితేశ్‌ శర్మ, రొమారియో షెఫర్డ్, టిమ్‌ డేవిడ్, భువనేశ్వర్, హాజల్‌వుడ్, యశ్‌ దయాళ్, సుయాశ్‌ శర్మ.

చెన్నై సూపర్‌ కింగ్స్‌: ధోని (కెప్టెన్), షేక్‌ రషీద్, ఆయుశ్‌ మాత్రే, స్యామ్‌ కరన్, రవీంద్ర జడేజా, బ్రెవిస్, శివమ్‌ దూబే, దీపక్‌ హుడా, అన్షుల్‌ కంబోజ్, నూర్‌ అహ్మద్, ఖలీల్‌ అహ్మద్, పతిరణ.



క్వార్టర్‌ ఫైనల్లో రిత్విక్‌ జంట ఓటమి

కస్కయిస్‌ (పోర్చుగల్‌): మిలీనియం ఎస్టోరిల్‌ ఓపెన్‌ ఏటీపీ చాలెంజర్‌–175 టెన్నిస్‌ టోర్నీలో భారత డేవిస్‌కప్‌ జట్టు సభ్యుడు బొల్లిపల్లి రిత్విక్‌ చౌదరీ పోరాటం ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన రిత్విక్‌ చౌదరీ కొలంబియా ప్లేయర్‌ నికొలస్‌ బరియెంతోస్‌తో కలిసి పురుషుల డబుల్స్‌ విభాగంలో పోటీపడ్డాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో రిత్విక్‌–బరియెంతోస్‌ ద్వయం 1–6, 7–6 (8/6), 2–10తో 'సూపర్‌ టైబ్రేక్‌'లో పీటర్‌ నూజా–ప్యాట్రిక్‌ రికిల్‌ (చెక్‌ రిపబ్లిక్‌) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 95 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్‌–బరియెంతోస్‌ తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఒక్కసారి కూడా బ్రేక్‌ చేయలేకపోయింది.

అనిరుధ్‌ జంటకు నిరాశ

మరోవైపు ఆస్ట్రియా ఓపెన్‌ ఏటీపీ చాలెంజర్‌–100 టెన్నిస్‌ టోర్నీ నుంచి హైదరాబాద్‌ ప్లేయర్‌ అనిరుధ్‌ చంద్రశేఖర్‌ (భారత్‌)–మిడిల్‌కూప్‌ (నెదర్లాండ్స్‌) జోడీ నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో అనిరుధ్‌–మిడిల్‌కూప్‌ ద్వయం 6–7 (1/7), 2–6తో నికో హిప్‌ఫిల్‌ (ఆస్ట్రియా)–జెరోమ్‌ కిమ్‌ (స్విట్జర్లాండ్‌) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

ఇంగ్లండ్‌ టెస్టు జట్టులో రెండు కొత్త ముఖాలు

- తొలిసారి అవకాశం దక్కించుకున్న స్యామ్‌ కుక్, జోర్డాన్‌ కాక్స్‌
- జింబాబ్వేతో ఏకైక టెస్టుకు జట్టు ఎంపిక


స్యామ్‌ కుక్‌

లండన్‌: టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్‌ జట్టు యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు సిద్ధమైంది. భారత్, ఇంగ్లండ్‌ మధ్య జూన్‌ 20 నుంచి ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ జరగనుంది. దానికి ముందు సొంతగడ్డపై ఇంగ్లండ్‌ జట్టు... జింబాబ్వేతో ఏకైక టెస్టు ఆడనుంది. ఈ నెల 22 నుంచి నాటింగ్‌హామ్‌లో జరగనున్న ఈ మ్యాచ్‌ కోసం ఇంగ్లండ్‌ వేల్స్‌ క్రికెట్‌ బోర్డు శుక్రవారం 13 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌ కోసం స్యామ్‌ కుక్, జోర్డాన్‌ కాక్స్‌ను తొలిసారి జాతీయ జట్టుకు ఎంపిక చేసింది. మీడియం పేసర్‌ స్యామ్‌ కుక్‌ దేశవాళీల్లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాడు. 27 ఏళ్ల కుక్‌ ఫస్ట్‌ క్లాస్‌ క్రికెట్‌లో 19.77 సగటుతో 318 వికెట్లు తీశాడు. ఇటీవల ఇంగ్లండ్‌ లయన్స్‌ తరఫున ఆస్ట్రేలియా పర్యటనలోనూ కుక్‌ ఆకట్టుకున్నాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి 13 వికెట్లు పడగొట్టాడు. దీంతో జింబాబ్వేతో టెస్టు మ్యాచ్‌ కోసం అతడిని ఎంపిక చేశారు. వికెట్‌ కీపర్‌ బ్యాటర్‌ అయిన 24 ఏళ్ల జోర్డాన్‌ కాక్స్‌ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు నాటింగ్‌హామ్‌షైర్‌ పేసర్‌ జోష్‌ టంగ్‌కు తిరిగి అవకాశం కల్పించారు. 2023 యాషెస్‌ సిరీస్‌లో ఆడిన టంగ్‌... ఆ తర్వాత గాయాల కారణంగా జట్టుకు దూరమయ్యాడు. 2003 తర్వాత ఇంగ్లండ్‌లో జింబాబ్వే టెస్టు మ్యాచ్‌ ఆడనుండటం ఇదే తొలిసారి.


జోర్డాన్‌ కాక్స్‌

ఇంగ్లండ్‌ జట్టు: బెన్‌ స్టోక్స్‌ (కెప్టెన్), అట్కిన్సన్, షోయబ్‌ బషీర్, హ్యారీ బ్రూక్, స్యామ్‌ కుక్, జోర్డాన్‌ కాక్స్, జాక్‌ క్రాలీ, బెన్‌ డకెట్, ఒలీ పోప్, మాథ్యూ పాట్స్, జో రూట్, జేమీ స్మిత్, జోష్‌ టంగ్‌.

ఇంగ్లండ్‌ మహిళల క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్లకు 'నో'

ఈసీబీ నిర్ణయం తక్షణం అమల్లోకి



లండన్‌: ఇంగ్లండ్‌ క్రికెట్‌ బోర్డు (ఈసీబీ) లింగ మార్పిడి (ట్రాన్స్‌ జెండర్లు) చేసుకున్న క్రికెటర్లపై నిషేధం విధించింది. ఇకపై మహిళలు, బాలికల క్రికెట్‌లో వారిని అనుమతించమని స్పష్టం చేసింది. ఈసీబీ నిర్ణయం తక్షణం అమలవుతుందని వెల్లడించింది. సుప్రీమ్‌ కోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు తెలిపింది. ఇటీవల సుప్రీమ్‌ కోర్టు మహిళలు, బాలికల క్రీడల్లో కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. మహిళా అథ్లెట్ల ఔన్నత్యాన్ని పెంచేవిధంగా ఈ కోర్టు నిర్ణయాలు తీసుకుంది. దీన్ని వెంటనే అమలు చేసేందుకు ఈసీబీ సిద్ధమైంది. 'తల్లిగర్భం నుంచే అమ్మాయిగా జన్మించిన ఆడబిడ్డలే ఇకపై బాలికలు (జూనియర్‌ స్థాయి), మహిళల (సీనియర్‌ స్థాయి) క్రికెట్‌లో ఆడేందుకు అర్హులు. లింగమార్పిడితో ఆడవారుగా మారిన క్రికెటర్లను అనుమతించం. అయితే ఈ ట్రాన్స్‌జెండర్లు ఓపెన్‌ లేదంటే మిక్స్‌డ్‌ క్రికెట్‌ ఆడుకోవచ్చు. కానీ మహిళల విభాగంలో పోటీపడేందుకు మాత్రం వీల్లేదు' అని ఈసీబీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇంగ్లండ్‌ ఫుట్‌బాల్‌ సంఘం (ఎఫ్‌ఏ) ఇలాంటి నిర్ణయమే తీసుకున్న 24 గంటల్లోపే ఈసీబీ కూడా ఎఫ్‌ఏను అనుసరించింది.



గుకేశ్‌
నకమురు

అమెరికాతో భారత్‌ 'సై'

అక్టోబర్‌లో రెండు జట్ల మధ్య చెస్‌ టోర్నీ ● బరిలో మేటి గ్రాండ్‌మాస్టర్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్, అమెరికాల మధ్య చెస్‌ టోర్నమెంట్‌ జరగనుంది. ఇరు దేశాలకు చెందిన టాప్‌ స్టార్‌ ప్లేయర్లందరూ ఈ టోర్నీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. దీనికి సంబంధించిన 'డ్రా' తదితర వివరాలను శుక్రవారం వెల్లడించారు. అక్టోబర్‌ 4న అర్లింగ్టన్‌లోని ఇ–స్పోర్ట్స్‌ స్టేడియంలో చెస్‌ పోటీలు జరుగనున్నాయి. ఇరు దేశాల నుంచి ఐదుగురు చొప్పున ఆటగాళ్లు ఇందులో పాల్గొంటారు. క్లాసికల్‌ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌ దొమ్మరాజు గుకేశ్‌ భారత జట్టును ముందుండి నడిపించనున్నాడు. అమెరికన్‌ సూపర్‌ గ్రాండ్‌మాస్టర్‌ హికారు నకమురను గుకేశ్‌ 'ఢీ'కొంటాడు. గుకేశ్‌తో పాటు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్‌ ఇరిగేశి అర్జున్, సాగర్‌ షా, కుర్రాడు ఎథన్‌ వాజ్‌తో పాటు భారత మహిళా ప్లేయర్, అంతర్జాతీయ మాస్టర్‌ దివ్య దేశ్‌ముఖ్‌లు బరిలో ఉన్నారు. మొదటి బోర్డులో గుకేశ్, నకమురు తలపడతారు. రెండో బోర్డులో అర్జున్‌... గ్రాండ్‌మాస్టర్‌ ఫాబియానో కరువానాను ఎదుర్కొంటాడు. మూడో బోర్డులో సాగర్‌ షా, లెవి రొజ్మన్‌ పోటీపడనుండగా, మిగతా పోటీల్లో దివ్యతో కారిస్సా యిప్, ఎథన్‌ వాజ్‌తో టానిటొలువా అడ్యూమి తలపడతారు. టోర్నీ నిబంధనల విషయానికొస్తే బోర్డులోని ఇరు ఆటగాళ్ల మధ్య ఐదు రౌండ్ల గేమ్‌లు జరుగుతాయి. పది నిమిషాల్లో గేమ్‌ను ముగించాల్సి ఉంటుంది. అప్పటికీ 'డ్రా' అయితే మరో 5 నిమిషాల ఆటను కొనసాగిస్తారు. షూటౌట్‌కు వస్తే మరో నిమిషం అదనంగా కేటాయిస్తారు. అప్పటికీ సమఉజ్జీలుగా నిలిస్తే మాత్రం విజేత తేలే వరకు పోటీ కొనసాగుతుంది.



పంజాబ్‌లోని అటారీ-వాఘా అంతర్జాతీయ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం బీఎస్‌ఎఫ్ జవాన్ల పహారా. ఇంకా భారత్‌లోనే ఉన్న తమ పౌరులు తిరిగొచ్చేందుకు వీలుగా చెక్‌పోస్టును తెరిచి ఉంచుతామని పాక్ తాజాగా ప్రకటించింది.



పాక్ ప్రకటన నేపథ్యంలో మూటాముల్లె సర్దుకుని పిల్లలతో పాటుగా అటారీ చెక్‌పోస్టు వైపు వెళ్తున్న ఆ దేశ పౌరులు. వారిని నిశితంగా గమనిస్తున్న బీఎస్‌ఎఫ్ సిబ్బంది.

పాక్‌పై ఫైనాన్షియల్ స్ట్రైక్స్!

దాయాది దేశ ఆర్థిక పునాదులను పెకలించేందుకు భారత్ యత్నం

- ఎఫ్‌ఏటీఎఫ్ 'గ్రే'లిస్ట్‌లో పాక్‌ను చేర్చేందుకు ప్రయత్నం
- ఐఎంఎఫ్ భారీ నిధులకు బ్రేకులేసేందుకు ప్రణాళిక

న్యూఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ స్ట్రైక్స్ చేసి డజన్లకొద్దీ ముష్కరులను అంతమొందించిన భారత ఇప్పుడు పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలపై కోలుకోలేని దెబ్బ కొట్టాలని కంకణం కట్టుకుంది. అందులోభాగంగా విదేశీ నిధులను పాక్ సర్కార్ ఉగ్ర కార్యకలాపాలు, సీమాంతర ఉగ్రవాదం, ఇతర చీకటి పనులను కేటాయిస్తోందని నిరూపించడం ద్వారా విదేశీ సాయం నిలిచిపోయేలా చేయాలని భారత్ యోచిస్తోంది. ఇందుకోసం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)పై భారత్ తీవ్ర స్థాయిలో ఒత్తిడిచేయనుంది. ఈ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 'గ్రే'జాబితాలోకి చేరితే ఆయా దేశాలకు అంతర్జాతీయ సాయం, నిధుల మంజూరు, విదేశాల మద్దతు, విదేశీ పెట్టుబడులు రావడం చాలా కష్టమవుతుంది. దీనికితోడు ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ద్వారా పాకిస్తాన్‌కు రాబోయే వందల కోట్ల విలువైన నిధులను అడ్డుకుని పాక్‌ను ఆర్థిక కష్టాల కడలిలో ముంచాలని మోదీ సర్కార్ తీవ్రంగా శ్రమిస్తోంది.

గతంలో పాక్‌పై గ్రే లిస్ట్ కొరడా

విదేశీ నిధులను పూర్తిగా దేశాభివృద్ధికి కోసం కేటాయించకుండా అందులో కొంత మొత్తాలను ఉగ్ర సంబంధ కార్యకలాపాలకు వెచ్చించినట్లు పాకిస్తాన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇవి నిజమని తేలడంతో పాక్‌ను 2018 జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ తన గ్రే లిస్ట్‌లో పెట్టింది. దీంతో విదేశీ సాయం అందక పాక్ తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంది. దీంతో బుద్ధి తెచ్చుకున్న పాకిస్తాన్ తన ఉగ్రకార్యకలాపాలకు నిధుల్లో కోత పెట్టింది. పలువురు ఉగ్రవాదులను అరెస్ట్‌చేసింది. దీంతో ఎట్టకేలకు 2022 అక్టోబర్‌లో గ్రే జాబితా నుంచి పాకిస్తాన్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు సైతం ఇలాగే పాకిస్తాన్‌ను గ్రే జాబితాలోకి చేర్చేలా ఎఫ్ఏటీఎఫ్‌పై మోదీ సర్కార్ ఒత్తిడిని పెంచింది. ఎఫ్ఏటీఎఫ్‌లో 40 సభ్య దేశాలున్నాయి. వీటిలో భారత్ తన అత్యంత స్నేహశీల దేశాల ద్వారా ఈ పని ముగించాలని చూస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశాలు ఏటా ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లో జరుగుతాయి. ఈ జూన్ సెషన్‌లో ఈ మేరకు మద్దతు కూడగట్టేందుకు మిత్రదేశాలతో భారత్ ఇప్పటికే సంప్రదింపులు మొదలెట్టినట్లు వార్తలొచ్చాయి.

ఐఎంఎఫ్‌పైనా కేంద్రం ఒత్తిడి

స్వదేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, తగ్గిపోయిన విదేశీ పెట్టుబడులతో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న పాకిస్తాన్ దేశ పాలన కోసం తరచూ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థపై ఆధారపడుతోంది. దీంతో వచ్చే మూడేళ్లలో 7 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఐఎంఎఫ్ ఒప్పుకుంది. ఈ నిధులొస్తే పాక్ వాటిని ఉగ్రకార్యకలాపాలకు దుర్వినియోగం చేయనుందని భారత్ ఐఎంఎఫ్ ఎదుట ఆందోళన వ్యక్తంచేయనుంది. భారత వాదన నెగ్గితే ఈ నిధులు ఆగిపోవడమో, తగ్గిపోవడమో జరగొచ్చు. నిధుల విస్తరణపై మే 9వ తేదీన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, పాక్ ఉన్నతాధికారుల మధ్య తొలి సమీక్ష సమావేశం జరగనుంది. పాకిస్తాన్‌కు నిధుల మంజూరుపై పునరాలోచన చేస్తే మంచిదని ఇతర అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలు, సంఘాలను సైతం భారత్ కోరబోతోంది. ప్రజాపనుల రుణాలు, సాంకేతిక సహకారానికి సంబంధించి మొత్తంగా 764 పనులకుగాను ఏకంగా 43.7 బిలియన్ డాలర్ల నిధులను పాక్‌కు ఇచ్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్ణయించింది. ఇప్పటికే 9.13 బిలియన్ డాలర్ల రుణాలిచ్చింది. నాలుగు నెలల క్రితం ప్రపంచ బ్యాంక్ సైతం పాకిస్తాన్‌కు 20 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది.

'లవ్ జిహాద్' దోషులకు వేసెక్టమీ చేయాలి

బీజేపీ ఎంపీ అలోక్ శర్మ వ్యాఖ్య

భోపాల్: 'లవ్ జిహాద్'దోషులకు వేసెక్టమీ శస్త్రచికిత్స చేయించాలంటూ బీజేపీ ఎంపీ అలోక్ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భోపాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. లవ్ జిహాద్ కేసుల్లో దోషులుగా తేలిన వారికి స్టెరిలైజేషన్ చేయిస్తామని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. హిందూ యువతులను ప్రేమ పేరుతో మత మార్పిడులకు పాల్పడే లవ్ జిహాద్ ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీ ప్రజలను హెచ్చరించారు. 'ఇలాంటివి మీ దృష్టికి వస్తే నేరుగా నాకు ఫోన్ చేసి చెప్పండి. అవసరమైతే, వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్లను ముట్టడించండి'అని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరలవుతోంది. హిందూ మహిళలతో స్నేహం చేస్తూ వారిపై లైంగిక దాడి చేసి, అందుకు సంబంధించిన వీడియోలను ఆన్‌లైన్‌లో పెడతామంటూ బెదిరిస్తున్న ఓ ముఠాను పోలీసులు గత నెలలో అరెస్ట్ చేశారు. వీరు బాధిత మహిళలను మతం మారాలని ఒత్తిడి చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి ఘటనలపై విచారణకు భోపాల్ పోలీస్ కమిషనర్ సారథ్యంలో సిట్ ఏర్పాటైంది. ఈ నేపథ్యంలోనే ఎంపీ అలోక్ శర్మ పై వ్యాఖ్యలు చేసినట్లుగా చెబుతున్నారు.


ట్రంపే బదులివ్వాలి

- స్టూడెంట్ వీసా రద్దుపై విదేశాంగ, హోంలాండ్ విభాగాలకు ప్రమీల లేఖ
- 130 మంది డెమొక్రాట్ల సంతకాలు

వాషింగ్టన్: స్టూడెంట్ వీసాల రద్దు, విదేశీ విద్యార్థుల చట్టపరమైన హోదాను రద్దు చేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై భారత సంతతికి చెందిన డెమొక్రాట్ ప్రమీలా జయపాల్ మండిపడ్డారు. ఏ ప్రాతిపదికన ఈ చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగాలకు లేఖ రాశారు. దానిపై 130 మందికి పైగా డెమొక్రాట్లు సంతకాలు చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా వీసాల రద్దు వల్ల విద్యార్థుల భవిష్యత్ గందరగోళంలో పడుతుందని జయపాల్ అన్నారు. వీసా హోదా అనిశ్చితి అమెరికా విశ్వవిద్యాలయాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ''రద్దు చేసిన కొందరు విద్యార్థుల వీసాలను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించినా అదింకా అమలు కాలేదు. కొందరు విద్యార్థులు ఇంకా ఇమిగ్రేషన్ నిర్బంధంలో ఉన్నారు. భవిష్యత్‌లో మరిన్ని వీసా రద్దులు జరుగుతాయనే భయాందోళనలు నెలకొన్నాయి''అని లేఖలో పేర్కొన్నారు. ''ఇది స్టూడెంట్ వీసా హోల్డర్లపై దాడి. ఈ భారీ, రాజకీయ ప్రేరేపిత ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విశ్వవిద్యాలయాలను భయానక ప్రదేశాలుగా మారుస్తోంది'అని జయపాల్ హెచ్చరించారు. ఆమె ఇమ్మిగ్రేషన్ ఇంటిగ్రిటీ, సెక్యూరిటీ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ కమిటీలో సభ్యురాలు. కొన్ని వారాల్లో గ్రాడ్యుయేషన్ ఉండగా ఆకస్మిక వీసాల రద్దు పలువురు విద్యార్థులను అయోమయంలో పడేసింది. తమ వీసా హోదాను పునరుద్ధరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా 100 మందికి పైగా విద్యార్థులు కోర్టులను ఆశ్రయించారు.

ఎవరీ ప్రమీలా జయపాల్?

అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్ మహిళగా జయపాల్ రికార్డు సృష్టించారు. 1965 సెప్టెంబర్ 21న చెన్నైలో జన్మించిన ఆమె వాషింగ్టన్ 7వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇమ్మిగ్రేషన్ సంస్కరణలు, ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక న్యాయం, వాతావరణం మార్పులు వంటి అంశాలపై ఎంతో కాలంగా క్రియాశీలకంగా పని చేస్తున్నారు. విద్యార్థి హక్కులు, వలస సంస్కరణల కోసం గళమెత్తుతున్నారు.



ఆకాశవీధిలో... అందాల పొదరిల్లు

'పదిలంగా కట్టుకున్న పొదరిల్లు'ను తలపిస్తున్న ఈ పక్షుల గూడు జర్మనీలో ఉంది. విస్బడెన్ నగరంలో ఓ మూతబడ్డ ఇటుకల ఫ్యాక్టరీ చిమ్నీ పై భాగాన్ని పక్షులు ఇలా ఎంచక్కా తమ నివాసంగా మార్చుకున్నాయి.

యుద్ధం ఇప్పట్లో ముగియదు: వాన్స్

వాషింగ్టన్: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభిప్రాయపడ్డారు. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న సంఘర్షణను ముగించడమెలా అనేది ఇప్పుడు అమెరికా ముందున్న సవాలన్నారు. ఈ సంఘర్షణను నిలిపేయడానికి ఒప్పందానికి రావాల్సిన బాధ్యత రెండు దేశాలపైనా ఉందన్నారు. అమెరికా-ఉక్రెయిన్ మధ్య అరుదైన ఖనిజ ఒప్పందం కుదిరిన కొన్ని గంటల్లోనే వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధంపై అధ్యక్షుడు ట్రంప్ వైఖరిని ఆయన సమర్థించారు. ''రష్యాకు భూమిని కోల్పోయిన ఉక్రేనియన్లు కోపంగా ఉన్నారు. వేలాది మంది సైనికులను కోల్పోవడం కూడా సరికాదు''అన్నారు. వివాదంపై త్వరలో పురోగతి రావాల్సిన అవసరముందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సైతం అన్నారు. లేదంటే ఈ అంశానికి ఎంత సమయం కేటాయించాలో అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. మే 9న విక్టరీ డేను పురస్కరించుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మూడు రోజుల పాటు కాల్పుల విరమణ ప్రకటించడం తెలిసిందే. ఉక్రెయిన్ 30 రోజుల విరమణకు పిలుపునిచ్చింది. కానీ యుద్ధం కొనసాగుతూనే ఉంది.

హార్వర్డ్ వర్సిటీకి పన్ను మినహాయింపు హోదా రద్దు

ట్రంప్ మరో తెంపరి నిర్ణయం

వాషింగ్టన్: అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కత్తిగట్టారు. వర్సిటీకి పన్ను మినహాయింపు హోదాను రద్దు చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. ''అదే వాళ్లకు తగిన శాస్తి''అంటూ తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌సోషల్‌లో పోస్ట్ చేశారు. కాసేపటికే హోదా రద్దుకు చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులకు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థి ఆందోళనలను కట్టడి సహా పలు అంశాల్లో తన ఆదేశాలను ఖాతరు చేయనందుకు హార్వర్డ్‌పై కొంతకాలంగా ఆయన గుర్రుగా ఉండటం తెలిసిందే. వర్సిటీకి దాదాపు 300 కోట్ల డాలర్ల మేరకు ప్రభుత్వ నిధులను నిలిపేస్తూ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. అయినా స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తి విషయాల్లో రాజీ పడే ప్రసక్తే లేదని హార్వర్డ్ ఇప్పటికే కుండబద్దలు కొట్టింది. దాంతో చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ పన్ను మినహాయింపు హోదా రద్దు ప్రకటన చేశారు.

నిర్బంధ ఓటింగ్‌కు వందేళ్లు

ఆస్ట్రేలియా పార్లమెంటుకు శనివారం ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలోని 1.8 కోట్ల మంది అర్హులైన ఓటర్లు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారు. ఆ దేశంలో ఓటేయడం కేవలం నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు.. తప్పనిసరిగా పాటించి తీరాల్సిన చట్టపరమైన బాధ్యత. ఎందుకంటే ఆస్ట్రేలియాలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేయాలని చట్టముంది. దాంతో అనేక దేశాలు ప్రజలను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడానికి నానా కష్టాలు పడుతుంటే ఆస్ట్రేలియా మాత్రం ప్రపంచంలోనే అత్యధిక ఓటింగ్ నమోదయ్యే దేశాల్లో ఒకటిగా ఉంది. 2022 ఎన్నికల్లో ఏకంగా 90 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు! బ్రిటన్‌లో 2024 ఎన్నికల్లో కేవలం 60 శాతం పోలింగ్ నమోదయ్యింది. అమెరికాలో ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో 64 శాతం నమోదైంది.

చట్ట సవరణ

ఆస్ట్రేలియాలో 1924లో ఎన్నికల చట్టాన్ని సవరించి ఫెడరల్ ఎన్నికల్లో ఓటేయడాన్ని తప్పనిసరి చేశారు. దానిప్రకారం ఫెడరల్ ఎన్నికల్లో ఓటు వేయకపోతే 20 డాలర్లు, రాష్ట్ర ఎన్నికల్లో ఓటేయకపోతే 79 డాలర్ల దాకా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ చట్టం బాగానే పనిచేసింది. 1922 ఎన్నికల్లో 60 శాతం కూడా లేని ఓటింగ్ చట్టం తర్వాత 1925 ఎన్నికల్లో ఏకంగా 91 శాతం దాటేసింది. నిర్బంధ ఓటింగ్ వల్ల గెలిచినవారు మరింత బాధ్యతాయుతంగా ఉంటారనే వాదన కూడా ఉంది. నిర్బంధ ఓటు అట్టడుగు వర్గాలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించడానికి కూడా సహాయపడుతుందని, ఇది మరింత సమసమాజ ప్రజా విధానాలను రూపొందిస్తుందని నిపుణుల విశ్లేషణ. నిర్బంధ ఓటింగ్ విధానంలో మధ్యతరగతి పౌరులు, వారి ఆందోళనలు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుంటారని, ఇది ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కనిపించే పోలరైజేషన్ రాజకీయాలను నిరోధించి భిన్నమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందనే అభిప్రాయం ఉంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఓటు వేయలేకపోతే ఏంటి పరిస్థితి? సరైన కారణం ఉంటే మినహాయింపు ఉంటుంది.

ఆస్ట్రేలియా ఘనత

- ప్రతి ఎన్నికల్లోనూ కనీసం 90 శాతం పైగా పోలింగ్
- నేడు పార్లమెంటుకు ఎన్నికలు

ఆస్ట్రేలియన్లు ఏమంటున్నారు?

నిర్బంధ ఓటింగ్ గురించి ఆస్ట్రేలియాలో ఎలాంటి వివాదం లేదు. ఈ చట్టానికి ప్రజల గట్టి మద్దతుంది. దీనికి 70 శాతం ఆమోదం ఉందని 1967 నుంచి జరిగిన పలు జాతీయ సర్వేలు తేల్చాయి. అయితే నిర్బంధ ఓటింగ్‌ను రద్దు చేయాలని దశాబ్దాలుగా డిమాండ్, ఆందోళనలు చేస్తున్న వాళ్లూ ఉన్నారు. ఓటేయాలో వద్దో ఎంచుకునే హక్కు పౌరులకు ఉండాలన్నది వారి వాదన. వాళ్లకు ప్రజాదరణ అంతంతే. నిర్బంధ ఓటింగ్ ద్వారా యువకులు మనమందరం ఎలాగైనా ఓటు వేయాలి అనే అవగాహనకు వస్తున్నారు. రాజకీయ ప్రక్రియలో పాల్గొనడంతోపాటు ఏం జరుగుతుందో తెలుసుకుంటున్నారు. నిర్బంధ ఓటు లేకపోయినా స్వచ్ఛందంగా ఓటేసే వాళ్లమేనని 2022లో 77 శాతం మంది ఆస్ట్రేలియన్లు చెప్పడం విశేషం!

వేతనంతో కూడిన సెలవు

ఓటింగ్‌కు అడ్డంకులు తొలగించడానికి, ప్రజలంతా ఓటింగ్‌లో పాల్గొనేలా చూడటానికి అధికారులు పలు విధానాలను అమలు చేశారు. ఆస్ట్రేలియాలో శనివారాల్లోనే ఎన్నికలు జరుగుతాయి. వీకెండ్ కావడంతో ఎక్కువ మంది స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రాలకు వెళ్తారు. యాజమాన్యాలు ఎన్నికల రోజున కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇస్తాయి. పోలింగ్ బూత్‌ల దగ్గర బార్బెక్యూలపై కాల్చిన డెమోక్రసీ సాసేజ్‌లు అదనపు ప్రోత్సాహం. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల దగ్గర నిధుల సేకరణ కోసం ఏర్పాటు చేసే ఈ స్నాక్స్ ఆస్ట్రేలియా ఎన్నికలకు చిహ్నాలుగా మారాయి. ఇవి స్థానిక పాఠశాలలు, కమ్యూనిటీలకు అతి పెద్ద నిధుల సేకరణ కార్యక్రమాలుగా మారాయి. మొత్తంగా ఎన్నికల రోజు ఆస్ట్రేలియాలో పండుగ వాతావరణం ఉంటుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కనుమరుగయ్యే దేశంతో ఖనిజ ఒప్పందమా?

అమెరికా-ఉక్రెయిన్ ఒప్పందంపై రష్యా

మాస్కో: ఉక్రెయిన్‌తో అమెరికా కుదుర్చుకున్న ఖనిజ ఒప్పందాన్ని రష్యా ఎద్దేవా చేసింది. త్వరలో కనుమరుగు కానున్న దేశంతో అమెరికా ఒప్పందం కుదుర్చుకుందని అపహాస్యం చేసింది. ''తమ సాయానికి బదులుగా ఖనిజ వనరులు అప్పగించాలని ఉక్రెయిన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తెచ్చారు. కనుమరుగవుతున్న దేశం సైనిక సామగ్రి కోసం జాతీయ సంపదను వదులుకుంది'' అని రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదెవ్ ఎద్దేవా చేశారు. అమెరికా సహాయానికి ఖనిజ వనరులను చెల్లించాల్సిన స్థాయికి ఉక్రెయిన్ పాలనను ట్రంప్ విచ్ఛిన్నం చేశారని వ్యాఖ్యానించారు. ''అమెరికా, ఉక్రెయిన్ ఒప్పందంతో ఉక్రెయిన్‌కు సహ-యజమానిలా అమెరికా భావిస్తోంది. ఇది శాంతిచర్చలను కష్టతరం చేస్తుంది'' అని క్రెమ్లిన్ మాజీ సలహాదారు సెర్గీ మార్కోమ్ తెలిపారు. ఉక్రెయిన్ విస్తారమైన ఖనిజ వనరులపై అమెరికాకు ప్రవేశం కల్పిస్తూ అమెరికా, ఉక్రెయిన్ బుధవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి.

ఏటా రూ. 5 వేల కోట్ల నష్టం!

పాక్ గగనతలం మూతపై ఎయిరిండియా

న్యూఢిల్లీ: భారత విమానాయన సంస్థలకు గగనతలం మూసివేస్తూ పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం ఎయిరిండియాకు సమస్యగా మారనుంది. ఇది ఏడాదిపాటు కొనసాగితే రూ.5 వేల కోట్లకు పైగా నష్టపోవాల్సి వస్తుందని సంస్థ అంచనా వేసింది. దీన్ని ఎదుర్కోవడానికి ఆర్థిక సాయం అవసరమని అభిప్రాయపడింది. పాక్ గగనతల మూసివేతపై పౌర విమానయాన శాఖ ఇటీవల పలు విమానయాన సంస్థలతో సమావేశమైంది. పరిస్థితిని ఎదుర్కోవటానికి వారి సూచనలు, సూచనలు కోరింది. ఎయిరిండియా, ఇండిగో, స్పైస్ జెట్ సహా పలు సంస్థలు శాఖకు సూచనలు, సలహాలు ఇచ్చాయి. ''పరిస్థితిని అంచనా వేస్తున్నాం. ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను పరిశీలిస్తున్నాం'' అని శాఖ అధికారులు తెలిపారు. విమానయాన సంస్థల నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. గగనతల ఆంక్షల వల్ల ఇంధన వినియోగం, ప్రయాణ సమయం పెరగడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులకు వారానికి ఏకంగా రూ.77 కోట్ల మేరకు అదనపు ఖర్చులు అవుతాయని అంచనా. మొత్తమ్మీద విమానయాన సంస్థలకు నెలవారీ నిర్వహణ రూ.306 కోట్లకు పైగా అదనపు ఖర్చులు అవుతాయని తేలింది.

సోనియా, రాహుల్‌కు ఢిల్లీ కోర్టు నోటీస్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు సమన్లు జారీ చేసింది. చార్జిషీటును అనుమతించే సమయంలో వీరికి వాదనలు వినిపించే అవకాశం ఇచ్చినట్లు స్పెషల్ కోర్టు జడ్జి విశాల్ గోగ్నె తెలిపారు. విచారణ పారదర్శకంగా కొనసాగేందుకు దీంతో వీలవుతుందని తెలిపారు. వీరికిచ్చే వెసులుబాటుతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తునకు ఎటువంటి అవరోధంగా ఉండదని కూడా స్పష్టం చేశారు. సోనియా, రాహుల్‌లకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వడంలో ఈడీకి ఎటువంటి అభ్యంతరం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసిన జడ్జి, ఈ కేసులో కాంగ్రెస్ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే తదితరులకు కూడా నోటీసులు పంపారు. సుమారు రూ.2 వేల కోట్ల విలువైన ఆస్తులను అక్రమ మార్గంలో సొంతం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలు కుట్రపన్నినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు

కేదార్‌నాథ్: హిమాలయాల్లో కొలువైన కేదార్‌నాథ్ ఆలయం తలుపులు శుక్రవారం ఉదయం 7 గంటలకు తిరిగి తెరుచుకున్నాయి. సుమారు 11 వేల అడుగుల ఎత్తున ఉన్న ఈ ఆలయంలో జరిగిన ప్రారంభ పూజల్లో 12 వేల మంది భక్తులు పాల్గొన్నారని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఆలయాన్ని నేపాల్, థాయ్‌లాండ్, శ్రీలంక వంటి దేశాల నుంచి తెప్పించిన బంతి, గులాబీ వంటి 54 రకాల 108 క్వింటాళ్ల పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి సీఎం పుష్కర్ సింగ్ ధామి, ఆలయ కమిటీ పెద్దలు, సాధువులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చార్‌ధామ్ ఆలయాల్లో ఒకటైన కేదార్‌నాథ్, 11 జ్యోతిర్లింగాలలో ఒకటి. చార్‌ధామ్ సర్క్యూట్‌లోని గంగోత్రి, యమునోత్రి ఆలయాలను ఏప్రిల్ 30వ తేదీన తెరవగా, బద్రీనాథ్ తలుపులు 4న తెరుకోనున్నాయి.

సీనియర్ సిటిజన్లు మార్గనిర్దేశకులు: ముర్ము

న్యూఢిల్లీ: సమాజంలో సంప్రదాయాలు, విలువలకు సీనియర్ సిటిజన్లు మూల స్తంభాల వంటి వారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. సమాజాన్ని రూపొందించడంలో మరియు భవిష్యత్తు తరాలకు మార్గనిర్దేశం చేయడంలో వారి తోడ్పాటు వెలకట్టలేనిదన్నారు. గౌరవించడం, సంతోషపరచడం, వారి శ్రేయస్సుపై శ్రద్ధ చూపడం మనందరి సమష్టి బాధ్యతని రాష్ట్రపతి అన్నారు. రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వయో వృద్ధులు గత కాలానికి అనుసంధానకర్తలు, మన భవిష్యత్తుకు మార్గదర్శకులు అని రాష్ట్రపతి ముర్ము అన్నారు. వారి అనుభవాల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని వివరించారు. వయో వృద్ధుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖను ఆమె ప్రశంసించారు. ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన 'సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ పోర్టల్'ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఐదుగురు సీనియర్ సిటిజన్లతో మాట్లాడి, వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్, నాగాలాండ్‌లోని ఓఖా, తమిళనాడులోని వెల్లూర్, ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ హోంలను రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు.

గాజాకు మానవతా సాయం తెస్తున్న ఓడపై దాడి

టెల్‌అవీవ్: గాజాలో ఆకలితో అలమటిస్తున్న పాలస్తీనియన్లకు ఆహారం తదితరాలను తీసుకువస్తున్న ఓడపై డ్రోన్ దాడి జరిగింది. మాల్టా సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో శుక్రవారం జరిగిన దాడితో నౌకలో పేలుడు సంభవించి, మంటలు చెలరేగాయి. అయితే, సమీపంలోని టగ్ బోట్ నిర్వాహకులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారని, నౌకలోని 12 మంది సిబ్బంది, నలుగురు పౌరులు సురక్షితంగా ఉన్నారని వివరించారు. దాడికి ఇజ్రాయెల్ కారణమని 'ఫ్రీడం ఫ్లోటిల్లా కోఎలిషన్'ఆరోపించింది. దాడి తీవ్రతకు జనరేటర్ దెబ్బతిందని, ఓడ మునిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. 2010లో కూడా ఇజ్రాయెల్ దిగ్బంధాన్ని ధిక్కరిస్తూ గాజాలోకి సాయం తీసుకువచ్చేందుకు యత్నించిన 'ఫ్రీడం ఫ్లోటిల్లా కోఎలిషన్' ఓడపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో అందులోని 9 మంది మృతి చెందారు.

పాక్ కుటుంబానికి సుప్రీం బాసట

ధ్రువ పత్రాలను పరిశీలించాలని యంత్రాంగానికి ఆదేశం

న్యూఢిల్లీ: పౌరసత్వ దరఖాస్తు పరిశీలనలో ఉండటం, వీసా గడువు ముగియడంతో తమను అధికారులు బలవంతంగా పాకిస్తాన్‌కు పంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఓ కుటుంబం పెట్టుకున్న అర్జీపై సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించింది. వీరి పాస్‌పోర్టులు, ఆధార్, పాన్ కార్డులు తదితరాలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కశ్మీర్ అధికారులను ఆదేశించింది. మానవీయ కోణం కలిగిన ప్రత్యేకమైన కేసుగా పేర్కొన్న ధర్మాసనం.. పౌరసత్వ దరఖాస్తుపై నిర్ణయం తేలేవరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. అయితే, పత్రాలపై సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్న ధర్మాసనం, అందుకు గడువు విధించలేదు. అధికారుల నిర్ణయంతో సంతృప్తి చెందనట్లయితే జమ్మూకశ్మీర్ హైకోర్టును ఆశ్రయించవచ్చని కూడా తెలిపింది.

షహబాజ్ షరీఫ్ యూట్యూబ్ చానల్‌పై నిషేధం

న్యూఢిల్లీ: పాకిస్తాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ యూట్యూబ్ చానల్‌పై భారత్ నిషేధం విధించింది. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం భారత్, పాక్‌ల మధ్య తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు తలెత్తిన సమయంలో శుక్రవారం ఈ పరిణామం చోటుచేసుకుంది. 'జాతీయ భద్రతకు సంబంధించి భారత ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు దేశంలో ఈ చానెల్‌లో కంటెంట్ అందుబాటులో లేదు. దీనిపై ప్రభుత్వం పంపిన విజ్ఞాపనల వివరాలు కావాలంటే గూగుల్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్టును చూడండి'అని బ్లాకైన చానల్‌పై ఓ సందేశం కనిపిస్తోంది.

సాక్షి ప్లస్
శనివారం। 3-5-2025

ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శాసనం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

చరిత్ర

శాతవాహనులు

మౌర్య సామ్రాజ్యం పతనంతో పాటు, భారత దేశంలో వాయవ్య దిశలో కుషాణులు, పశ్చిమ దిశలో 'క్షాత్రపులు', దక్షిణా పథంలో ప్రాచీనచోళులు, ఆంధ్ర శాతవాహనులు స్వతం త్ర రాజ్యాలు స్థాపించారు. శాతవాహనుల పరిపాలనకు పూర్వమే దక్షిణాపథం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు గ్రీకు రచనల ద్వారా తెలుస్తోంది. పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ, టాలమీ రచించిన 'జాగ్రఫీ', మెగస్తనీసు 'ఇండికా' వంటి గ్రంథాలు వింధ్య పర్వతాలకు దక్షిణాన వివిధ జాతుల వారు పరిపాలించి నట్లు విశద పరుస్తున్నాయి.

శాతవాహనుల యుగచరిత్ర క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి, క్రీ.శ. 2వ శతాబ్దం వరకూ దక్షిణాపథ రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టింది. వీరు ఉత్తర-దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించారు. సుమారు నాలుగున్నర శతాబ్దాల పాటు 33మంది రాజులు ప్రతిష్ఠానపురం, అమరావతులను రాజధానులుగా చేసుకొని పాలించారు. భారతదేశ చరిత్రలోనే అతి సుదీర్ఘంగా పాలించిన రాజవంశంగా శాతవాహనులు ప్రసిద్ధి చెందారు. వివిధ ఆధారాల ప్రకారం వీరి పాలన క్రీ.పూ. 271లో ఆరంభమై క్రీ.శ. 174లో పతనమైంది.

శాతవాహనుల చరిత్రకు ప్రధాన ఆధారాలు:

- ఐతరేయ బ్రాహ్మణం.
- మత్స్య, వాయు, బ్రహ్మాండపురాణాలు.
- కుంతల శాతకర్ణి కాలానికి చెందిన 'శర్వవర్మన్' సంస్కృత భాషలో రాసిన కాతంత్ర వ్యాకరణ గ్రంథం.
- గుణాఢ్యుడు ప్రాకృతభాషలో రచించిన బృహత్కథ.
- మహారాష్ట్ర ప్రాకృతభాషలో శాతవాహన రాజైన హాలుడు రచించిన గాథసప్తశతి.
- బౌద్ధమత మహాయాన సిద్ధాంతకర్త ఆచార్య నాగార్జునుడు సంస్కృతభాషలో రచించిన సుహృల్లేఖ, ప్రజ్ఞాపారమిత వంటి గ్రంథాలు.
- గ్రీకు రచయితలు మెగస్తనీసు-'ఇండికా', టాలమీ-'ఎ గైడ్ టు జాగ్రఫీ'.
- చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ రచించిన సీ-యూ-కీ గ్రంథం
- అజ్ఞాత రచయిత రచించిన 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్-సీ' గ్రంథం
- అశోకుడు వేయించిన శిలా శాసనాలు (ప్రాకృతం) ఎర్రగుడి, రాజుల మందగిరి (కర్నూలు జిల్లా), మస్కీ (రాయచూర్).
- శాతవాహన రాజు మొదటి శాతకర్ణి భార్య 'నాగనిక' వేయించిన 'నానాఘాట్ శిలాశాసనం' (ప్రాకృతభాష)
- గౌతమీ పుత్రశాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన 'నాసిక్' శిలా శాసనం.
- రెండో శాతకర్ణి సమకాలికుడైన కళింగా ధిపతి ఖారవేలుడు వేయించిన 'హాతీగుంఫా శిలా శాసనం (ఒడిశా).
- శకరాజైన రుద్రదమనుడు మొదటిసారిగా సంస్కృతభాషలో వేయించిన క్రీ.శ. 150 నాటి గిర్నార్ శాసనం.
- క్షాత్రపు రుద్రదత్తుడు వేయించిన నాసిక్, కన్హేరి శిలాశాసనాలు.
- 'వాసిష్ఠీ పుత్రపులోమావి'కి సంబంధించిన నాసిక్ గుహ శాసనం.

ఇవి కాకుండా, పురావస్తు అవశేషాలు, స్థూపాలు, చైత్యగృహాలు, విహారాలు, నాణేలు ముఖ్య ఆధారాలు. అశోకుడు, శాతవాహన రాజులు వేయించిన శాసనాలన్నీ ప్రాకృతభాష, బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి.

ఆంధ్రులు-ప్రశస్తి:

తెలుగుకంటె ఆంధ్రశబ్దం ప్రాచీనమైంది. రుగ్వేదానికి వ్యాఖ్యానంగా రాసిన 'ఐతరేయబ్రాహ్మణం'లో ఆంధ్రులు విశ్వా మిత్రుని సంతతిగా పేర్కొంటూ 'ఆంధ్రశబ్దం' ప్రశస్తి ఉంది. ఐతరేయ బ్రాహ్మణం క్రీ.పూ. 1200 నాటిది. అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో నివసించేవారని పేర్కొంది. ఆంధ్రుల నివాసం గురించి బౌద్ధ జాతక కథల్లో వివరణ ఉంది. భీమసేనజాతకం 'ఆంధ్రపదాన్ని' ప్రస్తావించింది. సెరివణిజ జాతకం తేలివాహన నదిపై (కృష్ణానది)ఉన్న నగరం 'ఆంధ్రనగరి' అని ప్రస్తావించింది.

క్రీ.శ. 4వ శతాబ్దం మైదవోలు శాసనం 'ఆంధ్రపదం' అని పేర్కొంది. తూర్పు చాళుక్యుల శాసనాల్లో ఆంధ్ర పేరుంది. క్రీ.శ. 13వ శతాబ్దం నాటి హన్మకొండ శాసనం (వరంగల్) 'ఆంధ్రవాణీమండన' అని పేర్కొంది. క్రీ.శ. 14వ శతాబ్దంలో 'ఆంధ్రఖండ మండలం' అని పేర్కొన్నారు. శక్తి సంగ్రమతంత్రం ప్రకారం ఆంధ్ర - తెలింగ దేశంగా పేర్కొంది. తర్వాత త్రిలింగశబ్దం వచ్చింది. కాళేశ్వరం, ద్రాక్షారామం, శ్రీశైలం త్రిలింగాలుగా పేరుగాంచాయి.

జన్మస్థలంపై - భిన్నాభిప్రాయాలు:


ఆంధ్ర శాతవాహనుల జన్మస్థానం, జాతి, కులం, పరిపాలనా కాలం, ముఖ్య పట్టణాల గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయా లున్నాయి. శాతవాహనులు గోదావరి, కృష్ణా మండల వాసులని, అశోకుని మరణానంతరం స్వతంత్రులై పశ్చిమాన నాసిక్ (మహారాష్ట్ర) వరకు రాజ్యాన్ని విస్తరించిన వీరు ఆంధ్రులేనని ఆచార్య గుర్తి వెంకటరావు, ఆచార్య మారేమండరామారావు, వి.ఎ.స్మిత్, రాయ్ చౌదరి, ఆర్.జి. భండార్కర్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. శాతవాహనుల జన్మభూమి విదర్భ ప్రాంతమని వాసుదేవ విష్ణుమిరాశీ పేర్కొన్నారు. శాతవాహనుల ఆదిమ నివాసం మహారాష్ట్ర (నాసిక్) అని పి.టి. శ్రీనివాస అయ్యం గారు, కె. గోపాలా చారి, ప్రసాల్కర్‌లు పేర్కొన్నారు. వీరి ప్రథమ నివాసం 'బళ్లారి' అని వి.ఎస్. సుక్తాంకర్ అభిప్రాయపడ్డారు. శాతవాహనులు, ఆంధ్రులు కారని, ఆంధ్రులకు 'భృత్యులు' అని ఆర్.జి. భండార్కర్ అభిప్రాయం. శాతవాహనుల ప్రాచీన రాజధాని శ్రీకాకుళం (కృష్ణా జిల్లా), ఆ తర్వాత ధాన్యకటకం (అమరావతి, గుంటూరు జిల్లా), ఆ తర్వాత ప్రతిష్ఠానపురం (పైథాన్, మహారాష్ట్ర) అని డాక్టర్ ఎల్.డి. బార్నెట్ అభిప్రాయపడ్డారు. వీరి మొదటి రాజధాని ధాన్యకటకం అని భండార్కర్ అభిప్రాయం.

రాజ్యస్థాపన:

స్వతంత్ర శాతవాహన రాజ్యస్థాపకుడు శ్రీముఖుడు (సీముకుడు). క్రీ.పూ. 271 నుంచి 248 వరకు 23ఏళ్లు పాలించాడు. ఇతను మొదట జైనమతం స్వీకరించాడు. శ్రీముఖుని నాణేలు (తగరం) కరీంనగర్ జిల్లా కోటిలింగాల, ధూళికట్ట ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. మెదక్ జిల్లా లో సంగారెడ్డి, కొండాపూర్‌ల్లో కూడా లభించాయి. కర్ణాటకలోని 'సన్నతి', మహారాష్ట్రలోని నెవాస, జున్నార్, అకోల ప్రాంతాల్లో తగరపు నాణేలు అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి.

మొదటి శాతకర్ణి:

శ్రీముఖుని తర్వాత అతడి సోదరుడు కన్హ(కృష్ణుడు) కొద్దికాలం పాలించాడు. ఇతడు నాసిక్, కన్హేరి గుహలను తొలిపించాడు. ఇతడి అన్న శ్రీముఖుని కుమారుడు మొదటి శాతకర్ణి తర్వాత రాజ్యానికొచ్చాడు. ఇతడు క్రీ.పూ. 180 నుంచి క్రీ.పూ. 170 వరకు పాలించాడు. ఇతడి భార్య నాగనిక వేయించిన నానాఘాట్ శిలాశాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. ఈ శాసనం ప్రకారం మొదటి శాతకర్ణికి 'ఏకవీరుడు, శూరుడు, దక్షిణాపథపతి'గా బిరుదులున్నాయి. రెండు అశ్వమేధయాగాలు, ఒక రాజసూయ యాగం చేసిన మొట్టమొదటి శాతవాహన రాజు ఇతడే! ఇతడి రాజ్యం ఉత్తరాన మాళ్వా నుంచి దక్షిణాన మైసూరు వరకు విస్తరించి ఉంది. 'అప్రతిహతచక్ర' అనే బిరుదు పొందాడు. ఇతడు బలమైన పుష్యమిత్ర శుంగుని ఓడించి, అందుకు గుర్తుగా ఉజ్జయినీ పట్టణ గుర్తుతో నాణేలను ముద్రించాడు. మొదటి శాతకర్ణి బ్రాహ్మణులకు కార్షాపణలు (వెండినాణేలు) విరివిగా దానం చేశాడు. ఇతడు మాళ్వా నుంచి విదిశ (మధ్యప్రదేశ్) వరకు రాజ్యాన్ని విస్తరించాడు.



రెండో శాతకర్ణి:

శాతవాహన వంశంలో 6వ రాజైన రెండో శాతకర్ణి క్రీ.పూ. 184 నుంచి క్రీ.పూ. 128 వరకు 56 ఏళ్లు పాలించాడు. కణ్వ వంశంలో చివరివాడైన 'సుశర్మను' ఓడించి పాటలీ పుత్రాన్ని జయించాడు. దీనికి గుర్తుగా రెండో శాతకర్ణి నాణేలు పాటలీపుత్రలోని 'కుహరమ' వద్ద లభ్యమ య్యాయి. ఇతడు కళింగాధిపతి (ఒడిశా) ఖారవేలుని చేతిలో ఓడాడని, ఖారవేలుని మరణానంతరం కళింగను జయించాడని తెలుస్తోంది. ఇతడు మధ్యప్రదేశ్‌లోని సాంచీస్థూపానికి దక్షిణ తోరణాన్ని నిర్మించాడు.

కుంతల శాతకర్ణి:

శాతవాహన రాజుల్లో 13వ వాడు 'కుంతల శాతకర్ణి' రాజ్యానికొచ్చాడు. శాతవాహనుల సమకాలీకులైన శకులను ఓడించి, మాళ్వా, మహారాష్ట్ర లను తిరిగి సంపాదించాడు. ఇతడి కాలంలోనే ప్రాకృత భాష స్థానంలో సంస్కృతం రాజభాషగా మారింది. ఇతడు తన నాణేలపై పాటలీపుత్ర చిహ్నాన్ని ముద్రించాడు.

వాత్స్యాయనుడు రచించిన 'కామసూత్రం' గ్రంథంలో కుంతల శాతకర్ణిని ప్రస్తావించాడు. ఇతని ఆస్థానంలో శర్వవర్మన్ సంస్కృతభాషలో 'కాతంత్ర వ్యాకరణ' గ్రంథాన్ని రచించాడు. ఇతడి కాలంలోనే గుణాఢ్యుడు పైశాచిక ప్రాకృతభాషలో బృహత్కథను రచించాడు. ఈ గ్రంథ మే పంచతంత్రాన్ని సంస్కృతభాషలో 'విష్ణుశర్మ' రచించడానికి ఆధారమైంది. బృహత్కథ ఆధారంగా, క్షేమేంద్రుడు బృహత్కథా మంజరి, హరిసేనుని బృహత్కథాకోశం, వరాహమిహిరుని - బృహత్ సంహిత వంటి గ్రంథాలకు కూడా గుణాఢ్యుని బృహత్కథ ఆధారమైంది.

హాలుడు:

శాతవాహన రాజుల్లో 17వ వాడు. ఏడాది మాత్రమే రాజ్యపాలన చేశాడు. హాలుడు ప్రాకృతభాషలో 700 శృంగార గాథలను 'గాథసప్తశతి' పేరుతో సంకలనం చేశాడు. ఈయనకు 'కవివత్సలుడు' అనే బిరుదు ఉంది. కుతూహలుడు రచించిన 'లీలావతి పరిణయం' కావ్యం ప్రకారం హాలుడు సింహళ రాకుమారి లీలావతిని గోదావరి తీరం ద్రాక్షారామంలో వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. వాత్స్యాయన కామసూత్రం, రాజశేఖరుని 'కావ్యమీమాంస' గ్రంథాలు హాలుడిని ప్రస్తావించాయి.

గౌతమీ పుత్రశాతకర్ణి:

క్రీ.శ. 62-86 మధ్య కాలంలో పాలించిన 23వ శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతడు శాతవాహన రాజుల్లో అగ్రగణ్యుడు. గొప్పవిజేత. తన తల్లి గౌతమీబాలశ్రీ వేయించిన నాసిక్ శిలా శాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. శాతవాహన రాజుల్లో పేరుకు ముందు తల్లిపేరును పెట్టుకునే సంప్రదాయం గౌతమీపుత్ర శాతకర్ణితోనే ప్రారంభమైంది. శక-శాతవాహనుల మధ్య సముద్ర వ్యాపారం కోసం జరుగుతున్న పోరాటాన్ని అంతం చేసి శకరాజైన నహపాణుడ్ని హతమార్చి, 'క్షహరాట వంశనిరవశేషకార' అనే బిరుదును పొందాడు. తాను అధికారంలోకి రావడానికి గుర్తుగా క్రీ.శ. 78లో 'శాలివాహన శకాన్ని' ప్రారంభించాడు. శక రాజుల్లో నహపాణుడు గొప్ప విజేతగా పేరు పొందాడు. నహపాణుడి రాజ్యం కతియవాడ్ (గుజరాత్), ఉత్తర-దక్షిణ-మహారాష్ట్ర ప్రాంతం, కొంకణ ప్రాంతాల వరకు విస్తరించింది. ఈయన రాజధాని మిన్నగార (మందసా). ఇది ఉజ్జయినీ-బ్రోచ్‌ల మధ్య ప్రాంతం. శాతవాహనుల నుంచి నహపాణుడు మహారాష్ట్ర ప్రాంతాన్ని జయించాడు. కానీ గౌతమీపుత్ర శాతకర్ణి తిరిగి జయిం చి స్వాధీనం చేసుకున్నాడు. నహపాణునితో క్షహరాట వంశం అంతమైంది. నహపాణుడు వేయించిన సుమారు 13,270 వెండినాణేలు మహారాష్ట్రలోని 'జోగల్‌తంబి' ప్రాంతంలో లభ్యమయ్యాయి. ఈ నాణేలను గౌతమీపుత్ర శాతకర్ణి తన బొమ్మతో తిరిగి ముద్రించాడు. ... నాణేలు అమరావతి, ... చర్ల, గోలి, మాడుగుల ప్రాంతాల్లో లభించాయి. ఇతనికాలం నాటి టంకశాల మూసకట్లతో సహా విజయపురి (నాగార్జునకొండ) వద్ద లభించాయి. ఇతడు అపరాంత, కుకుర, వైజయంతి, అసక, ముల కలను జయించాడు. ఇతనికి 'ఆగమనిలయ, ఏకబ్రాహ్మణ, క్షత్రియదర్పమానమర్దన, త్రిసముద్రతోయపీతవాహన' బిరుదులున్నాయి.

> **గుర్తుంచుకోండి ఇలా..!**
> చరిత్రలో తారీఖులు, దస్తావేజులు, రచనలు, రాజుల సమకాలీకులు, వాదాలు, రాజధానులు గుర్తుంచుకోవాలి. ఒక రాజ్యం చరిత్ర చదివినపుడు ఆనాటి సమకాలీన రాజుల గురించి కొంత తెలుసుకోవాలి. **ఉదా:** హాలుడు గాథసప్తశతిని ఏ భాషలో రచించాడు. **జ:** ప్రాకృతభాషలో. అదే విధంగా గ్రంథాలు ఏ అంశాన్ని ప్రస్తావిస్తున్నాయి అనేది కూడా గుర్తుంచుకోవాలి. **ఉదా:** 'గాథసప్తశతి' ఏ అంశాన్ని ప్రధానంగా పేర్కొంటుంది. **జ:** శృంగార పదాల గురించి.. ఈ కోణంలోనూ చరిత్రాంశాలను అధ్యయనం చేయాలి.

గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత అతని కుమారుడు 'వాసిష్ఠీపుత్ర పులోమావి' రాజ్యానికొచ్చాడు. ఇతడిని 'దక్షిణాపథేశ్వర' అని గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్‌శాసనం ప్రస్తావించింది. ఇతని సమకాలికుడు కుషాణురాజు హవిస్కుడు. వాసిష్ఠీపుత్ర పులోమావి కాలంలోనే తన రాజధానిని ప్రతిష్ఠానపురం నుంచి ధాన్యకటకానికి మార్చాడు. ఇతడి కాలంలోనే ప్రఖ్యాతిగాంచిన అమరావతి స్థూపానికి మెరుగులు దిద్దారు. ఇతడు కార్లేలోని బౌద్ధ భిక్షువులకు దానాలు చేశాడు. ఇతడి రాజ్యకాలం క్రీ.శ. 86-114 వరకు. ఇతడినే రెండో పులోమావిగా కూడా పిలుస్తారు.

యజ్ఞశ్రీ శాతకర్ణి:

ఇతడు కడపటి శాతవాహన రాజుల్లో గొప్పవాడు. 27వ శాతవాహనరాజు. యజ్ఞశ్రీ శాతకర్ణి మహాక్షాత్రప శకరుద్రదామునికి సమకాలికుడు. తొలి సంస్కృత శాసనం వేయించింది రుద్రదాముడే. దీనినే 'గిర్నార్ శాసనం' అంటారు. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో నౌకావ్యాపారం జరిగినట్లు అతడి నాణేల ద్వారా తెలుస్తోంది. ఇతడి కాలంలోనే తెరచాప (లేదా) లంగరు వేసిన ఓడముద్రలున్న నాణేలు లభించాయి. ఇతడి ఆస్థానంలో ఆచార్య నాగార్జునుడు ఉండేవాడు.

ఇతని కోసం శ్రీ పర్వతం (నాగార్జునకొండ)పై పారావత విహారం నిర్మించాడు యజ్ఞశ్రీ. యజ్ఞశ్రీ శాతకర్ణికి 'త్రి సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. ఇతడి తర్వాత శాతవాహన రాజ్యం క్షీణించింది. చివరిరాజు మూడో పులోమావి కాలంలో ఈ రాజ్యం అంతరించింది. క్రీ.శ. 225 సంవత్సరంలో సామంతరాజులైన అభీరులు, చుటునాగులు, ఇక్ష్వాకులు, పల్లవులు తిరుగుబాటు చేసి స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు.

మాదిరి ప్రశ్నలు:

1) 'లీలావతి పరిణయం' గ్రంథకర్త?
   1) రాజశేఖరుడు 2) హాలుడు
   3) వాత్స్యాయనుడు 4) కుతూహలుడు
2) ఆచార్య నాగార్జునుడికి సమకాలీన శాతవాహన రాజు?
   1) హాలుడు 2) మొదటి శాతకర్ణి
   3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
3) 'కాతంత్ర సంస్కృత వ్యాకరణం' రచయిత?
   1) నాగార్జునుడు 2) గుణాఢ్యుడు
   3) శర్వవర్మన్ 4)వరాహమిహిరుడు
4) ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శిలా శాసనం ఏది?
   1) 9వ 2) 12వ 3) 13వ 4) ఏవీకావు
5) నహపాణుడిని ఓడించిన శాతవాహన రాజు?
   1) సీముఖుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) రెండోశాతకర్ణి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
6) గాథాసప్తశతి ప్రాకృత పదాల్లో ప్రధానాంశం?
   1) జానపద పదాల వివరణ
   2) శృంగార పదాల వివరణ
   3) చిలుక చెప్పిన కథలు 4) పురాణాల కథనం
7) శాతవాహనులు ఆంధ్రులు కారని, ఆంధ్రులకు భృత్యులని వాదించిన పండితుడు?
   1) ఆర్.జి. భండార్కర్ 2) వి.యస్.సుక్తాంకర్
   3) రాప్సన్ 4) డా.గోపాలాచారి
8) ఆంధ్రశబ్దాన్ని తొలిసారిగా ప్రస్తావించింది?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) ఐతరేయ బ్రాహ్మణం
   4) మాండ్యూకోపనిషత్
9) ఓడముద్రలున్న సీసం నాణేలను ముద్రించిన శాతవాహన రాజు?
   1) హాలుడు
   2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండోపులోమావి
   4) యజ్ఞశ్రీ శాతకర్ణి
10) శాతవాహన రాజులు తమ వ్యక్తిగత నామాలకు మాతృగోత్ర నామాలను ముందు చేర్చి, చెప్పుకునే పద్ధతి ఎవరి కాలంలో ప్రారంభమైంది?
   1) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
   2) శ్రీముఖుడు 3) వాసిష్ఠీపుత్ర పులోమావి
11) తొలిసారి సంస్కృతభాషలో క్రీ.శ.150 లో గిర్నార్ శాసనాన్ని వేయించిన విదేశీ రాజు?
   1) నహపాణుడు 2) మీనాండర్
   3) రుద్రదమనుడు 4) డెమిట్రియస్

సమాధానాలు

1) 4; 2) 4; 3) 3; 4) 3; 5) 4; 6) 2; 7) 1; 8) 3; 9) 4; 10) 1; 11) 3.



నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?

విజ్ఞాన శాస్త్ర బోధనాభ్యసన వ్యూహాలు

- విద్యార్థుల్లో ఆమోదయోగ్యమైన ప్రవర్తనా మార్పు తీసుకొని రావడమే బోధన ముఖ్య ఉద్దేశం.
- బోధన ఒక కళ. అది సహజ సిద్ధంగా వస్తుంది. అలాకాకపోతే శిక్షణ ద్వారా సాధించవచ్చు. విద్యా లక్ష్యాలను సాధించడానికి బోధన పద్ధతులు ఉపయోగపడతాయి.
- పూర్వం సంప్రదాయ పద్ధతిలో బోధించే వారు. జ్ఞానం విస్ఫోటనం చెందిన తర్వాత మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు విద్యలో బోధించడం వల్ల అనేక బోధన పద్ధతులు ఏర్పడ్డాయి.

బోధన ఉపగమాలు:

- బోధన పద్ధతుల్లో వాడే విధానాలను ఉపగమాలు అనొచ్చు. అంటే ఒక బోధన పద్ధతిలో తెలిసిన విషయాలను తెలియని విషయాలవైపుగా లేదా తెలియని విషయం నుంచి తెలిసిన విషయం వైపుగా చెబుతూ ఉండటం ఈ ఉపగమాలను సూచిస్తాయి.
- ఒక విషయంలో ఉపగమాన్ని బోధన పద్ధతిలో వాడితే మరొక విషయంలో ఆ ఉపగమాన్నే ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు. **ఉదా:** గణితశాస్త్రం.

ఆగమన ఉపగమం:

- తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాల వైపునకు వెళ్లడం.
- మూర్త విషయాల నుంచి అమూర్త విషయాల వైపునకు వెళ్లడం.
- నిర్దిష్ట ఉదాహరణల నుంచి సామాన్య సూత్రాలను రాబట్టడం ఆగమన ఉపగమాన్ని సూచిస్తాయి.

ఫౌలర్

- నిర్దిష్ట అంశాల నుంచి సాధారణీకరణలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

జీవన్

- ప్రత్యేక సత్యాల నుంచి సాధారణ సత్యాలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

ఉదా:మల్లెపూవుకు సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. సన్నజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. విరజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. కాబట్టి రాత్రివేళ వికసించే పూలలో సువాసన ఉంటుంది అని సాధారణీకరణాన్ని ప్రతిపాదిస్తే అది ఆగమన ఉపగమం అవుతుంది.

నిగమన ఉపగమం:

- ఇది ఆగమన ఉపగమానికి వ్యతిరేకంగా ఉంటుంది.
- తెలియని విషయాల నుంచి తెలిసిన విషయాల వైపునకు, అమూర్త విషయాల నుం చి మూర్త విషయాల వైపునకు, సాధారణ విషయం నుంచి ప్రత్యేకాంశాల వైపునకు, వెళ్లడం ఈ ఉపగమాన్ని తెలుపుతుంది. దీన్ని అరిస్టాటిల్ తర్కశాస్త్ర పునాదులపై ఆధారపడి తయారుచేశారు.
- మానవులంతా మర్త్యులే (మరణించేవారే)
- సోక్రటీస్ మానవుడు మరణించాడు.
- ప్లేటో మానవుడు మరణించాడు.
- అలెగ్జాండర్ మానవుడు మరణించాడు. ఈ విభాగంలో బోధించడం నిగమన ఉపగమం.

విజ్ఞానశాస్త్ర బోధన వ్యూహాలు:

- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసే ప్రయత్నాలు లేదా బోధిం చే పద్ధతులు ప్రధానంగా రెండు రకాలు.
  1) ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు
  2) విద్యార్థి కేంద్రిత బోధన పద్ధతులు.

ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు:

- ఉపాధ్యాయుడు మాత్రమే చురుకుగా ఉండి బోధించే బోధన పద్ధతి. దీనిలో విద్యార్థి పాత్ర తక్కువ. ఇందులో నాలుగు పద్ధతులు చూడొచ్చు.
  1) ఉపన్యాస పద్ధతి
  2) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
  3) చారిత్రాత్మక పద్ధతి 4) నిర్మాణ పద్ధతి

ఉపన్యాస పద్ధతి:

- ఉపాధ్యాయుడు ఉపన్యసిస్తాడు. విద్యార్థులు వింటారు లేదా వింటున్నట్లు నటిస్తారు.
- దీన్ని రాసి మాట్లాడే పద్ధతి అని కూడా అంటారు.
- ఇందులో విద్యార్థి కంటే విషయానికే ప్రాధాన్యత ఉంటుంది.

ప్రయోజనాలు:

- ఆర్థికంగా సులువైనవి. ప్రయోగాలు, నమూనాలు లేవు కాబట్టి ఖర్చు తక్కువవుతుంది.
- తక్కువ కాలంలో ఎక్కువ అంశాలు బోధించవచ్చు.
- పాఠ్య ప్రణాళికను సకాలంలో బోధించవచ్చు.
- ఎంతమంది విద్యార్థులకైనా ఒకేసారి బోధించవచ్చు.
- పనిభారం తక్కువ.

లోపాలు

- కృత్యాధార బోధనకు వ్యతిరేకం.
- చేయడం ద్వారా నేర్చుకోవడం జరగదు. (విద్యార్థులు ప్రయోగాలు చేయరు).
- శాస్త్రీయ వైఖరి పెంపొందించలేం.
- వైయక్తిక భేదాలను గుర్తించి బోధించలేం.
- శారీరక ఉపస్థితి, మానసిక అనుపస్థితి ఉంటుంది. (తరగతి గదిలో ఉన్న విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండరు)

ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి:

- ఉపన్యాస పద్ధతిలోని లోపాలను ప్రదర్శనా పద్ధతిలో కొన్ని సవరించారు. ఈ పద్ధతిలో వినడం తోపాటు చూడటం కూడా ఉంటుంది. కాబట్టి అభ్యసించిన విషయం ఎక్కువ రోజులు గుర్తుంటుంది.
- విద్యార్థులు ఉపన్యాస పద్ధతిలో కంటే కొంత చురుకుగా ఉంటారు.
- **ముఖ్యాంశాలు:** పాఠ్య పథక రచన - పరికరాలను సిద్ధం చేసుకోవడం - ప్రయోగాలు సరిచేసి చూడడం.

ప్రదర్శన విజయవంతం కావాలంటే?

- ప్రదర్శనా లక్ష్యాన్ని ముందుగా తెలపాలి.
- ప్రదర్శన అందరికీ కనిపించేలా ఉండాలి.
- సామగ్రి తగిన పరిమాణంలో ఉండాలి.
- ప్రత్యామ్నాయ పరికరాలుండాలి.
- మధ్యలో ప్రశ్నలు వేసి ఆసక్తి పెంచాలి.
- విద్యార్థుల స్థాయికి తగిన ప్రయోగాలుండాలి.
- విద్యార్థుల సహకారం తీసుకోవాలి.
- ప్రదర్శన చూడడానికి తగిన సమయం ఇవ్వాలి.
- చివరి వరకూ ఆసక్తి కొనసాగాలి.

ప్రయోజనాలు: మనోవైజ్ఞానికం, సిద్ధాంతం ఆచరణకు మధ్య సంబంధం కలిగి ఉంది. వ్యయాన్ని, కాలాన్ని ఆదా చేస్తుంది. (ఉపాధ్యాయుడు మాత్రమే ప్రయోగం చేస్తాడు)

లోపాలు: విద్యార్థులు ప్రయోగం చూస్తారు కానీ చేయరు. ప్రదర్శన విఫలమైతే విద్యార్థుల్లో నిరుత్సాహం కలుగుతుంది.

3. చారిత్రక పద్ధతి: ఇది పూర్తిస్థాయి బోధన పద్ధతి కాదు. కొన్ని పాఠ్యాంశాలను మాత్రమే ఈ పద్ధతిలో బోధించవచ్చు. ఉదా: శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, ఆవిష్కరణలు తెలియజేసేటప్పుడు పూర్వ చరిత్ర తెలపొచ్చు. శాస్త్రవేత్తల చిత్రాలను ప్రదర్శిస్తూ చెప్పడం బాగుంటుంది. ప్రతి పాఠానికి ముందు దాని పూర్వ చరిత్ర చెప్పడం ఈ పద్ధతి.

4. నిర్మాణ పద్ధతి: విజ్ఞాన శాస్త్ర నిర్మాణం ప్రకారం బోధన జరిపే పద్ధతి. ష్వాబ్ అండ్ ఫినిక్స్ ప్రకారం సంశ్లేషాత్మక నిర్మాణంలో ఉండే పరిశీలనలు, వర్గీకరణలు, ప్రాకల్పనలు, ప్రయోగాలు, వ్యాఖ్యానం, కొలవడం, అన్వేషణ వంటి ప్రక్రియలు నేర్పడం, ద్రవ్యాత్మక నిర్మాణంలోని యథార్థాలు, భావనలు, సాధారణీకరణలు, సూత్రాలు, సిద్ధాంతాలు, నియమాలు తెలప డం ఈ పద్ధతిలో జరుగుతుంది. ఇది ఆలోచనను రేకెత్తించి వైఖరులను ఏర్పరుస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. బోధన ముఖ్య ఉద్దేశం కానిది?
   1) లక్ష్యాలను సాధించడం విద్యార్థుల్లో నేర్పడం.
   2) చేయడం ద్వారా నేర్చుకునేట్లు చేయడం.
   3) విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను బోధన ద్వారా పొందడం.
   4) విద్యార్థుల్లో శాశ్వత ప్రవర్తనా మార్పులు తీసుకొని రావడం.
2. ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో బోధన, బోధనలో ఆధునికీకరణకు వేటిని జోడిం చారు?
   1) ప్రయోగాలు చేస్తూ బోధించడం
   2) బోధనోపకరణాలు విరివిగా వాడడం
   3) మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు
   4) సొంత పాఠశాల భవనాలు
3. ఉపగమాలు, బోధన పద్ధతుల మధ్య సంబంధానికి సంబంధించి సరైంది?
   1) ఉపగమాలు, బోధన పద్ధతులు రెండూ ఒకటే.
   2) బోధన పద్ధతుల్లో తిరిగి అనుసరించే విధానం ఉపగమం.
   3) ఉపగమానికి బోధన పద్ధతికి అసలు సంబంధమే లేదు.
   4) విద్యలో ఉపగమం లేదు, బోధన పద్ధతి మాత్రమే ఉంది.
4. ఏ శాస్త్రంలో ఉపగమాలను ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు?
   1) విజ్ఞాన శాస్త్రం 2) సాంఘిక శాస్త్రం
   3) జీవ శాస్త్రం 4) గణిత శాస్త్రం
5. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు తన బోధనలో సూత్రాన్ని ముందుగా చెప్పి తర్వాత ఉదాహరణలు ఇచ్చారు. ఆమె అనుసరించిన ఉపగమం?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన, నిగమన రెండూ
   4) ఇది ఉపగమం కాదు
6. ఇనుము, రాగి, అల్యూమినియం వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఎందుకంటే అవి లోహాలు. కాబట్టి లోహాలన్నీ వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఈ క్రమంలో బోధించిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ ఉపగమాన్ని ఎంచుకున్నట్లు?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన నిగమన రెండూ
   4) నిగమన తర్వాత ఆగమన ఉపగమం
7. వీటిలో ఏది ఆగమన ఉపగమాన్ని తెలపదు?
   1) మూర్త విషయాల నుంచి అమూర్త విషయాలు రాబట్టడం
   2) నిర్దిష్ట విషయాల నుంచి సాధారణీకరణలు రూపొందించడం
   3) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
   4) అమూర్త సామాన్యీకరణల నుంచి మూర్త సత్యాలను గుర్తించే విధానం
8. నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?
   1) శాస్త్రీయ పద్ధతి
   2) శాస్త్రీయ వైఖరి పెంపొందిస్తుంది
   3) నేర్చుకున్న విషయాలు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంటాయి.
   4) సిలబస్‌ను తక్కువ సమయంలో పూర్తి చేయొచ్చు.
9. 'రాసి మాట్లాడే పద్ధతి' అని ఏ బోధన పద్ధతికి మారుపేరు?
   1) ఉపన్యాస - ప్రదర్శనా పద్ధతి
   2) ఉపన్యాస పద్ధతి
   3) చారిత్రక పద్ధతి
   4) నిర్మాణ పద్ధతి
10. కింది బోధన పద్ధతుల్లో ఏది ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతి కాదు?
   1) ఉపన్యాస పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) అన్వేషణ పద్ధతి 4) చారిత్రక పద్ధతి

సమాధానాలు

1) 3; 2) 3; 3) 2; 4) 4; 5) 2; 6) 1; 7) 4; 8) 4; 9) 2; 10) 3.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శాస్త్రీయ సూత్రాలు, సిద్ధాంతాలు, ధర్మాలు కనుక్కోవడానికి దోహదపడిన పద్ధతి? (డీఎస్సీ- 2008)
   1) ఆగమన 2)నిగమన
   3) సర్పిల 4) ఏక కేంద్రీయ
2. అభ్యసనంలో ఉపాధ్యాయుడు కల్పించే కృత్యాల పరంగా ప్రాధాన్యత లేని కృత్య లక్షణం? (డీఎస్సీ- 2008)
   1) బహుళ తరగతి బోధనకు అనువైనదిగా
   2) విద్యార్థులు శారీరక, మానసిక ఒత్తిళ్లను పెంచేదిగా
   3) ఆలోచనలు రేకెత్తించేదిగా
   4) ఆసక్తి కలిగించేదిగా

సమాధానాలు: 1) 1; 2) 2.

సాక్షి ప్లస్
శనివారం। 3-5-2025

సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం



హైడ్రోకార్బన్లు

1. ప్రయోగశాలలో ఇనార్గానిక్ సమ్మేళనం నుంచి తొలిసారిగా తయారుచేసిన కర్బన సమ్మేళనం ఏది?
   1) చక్కెర 2) గ్లూకోజ్
   3) యూరియా 4) ఆల్కహాల్
2. కింది వాటిలో హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బ్యూటేన్ 4) పైవన్నీ
3. ఆల్కేన్లుగా పేర్కొనే మొదటి నాలుగు హైడ్రోకార్బన్లు ఏవి?
   1) మీథేన్, బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్
   2) మీథేన్, ఇథిలీన్, ఎసిటలీన్, బ్యూటేన్
   3) మీథేన్, ఈథేన్, ప్రొపేన్, బ్యూటేన్
   4) బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్, మీథేన్
4. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే హైడ్రోకార్బన్ ఏది?
   1) ప్రొపేన్ 2) బ్యూటేన్
   3) పెంటేన్ 4) హెక్సేన్
5. కింది వాటిలో సంతృప్త హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బెంజీన్ 4) ఎసిటలీన్
6. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ విడుదల చేసే వాయువు ఏది?
   1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
   3) మీథేన్ 4) బ్యూటేన్
7. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి సురక్షితమైన పద్ధతి ఏది?
   1) ఫలాలను ఎసిటలీన్ చాంబర్‌లో ఉంచడం
   2) ఫలాలను ఇథిలీన్ చాంబర్‌లో ఉంచడం
   3) ఫలాలను బ్యూటేన్ చాంబర్‌లో ఉంచడం
   4) ఫలాలను ఈథర్ చాంబర్‌లో ఉంచడం
8. కింది వాటిలో కార్బన్ రూపాంతరం కానిది ఏది?
   1) వజ్రం 2) గ్రాఫైట్
   3) ఫుల్లరీన్ 4) కార్బోరండం
9. కింది వాటిలో కేవలం కార్బన్ పరమాణువులు మాత్రమే ఉండే పదార్థం ఏది?
   1) గ్రాఫైట్ 2) ఫుల్లరీన్
   3) వజ్రం 4) పైవన్నీ
10. కింది వాటిలో ఇంధనాలుగా ఎక్కువగా వినియోగంలో ఉన్నవేవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు 4) పైవన్నీ
11. కింది వాటిలో హరిత గృహ (గ్రీన్‌హౌజ్) వాయువు కానిది ఏది?
    1) కార్బన్ డై ఆక్సైడ్ 2) మీథేన్
    3) నైట్రస్ ఆక్సైడ్ 4) హైడ్రోజన్
12. వెల్డింగ్ చేయడానికి అవసరమైన అధిక ఉష్ణోగ్రత పొందడానికి ఆక్సిజన్‌తో కలిపి ఉపయోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
    3) ఈథేన్ 4) బ్యూటేన్
13. సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) మీథేన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
    3) బ్యూటేన్ 4) ఎసిటలీన్
14. గృహ ఇంధనంగా ఉపయోగించే గోబర్ గ్యాస్, బయోగ్యాస్‌లలో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) ఈథేన్
    3) మీథేన్ 4) పెంటేన్
15. LPGలో ఉండే ప్రధాన హైడ్రోకార్బన్ ఏది?
    1) బ్యూటేన్ 2) మీథేన్
    3) ప్రొపేన్ 4) బెంజీన్
16. జతపరచండి.
    జాబితా - 1
    A) కోల్ గ్యాస్ B) LPG
    C) వాటర్ గ్యాస్ D) ఆక్సీ ఎసిటలీన్
    జాబితా - 2
    1) వెల్డింగ్‌లో వాడతారు
    2) అమ్మోనియా తయారీలో వాడతారు
    3) వంటగ్యాస్‌గా ఉపయోగపడుతుంది
    4) లోహ సంగ్రహణలో క్షయకరణిగా వినియోగిస్తారు

	A	B	C	D
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	4	3	1	2
4)	2	4	1	3

17. 'వాటర్ గ్యాస్' ఏ వాయువుల మిశ్రమం?
    1) మీథేన్ + బ్యూటేన్
    2) మీథేన్ + కార్బన్ మోనాక్సైడ్
    3) హైడ్రోజన్ + కార్బన్ మోనాక్సైడ్
    4) హైడ్రోజన్ + ఆక్సిజన్
18. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది (దహన శీలి).
    2) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది. అదేవిధంగా మండటానికి సహాయ పడుతుంది (దహన దోహదకారి).
    3) ఆక్సిజన్ దహనశీలి కాదు. కానీ దహన దోహదకారి.
    4) ఆక్సిజన్ గ్రీన్‌హౌస్ వాయువు.
19. కింది వాటిలో మండే స్వభావం లేని వాయువు ఏది?
    i) హైడ్రోజన్ ii) బ్యూటేన్
    iii) కార్బన్ డై ఆక్సైడ్ iv) కార్బన్ మోనాక్సైడ్
    1) i, ii, iii 2) i, ii, iv
    3) ii, iii, iv 4) ii, iv
20. కింది వాటిలో పారిశ్రామిక ఇంధన వాయువు ఏది?
    1) వాటర్ గ్యాస్ 2) ప్రొడ్యూసర్ గ్యాస్
    3) కోల్ గ్యాస్ 4) పైవన్నీ
21. ప్రొడ్యూసర్ గ్యాస్‌లో నైట్రోజన్‌తోపాటు ఉండే ప్రధాన వాయువేది?
    1) హైడ్రోజన్ 2) ఆక్సిజన్
    3) కార్బన్ మోనాక్సైడ్ 4) బ్యూటేన్
22. కింది వాటిలో అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత వద్ద ఉత్ప్రేరక సమక్షంలో వేడిచేస్తే.. మైనం లాంటి ఘన పదార్థాన్ని ఏర్పరిచేది ఏది?
    1) హైడ్రోజన్ 2) ఇథిలీన్
    3) ఈథేన్ 4) మీథేన్
23. క్యారీ బ్యాగుల తయారీకి ఉపయోగపడే ముడి పదార్థం ఏది?
    1) ఇథిలీన్ 2) ఈథేన్
    3) బ్యూటేన్ 4) బెంజీన్
24. ఒక మైక్రాన్ కింది వాటిలో దేనికి సమానం?
    1) మిల్లీమీటర్‌లో పదో వంతు(0.1 mm)
    2) మిల్లీమీటర్‌లో వందో వంతు (0.01 mm)
    3) మిల్లీమీటర్‌లో 1000వ వంతు (0.001 mm)
    4) మిల్లీమీటర్‌కు సమానం
25. 2011లో భారత ప్రభుత్వం ఎంత మందం కలిగిన క్యారీ బ్యాగులపై నిషేధం విధించింది?
    1) 40 మైక్రాన్ల కంటే తక్కువ
    2) 40 మైక్రాన్ల కంటే ఎక్కువ
    3) 100 మైక్రాన్లు 4) ఏదీకాదు
26. జతపరచండి.
    ఇంధన వాయువు — ప్రధాన అనుఘటకాలు
    A) CNG — 1) మీథేన్, ఈథేన్
    B) కోల్‌గ్యాస్ — 2) హైడ్రోజన్, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్
    C) LPG — 3) బ్యూటేన్, ప్రొపేన్
    D) వాటర్ గ్యాస్ — 4) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్

	A	B	C	D
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	4	3	1	2
4)	3	4	1	2

27. కింది వాటిలో పొడవైన శృంఖలాలతో కూడిన హైడ్రోకార్బన్ల సల్ఫోనికామ్ల లవణాలేవి?
    1) సబ్బులు 2) డిటర్జెంట్లు
    3) కొవ్వులు 4) మైనాలు
28. ప్రింటింగ్ ఇంక్ తయారీలో వినియోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) మీథేన్ 2) ఈథేన్
    3) ప్రొపేన్ 4) బ్యూటేన్
29. దుస్తులను కొరికే క్రిముల నుంచి రక్షణ కోసం వాటి మధ్య ఉంచే కలరా ఉండల (డాంబర్ గోళీలు) తయారీలో వినియోగించే ప్రధాన పదార్థం ఏది?
    1) కాంఫర్ 2) నాఫ్తలీన్
    3) సుక్రోజ్ 4) ఫ్రక్టోజ్
30. కేన్సర్ కలిగించే గుణం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు 4) ఎరోమాటిక్ సమ్మేళనాలు
31. కింది వాటిలో ఎరోమాటిక్ ధర్మం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) బెంజీన్ 2) నాఫ్తలీన్
    3) టోలీన్ 4) పైవన్నీ
32. హైడ్రోకార్బన్లను మండిస్తే విడుదలయ్యే ప్రధాన వాయువేది?
    1) కార్బన్ డై ఆక్సైడ్ 2) కార్బన్ మోనాక్సైడ్
    3) సల్ఫర్ డై ఆక్సైడ్ 4) నైట్రస్ ఆక్సైడ్
33. హైడ్రోకార్బన్లకు ప్రధాన ఆధారం?
    1) ముడి చమురు 2) చక్కెర పరిశ్రమ
    3) తోలు పరిశ్రమ 4) ఏదీకాదు
34. 'డ్రై క్లీనింగ్'లో ఉపయోగించే ద్రావణి ఏది?
    1) పర్‌క్లోరో ఇథిలీన్ (PCE)
    2) ఆల్కహాల్
    3) పెట్రోల్ 4) హెక్సేన్
35. 'మార్ష్‌గ్యాస్' అని దేనికి పేరు?
    1) ఎసిటలీన్ 2) ఇథిలీన్
    3) మీథేన్ 4) ప్రొపేన్
36. బొగ్గు గనుల్లో అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) హైడ్రోజన్
    3) మీథేన్ 4) ఆక్సిజన్
37. మంటలను ఆర్పడానికి కింది వాటిలో ఏ వాయువు పనికిరాదు?
    i) హైడ్రోజన్ ii) కార్బన్ మోనాక్సైడ్
    iii) ఆక్సిజన్ iv) కార్బన్ డై ఆక్సైడ్
    1) iv మాత్రమే 2) i, iii మాత్రమే
    3) ii, iii మాత్రమే 4) i, ii, iii
38. వంట గ్యాస్ సిలిండర్లలో నింపే గ్యాస్ ఏ రూపం లో ఉంటుంది?
    1) ఘన 2) ద్రవ
    3) వాయు 4) జెల్
39. వరి పొలాల్లో చెత్తాచెదారం కుళ్లిపోవడం వల్ల విడుదలయ్యే వాయువేది?
    1) ఎసిటలీన్ 2) ఈథేన్
    3) ఇథిలీన్ 4) మీథేన్
40. గాలి తగిలేలా ఉంచినప్పుడు 'వైన్' రుచి మారడానికి కారణం?
    1) ఆల్కహాల్ ఈథర్‌గా మారడం
    2) ఇథైల్ ఆల్కహాల్ ఎసిటికామ్లంగా ఆక్సీకరణం చెందడం
    3) ఇథైల్ ఆల్కహాల్ మిథైల్ ఆల్కహాల్‌గా మారడం
    4) ఇథైల్ ఆల్కహాల్ లాక్టికామ్లంగా మారడం
41. వాహనాల్లో ఇంధనం దహనం చెందినప్పుడు కార్బన్, హైడ్రోజన్‌లు ఏవిధంగా మారతాయి?
    1) కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరిగా మారతాయి
    2) ఆల్కీన్‌గా మారతాయి
    3) బెంజీన్‌గా మారతాయి
    4) వాతావరణంలోకి అలాగే విడుదలవుతాయి
42. భారీ మోటారు వాహనాలకు డీజిల్‌ను ఇంధనంగా వాడటానికి కారణం?
    1) కాలుష్యం తక్కువగా ఉండటం
    2) అధిక సామర్థ్యం, ఇంధన పొదుపు
    3) ఇంజన్‌కు తక్కువ నష్టం కలగడం
    4) అధికంగా లభ్యమవడం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4;
5) 1; 6) 2; 7) 2; 8) 4;
9) 4; 10) 4; 11) 4; 12) 2;
13) 1; 14) 3; 15) 1; 16) 2;
17) 3; 18) 3; 19) 2; 20) 4;
21) 3; 22) 2; 23) 1; 24) 3;
25) 1; 26) 1; 27) 2; 28) 1;
29) 2; 30) 4; 31) 4; 32) 1;
33) 1; 34) 1; 35) 3; 36) 3;
37) 4; 38) 2; 39) 4; 40) 2;
41) 1; 42) 2;

హాలోజన్లు

1. కింది వాటిలో హాలోజన్ కానిది ఏది?
   1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
   3) గ్జినాన్ 4) అయోడిన్
2. అయోడిన్‌కు ప్రధాన ఆధారం?
   1) సముద్ర మొక్కలు 2) నదీజలం
   3) బావుల నీరు 4) బొగ్గు గనులు
3. తళతళా మెరిసే అలోహం ఏది?
   1) ఫాస్ఫరస్ 2) అయోడిన్
   3) సల్ఫర్ 4) లెడ్
4. ఉత్పతనం చెందే గుణం ఉన్న హాలోజన్?
   1) అయోడిన్ 2) బ్రోమిన్
   3) క్లోరిన్ 4) ఫ్లోరిన్
5. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవరూపంలో ఉండే హాలోజన్ ఏది?
   1) ఫ్లోరిన్ 2) బ్రోమిన్
   3) క్లోరిన్ 4) అయోడిన్
6. ఆవర్తన పట్టికలోని మూలకాలన్నింటిలో అత్యధిక రుణ విద్యుదాత్మకత ఉన్న మూలకం ఏది?
   1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
   3) బ్రోమిన్ 4) అయోడిన్
7. ఆహారంలో రుచి కోసం వాడే క్లోరిన్ సమ్మేళనం ఏది?
   1) సోడియం క్లోరేట్ 2) బ్లీచింగ్ పౌడర్
   3) సోడియం క్లోరైడ్ 4) పొటాషియం క్లోరైడ్
8. టేబుల్ సాల్ట్ ఫార్ములా?
   1) Na_2CO_3 2) $NaCl$
   3) $NaHCO_3$ 4) $CaOCl_2$
9. పాలల్లో స్టార్చ్ (గంజి పొడి)తో కల్తీ జరిగితే.. ఆ పాలకు అయోడిన్ కలిపినప్పుడు వచ్చే రంగు ఏది?
   1) నీలం 2) ఆరెంజ్
   3) ఎరుపు 4) పసుపు
10. థైరాయిడ్ హార్మోన్‌ను నియంత్రించే పదార్థం ఏది?
    1) సల్ఫర్ 2) అయోడిన్
    3) ఫాస్ఫరస్ 4) క్లోరిన్

సమాధానాలు

1) 3 2) 1 3) 2 4) 1
5) 2 6) 1 7) 3 8) 2
9) 1 10) 2

how to bake a cake...

Model Questions

Directions (Q.No. 1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. In addition to escalating violence, (1)/ a distinct feature of the situation in Kashmir today (2)/ is the divide among the administration and the populace, (3)/ which is possibly at its widest today. (4)/ No error (5)
2. The government has come under a lot of criticism (1)/ above its estimates for economic growth (2)/ during the United Progressive Alliance years (3)/ and for the slowdown in GDP growth in the second quarter of this financial year. (4)/ No error (5)
3. Over centuries, humans observed (1)/ and invented means to extract repetitions (2)/ and commonalities from a world (3)/ that was full of differences and variations. (4)/ No error (5)
4. The Andhra Pradesh Weather Forecasting and Early Warning Research Centre, an division of the RTGS, (1)/ on Sunday said cyclone Phethai might make landfall (2)/ by the evening of Monday (3)/ between Kakinada and Tuni. (4)/ No error (5)
5. The Madras High Court on Monday directed the Centre (1)/ to notify the statutory rules related to online sale (2)/ of drugs and medicines by January 31, 2019 (3)/ and banned online sales till than. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. At school, Mira is antisocial and sullen, but it is in her home in which she is a bubbly, even tempered child.
   1) in her home
   2) in her home, in which
   3) in her home where
   4) it is in her home and
   5) No correction required
7. Angel food cake, a cholesterol-free cake, solves the problem of how to bake a cake for a health-conscious family.
   1) having a health-conscious family for which to bake a cake
   2) how can one bake a cake for a health-conscious family
   3) how one could feed a health-conscious family a cake
   4) having a health-conscious cake to bake for a family
   5) No correction required
8. Experts believe that senior citizens with higher than average cholesterol and their families develop a predisposition to cardiovascular disease are more likely to die at an age below that of their life expectancy.
   1) and a predisposition to cardiovascular disease runs in the family
   2) whose families have a predisposition to cardiovascular disease
   3) whose families have a predisposition to cardiovascular disease running in them
   4) with a predisposition to cardiovascular disease running in their family
   5) No correction required
9. Sometimes, it seems like she does things only making it more inconvenient for her husband so he can have a good time when he's out with his friends.
   1) to make it more inconvenient for her husband to have
   2) to make more inconvenient for her husband the having of
   3) that her husband more inconveniently can have
   4) for her husband to more inconveniently
   5) No correction required
10. She had to back down as she had forgotten her mobile and car keys in the cabin.
    1) go back as she has forgotten
    2) went back as she has forget
    3) backed down as she had forgotten
    4) return as she had forgotten
    5) No correction required

Directions (Q.No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. A series of misunderstandings between the management and the staff have led to the present ____.
    1) concord 2) contract
    3) impasse 4) access
    5) agreement
12. Tensions had ____ towards the end of day three with Kohli and Paine exchanging verbal ____ as the game headed for a nail-biting finish.
    1) flared, trickle 2) flared-in, pitch
    3) escalated, dribble
    4) flared-up, volleys
    5) increased, duals
13. The children were ____ by the seemingly nonsensical clues until their teacher pointed out that the messages were in code.
    1) censured 2) striated
    3) feigned 4) prevaricated
    5) flummoxed
14. The chess master promised to ____ havoc upon his opponent's pawns for taking his bishop.
    1) wreak 2) warrant3) ensue
    4) placate 5) endow
15. The soldiers received a military ____ to inspect all their vehicles before travelling.
    1) allotment 2) dominion
    3) affectation 4) calculation
    5) mandate

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

Bank Exams

GENERAL ENGLISH

A) The ruling establishment in India maintains that the NRC is an administrative task overseen by the Supreme Court, and not a political gambit.
B) Many Indian citizens are securing coveted employment opportunities in Bangladesh through multinational companies, non-governmental organizations, and trading activities.
C) According to the latest available Bangladesh government estimates of 2009, more than 500,000 Indians were working in Bangladesh.
D) However, some members of the ruling party have been making hateful anti-migration and anti-Bangladeshi comments that reflect poorly on the prevalent positive relationship between Bangladesh and India.
E) More recently, Bangladesh was reported to be among the highest source of remittances to India, behind the United Arab Emirates, the U.S., Saudi Arabia, Qatar and the U.K.
F) To put things into perspective, most of them are employed in advantageous jobs in Bangladesh while Bangladeshis in India are largely employed in low-paying jobs.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F



Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Bollywood films influence negative societal attitudes towards women in India. If we are to make progress, we must reverse these narratives through better storytelling, for storytelling influences behaviour. A study by Elizabeth Levy of Harvard University showed how a reconciliation-themed radio soap opera changed social norms and behaviour in Rwanda after the 1994 genocide. We also know storytelling works because multilateral agencies around the world spend billions of dollars on advertisements and informational campaigns to reach the public. Yet, in India, we ignore or simply don't accept the impact of storytelling on social behaviour. Last year, IBM India conducted a research study analyzing gender stereotypes in 4,000 Bollywood movies released between 1970 and 2017. Among these, the researchers identified only 30 movies where these stereotypes were broken. While filmmakers are attempting to break this mould, they are still few and far between. One way of initiating change could be for the Central Board of Film Certification (CBFC) to introduce a gender equity certification among the categories of film certification that we have today. This will empower the public to make a choice before heading to the theatres. It will signal to the industry that a gender lens is important and necessary. Granted, big brother attitudes are dangerous and we need to constantly push for less state regulation. But given the nature of sexual allegations against powerful members of the film industry, who can we trust to be responsible for shaping the narrative around gender stereotypes in India? Are future generations going to continue living in a world where they are encouraged to harass and rape women? Will sexist behaviour be tolerated and, if yes, for how long? Or can we start shaping the narrative around how we view various genders by being more responsible in how we depict them? The answer is, we can. It's time to think of unique ways of making films more gender sensitive, for this is a medium that has a huge impact on social behaviour as studies time and again have shown.

21. What does the writer say in this passage?
    1) We must reverse storytelling.
    2) Social norms and behaviour in India are reversed.
    3) We ignore or simply don't accept the impact of multilateral agencies.
    4) It is high time to think of future generations.
    5) social behaviour is definitely influenced by films

KEY

1) 3 2) 2 3) 2 4) 1 5) 4
6) 1 7) 5 8) 2 9) 1 10) 4
11) 3 12) 4 13) 5 14) 1 15) 5
16) 5 17) 2 18) 4 19) 3 20) 4
21) 5